

'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 178

బుధవారం 18-9-2024


SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



అజేయంగా 'ఆసియా' విజేతగా..

12 లో

టోర్నీలో ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ జయకేతనం ఎగురవేసిన భారత హాకీ జట్టు.. ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో వరుసగా రెండోసారి విజేతగా నిలిచింది. ఫైనల్‌లో 1–0 తేడాతో చైనాపై గెలిచి.. ఐదోసారి టైటిల్‌ను కైవసం చేసుకుంది.



బుల్డోజర్లకు బ్రేక్

తమ అనుమతి లేకుండా దేశ వ్యాప్తంగా ఎలాంటి కూల్చివేతలు చేపట్టవద్దని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

వివరాలు 6లో ▸



ఈ టర్మ్‌లోనే జమిలి ఎన్నికలు

ప్రస్తుత ప్రభుత్వ పాలనా కాలంలోనే జమిలి (ఒకేసారి దేశవ్యాప్త) ఎన్నికలు నిర్వహిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు.

వివరాలు 6లో ▸



నైట్ షిఫ్టులు వద్దంటారా?

మహిళా వైద్యులు నైట్ డ్యూటీలు చేయొద్దన్న పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ నిర్దేశాలను సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది.

వివరాలు 6లో ▸



పేజర్లే బాంబులై

ఇజ్రాయెల్‌కు ఆచూకీ చిక్కొద్దనే ఉద్దేశంతో హెజ్బుల్లా మిలిటెంట్లు వాడుతున్న పేజర్లు చివరికి వారి ప్రాణాలకే ముప్పు తెచ్చాయి.

వివరాలు 6లో ▸

• అసలు కారణం బాబు అరెస్టే..

ఆ శిక్ష.. ఐపీఎస్‌లపై కక్ష!

అధికారులను అక్రమ కేసులతో వేధిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

హనీ ట్రాప్, ఫోర్జరీ కేసుల్లో నిందితురాలైన జత్వానీకి వత్తాసు

- ఆగమేఘాలపై ఆమెను రప్పించి ఫిర్యాదు స్వీకరణ
- ఎలాంటి విచారణ లేకుండానే అక్రమ కేసు నమోదు
- ఆ వెంటనే ముగ్గురు ఐపీఎస్ అధికారుల సస్పెన్షన్
- వారిపై మరిన్ని చర్యలకు పన్నాగం
- మార్గదర్శి పని పట్టిన ఐఆర్‌ఎస్ అధికారి రామకృష్ణపై తాజాగా ఈనాడు ఆగ్రహం
- రామోజీ కుటుంబ మేలు కోసం ఆ అధికారిని టార్గెట్ చేసిన ప్రభుత్వం
- అందుకే కక్షగట్టి వేధింపుల కుతంత్రం
- ప్రభుత్వ కక్షపై మండిపడుతున్న అఖిల భారత సర్వీసు అధికారులు



సాక్షి, అమరావతి:

వలపు వల (హనీ ట్రాప్)తో బడా బాబులను బ్లాక్ మెయిల్ చేయడం ఆమె వ్యవహార శైలి.. ఫోర్జరీ పత్రాలతో మోసాలకు పాల్పడటం ఆమె నైజం.. ఏపీ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో కేసులు ఆమె నేర చరిత్రకు సాక్ష్యం.. ఫోర్జరీ నేరంపై విజయవాడ కోర్టు ఆదేశాలతో రిమాండ్.. ఇదీ ఇటీవల నేపథ్యం..

తీవ్రమైన నేరాల్లో నిందితురాలైన కాదంబరి జత్వానీ నిరాధార ఆరోపణలతో ముగ్గురు ఐపీఎస్ అధికారులపై ఫిర్యాదు చేస్తే, ప్రభుత్వం ఎలా స్పందించాలి? ఆమెను అరెస్ట్ చేసి, న్యాయస్థానం ద్వారా రిమాండ్ విధించిన అధికారులపై ఆరోపణలు చేస్తున్నట్టుగా భావించాలి. మరోవైపు ఆమె ఆరోపణలు ఎంత వరకు వాస్తవమో దర్యాప్తునకు ఆదేశించాలి. కానీ ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉంది. ఎందుకంటే ఎన్నికలకు ముందు తనను అరెస్టు చేసి జైలులో పెట్టడాన్ని మనసులో ఉంచుకున్న చంద్రబాబు.. ఏదో ఒక సాకు చూపి.. సీనియర్ ఐపీఎస్ అధికారులపై వేటు వేయాలని ఎదురు చూస్తున్నారు. ఇందులో భాగంగానే జుగుప్సాకరమైన, తీవ్రమైన ఆర్థిక నేరాల్లో నిందితురాలైన కాదంబరి జత్వానీకి ప్రభుత్వం విశిష్ట అతిథి స్థాయిలో ప్రోటోకాల్ మర్యాదలు చేసింది. ఆపై ఆమె ఫిర్యాదును సాకుగా చేసుకుని

మిగతా 2వ పేజీలో ▸

ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనాతో ఆతిశి, అరవింద్ కేజ్రీవాల్



ఢిల్లీ సీఎం ఆతిశి

- కేజ్రీవాల్ స్థానంలో ఎన్నుకున్న ఆప్
- శాసనసభాపక్షం ఏకగ్రీవ నిర్ణయం
- రాజీనామా సమర్పించిన కేజ్రీవాల్
- వారంలో సీఎంగా ఆతిశి ప్రమాణం
- సుష్మ, షీలా తర్వాత మూడో మహిళ

"కేజ్రీవాల్ నన్ను నమ్మి ఎమ్మెల్యేను చేశారు. మంత్రిని చేశారు. ఇప్పుడిలా సీఎంనూ చేశారు. ఇది ఆప్‌లో మాత్రమే సాధ్యం. ఢిల్లీ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కేజ్రీవాల్ మార్గదర్శకత్వంలో ముందుకెళ్తా. నిజాయితీపరుడైన ఆయనపై తప్పుడు అభియోగాలు మోపారు. ఆయన రాజీనామా చేయడం ఎంతో బాధగా ఉంది. కేజ్రీవాల్‌ను తిరిగి సీఎం చేయడమే లక్ష్యంగా పని చేస్తా."

– ఆతిశి

6 లో

వినాయకా.. సెలవికా



హైదరాబాద్‌లో తొమ్మిది రోజుల పాటు ఘనమైన పూజలందుకున్న గణనాథులు మంగళవారం భక్తకోటి జేజేలు, ఆనందోత్సాహాల నడుమ గంగమ్మ ఒడిలో ఒదిగిపోయారు.



ఆగిన 'హరికథా' గంగా ప్రవాహం

- పద్మశ్రీ కోట సచ్చిదానందశాస్త్రి కన్నుమూత
- హరికథకు పద్మశ్రీ అందించిన తొలి భాగవతార్‌గా గుర్తింపు
- ఎలాంటి ప్రతిఫలం లేకుండా ఎంతో మందికి శిక్షణ
- దేశ విదేశాల్లో వేలాది ప్రదర్శనలు

5 లో



స్కూళ్ల మరుగుదొడ్ల ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సిందే

గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు వారి పరిధిలోని స్కూళ్లలోని మరుగుదొడ్లను పరిశీలించి.. ఆ ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సిందేనని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. లేకపోతే క్రమ శిక్షణ చర్యలు తీసుకుంటామని మరోసారి హెచ్చరించింది.

2లో

మా కలలు చిదిమేసిన ప్రభుత్వం

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయం మా భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేసింది

మా తల్లిదండ్రుల ఆశలను అడియాశలు చేసింది



రిజర్వేషన్ కేటగిరీ వారికీ తీవ్ర నష్టం

ఎన్నికల ముందు సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు రద్దు చేస్తామన్నారు

అధికారంలోకి వచ్చాక అన్నీ ప్రైవేటుపరం అంటున్నారు

చంద్రబాబు, లోకేశ్ నమ్మించి గొంతుకోశారు.. నీట్ ర్యాంకర్లు, వారి తల్లిదండ్రుల ఆగ్రహం

10 లో

ప్రభుత్వం వల్ల ఎంతో నష్టం



"నాకు నీట్‌లో 568 మార్కులు వచ్చాయి. గతేడాది ఎస్వీయూ రీజియన్‌లో ఓసీ కేటగిరీకి 542 మార్కులకు కూడా సీటొచ్చింది. ఈ ఏడాది కొత్తగా 5 కాలేజీలు వస్తున్నాయని.. 550కి ఓసీ కేటగిరిలో సీటు వస్తుందని మా కాలేజీ అధ్యాపకులు చెప్పారు. ఎస్వీయూ రీజియన్ పరిధిలో పులివెందుల మెడికల్ కాలేజీకి అనుమతి వచ్చిందన్నారు. కానీ ఆ సీట్లను రద్దు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసినట్లు తెలిసింది. దీంతో నేను ఎంతో నష్టపోతున్నా. ఏం చేయాలో అర్థమవ్వట్లేదు. ధైర్యం చేసి లాంగ్‌టర్మ్‌కు వెళదామన్నా.. వచ్చే ఏడాది సీట్లు పెరుగుతాయన్న నమ్మకం లేదు."

– లతిక, నీట్ విద్యార్థి, ఎస్వీయూ రీజియన్



వైద్య విద్య ప్రైవేటీకరణకు

వ్యతిరేకంగా ఉద్యమిస్తాం

మెడికల్ సీట్లలో కోత విధిస్తే సహించం

- 17 కొత్త మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నడపాలి
- వాటిని బడా బాబుల చేతుల్లో పెడితే ఊరుకోం
- విద్యార్థి సంఘాల హెచ్చరిక
- ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా రేపు నిరసన కార్యక్రమాలు


– వివరాలు 10లో

వరద బాధితులకు ప్యాకేజీ

ఇళ్లు కోల్పోయిన వారికి కొత్త ఇళ్లు

దుకాణాలు మునిగితే రూ.25 వేల సాయం

- వరికి హెక్టారుకు రూ.25 వేల చొప్పున పరిహారం
- గత ప్రభుత్వ భూతాన్ని శాశ్వతంగా పూడ్చిపెట్టాలి
- అమరావతి మునిగిపోతుందనే నోళ్లకు తాళాలు వేయాలి
- నీళ్లొస్తాయని ఆకాశంలో రాజధాని కడతారా
- 'ఆపరేషన్ బుడమేరు' త్వరలో ప్రారంభం
- మీడియాతో సీఎం చంద్రబాబు



సాక్షి, అమరావతి: భారీ వర్షాలు, వరదల కారణంగా సర్వస్వం కోల్పోయిన వారికి ఆర్థిక ప్యాకేజీ అందిస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. భారీ వర్షాలు, వరదల వల్ల ఇళ్లు కూలిన వారికి కొత్త ఇళ్లు కట్టిస్తామన్నారు. విజయవాడలోని 179 సచివాలయాల పరిధిలో గ్రౌండ్ ఫ్లోర్ మునిగిపోయిన అన్ని కుటుంబాలకు రూ.25 వేలు, మిగతా ఫ్లోర్లు మునిగిన వారికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ఇళ్లుమునిగిన వారికి రూ.10 వేల చొప్పున అందిస్తామన్నారు. ఆయా ఇళ్లలో

మిగతా 3వ పేజీలో ▸

ఇదండీ సంగతి



నిజమే సార్! ఎక్కువ జనాభా ఉంటే ఎక్కువ యుద్ధాలు చేయొచ్చు!!

ఎక్సైజ్ శాఖలో 'డబ్బుల్' ధమాకా!

పోస్టులు కావాలంటే టీడీపీ నేతలు అడిగినంత ముట్టజెప్పాల్సిందే

ఎమ్మెల్యే సిఫార్సు లేఖకో రేటు.. పోస్టింగ్‌కు మరో రేటు

రెండు రకాలుగానూ దండుకుంటున్న పచ్చ నేతలు

- గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం, పశ్చిమ గోదావరి డీసీ పోస్టులకు భారీ డిమాండ్
- ఎమ్మెల్యే లేఖకు రూ.10-15 లక్షలు, పోస్టింగ్‌కు రూ.30 లక్షలు
- ఇతర జిల్లాల్లో డీసీ పోస్టుకు రూ.20 లక్షలు, ఈఎస్ పోస్టుకు రూ.15 లక్షలు
- కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్, ఎస్ఐ, సీఐ పోస్టులకూ రేట్లు ఫిక్స్.. పోస్టులు కొనలేని వారికి లూప్‌లైన్ పోస్టులు
- విశాఖపట్నం మొత్తం టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి చెప్పిన వారికే..

2 లో



మద్యం అమ్మకాల్లో తగ్గేదే లే!

2లో

- సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఇతర రాష్ట్రాల కంటే తగ్గని విధంగా కొత్త మద్యం విధానం.. అక్టోబర్ 1 నుంచి అమలు
- ఈ నెలాఖరుతో ప్రభుత్వ మద్యం దుకాణాలకు మంగళం
- ఉద్యోగుల కాంట్రాక్టు కూడా ముగింపు
- జిల్లా కమిటీల ద్వారా ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటు
- సామాన్యులకు అందుబాటు ధరలో ఒక ప్రత్యేక బ్రాండ్
- నేడు కేబినెట్ భేటీలో నూతన విధానానికి ఆమోదం

బాలికల హాస్టల్‌లో కీచకపర్వం



నిందితుడు శశికుమార్

- ఏలూరులోని ఓ సేవాశ్రమంలో కామాంధుడి స్వైరవిహారం
- గత కొన్నాళ్లుగా పదుల సంఖ్యలో బాలికలపై వార్డెన్ భర్త లైంగిక దాడి.. ఫొటోషూట్‌లంటూ బాలికలను బయటకు తీసుకెళ్లి అత్యాచారం
- ఏలూరు టూటౌన్ స్టేషన్‌లో బాలికల ఫిర్యాదు
- నిందితుడికి స్థానిక ఎంపీ కార్యాలయం వ్యక్తుల వత్తాసు
- బాలికలను భయపెట్టి కేసును నీరుగార్చే ప్రయత్నం
- తూతూ మంత్రంగానే పోలీసుల విచారణ

10 లో

టాపర్ల ఎంపిక.. ఐఐటీ బాంబే..

- జేఈఈ అడ్వాన్స్‌డ్ టాప్ ర్యాంకర్లను ఆకర్షిస్తున్న విద్యాసంస్థ
- తొలి 10 ర్యాంకులు సాధించిన వారంతా అక్కడే చేరిక
- టాప్–1000లో ఏకంగా 246 మందికి ప్రవేశాలు
- ఆ తర్వాత ఐఐటీ ఢిల్లీ, మద్రాస్‌లకు చోటు
- ఈ ఏడాది మహిళల ప్రవేశాల్లో స్వల్పంగా పెరుగుదల
- 'జేఈఈ అడ్వాన్స్‌డ్–2024' నివేదిక వెల్లడి

3లో



క్లుప్తంగా...

ప్రధానికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన జగన్

సాక్షి, అమరావతి: ప్రధాని నరేంద్ర మోదీకి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. మోదీకి ఆయురారోగ్యాలు కలగాలని కోరుకుంటున్నట్లు 'ఎక్స్'లో మంగళవారం పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా మోదీ జన్మదిన వేడుకలు

సాక్షి, అమరావతి: ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా మంగళవారం బీజేపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో పలుచోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ యువ మోర్చా ఆధ్వర్యంలో విజయవాడలో రక్తదాన శిబిరాన్ని మంత్రి సత్యకుమార్ ప్రారంభించారు. విజయవాడలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలు కిట్లును పంపిణీ చేశారు. మోదీ ఫొటో ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రారంభించారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు పురందేశ్వరి, జాతీయ కార్యవర్గ సభ్యులు రాజమహేంద్రవరంలో మోదీ జన్మదినం నేపథ్యంలో కేక్ కట్ చేయగా.. భీమవరంలో రక్తదాన శిబిరాన్ని కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ ప్రారంభించారు.

స్కూళ్ల మరుగుదొడ్ల ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సిందే



సాక్షి, అమరావతి: గ్రామ సచివాలయాల్లో పనిచేసే వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్స్, వార్డు ఎడ్యుకేషనల్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు ప్రతి వారం వారి పరిధిలోని స్కూళ్లలో మరుగుదొడ్లను పరిశీలించి, ఆ ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం మరోసారి హెచ్చరించింది. ప్రతి సోమవారం, గురువారం అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీలను సందర్శించి అక్కడి మరుగుదొడ్లు, యూరినల్స్ గదుల్లో శుభ్రతకు సంబంధించిన ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేసే బాధ్యతను సచివాలయాల ఉద్యోగులకు అప్పగిస్తూ ప్రభుత్వం గత 16న ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే, క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమానికి సంబంధించిన విధులకు చాలాచోట్ల ఆ ఉద్యోగులు హాజరు కావడం లేదన్న సమాచారంతో గ్రామ/వార్డు సచివాలయాల శాఖ ఉన్నతాధికారులు మంగళవారం కూడా ఈ మేరకు అన్ని గ్రామ/వార్డు సచివాలయాల్లోని సెక్రటరీలకు వ్యక్తిగతంగా మెసేజ్ రూపంలో ఈ సమాచారం మరోసారి పంపారు.

ఏపీ సహా మూడు రాష్ట్రాల్లో పెరిగిన రొయ్యల ఎగుమతి



సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ సహా గుజరాత్, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాల్లో రొయ్యల ఎగుమతి పెరిగిందని కేంద్ర పంచాయతీరాజ్, మత్స్య, పశుసంవర్ధక డెయిరీ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ తెలిపారు. 2013–14 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఎగుమతుల ద్వారా రూ.19,368కోట్లు రాబడి రాగా.. 2023–24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఎగుమతుల ద్వారా రూ.40,013.54కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. మంగళవారం ఢిల్లీలో విలేకరులతో కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఆక్వాకల్చర్ ఉత్పత్తి అభివృద్ధిలో భాగంగా ఆయా రాష్ట్రాలకు సహాయ, సహకారాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్, గుజరాత్, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాల్లో రొయ్యలు, చేపల ఎగుమతి క్రమక్రమంగా పెరుగుతోందన్నారు. స్వదేశంతో పాటు, విదేశాలకు సైతం ఎగుమతి అవుతున్నట్లు చెప్పారు. రూ.640.25కోట్లతో ఏపీతో పాటు అరుణాచల్ ప్రదేశ్, అసోం, ఛత్తీస్‌గఢ్, హర్యానా, మధ్యప్రదేశ్, మిజోరాం, త్రిపుర, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఇంటిగ్రేటెడ్ ఆక్వాపార్కుల నిర్మాణానికి ఆమోదం తెలిపినట్లు కేంద్ర మంత్రి రాజీవ్‌రంజన్ సింగ్ చెప్పారు.

నేడు స్టీల్‌ప్లాంట్‌లో కీలక సమావేశం



విశాఖ సిటీ: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో బుధవారం సాయంత్రం 4 గంటలకు కీలక సమావేశం జరగనుంది. ఆర్ఐఎన్ఎల్ ఇన్‌చార్జ్ సీఎండీ అరుణ్‌కాంత్ నుంచి కార్మిక, ఉద్యోగసంఘాల నేతలకు మంగళవారం పిలుపువచ్చింది. 4 రోజుల కిందట ఢిల్లీలో జరిగిన సమావేశంలో తీర్మానించిన అంశాలు, ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్ పరిస్థితి, కేంద్రం ఆలోచనలు, ప్రతిపాదనలు, ఇతర ముఖ్య అంశాలను ఆయన నేతలకు వివరించే అవకాశాలున్నాయి.

ఎక్సైజ్ శాఖలో 'డబ్బుల్' ధమాకా!

పోస్టులు కావాలంటే టీడీపీ నేతలు అడిగినంత ముట్టజెప్పాల్సిందే

ఎమ్మెల్యే సిఫార్సు లేఖకో రేటు.. పోస్టింగ్‌కు మరో రేటు

రెండు రకాలుగానూ దండుకుంటున్న పచ్చ నేతలు



సాక్షి ప్రతినిధి కర్నూలు/సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ఎక్సైజ్ శాఖ టీడీపీ నేతలకు కాసుల ఖజానాగా మారింది. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)ను కూటమి ప్రభుత్వం తాజాగా రద్దు చేసింది. సెబ్‌లో ఉన్న ఉద్యోగులను తిరిగి ఎక్సైజ్ శాఖకు పంపుతోంది. దీంతో కోరుకున్న పోస్టులు దక్కించుకునేందుకు అధికారులు.. వీరి ఆరాటాన్ని 'క్యాష్' చేసుకునేందుకు ప్రభుత్వ పెద్దలు, టీడీపీ నేతలు సిద్ధమయ్యారు. ప్రాంతానికి, పోస్టుకో రేటును నిర్ణయించి భారీగా వసూళ్ల పర్వానికి తెరలేపారు. ఎమ్మెల్యే సిఫార్సు లేఖ ఉంటేనే పోస్టింగ్.. లెటర్‌కు, పోస్టింగ్‌కు వేర్వేరుగా టీడీపీ నేతలు డిమాండ్ చేసినంత కప్పం.. అడిగినంత చెల్లించలేకపోతే లూప్‌లైన్ పోస్టింగ్‌లు.. ఇలా అమరావతిలో ఎక్సైజ్‌శాఖ ప్రధాన కార్యాలయంలో రెండు రోజులుగా ఇదే దందా నడుస్తోంది. బేరసారాలతో కొందరు ఇప్పటికే తమకు నచ్చిన చోట పోస్టింగులు దక్కించుకోగా ఇంకొన్ని పోస్టింగులకు బేరాలు నడుస్తున్నాయి. ఇప్పుడు ఈ వ్యవహారం ఎక్సైజ్ శాఖలో తీవ్ర చర్చనీయాంశమైంది.

సెబ్‌కు చెల్లుచీటీ ఇచ్చి.. వసూళ్ల పర్వానికి తెరలేపి..

గత ప్రభుత్వం పల్లెల్లో బెల్ట్‌షాపులకు అడ్డుకట్ట వేయడానికి, సారా తయారీని అరికట్టడానికి, గంజాయి నిర్మూలనకు సెబ్‌ను ఏర్పాటు చేసింది. అలాగే ప్రజలకు మద్యం దూరమయ్యేలా చేసేందుకు ప్రభుత్వమే పరిమిత సంఖ్యలో మద్యం దుకాణాలు నిర్వహించింది. బెల్ట్‌షాపుల కోసం బల్క్‌గా మద్యం బాటిళ్లను విక్రయించేందుకు ప్రభుత్వం అనుమతించలేదు. దీంతో సిబ్బంది అవసరం తగ్గింది. దీంతో సెబ్‌ను ఏర్పాటు చేసి ఎక్సైజ్ శాఖలోని 70 శాతం సిబ్బందిని అందులోకి పంపారు. బెల్ట్‌షాపులు తగ్గడంతో పల్లెల్లో మద్యం సేవించేవారి సంఖ్య తగ్గిపోయింది. తద్వారా నేరాల సంఖ్య కూడా పడిపోయింది. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం కొలువుదీరడంతో తిరిగి ఎక్సైజ్ శాఖను ఏర్పాటు చేస్తున్నారు. సెబ్‌లో విలీనమైన ఎక్సైజ్ అధికారులను తిరిగి మాతృశాఖలో నియమించి పాత పంథాలోనే విధులు నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో తిరిగి ఎక్సైజ్ స్టేషన్లలో సీఐ, ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు ఉంటారు. వీటితో పాటు 26 జిల్లాలకు ఎక్సైజ్ సూపరింటెండెంట్‌లు(ఈఎస్), ఉమ్మడి 13 జిల్లాలకు డిప్యూటీ కమిషనర్ (డీసీ)లను నియమించనున్నారు. దీంతో కోరుకున్న చోట పోస్టులు దక్కించుకునేందుకు ప్రభుత్వ పెద్దలను, ఎమ్మెల్యేలను ఆశ్రయిస్తున్నారు.

విశ్వసనీయ సమాచారం మేరకు ఇప్పటివరకు ఖరారైన పోస్టింగులు..

సీఐ	ఖరారైన పోస్టింగ్
జయరాంనాయుడు	కర్నూలు టౌన్
పద్మావతి	ఈఎస్‌టీఎఫ్, కర్నూలు
సత్యనారాయణ	అనంతపురం టౌన్
హరికృష్ణ	హిందూపురం
గురునాథరెడ్డి	ఈఎస్‌టీఎఫ్, పుట్టపర్తి
శ్యాంప్రసాద్	తిరుపతి అర్బన్
నర్సానాయుడు	తిరుపతి రూరల్
సునంద (ఏసీ, ఎన్‌ఫోర్స్‌మెంట్)	అనంతపురం
జగదీశ్	మహారాణిపేట (విశాఖపట్నం)
తేజ	విశాఖ సర్కిల్-4
నాగవేణి	సీతమ్మధార

పోస్టుకో రేటు..

డీసీ, ఈఎస్, ఏసీలతో పాటు సీఐల నియామకాల కోసం రెండురోజులుగా అమరావతిలో కసరత్తు జరుగుతోంది. ఎక్సైజ్‌శాఖ యూనియన్ నాయకులు అక్కడే మకాం వేశారు. యూనియన్ కనుసన్నల్లోనే పోస్టింగులు ఖరారవుతున్నట్లు తెలుస్తోంది. డిప్యూటీ కమిషనర్ పోస్టు కావాలంటే స్థానిక మంత్రి లేదా ఎమ్మెల్యే సిఫార్సు లేఖ తప్పనిసరి. ఈ లేఖ కావాలంటే రూ.15 లక్షలు స్థానిక ప్రజాప్రతినిధికి ఇవ్వాల్సిందే. లేఖ తీసుకొస్తే ఆపై పోస్టింగు ఇచ్చేందుకు ఎక్సైజ్ శాఖలోని ఓ ప్రభుత్వ పెద్దకు మరింత ముట్టజెప్పాలి. ఈ క్రమంలో విశాఖపట్నం, గుంటూరు, పశ్చిమగోదావరి, విజయవాడ డీసీ పోస్టులకు రూ.30 లక్షలు ధర నిర్ధారించినట్లు తెలుస్తోంది. కొందరు ఇంత కంటే ఎక్కువ ఇచ్చి చేరేందుకు కూడా సిద్ధమైనట్లు తెలుస్తోంది. తక్కిన జిల్లాల్లో డీసీ పోస్టులకు రూ.20లక్షలు, ఈఎస్ పోస్టులకు రూ.15లక్షలుగా ధర ఫిక్స్ చేశారు. ఈ మొత్తాలకు తక్కువ కాకుండా ఎవరు ఎక్కువ ఇస్తే వారికి పోస్టింగులు ఇస్తున్నారు. పోస్టింగులకు టీడీపీ ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు తప్పనిసరి అని ప్రభుత్వం చెప్పినట్లు తెలుస్తోంది. ప్రజాప్రతినిధులు యూనియన్ నాయకులు సిఫార్సు చేసిన వారికే లేఖలు ఇస్తున్నట్లు చెబుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు కర్నూలు డీసీగా మునిచంద్రమోహన్, అనంతపురం డీసీగా నాగమద్దయ్య ఇప్పటికే ఖరారైనట్లు సమాచారం. చిత్తూరు డీసీ పోస్టు మంత్రి నారా లోకేశ్ సిఫార్సు చేసిన వారికే దక్కనున్నట్లు తెలుస్తోంది. కడప డీసీకి పెద్దగా పోటీ లేదని సమాచారం. అలాగే విశాఖ డిప్యూటీ కమిషనర్‌గా శ్రీరామచంద్రమూర్తి, ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఆర్. ప్రసాద్ పేరు ఖరారైందని చెబుతున్నారు. అలాగే శ్రీకాకుళం ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా రామకృష్ణ ఖరారైనట్లు సమాచారం.

కానిస్టేబుల్ పోస్టుకు సైతం

ఎక్సైజ్ స్టేషన్‌లలో సీఐ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో)గా ఉంటారు. ఆయన కింద ఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు ఉంటారు. ప్రస్తుతం సీఐల పోస్టింగులకు బేరాలు నడుస్తున్నాయి. సీఐ పోస్టుకు సిఫార్సు లేఖ కావాలంటే రూ.8–10 లక్షలు సంబంధిత టీడీపీ ఎమ్మెల్యేకు ముట్టజెప్పాలని తెలుస్తోంది. రాజధానిలో పోస్టింగ్ కావాలంటే మరో రూ.10 లక్షలు సమర్పించుకోవాల్సిందే. స్టేషన్‌ను బట్టి ఈ ధరల్లో తేడాలు ఉన్నాయి. ఈఎస్‌లు.. లెటర్‌కు రూ.10 లక్షలు, రాజధానిలో పోస్టుకు రూ.15 లక్షలు ముట్టజెప్పాల్సిందేనని తెలుస్తోంది. మొదటగా డీసీలు, ఈఎస్‌లు, సీఐలను నియమించనున్నారు. ఆపై వీరు ఎస్ఐ నుంచి కానిస్టేబుళ్ల వరకూ నియమించుకోవచ్చు. ఈ నియామకాల్లోనే వీరు పెట్టిన పెట్టుబడిని రికవరీ చేయాలనే యోచనలో కొందరు డీసీలు, ఈఎస్‌లు ఉన్నట్లు తెలుస్తోంది. కానిస్టేబుల్ పోస్టుకు రూ.లక్ష, హెడ్ కానిస్టేబుల్‌కు రూ.1.50 లక్షలు, ఎస్ఐ పోస్టుకు రూ.5 లక్షలు ధర నిర్ణయించారు. తాము అడిగినంత చెల్లించలేనివారికి మొబైల్ పార్టీ, థర్డ్‌గ్రేడ్ స్టేషన్లను కేటాయించాలని నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు.

విశాఖలో భారీ డిమాండ్

విశాఖ ఎక్సైజ్ శాఖలో పోస్టింగ్‌లకు భారీ డిమాండ్ ఉంది. డిప్యూటీ కమిషనర్ నుంచి సబ్ ఇన్‌స్పెక్టర్ వరకు ప్రతి చోట విపరీతమైన గిరాకీ కనిపిస్తోంది. పోస్టును బట్టి రేటు పలుకుతోంది. విశాఖ ఎక్సైజ్ శాఖలో డిప్యూటీ కమిషనర్ పోస్టు హాట్ సీటుగా మారిపోయింది. ఇక్కడ పోస్టింగ్ కోసం ఆశావహుల సంఖ్యలో కూడా ఎక్కువగానే ఉంది. ప్రధానంగా ముగ్గురు సీనియర్ అధికారులు పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. గతంలో ఇక్కడ సూపరింటెండెంట్‌గా పని చేసి వెళ్లిన అధికారి కూడా ఈ కోవలో ఉన్నట్టు సమాచారం. అలాగే పక్క జిల్లాల నుంచి మరో ఇద్దరు అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కొక్కరు 5 నుంచి 10 మంది ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను సిద్ధం చేసుకుంటున్నారు. అలాగే ఈ పోస్టుకు రూ.30 లక్షలు ముట్టజెప్పేందుకు రెడీ అవుతున్నారు. అలాగే ఎక్సైజ్ సూపరింటెండెంట్ పోస్టు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు పలుకుతోంది. కీలకమైన ఆ స్థానాలను చేజిక్కించుకుంటే.. ఆ తరువాత జరిగే సీఐ, ఎస్ఐ, కానిస్టేబుల్ బదిలీల్లో సులువుగా సంపాదించుకోవచ్చని ఇప్పుడు ఎంతైనా ఖర్చు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది.

స్టేషన్‌ను బట్టి రేటు

సీఐ నుంచి కానిస్టేబుళ్ల వరకు రేటుతో పాటు స్థానిక ప్రజాప్రతినిధి సిఫార్సు లేఖలు కూడా తప్పనిసరి. ఆ సిఫార్సు లేఖలకు స్టేషన్‌ను బట్టి రేటు నిర్ణయించినట్లు సమాచారం. సీఐ పోస్టింగ్‌కు రూ.5 నుంచి రూ.8 లక్షలు, ఎస్ఐకి రూ.2 నుంచి రూ.3 లక్షలు, హెడ్ కానిస్టేబుల్‌కు రూ.లక్ష నుంచి రూ.1.5 లక్షలు, కానిస్టేబుల్ స్థాయికి రూ.50 వేలు నుంచి రూ.75 వేలు వసూలు చేస్తున్నట్లు టాక్ నడుస్తోంది. ఈ వ్యవహారంలో ఎక్సైజ్ శాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర స్థాయి నేత కీలక పాత్ర పోషిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. రాయలసీమ ప్రాంతానికి చెందిన సదరు సీఐ స్థాయి అధికారి లాబీయింగ్‌లో సిద్ధహస్తుడన్న పేరు ఉంది. కొన్ని చోట్ల అధికారులు, సిబ్బంది పోస్టింగుల విషయంలో ఎవరైనా ప్రజాప్రతినిధులను కలిస్తే.. సదరు అధికారి ద్వారా రావాలని స్పష్టంగా చెబుతున్నట్లు సమాచారం.

వెలగపూడిదే రాజ్యం..

విశాఖపట్నం నగర పరిధిలో ఆరుగురు ఎమ్మెల్యేలు ఉన్నా హవా అంతా విశాఖ తూర్పు టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చలాయిస్తున్నారు. కానిస్టేబుల్ నుంచి ఈసీ వరకూ పోస్టులకూ ఆయనే సిఫారసు లేఖలు ఇస్తున్నారు. తక్కిన ఎమ్మెల్యేలు ఎవరూ లేఖలు ఇచ్చేందుకు వీల్లేదు. వీరిలో గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కూడా ఉండటం విశేషం. వీరితో పాటు బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, జనసేన పార్టీ ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్‌బాబు, వంశీకృష్ణ యాదవ్ కూడా ఉన్నారు. భీమిలి టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మినహా తక్కిన వారంతా తమ నియోజకవర్గాల్లో పోస్టింగ్‌ల కోసం ఎమ్మెల్యేల వద్దకు వెళ్తుంటే 'వెలగపూడిని కలవండి' అని వారు చెబుతున్నట్టు తెలుస్తోంది. గతంలో మద్యం సిండికేట్ మొత్తం వెలగపూడి కనుసన్నల్లోనే నడిచేది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరిగి ఎక్సైజ్‌ను పూర్తిగా తన గుప్పిట్లోకి తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీనికి ప్రభుత్వ సహకారం కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

ఉత్తరాంధ్రలో కూడా..

విశాఖలో మాత్రమే కాకుండా విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో కూడా ఇదే తరహా పరిస్థితి కనిపిస్తోంది. ప్రధానంగా శ్రీకాకుళంలో మద్యం తయారీ కంపెనీలు ఉన్నాయి. దీంతో అక్కడ పోస్టింగ్‌లకు కూడా పెద్ద ఎత్తున పైరవీలు జరుగుతున్నాయి. విశాఖలో పోస్టింగ్ అవకాశం దక్కని వారు రెండో ఆప్షన్‌గా శ్రీకాకుళంను ఎంచుకుంటున్నట్లు తెలుస్తోంది. అక్కడ జిల్లా స్థాయిలో పోస్టింగ్ లభిస్తే ఒక వైపు కింది స్థాయి అధికారుల బదిలీల్లోనే కాకుండా మద్యం కంపెనీల నుంచి కూడా పెద్ద ఎత్తున లాభం ఉంటుందని భావిస్తున్నారు. దీంతో శ్రీకాకుళం జిల్లా కూడా ఎక్సైజ్ అధికారులకు హాట్ ఫేవరెట్‌గా మారింది.

కొత్త పాలసీలో భారీ ఆదాయం

ప్రభుత్వం నూతన మద్యం పాలసీ తీసుకురానుంది. టెండర్ల ద్వారా లేదా లాటరీ ద్వారా మద్యం షాపులు ప్రైవేటు వ్యక్తులకు కేటాయించనున్నారు. దీంతో ప్రైవేటు వ్యక్తులు 'సిండికేట్' ద్వారా మద్యం ధరలు పెంచి విక్రయాలు సాగించనున్నారు. దీంతో అధికారులకు నెలమామూళ్లు ఇస్తారు. తద్వారా పోస్టింగ్ పెట్టుబడితో పాటు భారీగానే ఆర్జించే అవకాశం ఉంది. పైగా బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా నడిచే అవకాశం ఉంది. దీంతోనే ఆదాయం ఉన్న స్టేషన్‌ల కోసం భారీగా పెట్టుబడి పెట్టి పోస్టింగులు తెచ్చుకునేందుకు అధికారులు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

ఆ శిక్ష.. ఐపీఎస్‌లపై కక్ష!

▶ మొదటి పేజీ తరువాయి

డీజీ పీఎస్ఆర్ ఆంజనేయులు, ఐజీ టి.కాంతి రాణా, డీఐజీ విశాల్ గున్నీలను ఏకపక్షంగా సస్పెండ్ చేసింది. వారిపై మరిన్ని చర్యలకు సన్నద్ధమవుతోంది. సీనియర్ ఐపీఎస్ అధికారులపై.. అదీ ఏకంగా డీజీ స్థాయి, ఐజీ, డీఐజీ స్థాయి అధికారులపై కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని అర్థమవుతోంది. వ్యక్తిగత కక్షతోనే ఈ ముగ్గురు ఐపీఎస్ అధికారులపై ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగం మేరకు కుట్ర పూరితంగా కక్ష సాధింపునకు పాల్పడుతోంది. ఈ పరిణామం యావత్ దేశ వ్యాప్తంగా అఖిల భారత సర్వీసు అధికారుల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులు, అక్రమ కేసులతో వేధిస్తున్న టీడీపీ కూటమి ప్రభుత్వం.. కీలక ఉన్నతాధికారులే లక్ష్యంగా కుట్రలకు పదును పెడుతోంది.



కాదంబరితో క్విడ్ ప్రో కో కుట్ర

వలపు వల (హనీట్రాప్)తో బడా బాబులను బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడటమే వ్యాపకంగా మార్చుకున్న కాదంబరి జత్వానీతో కూడా చంద్రబాబు ప్రభుత్వం క్విడ్ ప్రో కో కుట్రకు తెరతీసింది. ఫోర్జరీ పత్రాలతో భూములు కొల్లగొట్టేందుకు యత్నించి అడ్డంగా దొరికిపోయిన ఆమెతో టీడీపీ ప్రభుత్వం అవగాహనకు రావడం విడ్డూరంగా ఉంది. తీవ్రమైన నేరాలకు పాల్పడిన కేసుల్లో నిందితురాలికి వత్తాసు పలుకుతూ ఐపీఎస్ అధికారులను వేధిస్తుండటం పట్ల అఖిల భారత సర్వీసు అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నేర చరిత్ర ఉన్న కాదంబరి జత్వానీతో తప్పుడు ఫిర్యాదు ఇప్పించి.. ఐపీఎస్ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, టి.కాంతిరాణా, విశాల్ గున్నీలను ఇప్పటికే ఏకపక్షంగా సస్పెండ్ చేసిన ప్రభుత్వం.. వారిపై మరిన్ని వేధింపులకు పాల్పడేందుకు సన్నద్ధమవుతుండటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాదంబరి జత్వానీ విజయవాడలో ప్రత్యక్షం కావడం వెనుక పక్కా కుట్ర దాగి ఉందని అధికార వర్గాలే వెల్లడిస్తున్నాయి. గతంలో ఆమెపై నమోదు చేసిన ఫోర్జరీ కేసును నీరుగారుస్తామని చెబుతూ.. అందుకు ప్రతిగా ఆ ముగ్గురు ఐపీఎస్ అధికారులకు వ్యతిరేకంగా ఫిర్యాదు చేయమని ఆమెకు షరతు విధించినట్టు స్పష్టమవుతోంది. చంద్రబాబు ప్రభుత్వ కథ, స్క్రీన్ ప్లే ప్రకారం కాదంబరి జత్వానీ నెల రోజులుగా విజయవాడలో హైడ్రామా సృష్టిస్తున్నారు. జత్వానీపై ఏపీ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో పలు కేసులు ఉన్నాయి. వలపు వలతో బడా బాబులను బ్లాక్ మెయిలింగ్ చేయడం ఆమె వ్యాపకంగా చేసుకున్నారని పలు ఫిర్యాదులు, విమర్శలు ఉన్నాయి.

నిందితురాలితో ప్రభుత్వం కుమ్మక్కు

పారిశ్రామికవేత్త కుక్కల విద్యాసాగర్‌కు చెందిన ఐదు ఎకరాలను ఫోర్జరీ పత్రాలతో మరొకరికి విక్రయించేందుకు కూడా కాదంబరి జత్వానీ బరి తెగించారు. వెంటనే అప్రమత్తమైన విద్యాసాగర్ ఈ ఏడాది ఫిబ్రవరిలో ఫిర్యాదు చేయడంతో విజయవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. న్యాయస్థానం అనుమతితో నిబంధనలను పాటిస్తూ ముంబయిలో ఆమెను అరెస్ట్ చేసి విజయవాడ తీసుకువచ్చారు. ఫోర్జరీ అభియోగాలకు సంబంధించి పోలీసులు సమర్పించిన ఆధారాలతో న్యాయస్థానం సంతృప్తి చెంది ఆమెకు రిమాండ్ విధించింది. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినంత మాత్రాన జత్వానీ గతంలో పాల్పడిన తీవ్రమైన, జుగుప్సాకరమైన నేరాలు ఒక్క దెబ్బతో మాయమైపోయినట్టు కాదని అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. కేవలం తన ఫోర్జరీ బాగోతాన్ని ఆధారాలతోసహా వెలికి తీసినందుకే ముగ్గురు ఐపీఎస్ అధికారులపై ఆమె కక్ష గట్టారు. కాగా ఆ పోలీసు అధికారులను అక్రమ కేసులతో వేధించాలని అప్పటికే నిర్ణయించిన చంద్రబాబు ప్రభుత్వం కాదంబరి జత్వానీని తమ కుట్రలో భాగస్వామిగా చేసుకుంది. ప్రభుత్వ పెద్దలు ఆమెతో ఇటీవల ఇప్పించిన ఫిర్యాదుతో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో ఇంకొందరు పోలీసు అధికారుల పేర్లను కూడా చేర్చేందుకు సన్నద్ధమవుతున్నట్టుగా తెలుస్తోంది. చంద్రబాబు ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలు, అధికారులను అవమానిస్తూ వేధిస్తున్న తీరు అఖిల భారత సర్వీసు అధికారుల మనోస్థైర్యాన్ని దెబ్బ తీస్తున్నాయి. ఇదే ప్రభుత్వ విధానంగా మారితే.. రాష్ట్రంలో ఏ అఖిల భారత స్థాయి అధికారి కూడా నిబద్ధతతో పని చేయడం సాధ్యం కాదని చెబుతున్నారు. ఏదైనా నేరానికి పాల్పడిన వారిపై విచారణ నిర్వహించి పక్కా ఆధారాలతో చర్యలు తీసుకుంటే ప్రభుత్వ పెద్దలు అభినందించాలి. కానీ నిందితులతో కుమ్మక్కై అధికారులనే వేధిస్తుంటే రాష్ట్రంలో పని చేసేందుకు ఏ అఖిల భారత సర్వీసు అధికారి కూడా ఇష్టపడరని స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వ అధికార యంత్రాంగం మనోధైర్యం దెబ్బతింటే అంతిమంగా ప్రజలే నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మరో టార్గెట్ రామకృష్ణే

చంద్రబాబు, ఈనాడు రామోజీరావు కుటుంబం క్విడ్ ప్రో కోకుట్ర మరోసారి అధికారికంగా బట్టబయలవుతోంది. అందులో భాగంగానే స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ పూర్వపు ఐజీ రామకృష్ణకు టీడీపీ కూటమి ప్రభుత్వం గురి పెట్టింది. ఎందుకంటే.. రామోజీరావు కుటుంబం దశాబ్దాలుగా మార్గదర్శి చిట్ ఫండ్స్ ద్వారా యథేచ్ఛగా పాల్పడిన ఆర్థిక అక్రమాలను ఆధారాలతో సహా ఆయన నిగ్గు తేల్చారు. కేంద్ర సర్వీసుల నుంచి డెప్యుటేషన్‌పై రాష్ట్రానికి వచ్చిన ఐఆర్ఎస్ అధికారి రామకృష్ణ.. కేంద్ర చిట్ ఫండ్ చట్టాన్ని పక్కాగా అమలు చేసేందుకు ప్రయత్నించారు. ఆ చట్టాన్ని ఉల్లంఘిస్తూ రామోజీరావు కుటుంబం మార్గదర్శి చిట్స్ చందాదారుల సొమ్మును అక్రమ మార్గాల ద్వారా మళ్లించి తమ కుటుంబ వ్యాపార సంస్థలు, మ్యూచువల్ ఫండ్స్‌లో అక్రమ పెట్టుబడులుగా పెట్టినట్టు స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ గుర్తించింది. ఘోస్ట్ చందాదారుల పేరుతో అక్రమాలు, రశీదుల ముసుగులో అక్రమ డిపాజిట్ల సేకరణ తదితర ఆర్థిక నేరాలను వెలుగులోకి తెచ్చింది. దాంతో రెండేళ్ల పాటు మార్గదర్శి చిట్ ఫండ్స్‌లో కొత్త చిట్టీ గ్రూపులు నిలిచి పోవడంతో రామోజీ కుటుంబ ఆర్థిక అక్రమాల పునాదులు కదిలాయి. స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ ఫిర్యాదుతో సీఐడీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. అక్రమాలకు పక్కా ఆధారాలు లభించడంతో గత ఏడాది రామోజీరావు (ప్రస్తుతం చనిపోయారు), ఆయన కోడలు శైలజ కిరణ్‌ను హైదరాబాద్‌లో విచారించారు. ఇది ఆ కుటుంబంతో అనుబంధం ఉన్న చంద్రబాబుకు ఏమాత్రం రుచించలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రామకృష్ణను వ్యక్తిగత లక్ష్యంగా చేసుకున్నారు. ఆయనకు పోస్టింగు ఇవ్వనే లేదు. మరోవైపు ఐఆర్ఎస్ అధికారిగా ఆయన డెప్యుటేషన్ పూర్తి కావడంతో కేంద్ర సర్వీసులకు తిరిగి వెళ్లాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం రిలీవ్ చేయకపోయినా సరే.. డీమ్డ్ టు బీ రిలీవ్డ్‌గా ఆయన తిరిగి కేంద్ర సర్వీసుకు వెళ్లిపోవచ్చు. కానీ ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగా ఆయన్ను ఆపి వేధిస్తోంది. రామకృష్ణను లక్ష్యంగా చేసుకుని ఈనాడు పత్రికలో రెండు రోజులుగా ప్రత్యేక కథనాలు ప్రచురించడమే ఇందుకు నిదర్శనం. రాజగురువు కుటుంబానికి ఆగ్రహం కలిగిందని బెంబేలెత్తిన చంద్రబాబు ప్రభుత్వం.. నిబంధనలను అతిక్రమించేందుకు కూడా వెనుకాడటం లేదు. రామోజీ కుటుంబాన్ని సంతృప్తి పరిచేందుకు రామకృష్ణపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయాన్ని ఆదేశించినట్టు సమాచారం. కేంద్ర ప్రభుత్వ అధికారి అయిన ఆయనపై ఏకపక్షంగా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయ వర్గాలు తర్జన భర్జన పడుతున్నాయి. కానీ రామోజీ కుటుంబం కళ్లల్లో ఆనందం చూడటమే తమ లక్ష్యం.. అన్నట్లు రామకృష్ణపై చర్యలు తీసుకోవాల్సిందేనని ముఖ్యమంత్రి కార్యాలయం స్పష్టం చేసినట్టు సమాచారం. దాంతో రామకృష్ణపై ప్రభుత్వం ఒకట్రెండ్రోజుల్లో కక్ష సాధింపు చర్యలు చేపట్టే అవకాశాలున్నాయని సచివాలయ వర్గాలు చెబుతున్నాయి.

మద్యం అమ్మకాల్లో తగ్గేదే లే!

ఇతర రాష్ట్రాల కంటే తగ్గని విధంగా కొత్త విధానం రూపకల్పన

సీఎం చంద్రబాబు ఆదేశాలతోనే కొత్త మద్యం విధానం



సాక్షి, అమరావతి: పొరుగు రాష్ట్రాల కంటే మన రాష్ట్రంలో మద్యం విక్రయాల ద్వారా ప్రభుత్వ ఆదాయం తగ్గకుండా ఉండేలా కొత్త మద్యం విధానం ఉంటుందని మంత్రివర్గ ఉప సంఘం ప్రకటించింది. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాల స్థానంలో ఇక నుంచి ప్రైవేటు మద్యం దుకాణాల విధానాన్ని ప్రవేశ పెడతామని తెలిపింది. కొత్త మద్యం విధానాన్ని రూపొందించేందుకు ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం సభ్యులు కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్, కొండపల్లి శ్రీనివాస్‌లు మంగళవారం వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో సమావేశమయ్యారు. తమ మంత్రివర్గ ఉపసంఘం నివేదిక గురించి ఆయనతో చర్చించారు. కొత్త మద్యం విధానంలో చేర్చాల్సిన పలు అంశాలను సీఎం వారికి సూచించారు. కొత్త మద్యం విధానంపై రూపొందించిన నివేదికను బుధవారం నిర్వహించనున్న రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో ప్రవేశపెట్టి ఆమోదించాలని నిర్ణయించారు. కొత్త మద్యం విధానాన్ని అక్టోబర్ 1 నుంచి రాష్ట్రంలో అమలు చేయనున్నారు. అనంతరం మీడియా సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభుత్వ మద్యం దుకాణాల విధానం ఈ నెల 30తో ముగుస్తుందన్నారు. దాంతోపాటు ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని ఉద్యోగుల కాల పరిమితి కూడా ముగుస్తుందని పరోక్షంగా వెల్లడించారు.

నగరాల్లో స్మార్ట్ మద్యం దుకాణాలు

ప్రైవేటు మద్యం దుకాణాలను జిల్లా కమిటీలు లాటరీ విధానంలో కేటాయిస్తాయని మంత్రి రవీంద్ర చెప్పారు. మద్యం దుకాణాల టెండర్లలో సిండికేట్ కాకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా కమిటీలదేనని స్పష్టం చేశారు. గీత కార్మికులకు 10 శాతం మద్యం దుకాణలను కేటాయిస్తామన్నారు. జనాభా ఎక్కువగా ఉండే నగరాల్లో స్మార్ట్ మద్యం దుకాణాలను ఏర్పాటు చేస్తామన్నారు. మద్యం ధరలను ఓ కమిటీ నిర్ణయిస్తుందని ఆయన చెప్పారు. సామాన్యులకు అందుబాటు ధరలో ఒక బ్రాండును ప్రవేశపెడతామని వెల్లడించారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో వివిధ సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని కొత్త మద్యం విధానాన్ని రూపొందించామన్నారు. మద్యం విక్రయాల ద్వారా వచ్చిన ఆదాయం నుంచే మద్యం వ్యసనాన్ని తగ్గించేందుకు డి అడిక్షన్ సెంటర్లు, కౌన్సెలింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు, ఉద్యోగాలు వచ్చేలా కొత్త మద్యం విధానం ఉంటుందన్నారు. నాణ్యమైన మద్యాన్ని అందిస్తూనే ఆదాయ సముపార్జనలో పొరుగు రాష్ట్రాలతో పోటీ పడేలా కొత్త మద్యం విధానం ఉంటుందని మంత్రి సత్యకుమార్ చెప్పారు. ఆరు రాష్ట్రాల్లో విధానాలను పరిశీలించిన అనంతరమే కొత్త మద్యం విధానాన్ని రూపొందించామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.

ఏమైనా మిగిలాయా!



విజయవాడ భవానీపురం బొమ్మసాని సుబ్బారావు నగర్‌లో వరదకు కొట్టుకుపోగా మిగిలిన కొద్దిపాటి సామగ్రిని జాగ్రత్త చేసుకుంటున్న వరద బాధితుడు.

జ్ఞాపకం పదిలం



విజయవాడ కండ్రికలో ఇంట్లో బురదను చూసి విషాదంలో మునిగిన ఎం.దుర్గ.. తమ పెళ్లినాటి ఫొటోను చూసుకుంటూ మధుర జ్ఞాపకాన్ని పదిలపర్చుకుంటున్న దృశ్యమిది.

చక్క'బడే' బాధ్యత చిట్టి చేతులదే



బడులను బాగుచేసుకునే బాధ్యత చిట్టిచేతులపైనే పడింది. విజయవాడ సింగ్‌నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో బురదగా మారిన బెంచీలను విద్యార్థులే శుభ్రం చేసుకుంటున్న దృశ్యమిది.

పనికొస్తాయా మాస్టారూ!



బుడమేరు వరద వల్ల పాఠశాలల్లో తడిసిన డిజిటల్ బోధన సామగ్రి పనికొస్తాయో లేదో తెలీదుకానీ.. సింగ్‌నగర్ హైస్కూల్‌లో తడిసిన ట్యాబ్‌లు, కంప్యూటర్లను ఆరబెడుతున్న టీచర్

క్లుప్తంగా...

వంట నూనెల నిల్వలపై విజిలెన్స్ తనిఖీలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పామాయిల్, ఇతర వంటనూనెల దుకాణాలు, హోల్‌సేల్ వ్యాపార సంస్థల్లో విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం సోదాలు నిర్వహించారు. 50 బృందాలుగా ఏర్పడిన అధికారులు 26 జిల్లాల్లోని వంటనూనెల మిల్లర్లు, స్టాకిస్టులు, రిటైల్ వ్యాపార సంస్థల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. వంటనూనెలు అక్రమంగా నిల్వ చేసినా, కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీఎస్సీ నర్సింగ్ దరఖాస్తు గడువు పొడిగింపు



సాక్షి, అమరావతి: బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో 2024-25 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు చేసుకోవడానికి ఈనెల 20వ తేదీ వరకూ గడువు పొడిగిస్తూ మంగళవారం ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి ప్రకటన విడుదల చేశారు. 20వ తేదీ రాత్రి 9 గంటలలోగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదే విధంగా ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు స్పోర్ట్స్ కోటా కింద దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల తాత్కాలిక ప్రయారిటీ లిస్ట్ విడుదల చేశారు. mbbsbdsadmissions24@gmail.com మెయిల్‌కు అభ్యర్థులు బుధవారం మధ్యాహ్నం మూడు గంటల్లోగా అభ్యంతరాలను పంపవచ్చని పేర్కొన్నారు.

'భూముల రీ సర్వే' పేరు మార్పు



సాక్షి, అమరావతి: అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పథకాలను రద్దు చేయడం, పేర్లు మార్చడంపైనే దృష్టి పెట్టిన చంద్రబాబు ప్రభుత్వం తాజాగా మరో పథకానికి పేరు మార్చింది. వైఎస్ జగన్ హయాంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం' పేరును కూటమి ప్రభుత్వం 'ఏపీ రీ సర్వే ప్రాజెక్టు'గా మార్చేసింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివాదాస్పదంగా మారిన భూముల వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు వైఎస్ జగన్ హయాంలో ఈ పథకం ప్రారంభమైంది. 8 వేల గ్రామాల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసి.. డిజిటల్ రికార్డులను అందుబాటులోకి తెచ్చింది. కానీ ప్రజలకు మంచి జరగడాన్ని సహించలేకపోయిన టీడీపీ.. ఈ పథకంపై పెద్దఎత్తున దుష్ప్రచారం చేసింది. అధికారంలోకి రాగానే ఈ పథకాన్ని నిలిపివేసింది. ఇప్పుడు పేరు కూడా మార్చేసింది.

బీసీలకు పెద్దపీట వేస్తాం

మంత్రి సవిత



సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వంలో బీసీలకు పూర్వవైభవం తీసుకొస్తామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్‌పై రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు మంగళవారం నిర్వహించిన సమీక్షలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి సవిత వెల్లడించారు. బీసీ సంక్షేమం కోసం రూ.110 కోట్ల డైట్ ఛార్జీల బకాయిలు, రూ.20.52 కోట్ల కాస్మొటిక్ ఛార్జీల బకాయిల విడుదలకు నిర్ణయం తీసుకున్నామన్నారు. వసతి గృహాలకు రూ.35కోట్లు విడుదల చేస్తామని తెలిపారు. బీసీ కార్పొరేషన్‌ను పునర్ వ్యవస్థీకరించి, సమగ్ర సర్వే చేస్తామని, సమగ్ర కార్యాచరణ, ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. అంతకుముందు మంత్రి విశ్వకర్మ జయంతిలో పాల్గొన్నారు. ఆయన చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

వంద రోజుల్లో రోడ్లపై గుంతలు లేకుండా చూడండి

సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్



సాక్షి, అమరావతి: వంద రోజుల్లో రాష్ట్రంలోని అన్ని రహదారులను గుంతలు లేకుండా తీర్చిదిద్దాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ రహదారులు, భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల్లో వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలుపై మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఆయా శాఖల కార్యదర్శులతో సీఎస్ సమీక్షించారు. ఇప్పటికే నిధులు మంజూరైనందువల్ల రహదారులకు మరమ్మతులు చేపట్టాలని చెప్పారు. తర్వాత సంబంధిత ఏఈ, డీఈ, ఈఈ, ఎస్ఈల నుంచి తమ ప్రాంతంలోని రహదారులకు గుంతలు లేవని సర్టిఫికెట్లు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు. రోడ్లు, భవనాలశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే మాట్లాడుతూ త్వరలోనే టెండర్లు ఖరారు చేసి గుంతలను పూడ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యాశాఖపై సమీక్ష చేస్తూ మధ్యాహ్న భోజన పథకం, అకడమిక్ క్యాలెండర్, నైపుణ్య శిక్షణ, వివిధ విద్యాసంస్థలకు రేటింగ్ ఇచ్చే ప్రక్రియ, ఐటీఐలు, పాలిటెక్నిక్‌లను పరిశ్రమలతో అనుసంధానం చేసి ఇంటర్న్‌షిప్, అప్రెంటీస్‌షిప్ కల్పించడం వంటి అంశాలపై చర్చించారు. అదేవిధంగా రాష్ట్రంలోని ప్రమాదకర పరిశ్రమల్లో మూడు నెలలకు ఒకసారి తప్పకుండా సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని సీఎస్ ఆదేశించారు.

టాపర్ల ఎంపిక.. ఐఐటీ బాంబే

జేఈఈ అడ్వాన్స్‌డ్ టాప్ ర్యాంకర్లను ఆకర్షిస్తున్న విద్యా సంస్థ



సాక్షి, అమరావతి: జేఈఈ అడ్వాన్స్‌డ్ టాపర్లకు ఐఐటీ బాంబే (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-బాంబే)అగ్రగామి ఎంపికగా కొనసాగుతోంది. ఈ ఏడాది టాప్-10 జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకులు సాధించిన విద్యార్థులంతా ఐఐటీ-బాంబేలోనే ప్రవేశాలు పొందారు. మొదటి 25 ర్యాంకుల్లో 24 మంది, 50 ర్యాంకుల్లో 47 మంది, 1000లోపు ర్యాంకుల్లో 246 మంది ఐఐటీ-బాంబే నుంచే ఇంజనీర్లుగా ఎదిగేందుకు ప్రణాళిక వేసుకున్నట్టు తెలుస్తోంది. ఇంజనీరింగ్ విద్య, పరిశోధన రంగంలో అగ్రగామిగా ఐఐటీ బాంబే ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందింది. అందుకే.. 2018లో కేంద్ర ప్రభుత్వం దీనికి ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్ హోదాను మంజూరు చేసిన విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా జాతీయ సాంకేతిక విద్యను విస్తరించడంలో భాగంగా ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీలతో పాటు కేంద్ర ప్రభుత్వ సహకారంతో నడిచే విద్యాసంస్థల్లో ప్రవేశాలకు జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ పరీక్షలు నిర్వహించింది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఐఐటీ మద్రాస్ 'జేఈఈ అడ్వాన్స్‌డ్-2024' నివేదికను విడుదల చేసింది. అడ్వాన్స్‌డ్ పరీక్ష నిర్వహణ, జోసా కౌన్సెలింగ్‌లో కీలకంగా వ్యవహరించిన (జేఈఈ అడ్వాన్స్‌డ్ ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్-2) ఆచార్య అన్నాబత్తుల రత్నకుమార్ ఏపీకి చెందిన వ్యక్తి కావడం విశేషం. 2024-25 విద్యా సంవత్సరానికి 2.50 లక్షల మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించగా.. 1.80 లక్షల మంది పరీక్షలు రాశారు. ఇందులో 17,695 మంది 23 ఐఐటీల్లో సీట్లు సాధించారు. వీరిలో భారతీయ పౌరసత్వ మూలాలున్న 88 మంది, ఇద్దరు విదేశీ విద్యార్థులు కూడా ఉన్నారు.


బాంబే తర్వాత ఢిల్లీనే..

దేశంలోని 23 ఐఐటీల్లో ఐఐటీ బాంబే తర్వాత టాప్ ర్యాంకర్ల ఫేవరెట్ ఎంపికగా ఐఐటీ-ఢిల్లీ మారింది. ఇందులో టాప్-50 ర్యాంకర్లలో ఇద్దరు, టాప్-100లో 23 మంది, టాప్-200లో 50 మంది, టాప్-500లో 109, టాప్-1000లో 204 మంది ప్రవేశాలు పొందారు. ఆ తర్వాత తొలి వెయ్యి ర్యాంకుల్లో ఐఐటీ మద్రాస్‌లో 128 మంది, ఐఐటీ కాన్పూర్‌లో 117 మంది, ఐఐటీ ఖరగ్‌పూర్‌లో 82 మంది, ఐఐటీ గౌహతిలో 69 మంది, ఐఐటీ రూర్కీలో 55 మంది, ఐఐటీ హైదరాబాద్‌లో 41 మంది, ఐఐటీ వారణాసిలో 23 మంది, ఐఐటీ ఇండోర్‌లో ఐదుగురు, ఐఐటీ గాంధీనగర్‌లో ఒకరు ప్రవేశాలు పొందారు.

మహిళా విద్యార్థుల ప్రవేశాలు ఇలా..

గడచిన నాలుగేళ్లతో పోలిస్తే ఐఐటీల్లో సీట్ల సంఖ్య క్రమేపీ పెరుగుతూ వస్తోంది. 2024-25 ప్రవేశాల్లో 23 ఐఐటీల్లో సూపర్ న్యూమరరీ సీట్లు 3,566 ఉండగా.. మొత్తం సీట్లు 17,760కు చేరాయి. వీటిలో 17,695 సీట్లు భర్తీ చేశారు. వీటిలో సుమారు 80 శాతం ప్రవేశాలు పురుషులే పొందుతున్నారు. ఏటా ఐఐటీల్లో ప్రవేశాలు పొందుతున్న మహిళలు మాత్రం కేవలం 3 వేల వరకు మాత్రమే ఉంటున్నారు. గడచిన ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం 73 మంది మాత్రమే అధికంగా ప్రవేశాలు తీసుకున్నారు. ఐఐటీలో అత్యధికంగా ఖరగ్‌పూర్‌లో 363, వారణాసిలో 301, బాంబేలో 278, రూర్కీలో 275, ఢిల్లీలో 246, కాన్పూర్‌లో 248, మద్రాస్‌లో 231 మందితో పాటు హైదరాబాద్‌లో 120, తిరుపతిలో 50 మంది మహిళలు ప్రవేశాలు పొందారు.


ఐఐటీ ప్రవేశాల్లో మహిళా విద్యార్థుల ప్రవేశాలు ఇలా..



గత నాలుగేళ్లుగా ఐఐటీ టాప్-1000 ర్యాంకర్ల ప్రవేశాలు ఇలా..

ఐఐటీ	2021	2022	2023	2024
బాంబే	265	246	245	246
ఢిల్లీ	203	210	208	204
మద్రాస్	110	110	113	128
కాన్పూర్	120	107	120	120
ఖరగ్‌పూర్	79	93	81	82
రూర్కీ	49	60	66	55
గౌహతి	61	66	63	69

2024లో ఐఐటీ బాంబేలో 1000 ర్యాంకర్ల ప్రవేశాలు ఇలా..



తెలియకుంటే.. మిన్నకుంటే మేలు!



జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో విద్యార్థులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. తాము కలలుకన్న ఐఐటీల్లో సీట్లు సాధించేందుకు ప్రతి మార్కును లెక్కించుకుంటున్నారు. ఈ క్రమంలోనే మైనస్ మార్కులు ఉండటంతో తెలియని ప్రశ్నల జోలికి వెళ్లడం లేదు. ఇలా పేపర్-1 గణితంలో 7వ ప్రశ్నను 80.31 శాతం మంది విడిచిపెట్టేశారు. ఇలా ప్రశ్నలు1, 3, 4, 5, 14, 17కు సుమారు 60 శాతానికిపైగా విద్యార్థులు సమాధానాలు రాయలేదు. ఫిజిక్స్‌లో 7వ ప్రశ్నకు అత్యధికంగా 82.32 శాతం మంది సమాధానం ఇవ్వలేదు. ఇలా 2, 3, 6, 16 ప్రశ్నలు 60 శాతానికిపైగా దూరంగా ఉన్నారు. కెమిస్ట్రీలో చాలావరకు జవాబు రాయడానికి ప్రయత్నించినట్టు తెలుస్తోంది. ఇలానే పేపర్-2లో గణితంలో 5వ ప్రశ్నకు అత్యధికంగా 71.11 శాతం మంది, ఫిజిక్స్‌లో 7వ ప్రశ్నకు 72.27 శాతం మంది జవాబు రాయలేదు. మొత్తంగా చూస్తే రెండు పేపర్లలో ఏ ఒక్క ప్రశ్నకు కూడా నూరు శాతం మంది జవాబు పెట్టకపోవడం గమనార్హం.

వరద బాధితులకు ప్యాకేజీ

▶ మొదటి పేజీ తరువాయి

అద్దెకు ఎవరైనా ఉంటుంటే పరిహారం వారికే చెల్లిస్తామన్నారు. కిరాణా షాపులు, చిన్న వ్యాపారులకు రూ.25 వేల చొప్పున ఇస్తామన్నారు. ఇప్పటికే అర్బన్ కంపెనీ ద్వారా ఎలక్ట్రానిక్ పరికరాల మరమ్మతులు చేయిస్తున్నామన్నారు.

వ్యవసాయ రంగానికి పరిహారం ఇలా

వరి పంట దెబ్బతింటే హెక్టారుకు రూ.25 వేల చొప్పున పరిహారం చెల్లిస్తామని చంద్రబాబు చెప్పారు. పత్తి, వేరుశనగ, చెరకు పంటలకు హెక్టారుకు రూ.25 వేల చొప్పున, మొక్కజొన్న, సజ్జలు, మినుము, పెసలు, కందులు, రాగులు, కొర్రలు, సామలు, రాగులు, నువ్వులు, సోయాబీన్, సన్‌ఫ్లవర్, ఆముదం, జూట్ పంటలకు హెక్టారుకు రూ.15 వేల చొప్పున పరిహారం ఇస్తామన్నారు. తమలపాకు పంటకు హెక్టారుకు రూ.75 వేలు, అరటి, మిరప, పసుపు కంద, జామ, నిమ్మ, మామిడి, జీడిమామిడి, దానిమ్మ, సపోటా, డ్రాగన్ ఫ్రూట్‌తో పాటు కాఫీ, యాపిల్ బేర్ తోటలకు హెక్టారుకు రూ.35 వేలు, కూరగాయలు, బొప్పాయి, టమాటా, పూలు, ఉల్లి, మెలన్స్, నర్సరీ, కొత్తిమీర పంటలకు హెక్టారుకు రూ.25 వేలు, ఆయిల్‌పామ్, కొబ్బరి ఒక్కో చెట్టుకు రూ.1,500, మల్బరీ తోటలకు హెక్టారుకు రూ.25 వేల చొప్పున పరిహారం చెల్లిస్తామన్నారు. చనిపోయిన ఆవులు, గేదెలకు రూ.50 వేలు, ఎద్దులకు రూ.40 వేలు, దూడలకు రూ.25 వేలు, మేకలు, గొర్రెలకు రూ.7,500, కోడిపిల్లకు రూ.100, పశువుల షెడ్లకు రూ.5 వేల చొప్పున పరిహారం అందిస్తామన్నారు. పంట నష్టాలను ఆయా క్షేత్రాల్లో రైతులు సాగు చేస్తున్నారా లేదా కౌలు రైతులకు సాగు చేస్తున్నారా గుర్తించి వారికే అందజేస్తామన్నారు. వలలతో సహా పూర్తిగా దెబ్బతిన్న నాన్ మోటరైజ్డ్ బోట్లకు రూ.20 వేలు, మోటరైజ్డ్ బోట్లకు రూ.25 వేలు, ఫిష్ ఫామ్స్ (డిసిల్టింగ్, రిస్టోరేషన్, మరమ్మతులు)కు హెక్టారుకు రూ.18 వేల పరిహారమిస్తామన్నారు.

మరమ్మతులకు రుణాలు

విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల పరిధిలో దెబ్బతిన్న గ్రౌండ్ ఫ్లోర్ ఇళ్లకు రూ.50 వేలు, ఫస్ట్ ఫ్లోర్‌లో ఉన్న ఇళ్లకు రూ.25 వేల చొప్పున బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తామని చెప్పారు. దుకాణాలు, వాణిజ్య సముదాయాలు, ఎంఎస్ఎంఈల రుణాలను 24 నెలలపాటు రీషెడ్యూల్ చేయాలని కోరామని, బ్యాంకులు 12 నెలలపాటు రీషెడ్యూల్ చేయడానికి ముందుకొచ్చాయన్నారు. వ్యవసాయ రుణాలను ఐదేళ్లపాటు రీషెడ్యూల్ చేయిస్తామని, ఏడాది పాటు మారటోరియం విధించాలని ఆదేశించామన్నారు. రైతుల అవసరాలకు అనుగుణంగా కొత్తగా పంట రుణాలిస్తామని చెప్పారు.

ఆ భూతాన్ని పూడ్చిపెట్టాలి

గత ప్రభుత్వం విపత్తుల నిధులను ఖర్చుచేసి అకౌంట్స్‌లో చూపలేదని, దీంతో ఈ ఆర్థిక ఏడాది విపత్తుల నిధి నుంచి తొలి విడత రావాల్సిన నిధులు రూ.515 కోట్లు కేంద్రం నుంచి రాలేదని చంద్రబాబు అన్నారు. గత ప్రభుత్వం దుర్మార్గమైన పాలన చేసిందని, గత ప్రభుత్వ భూతాన్ని మళ్లీ లేవకుండా శాశ్వతంగా పూడ్చిపెట్టాలని అన్నారు. పంచాయతీరాజ్ నిధులతో పాటు పోలవరం నిధులను కూడా దారి మళ్లించిందని ఆరోపించారు. రూ.10.50 లక్షల కోట్లు అప్పులున్నాయని, రూ.లక్ష కోట్ల బిల్లు బకాయిలు ఉన్నాయని చెప్పారు. జీతాలు కూడా ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందని, ఈ నేపథ్యంలో కేంద్రం త్వరగా ఆర్థిక సాయం అందించాలని కోరుతున్నట్టు చెప్పారు. కేంద్రం నుంచి వచ్చే వరద సాయంపై ఇప్పుడే చెప్పలేనన్నారు.

అమరావతి మునిగిపోతుందని దుష్ప్రచారం

అమరావతి మునిగిపోతుందని వైఎస్సార్‌సీపీ దుష్ప్రచారం చేస్తోందని చంద్రబాబు మండిపడ్డారు. బుద్ధి, జ్ఞానం ఉన్న వారెవరూ ఇలా మాట్లాడరన్నారు. అలాంటి నోళ్లకు తాళం వేయాలన్నారు. కింద నీళ్లు వస్తాయని, రాజధానిని ఆకాశంలో కట్టుకుంటామా అని ప్రశ్నించారు. ఏ సిటీ మునగకుండా ఉంటుందో చెప్పాలన్నారు. కర్నూలు, రాజమండ్రి మునిగిపోలేదా.. బెంగళూరు, ముంబై, హైదరాబాద్ మునిగిపోలేదా అని ప్రశ్నించారు. ఆ సిటీలు మునిగిపోయాయని రాజధానులను మార్చేశారా అని ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌పై కొంతమంది రెచ్చగొడుతున్నారన్నారు. గతంలో స్టీల్ ప్లాంట్‌ను తానే కాపాడితే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ప్రైవేట్ స్టీల్ ప్లాంట్లకు లాభాలు వస్తుంటే.. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఎందుకు నష్టం వస్తోందో యాజమాన్యం, సిబ్బంది ఆలోచించుకోవాల్సి ఉందన్నారు.

త్వరలోనే 'ఆపరేషన్ బుడమేరు'

గత ప్రభుత్వ తప్పుడు పనులు, ఆక్రమణల వల్లే ఇంత వరద వచ్చిందని చంద్రబాబు విమర్శించారు. త్వరలోనే ఆపరేషన్ బుడమేరు ప్రారంభిస్తామన్నారు. మెడికల్ కాలేజీలపై వైఎస్సార్‌సీపీ ఆరోపణలు చేస్తోందని, వాటిపై జీవో ఏమిచ్చారో ఆ జీవో మెడకు కట్టి ఊరంతా తిప్పుతానన్నారు.

వరద బాధితులకు నష్టపరిహారం ఇలా..

విజయవాడలో గ్రౌండ్ ఫ్లోర్ మునిగితే	రూ.25 వేలు
ఫస్ట్ ఫ్లోర్, ఆపై అంతస్తులు మునిగితే	రూ.10 వేలు
రాష్ట్రంలో మిగతా ప్రాంతాల్లో గ్రౌండ్ ఫ్లోర్ మునిగితే	రూ.10 వేలు
విజయవాడలో చిన్న దుకాణాలకు	రూ.25 వేలు
రిజిస్టర్డ్ వ్యాపార సంస్థలు, ఎంఎస్ఎంఈలు (రూ.40 లక్షల లోపు టర్నోవర్)	రూ.50 వేలు
రిజిస్టర్డ్ వ్యాపార సంస్థలు, ఎంఎస్ఎంఈలు (రూ.40 లక్షల నుంచి రూ.1.5 కోట్ల టర్నోవర్)	రూ.1 లక్ష
రూ.1.50 కోట్లకు పైగా టర్నోవర్	రూ.1.50 లక్షలు
ముంపు ప్రాంతాల్లో దెబ్బతిన్న ద్విచక్ర వాహనాలకు	రూ.3 వేలు
దెబ్బతిన్న ఆటోలు వంటి 3 చక్రాల వాహనాలు	రూ.10 వేలు
విజయవాడలో తోపుడు బళ్లు మునిగితే.. కొత్త తోపుడు బళ్లు అందజేత	
ముంపునకు గురైన చేనేత, చేతివృత్తుల వారికి	రూ.25 వేలు

బొలిశెట్టి వ్యాఖ్యలపై దుమారం

- ఆ వ్యాఖ్యలు స్టీల్‌ప్లాంట్‌పై జనసేన పార్టీ స్టాండా అని కార్మిక సంఘాల నిలదీత
- వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా నాలుక చీరేస్తామని అల్టిమేటం

విశాఖ సిటీ: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న కార్మిక, ఉద్యోగ సంఘాల నాయకులను అవమానిస్తూ జనసేన పార్టీ నేత బొలిశెట్టి సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ 1,314 రోజులుగా స్టీల్‌ప్లాంట్ కార్మికులు, ఉద్యోగులు చేస్తున్న పోరాటాలు దొంగ ఉద్యమాలని బొలిశెట్టి వ్యాఖ్యానించడం వివాదాస్పదమైంది. 'దుకాణాల మాదిరిగా టెంట్లు వేసుకుని కూర్చున్న వారు పవన్‌కళ్యాణ్‌ను ఎందుకు కలవలేదని, వారిని చాచిపెట్టి కొట్టాల'న్న బొలిశెట్టి వ్యాఖ్యలపై కార్మికులు, ఉద్యోగులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలు జనసేన పార్టీ స్టాండా? అని ప్రశ్నిస్తున్నారు. అదే వారి విధానమైతే తాము స్టీల్‌ప్లాంట్ కోసమే కాకుండా.. జనసేన పార్టీకి వ్యతిరేకంగా కూడా ఉద్యమిస్తామని హెచ్చరికలు జారీ చేశారు.

ఆ వ్యాఖ్యలు పట్టించుకోం




కార్మిక సంఘాల ఉద్యమాల వల్లే ప్రైవేటీకరణ ఇంతకాలం ఆగిందని బహిరంగ సభలో పవన్ చెప్పారు. బొలిశెట్టి జనసేనలో ఉంటూ బాధ్యతారహితంగా మాట్లాడుతూ ఆ పార్టీ పరువు తీస్తున్నారు. - డి.ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి, స్టీల్ ఏఐటీయూసీ

క్షమాపణ చెప్పాలి



ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నం ఇది. ఏనాడూ బొలిశెట్టి కార్మికుల ఉద్యమంలో పాల్గొనలేదు. ఆయన భేషరతుగా క్షమాపణ చెప్పాలి. దమ్ముంటే టెంట్ వద్దకు వచ్చి ఆ మాట చెప్పాలి.
- రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి, స్టీల్ ఐఎన్‌టీయూసీ

సంఘాల వల్లే ప్రైవేటీకరణ ఆగింది



కార్మిక సంఘాలు ఉండబట్టే ఇప్పటివరకు ప్రైవేటీకరణ ఆగింది. డ్రెడ్జింగ్ కార్పొరేషన్ సీఐటీయూ పోరాటాల వల్ల ఆగింది తప్ప.. పవన్‌కళ్యాణ్ వల్ల కాదు. ఈ విషయాలేవీ బొలిశెట్టికి తెలియదేమో. - యు.రామస్వామి, ప్రధాన కార్యదర్శి, స్టీల్ సీఐటీయూ

విమర్శలు అర్థరహితం



స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాలపై జనసేన నేత బొలిశెట్టి సత్యనారాయణ చేసిన విమర్శలు అర్థరహితం. జనసేన అధికారంలోకి వచ్చాకే కార్మిక సంఘాలు మంచివి కావని ఆయనకు తెలిసిందా.
- వై.మస్తానప్ప, ప్రధాన కార్యదర్శి, స్టీల్ వైఎస్సార్‌టీయూసీ

ప్రకృతి వ్యవసాయం.. అనేక సవాళ్లకు సమాధానం

మెక్సికో ప్రభుత్వ ఏరియా డైరెక్టర్ డియాజ్ మరియా




విత్తనాలు నాటుతున్న మెక్సికో బృందం

రామచంద్రాపురం: ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలు ఆందోళన కలిగిస్తున్నాయని, ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయం అనేక సవాళ్లకు సమాధానం చూపగలదని మెక్సికో ప్రభుత్వ ఏరియా డైరెక్టర్ డియాజ్ మరియా అభిప్రాయపడ్డారు. మంగళవారం తిరుపతి జిల్లా, రామచంద్రాపురం మండలంలోని గొల్లపల్లి గ్రామంలో రైతు నాగరాజు వ్యవసాయ క్షేత్రంలో స్వయంగా విత్తనాలు వేశారు. అనంతరం ఏటీఎం, ఎ-గ్రేడ్ మోడళ్లను, ఘన జీవామృతం, బీజామృతంతో విత్తనశుద్ధి చేసే ప్రక్రియను పరిశీలించారు. ఈ క్రమంలోనే కుప్పంబాదూరు గ్రామంలో రైతులు చేపడుతున్న సూర్యమండలం నమూనాలో తక్కువ విస్తీర్ణంలో వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలను పండించే పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. టీవీసపాళ్లు గ్రామంలో రైతుసాధికారత సంస్థ, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో ముఖాముఖి నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంతో సామాన్య రైతులను శాస్త్రవేత్తలుగా తయారు చేసే విధానం అమోఘమని వారు కితాబిచ్చారు. రైతుసాధికారత సంస్థ ఆరోగ్య విభాగపు లీడ్ డా.రాజగోపాల్ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం వల్ల ఆరోగ్యంలో వచ్చే మార్పులను ఉదాహరణలతో వివరించారు.

జీవో 85తో ఉరితాడు బిగించారు

- ప్రభుత్వంపై వైద్యుల ఆగ్రహం
- ఇన్‌సర్వీస్ కోటా కుదింపును వ్యతిరేకిస్తూ నిరసన



విజయవాడ ధర్నా చౌక్‌లో నిరసన తెలుపుతున్న డాక్టర్లు

సాక్షి, అమరావతి: గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు వైద్య సేవలు అందించే తమకు రాష్ట్ర ప్రభుత్వం జీవో 85 ద్వారా ఉరితాడు బిగించిందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పీహెచ్‌సీ) వైద్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే జీవో 85ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పీహెచ్‌సీల్లో సేవలు అందించే ఎంబీబీఎస్ వైద్యులకు పీజీ వైద్య విద్య ఇన్‌సర్వీస్ కోటా కుదింపును నిరసిస్తూ మంగళవారం విజయవాడలో వైద్యులు ఆందోళన నిర్వహించారు. ఈ ఆందోళనకు ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జయధీర్, వివిధ సంఘాల ప్రతినిధులు మద్దతు తెలిపారు. వైద్యులు తమ నిరసనను తీవ్రతరం చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం మరోసారి చర్చలకు సిద్ధమైంది. ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ బుధవారం వైద్యులతో చర్చిస్తారని మంత్రి కార్యాలయం మంగళవారం ప్రకటించింది. ఆ మేరకు కమిషనర్ హరికిరణ్.. వైద్యుల సంఘం ప్రతినిధులను ఆహ్వానించారు.

సాక్షి

బుధవారం, 18 సెప్టెంబర్ 2024

నిజమాడితే నేరమా!

'వాస్తవాలు మొండిఘటాలు. అవి ఓ పట్టాన లొంగవు. గణాంకాలు అలా కాదు... అవి ఎటు వంచితే అటు వంగుతాయి' అంటాడు విఖ్యాత రచయిత మార్క్ ట్వైన్. పాలకులు గణాంకాలను ఇష్టానుసారం మార్చితే... నిజాలకు మసిపూస్తే ప్రమాదం. అయితే ఏ దేశంలోనైనా జరిగేది అదే అంటారు నిరాశా వాదులు. ఆ మాటెలా వున్నా కేంద్ర ప్రభుత్వం ప్రణబ్ సేన్ ఆధ్వర్యంలోని గణాంకాల స్థాయీ సంఘాన్ని ఇటీవల రద్దు చేసిన తీరు వాంఛనీయం కాదు. ఎన్ని విమర్శలున్నా, లోపాలున్నా గణాంకాలు పాలనా నిర్వహణలో కీలకపాత్ర పోషిస్తాయి. ప్రభుత్వాలు ప్రకటించే ఏ పథకానికైనా, రూపొందించే ఏ విధానానికైనా గణాంకాలే ప్రాతిపదిక. వివిధ మంత్రిత్వ శాఖలు నిర్వహించే సర్వేల ప్రక్రియ ఎలావుండాలో, పరిశోధనకు వేటిని పరిగణనలోకి తీసుకోవాలో, దాని నమూనా ఏ విధంగా ఉండాలో కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖకు సిఫార్సులు చేయటం గణాంకాల కమిటీ ప్రాథమిక విధి. దీంతోపాటు వివిధ మంత్రిత్వ శాఖలు గణాంకాల మంత్రిత్వ శాఖకు సమర్పించే సర్వే నివేదికల తీరుతెన్నులెలా వున్నాయో నిశితంగా పరిశీలించి, సందేహాలు నివృత్తి చేసుకుని ఆ ఫలితాలను ప్రకటించటం కూడా కమిటీ పనే. దేశంలోనే తొలిసారి 2019లో కేంద్రం 14 మందితో ఈ కమిటీని నియమించినప్పుడు అందరూ సంతోషించారు. నిరుడు ఆ కమిటీ పరిధిని విస్తరించారు కూడా. కానీ దాన్ని కాస్తా మొన్నీమధ్య రద్దు చేశారు. జాతీయ నమూనా సర్వేలకు సంబంధించి ఇటీవల స్టీరింగ్ కమిటీ ఏర్పాటైనందున గణాంకాల కమిటీని రద్దు చేస్తున్నామని కమిటీ సభ్యులకు చెప్పారు. అసలు అప్పటికే ఆ పనిలో ఓ కమిటీ నిమగ్నమై ఉండగా కొత్త కమిటీ ఎందుకు ఏర్పాటైనట్టు? దాన్ని చూపించి పాతది రద్దు చేస్తున్నామని చెప్పటంలో ఆంతర్యం ఏమిటి? వీటికి జవాబిచ్చేవారు లేరు.

ప్రభుత్వాలు తీసుకునే ప్రతి నిర్ణయానికీ, వేసే ప్రతి అడుగుకూ గణాంకాలు ప్రాణం. ఏటా బడ్జెట్ ముందు ప్రవేశపెట్టే ఆర్థిక సర్వేనే తీసుకుంటే... దేశంలో ఆహారానికి జనం ఖర్చు చేస్తున్నదెంతో, అది పట్టణాల్లో ఎలావుందో గ్రామీణ ప్రాంతాల్లో ఎలా వుందో తెలుస్తుంది. నిరుద్యోగిత ఏ విధంగా వున్నదో, వ్యవసాయ రంగంపై ఆధారపడి పనిచేస్తున్నవారి సంఖ్య ఎంతో వెల్లడవుతుంది. జనం విద్యకు ఖర్చు చేస్తున్నదెంత... ఆరోగ్యానికి ఖర్చవుతున్నదెంత అనే వివరాలు కూడా తెలుస్తాయి. ఇక పేదరిక నిర్మూలన పథకాలు క్షేత్రస్థాయిలో ఏ మేరకు ప్రభావం చూపాయో, వాటిని మరింత ప్రభావవంతంగా అమలు చేయడానికి ఎటువంటి చర్యలు అవసరమో నిర్ణయించుకోవటానికి గణాంకాలు తోడ్పడతాయి. అయితే ఈ గణాంకాల విశ్వసనీయత తేలాలంటే ఒక గీటురాయి అవసరం. జనాభా గణాంకాలే ఆ గీటురాయి. విషాదమేమంటే మూడేళ్ల క్రితం ప్రారంభం కావాల్సిన జన గణన ఇంతవరకూ మన దేశంలో మొదలుకాలేదు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ పదేళ్లకోసారి క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఈ గణన కరోనా మహమ్మారి విరుచుకుపడటంతో సాగలేదు. వాస్తవానికి జనగణన నోటిఫికేషన్ పద్ధతిగా 2019 మార్చిలో విడుదలైంది. దాని ప్రకారం 2020 ఏప్రిల్–సెప్టెంబర్‌లమధ్య తొలి దశలో ఇళ్లు, కట్టడాలు, కుటుంబాలు వగైరాలకు సంబంధించిన సర్వే పూర్తి కావాలి. 2021 ఫిబ్రవరిలో జనాభా గణన ఉండాలి. కానీ 2020 మార్చితో మొదలై ఆ ఏడాది నవంబర్ వరకూ కరోనా వ్యాప్తి తీవ్రంగా ఉండటంతో జనాభా గణన సాధ్యపడలేదు. ఆ తర్వాతైనా వెనువెంటనే ప్రారంభించాలని కేంద్రం అనుకోలేదు. అమెరికా, చైనాలతో సహా ప్రపంచంలో ఎన్నో దేశాలు కరోనా తీవ్రత తగ్గగానే చకచకా రంగంలోకి దిగి జనాభా గణనను జయప్రదంగా పూర్తిచేశాయి. కేవలం ఘర్షణ వాతావరణం నెలకొన్న లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాల్లో మాత్రమే జన గణన జరగలేదు. మన దగ్గర ఎందుకు కాలేదో సంజాయిషీ ఇవ్వడానికి కూడా కేంద్రం సిద్ధపడలేదు.

భిన్న మంత్రిత్వ శాఖలకు అనుబంధంగా ఉండే సంస్థలూ, ఇతరత్రా స్వచ్ఛంద సంస్థలూ క్రమం తప్పకుండా సర్వేలు చేస్తున్నాయి. కానీ వాటిని దేంతో సరిపోల్చుకోవాలి? ఏ ప్రాతిపదికన వాటిని విశ్వసించాలి? తాజా జన గణన లేదు కాబట్టి 2011 నాటి జనాభా లెక్కలే వీటన్నిటికీ గీటురాయిగా వినియోగిస్తున్నారు. కానీ ఇందువల్ల వాస్తవ చిత్రం ఆవిష్కరణ కాదు. ఉదాహరణకు 2011 జనగణన ప్రాతిపదికగా మన జనాభా 120 కోట్లని తేలింది. తాజాగా అది 140 కోట్లకు చేరుకుందని చెబుతున్నారు. కానీ పాత లెక్కన పేదరికాన్నీ, ఇతర స్థితిగతులనూ గణిస్తున్నందువల్ల 12 కోట్లమంది నిరుపేదలకు ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) సదుపాయం వర్తించటం లేదని అంటున్నారు. తమ రాష్ట్ర జనాభా పెరిగినందువల్ల అదనపు కోటా కావాలని ఏ ప్రభుత్వమైనా ఏ ప్రాతిపదికన అడగాలి? అందుకు కేంద్రం ఎలా అంగీకరించాలి? అప్పుడప్పుడు వెలువడే ప్రపంచ సంస్థల సర్వేలు పేదరికాన్నీ, నిరుద్యోగితనూ, ఇతరత్రా అంశాలనూ చూపుతూ మన దేశం వెనకబడి వుందని చెబుతుంటే కేంద్రం నిష్ఠూరమాడుతోంది. అక్కడివరకూ ఎందుకు... మన సర్వేల రూపకల్పన, అవి వెల్లడించే ఫలితాలు దేశంలో పేదరికం పెరిగినట్టు, అభివృద్ధి జరగనట్టు అభిప్రాయం కలగజేస్తున్నాయని ప్రధాని ఆర్థిక సలహా మండలి సభ్యురాలు శామికా రవి ఆ మధ్య విమర్శించారు. ఈ విషయంలో ఆమెతో ప్రణబ్ సేన్‌కు వాగ్వాదం కూడా జరిగింది. బహుశా గణాంకాల కమిటీ రద్దు వెనకున్న అసలు కారణం అదేనా? ఇద్దరి వైఖరుల్లోనూ వ్యత్యాసానికి మూలం జన గణన జరపక పోవటంలో ఉంది. ఆ పనిచేయకుండా గణాంకాల కమిటీనే రద్దు పర్చటం ఉన్నదున్నట్టు చూపుతున్నదని అలిగి అద్దాన్ని బద్దలుకొట్టడమే అవుతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు
భాద్రపద మాసం, **తిథి:** పౌర్ణమి ఉ.8.55 వరకు
తదుపరి బ.పాడ్యమి, **నక్షత్రం:** పూర్వాభాద్ర ప.12.58 వరకు
తదుపరి ఉత్తరాభాద్ర, **వర్జ్యం:** రా.9.54 నుండి 11.24 వరకు,
దుర్ముహూర్తం: ప.11.32 నుండి 12.20 వరకు,
అమృతఘడియలు: లేవు, మహాలయ పక్షం ప్రారంభం.

సూర్యోదయం : 5.50
సూర్యాస్తమయం: 6.00
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

పరిశోధనల సులభతరం ఇలాగా!

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

ఐఐటీ ఢిల్లీతో పాటు దేశంలోని మరికొన్ని విద్యా సంస్థలకు ఇటీవల ఓ నోటీసు వచ్చింది. గడచిన ఐదేళ్ల కాలంలో పరిశోధనల కోసం అందుకున్న నిధులపై జీఎస్టీ ఎందుకు చెల్లించలేదని అందులో ప్రశ్నించారు. జీఎస్టీ సకాలంలో చెల్లించనందుకు జరిమానా, వడ్డీ కలిపి రూ.120 కోట్లు కట్టమని కూడా ఆదేశించారు. రెండేళ్ల క్రితమే సాంకేతిక పరిజ్ఞాన పరికరాలపై జీఎస్టీని 5 నుంచి 18 శాతానికి పెంచారు. ప్రభుత్వ రంగ పరిశోధన సంస్థలు ఎదుర్కొంటున్న ఇంకో సమస్య రెడ్ టేపిజమ్. ప్రతిష్ఠాత్మక సైన్సు అవార్డులను కూడా నగదు బహుమతి లేకుండానే అందిస్తున్నారు. ఉన్నత విద్యా రంగంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో పరిశోధనలను తగ్గించేందుకు ఒక పద్ధతి ప్రకారం జరుగుతున్న ప్రయత్నాల్లో భాగంగానే వీటిని చూడాలి.

ఐఐటీ ఢిల్లీతో పాటు దేశంలోని మరికొన్ని విద్యా సంస్థలకు వచ్చిన జీఎస్టీ చెల్లింపుల నోటీసుపై శాస్త్రవేత్తలు స్పందించలేదు కానీ, 'ఇన్ఫోసిస్' మాజీ సీఎఫ్‌వో, ఇన్వెస్టర్ టీవీ మోహన్‌దాస్ పై మాత్రం దీన్ని 'అతి నీచమైన పన్ను తీవ్రవాదం' అని వ్యాఖ్యానించారు.

నెల క్రితం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పరిశోధనల కోసం ఉపయోగించే రసాయనాలపై కస్టమ్స్ డ్యూటీని 10 నుంచి 150 శాతానికి పెంచడం... అకస్మాత్తుగా పెరిగిన ప్రాజెక్టు ఖర్చులతో శాస్త్రవేత్తలు, విద్యా సంస్థలు బెంబేలెత్తడం తెలిసిన విషయమే. పరిశోధనలకు అవసరమైన ఎంజైములు, రీజెంట్లు చాలా వరకూ విదేశాల నుంచి దిగుమతి చేసుకునేవే. కస్టమ్స్ డ్యూటీ పెంచడమంటే వాటిని దాదాపుగా అడ్డుకోవడమే. శాస్త్రవేత్తల నిరసనల నేపథ్యంలో ప్రభుత్వం దిగి వచ్చింది. సృజనాత్మక ఆలోచనలు వృద్ధి చెందాలంటే, 'రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్'(ఆర్ అండ్ డీ)కి మరిన్ని నిధులు ఇవ్వాల్సి ఉండగా... కేంద్రం అందుకు భిన్నంగా వ్యవహరించడం గమనార్హం.

జీఎస్టీ నోటీసులు, కస్టమ్స్ డ్యూటీ పెంపులు ఏవో చెదురు ముదురు సంఘటనలు కావచ్చునని అనుకునేందుకూ అవకాశం లేదు. ఉన్నత విద్యా రంగంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో పరిశోధనలను తగ్గించేందుకు ఒక పద్ధతి ప్రకారం జరుగుతున్న ప్రయత్నాల్లో భాగంగానే వీటిని చూడాల్సి ఉంది. రెండేళ్ల క్రితమే సాంకేతిక పరిజ్ఞాన పరికరాలపై జీఎస్టీని 5 నుంచి 18 శాతానికి పెంచడం, తాజాగా నిధులపై జీఎస్టీ నోటీసులు ఈ విషయాన్ని ధ్రువీకరిస్తున్నాయి. ఈ రెండు నిర్ణయాల వల్ల పరికరాలను సమకూర్చుకోవడం, పరిశోధనల నిర్వహణ ఖర్చు గణనీయంగా పెరుగుతుంది. ఈ విషయంపై ఆందోళనతోనే కేంద్ర ప్రభుత్వానికి శాస్త్ర అంశాల్లో సలహా ఇచ్చే విభాగం కేంద్రానికి ఒక నోట్‌ను పంపింది. జీఎస్టీ వసూళ్లు, పన్నుల పెంపుల ప్రభావం నుంచి ప్రైవేట్ సంస్థలు సర్దుకోవచ్చుననీ, ప్రభుత్వ సంస్థల్లో ఇందుకు అవకాశాలు తక్కువనీ ఈ నోట్‌లో స్పష్టం చేశారు. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ నోట్‌పై స్పందిస్తూ, సంస్థలకు కేటాయించే నిధులను ఎక్కువ చేస్తున్నాము కాబట్టి జీఎస్టీతో నష్టమేమీ ఉండదని నమ్మబలికే ప్రయత్నం చేసింది. కానీ పరిస్థితిని సరిచేసేందుకు చేసింది మాత్రం శూన్యం.

పరిశోధనలకు ఊతం ఇలా కాదు...

ఏ దేశంలోనైనా స్వేచ్ఛగా పరిశోధనలు చేసుకునే వాతావరణం ఉన్నప్పుడు కొత్త ఆవిష్కరణలు సాధ్యమవుతాయి. తగినన్ని నిధులు సమకూర్చడం, భాగస్వామ్యాలను ప్రోత్సహించడం.... పన్నులు, నిబంధనల విషయంలో ఆచితూచి వ్యవహరించడం అవసరం. ఈ అన్ని అంశాలు భారత్‌లో ఇప్పుడు కొరవడ్డాయనే చెప్పాలి. నిధుల విషయాన్ని చూద్దాం. జాతీయ స్థూల ఉత్పత్తిలో ఒక శాతం కంటే



తక్కువ. అన్ని రకాల ప్రాజెక్టులకు ఒకే ఛత్రం కింద నిధులిస్తామని 'అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్' (ఏఎన్ఆర్ఎఫ్) ఒకటి ఏర్పాటు చేసేందుకు ఐదేళ్లుగా ప్రయత్నాలు సా...గుతూనే ఉన్నాయి. మరోవైపు పరిశోధనలకు తాము నిధులు ఎక్కువ చేశామని ప్రభుత్వం బాకా ఊదుతూనే ఉంది. ఐదేళ్ల కాలంలో కొత్త సంస్థ ద్వారా 50 వేల కోట్ల రూపాయలు ఇస్తామని పదే పదే సంకల్పం చెప్పుకుంటోంది. ఈ మొత్తం కూడా వట్టి మాటే. తామిచ్చేది 30 శాతమనీ, మిగిలిన 70 శాతాన్ని ఆయా సంస్థలు ప్రైవేట్ రంగంలో సేకరించుకోవాలనీ ప్రభుత్వమే తేల్చి చెప్పింది. అంటే, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే మొత్తం ఏడాదికి రూ.30,000 కోట్లు మాత్రమే అవుతుంది. ఇది ప్రస్తుత కేటాయింపుల కంటే చాలా తక్కువ. 2024–25లో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన మంత్రిత్వ శాఖకు రూ.16,628 కోట్లు కేటాయించడం ఇక్కడ చెప్పుకోవాల్సిన అంశం.

ఏఎన్ఆర్ఎఫ్ ఏర్పాటు ఆలోచన వెనుక 'ఆర్ అండ్ డీ' బరువును తగ్గించుకునేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని స్పష్టం అవుతోంది. అదెలా చేయాలో మాత్ర స్పష్టత కనిపించడం లేదు. దేశంలో ప్రభుత్వ రంగ పరిశోధన సంస్థలు ఎదుర్కొంటున్న ఇంకో సమస్య రెడ్ టేపిజమ్. నిధులు పొందేందుకు, పంపిణీ, స్కాలర్‌షిప్, ఫెలోషిప్‌ల నిర్ధారణ వంటి అనేక అంశాల్లో అధికారుల జోక్యం ఉంటోంది. మేకిన్ ఇండియా వంటి వాటికి అనుగుణంగా ప్రాజెక్టుల రూపకల్పన ఇంకో సమస్య. వీటన్నింటి మధ్య తాము పరిశోధనలపై దృష్టి ఎలా కేంద్రీకరించగలమని ఐఐటీ కాన్పూర్ శాస్త్రవేత్త ఒకరు 'ఎక్స్' వేదికగా వ్యాఖ్యానించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. పరిశోధనలకు అడ్డంపడే ఇలాంటి విషయాలు ఇంకా అనేకమున్నాయి. అంతర్జాతీయ ప్రయాణాలకు అందించే నిధులపై నియంత్రణ వాటిల్లో ఒకటి. కీలకమైన శాస్త్ర అంశాల్లో పలు దేశాలు కలిసి పని చేయడం ఎక్కువ అవుతున్న ఈ కాలంలో కాన్ఫరెన్సులకు వెళ్లేందుకు ఇలాంటి వంకలు పెట్టడం గమనార్హం.

సైన్స్ వ్యవహారాల్లో సౌలభ్యమెంత?

గత ఏడాది ఫౌండేషన్ ఫర్ అడ్వాన్సింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఫాస్ట్) ఒక సర్వే చేసింది. టాప్–10 పరిశోధన సంస్థల్లో పని చేస్తున్న శాస్త్రవేత్తలను ప్రశ్నించి దేశంలో పరిశోధనలు చేసేందుకు అనువైన వాతావరణం ఎలా ఉందో అంచనా కట్టింది. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' మాదిరిగా 'ఈజ్ ఆఫ్ డూయింగ్ సైన్స్' అన్నమాట. 2015లో ప్రధాని నరేంద్ర మోదీనే ఈ పదాన్ని పరిచయం చేశారు. 'ఫాస్ట్' చేసిన సర్వేలో స్థూలంగా, ఈజ్ ఆఫ్ డూయింగ్ సైన్స్ బాగుందని ఆరు శాతం మంది కితాబిచ్చారు. నిధులు పొందే విషయంలో మాత్రం యావరేజ్ కంటే తక్కువని తేల్చారు. నిధులిచ్చే సంస్థలు గ్రాంట్లు ఇచ్చేందుకు తీసుకునే సమయం, నిధుల మొత్తం, ప్రాజెక్టు ఉద్దేశం వంటి అంశాల ఆధారంగా పనిచేస్తున్నాయని వీరు చెప్పారు. ఇక అందించిన నిధులను స్వేచ్ఛగా వాడుకునే అవకాశం ఉందా? విదేశాల్లో జరిగే సదస్సులకు వెళ్లగలుగుతున్నారా? పరిశోధనలకు అవసరమైన వనరులు, పరికరాలు అందుబాటులో ఉన్నాయా? అన్న ప్రశ్నలకు శాస్త్రవేత్తల సమాధానం 'అధ్వాన్నం' అని!

ప్రతిభను ఎప్పటికప్పుడు గుర్తించి ప్రోత్సహించడం, 'ఆర్ అండ్ డీ' వాతావరణం బాగుందని అనేందుకు ఇంకో గుర్తు. కానీ శాంతి స్వరూప్ భట్నాగర్ పేరిట ఇస్తున్న ప్రతిష్ఠాత్మక అవార్డులను కూడా 'విజ్ఞాన్ పురస్కార్' పేరిట నగదు బహుమతి లేకుండానే అందిస్తున్నారు. 2022లో సైన్స్ అవార్డులను నిలిపివేసిన ప్రభుత్వం నోబెల్ స్థాయిలో 'విజ్ఞాన రత్న' అవార్డు ఒకదాన్ని అందిస్తామని చెప్పింది. గత నెలలో ఈ అవార్డును ప్రకటించారు కూడా. ఇందులోనూ నగదు ప్రస్తావన లేదు. ఆసక్తికరంగా ఉత్తర ప్రదేశ్, హరియాణా ప్రభుత్వాలు అందించే రాష్ట్ర స్థాయి అవార్డులైన 'విజ్ఞాన్ గౌరవ్', 'విజ్ఞాన్ రత్న' (జాతీయ అవార్డుకు ముందే అమల్లో ఉన్న రాష్ట్ర స్థాయి అవార్డు)లకు రూ. 5 లక్షల చొప్పున నగదు ప్రోత్సాహకాలు ఇస్తున్నారు!

ఒకవైపు భారత్‌లో సైన్సును సులభతరం చేయడం తగ్గిపోతూండగా, చైనా ముందుకు దూసుకెళుతోంది. భారత్ తన జీడీపీలో 0.66 శాతం పరిశోధనలకు వెచ్చిస్తూండగా, చైనా 2.4 శాతం ఖర్చు పెడుతోంది. చైనాలోని పెకింగ్, ట్సింగ్‌హువా యూనివర్సిటీల పరిశోధన బడ్జెట్ మనం విద్యకు పెడుతున్న దాని కంటే ఎక్కువ ఉండటం చెప్పుకోవాల్సిన అంశం. ఈ విషయాన్ని ఐఐటీ ఢిల్లీ డైరెక్టర్ వి. రాంగోపాల్ రావు ఇటీవలే ఒక సమావేశంలో తెలిపారు. పరిశోధనల నిధుల విషయంలో యూనివర్సిటీలు, పరిశోధన సంస్థలను పస్తు పెట్టడం అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను మార్చాలన్న ఆకాంక్షను నెరవేర్చేది ఎంతమాత్రం కాదన్నది గుర్తించాలి.

రచయిత సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

ఒక అంచనా



కశ్మీరీ ఓటర్లలోని ప్రస్తుత గందరగోళం ఫలితంగా జమ్ము నుంచి ముఖ్యమంత్రి, కశ్మీర్ నుంచి ఉపముఖ్యమంత్రి రావొచ్చు.

– తారిఖ్ త్రాంబూ, వైద్యుడు

శుభాకాంక్షలు



మన అత్యంత గౌరవనీయమైన, మాననీయమైన ప్రియతమ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీజీకి జన్మదిన (సెప్టెంబర్ 17) శుభాకాంక్షలు. మీకు ఆరోగ్యాన్నీ, సంతోషాన్నీ ఎల్లవేళలా ప్రసాదించాలని దేవుడిని ప్రార్థిస్తాను.

– రజినీకాంత్, నటుడు

పేద దేశాలను పిండుకుంటున్నారు!



నిధులు అత్యంత అవసరమైన దేశాల నుంచే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వాటిని మళ్లిస్తుంది. 2023లో ప్రైవేట్ రుణదాతలు తాము అప్పిచ్చినదానికంటే 68 బిలియన్ డాలర్లు అధికంగా పేద దేశాల నుంచి చెల్లింపులుగా పొందారు; ఇక ఆర్థిక సంస్థలు 40 బిలియన్ డాలర్లు పిండుకున్నాయి. వాటి సాయం కేవలం 2 బిలియన్ డాలర్లు.

– మహమ్మద్ నశీద్, మాల్దీవుల మాజీ అధ్యక్షుడు

అసలు దోషులు



నార్కో–తీవ్రవాదులతో నిశ్చయాత్మకంగా వ్యవహరించకపోతే మణిపూర్‌లో శాంతిని సాధించడం అసాధ్యం.

– సేవియో రోడ్రిగ్స్, మీడియా పర్సనాలిటీ

ఎందుకు ముఖస్తుతి?



ఢిల్లీ నూతన ముఖ్యమంత్రి (ఆతిశీ మార్లేనా) తన మొదటి ఉపన్యాసాన్ని తన బాస్ కీర్తనగా మలచాలా? ఆమె బాధ్యత ప్రజలకు, కేజ్రీవాల్‌కు కాదు. కానీ ముఖస్తుతి అనే జబ్బు ఆమ్ ఆద్మీ పార్టీలో వ్యాపించినట్టుంది.

– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

ఎన్నిసార్లు తలొగ్గడం?



బైడెన్ ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గి, కోవిడ్–19 ల్యాబ్ లీక్ వాదన తాలూకు ఉల్లేఖనాలకు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లో అడ్డుకట్ట వేసినట్టు గత నెలలో మార్క్ జుకర్‌బర్గ్ చెప్పారు. ఇప్పుడు మళ్లీ ఆయన అమెరికా ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గి, 'ఆర్‌టీ (టీవీ నెట్‌వర్క్) సహా రష్యన్ మీడియా యాప్స్‌ను నిషేధించారు.

– బ్రహ్మ చెల్లానీ, వ్యూహాత్మక అంశాల వ్యాఖ్యాత

ఉన్నట్టుండి ఎందుకని...



ఇరాన్ సుప్రీంలీడర్ వ్యాఖ్యలోని నైతిక అంశాన్ని అంతగా పట్టించుకోను – ఇరాన్ అధిక సంఖ్యాక మత రాజ్యమని అందరికీ తెలుసు. వీగర్ ముస్లింలను (చైనా) విస్మరించడం కూడా ఆశ్చర్యం కలిగించలేదు. 'ఉమ్మా నిబద్ధత' కన్నా వ్యూహాత్మక ప్రయోజనాలకే వారిది పెద్ద పీట. కానీ ఈ వ్యాఖ్యలు ('భారత్‌లో ముస్లింలు బాధలు పడుతున్నారు') చేయడానికి ఖొమైనీని ప్రేరేపించినది ఏమిటా అని ఆలోచిస్తున్నా.

– స్టాన్లీ జానీ, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

పునర్వినియోగం ఒక పరిష్కారం

భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ప్లాస్టిక్ కాలుష్యకారక దేశంగా నిలుస్తోంది. లీడ్స్ విశ్వవిద్యాలయం (ఇంగ్లండ్) అధ్యయనం ప్రకారం... భారత్ ప్రతి ఏటా సుమారు కోటి టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను పర్యావరణంలోకి విడుదల చేస్తోంది. ఇది ప్రపంచ మొత్తం ప్లాస్టిక్ వ్యర్థాలలో ఐదో వంతు. మనదేశం ప్లాస్టిక్ వ్యర్థాల విడుదలలో చైనాను మించి ప్రపంచంలో మొదటి స్థానంలో నిలిచిందని తాజా గణాంకాలు చెబుతున్నాయి. దేశంలో ప్లాస్టిక్ కాలుష్యానికి 53 శాతం సేకరించని వ్యర్థాలు, 38 శాతం డంప్‌సైట్‌లలో బహిరంగంగా కాల్చడం కారణాలని పరి శోధనలు తెలుపుతున్నాయి.

ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడంలో ఏఐ (కృత్రిమ మేధ) కీలకంగా సహాయం చేస్తోంది. ఏఐ ఆధారిత పరికరాలు ప్లాస్టిక్ వ్యర్థాలను గుర్తించడంలో, సేకరించడంలో, రీసైకిల్ చేయడంలో పర్యవేక్షణ– నిర్వహణను మెరుగుపరుస్తాయి. డేటా విశ్లేషణ ద్వారా వ్యర్థాల కూర్పును అంచనా వేసి, తిరిగి ప్రాసెస్ చేయడానికి ఇవి కచ్చితమైన మార్గాలను సూచించగలవు. ఇందువల్ల ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ సులభతరం అవుతుంది. ఈ విధంగా పరిసరాలను కాపాడటంలో ఏఐ సహాయపడుతుంది.

భారతదేశం ఇప్పుడు ఆస్ట్రేలియాను ఆదర్శంగా తీసుకొని ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించడంలో కొత్త మార్గాలను అన్వేషిస్తోంది. సర్క్యులర్ ఎకానమీ, డిజైన్, సాంకేతికతలు, వ్యాపార పద్ధతుల ద్వారా... ప్లాస్టిక్ వస్తువుల ఉపయోగాన్ని ఎక్కువ కాలం కొనసాగించవచ్చు. ఈ విధానం ప్రకారం, ఉత్పత్తులను మరమ్మతు చేయదగినట్లుగా తయారు చేయడం, రీసైక్లింగ్, అప్‌సైక్లింగ్ పద్ధతులను అనుసరించడం అవసరం. ఇది జీరో ప్లాస్టిక్ వ్యర్థాల ఆర్థిక వ్యవస్థకు దోహదం చేస్తుంది. కొత్త పరిశ్రమలను ఏర్పరచడంలో, ఉద్యోగాలు సృష్టించడంలో సహాయపడుతుంది. 2030 నాటికి 'జీరో ప్లాస్టిక్ వ్యర్థాలు' సాధించేందుకు సమగ్ర వ్యూహాన్ని అభివృద్ధి చేయాలి.

– డా॥ కృష్ణ కుమార్ వేపకొమ్మ । హైదరాబాద్

భారత్‌కు ఒలింపిక్స్ నిర్వహించే సత్తా ఉందా?

అభిప్రాయం



కృష్ణారావు చొప్పరపు

2036లో జరిగే ఒలింపిక్స్‌కు ఆతిథ్యమివ్వాలని భారత్ ముచ్చట పడుతోంది. న్యూఢిల్లీ వేదికగా ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్‌తో పాటు హైదరాబాద్ వేదికగా ఆఫ్రో–ఆసియా క్రీడలు నిర్వహించిన అనుభవంతో ఏకంగా ఒలింపిక్స్‌కే ఆతిథ్యమివ్వాలని ఆరాటపడుతోంది. కనీస అవసరాలు తీరని కోట్లాది మంది జనాభా కలిగిన భారత్‌కు ఒలింపిక్స్ లాంటి ఖరీదైన క్రీడలు నిర్వహించే సత్తా ఉందా? అసలు ఒలింపిక్స్ నిర్వహించడం భారత్‌కు అవసరమా?

పారిస్ వేదికగా ఇటీవలే ముగిసిన 2024 ఒలింపిక్స్ పతకాల పట్టికలో భారత్‌కు దక్కినచోటు 71వ స్థానం. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన రెండు దేశాలలో ఒకటిగా ఉన్న భారత్ ఒక్క బంగారు పతకమైనా సాధించలేకపోయింది. కేవలం ఓ రజత, ఐదు కంచు పతకాలతో సరిపెట్టుకుంది. పొరుగు దేశం చైనా మాత్రం పతకాల పట్టిక రెండో స్థానంలో నిలవడం ద్వారా అమెరికాకు అడుగడుగునా పోటీ ఇచ్చింది. అయితే ఒలింపిక్స్‌కు కొన సాగింపుగా జరిగిన పారా ఒలింపిక్స్‌లో భారత్ పత కాల పట్టికలో 18వ స్థానంలో నిలవడం ద్వారా పరువు దక్కించుకోగలిగింది. ప్రపంచంలోని 204 దేశాలు తలపడే ఒలింపిక్స్‌లో బంగారు పతకాలు సాధించే సత్తాలేని, పతకాల పట్టిక మొదటి ఐదు స్థానాలలో నిలిచే స్థాయిలేని భారత్ ఒలింపిక్స్‌కు ఆతిథ్యమిస్తానంటూ ముందుకు రావడాన్ని క్రీడా విశ్లేషకులు తప్పు పడుతున్నారు. ముందుగా క్రీడారంగాన్ని బాగు చేసుకొని, దేశంలో క్రీడాసంస్కృతి పాదుకొన్న తరువాతే ఒలింపిక్స్‌కు ఆతిథ్యమివ్వడం గురించి ఆలోచించాలని సూచిస్తున్నారు.

సుమారు పది వేల మంది అథ్లెట్లు పోటీ పడే ఒలింపిక్స్‌కు ఆతిథ్యమివ్వడం అంటే మాటలు కాదు. గతంలో ఒలింపిక్స్ నిర్వహించడం ద్వారా గ్రీసు, బ్రెజిల్ లాంటి దేశాలు ఆర్థికంగా దివాళా పరిస్థితిని ఎదుర్కొన్నాయి. క్రీడారంగానికి వార్షిక బడ్జెట్లో భారీగా నిధులు కేటాయించే వెసలుబాటు లేని భారత్‌కు లక్షల కోట్ల రూపాయల ఖర్చుతో ఒలింపిక్స్ నిర్వహించడం



తలకుమించిన భారమే అవుతుంది. పైగా ప్రపంచ ప్రమాణాలతో కూడిన అత్యాధునిక క్రీడామౌలిక సదుపాయాలు కలిగిన రాజధాని న్యూఢిల్లీ నగరాన్ని కాదని అహ్మదాబాద్ వేదికగా ఒలింపిక్స్ నిర్వహించాలన్న ఆలోచనా ఆందోళన కలిగిస్తోంది.

జీ–20 ప్రెసిడెన్సీ శిఖరాగ్ర సమావేశాన్ని అట్టహాసంగా నిర్వహించిన భారత్... ఒలింపిక్స్‌ను మాత్రం ఎందుకు నిర్వహించలేదని కేంద్ర మాజీ క్రీడామంత్రి అనురాగ్ ఠాకూర్ ప్రశ్నిస్తున్నారు. 2032 వరకూ ఒలింపిక్స్ వేదికలు ఖరారు కావడంతో, 2036 ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యమివ్వాలని భావిస్తున్నట్లు ఠాకూర్ గతంలోనే ప్రకటించారు. ఇప్పటికే గుజరాత్ పలుమార్లు ఒలింపిక్స్ నిర్వహించడానికి తన సంసిద్ధతను తెలిపిందనీ, ఒలింపిక్స్‌కు అవసరమైన క్రీడా సముదాయాలు, విమానాశ్రయాలు, స్టార్ హోటళ్ల లాంటి మౌలిక సదుపాయాలు అక్కడ ఉన్నాయనీ గుర్తు చేశారు. అంతే కాదు, 2036 ఒలింపిక్స్ నాటికి భారత పట్టణ జనాభా 40 శాతానికి పెరుగు తుందని, ఆర్థిక వ్యవస్థ సైతం మూడు ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరటం ఖాయమని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.

తమ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకే సకాలంలో జీతాలు చెల్లించలేక సతమతమవుతున్న గుజరాత్‌కు వేలకోట్ల రూపాయల ఖర్చుతో ఒలింపిక్స్ నిర్వహించే సత్తా ఉందా అని కొందరు ప్రశ్నిస్తున్నారు. పైగా, దశాబ్ద కాలంగా భారత్ అప్పులకుప్పగా మారిపోతూ వస్తోంది. లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం... రోజుకు 3 వేల 24 కోట్ల రూపాయల చొప్పున ప్రభుత్వం పలురూపాలలో అప్పులు చేస్తోంది. గత ఎనిమిదిన్నరేళ్లలో కేంద్రం 92 లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసింది. గతంలో 72 దేశాలు తలపడిన కామన్వెల్త్ గేమ్స్‌కు ఆతిథ్యమివ్వటానికే నానాపాట్లు పడిన భారత్ 204 దేశాలు పోటీపడే ఒలింపిక్స్‌కు ఆతిథ్యమిస్తాననడం అర్థంలేనిదని అనేవారు లేకపోలేదు. ఒలింపిక్స్ నిర్వహించడం సంగతి అటుంచి, ఆతిథ్య మివ్వటానికి జరిగే పోటీలో వందల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. మొత్తంగా ఒలింపిక్స్ నిర్వహణతో భారత్‌కు జరిగే మేలు కంటే కీడే ఎక్కువన్న వాస్తవాన్ని గమనించకుంటే భారత్ భారీ మూల్యం చెల్లించక తప్పదు.

వ్యాసకర్త సీనియర్ స్పోర్ట్స్ జర్నలిస్ట్
మొబైల్: 84668 64969

మేలెంచి, కీడెంచు...

'**కీ**డెంచి, మేలెంచు' అని లోకోక్తి. ఏదయినా పని తలపెట్టినప్పుడు, ముందు అందులో ఉన్న కష్టాలూ, రాగల నష్టాలూ కూలంకషంగా విచారించుకొని, 'లాభాలు ఖాయం' అని బాగా ధ్రువీకరించుకొన్న తర్వాతే పని ఆరంభించమని! నిజమే! సరిగా పూర్వాపరాలు చూడకుండా, 'బుడ బుడా' పనులు ఆరంభించి, చేతులు కాల్చుకొనే తొందరపాటు మనుషులకు లోకంలో కొదవలేదు.

అనుకొన్న ఆలోచనలలో కీడు మాత్రమే ఎక్కువగా ఎంచి, 'మేలు సంగతి దేవుడెరుగు, నష్టం ఉండకుండా ఉంటే చాలు!' అని అనుక్షణం జంకుతూ ఉన్నా, అడుగు ముందుకు పడదు. ఎప్పటి కప్పుడు ముందు కీడు మాత్రమే ఎంచటం నకారాత్మకతగా మారి, మనిషిని భయస్థుడిగా, ఏమీ చేయలేని అసమర్థుడిగా మార్చే అవకాశం ఉంది. సమకాలీన సమాజంలో ఈ అతి భయస్థుల జనాభా కూడా పెద్దదే.

జ్యోతిర్మయం

ఈ అతి భయానికి చికిత్స చేసే నిపుణులు, పాత సామెతను మార్చి, 'మేలెంచి, కీడెంచు' అని సలహా ఇస్తారు. 'అంతా అనుకొన్నట్టే జరుగుతుంది, అన్ని ఆటంకాలూ అధిగమిస్తాను, విజయం తథ్యం' అని పదే పదే మననం చేసుకొంటూ పనిలోకి దిగితే, ఆ సకారాత్మకతే సాఫల్యానికి సోపానంగా నిలుస్తుంది అంటారు.

రెండు పక్షాలూ హేతుబద్ధంగానే కనిపిస్తాయి. 'అడుగు వేస్తే, గుంటలో పడతానేమో!' అని అడుగడుగునా అనుమానిస్తూ కూర్చొన్నా కష్టమే. 'ఆలోచిస్తే లాభం లేదు. ముందు దూకేస్తే, తరువాత మిగతా విషయాలు చూడవచ్చు!' అని దూకుడుతనానికి పోయినా దుఃఖం తప్పదు. కనుక, 'అతి'ని వర్జించి, జాగరూకతను క్రియాశీలతతో మేళవించి నడవటం బుద్ధిమంతుడి పని.

చెప్పటం తేలికే. కానీ పుటకలో వచ్చిన స్వభావం మారుతుందా? 'ప్రయత్నిస్తే మారగలను. ఎందరు ఘనులు ఎన్ని విధాలా మారలేదు!' అని మేలెంచి ప్రయత్నించినవాడు మారగలడు. జాగరూకత అవసరం. 'మారడం చాలా కష్టం కనుక అందుకు చేసే ప్రయత్నం వ్యర్థం' అని కీడెంచేవాడు మారలేడు. ఆత్మవిశ్వాసం అవసరం!

– ఎం. మారుతి శాస్త్రి

ఆగిన హరికథా గంగా ప్రవాహం

పద్మశ్రీ కోట సచ్చిదానందశాస్త్రి కన్నుమూత
హరికథకు పద్మశ్రీ అందించిన తొలి భాగవతార్‌గా గుర్తింపు
ఎలాంటి ప్రతిఫలం లేకుండా ఎంతో మందికి శిక్షణ
దేశ విదేశాల్లో వేలాది ప్రదర్శనలు

హరి కథలు చెప్పడమంటే మాటలు కాదు.. అందుకు అద్భుతమైన సంగీత, పాండిత్య ప్రతిభ అవసరం. అది అందరికీ అబ్బే విద్య కాదు. ఈ తరంలో చాలా మందికి హరికథ అంటే తెలియదు. హరికథ అనేది తెలుగువారి సాంప్రదాయంలో ఓ భాగం. సంగీత, సాహిత్య నృత్య, అభినయాల సమ్మేళనమే ఈ హరికథ..ఈ విశిష్ట కళలో తెలుగునాట ప్రసిద్ధి చెందిన హరికథకుడు కోట సచ్చిదానందశాస్త్రి. ఆయన కథ చెప్పే విధానం గంగా ప్రవాహంలా సాగిపోతుంది. తన అద్భుతమైన, అనర్గళమైన వాక్పటిమతో, శ్రావ్యమైన సంగీత, నాద, తాళ పాండిత్యంతో, శ్రోతలను రసమాధుర్యంలో ఓలలాడించే వారు 'కోట'.

ఆయన హరికథంటే జనం ఎడ్లబండ్లు కట్టుకుని వచ్చేవారు...
తండోపతండాలుగా వచ్చిన వారితో అక్కడ హౌస్‌ఫుల్...
ఆ రోజు సినిమా థియేటర్లలో సెకండ్ షోకు జనం నిల్...

చిన్న పిట్టకథలు, చతురోక్తులతో 'కోట' కథాగానం జనరంజకంగా సాగేది..మధూకరం చేసుకుంటూ వేదవిద్యను నేర్చుకుని, హరికథను సాధన చేసి, ప్రఖ్యాత హరికథకుడిగా 'కోట' ఎదిగారు. 7 దశాబ్దాల సుదీర్ఘ కథాగానంతో భారత ప్రభుత్వంచే 'పద్మశ్రీ' స్వీకరించారు. హరికథకు తొలిసారిగా పద్మశ్రీ అందించిన తొలి భాగవతార్‌గా కీర్తిని పొందారు. రామాయణ, భారత, భాగవతాలను గానం చేస్తూ విశేష ప్రాచుర్యం కల్పించారు. 7 దశాబ్దాలుగా దేశవిదేశాల్లో వేలాది ప్రదర్శనలిచ్చారు. శతాధిక కథావారసులను తీర్చిదిద్దారు. 8 పదుల వయసులోనూ కథాగానం చేస్తూ వచ్చారు. అలసిపోయిన ఆ గానం ఇక శాశ్వతంగా మూగబోయింది.


యుక్తవయసులో కోట సచ్చిదానందశాస్త్రి

తెనాలి: సచ్చిదానంద శాస్త్రి స్వస్థలం ప్రకాశం జిల్లా అద్దంకి. తల్లిదండ్రులు వెంకట శివయ్య, సుబ్బమ్మ. పురోహితుడైన తండ్రి దగ్గరే శాస్త్రి చిన్నతనంలో వేద విద్య అభ్యసించారు. బ్రాహ్మణ కోడూరులో మధూకర వృత్తితో పమిడిమర్రు సుబ్బావధానులు దగ్గర వేద విద్య నేర్చారు. 14 ఏళ్ల వయసులో తండ్రి మరణంతో అయిదుగురు ఆడపిల్లలు, ఇద్దరు మగబిడ్డల్లో పెద్దవాడైన సచ్చిదానందశాస్త్రిపై కుటుంబ బాధ్యతలు పడ్డాయి. బంధువర్గంలో కళాకారులు, హరికథకులు ఉండటంతో సహజంగానే ఆసక్తి కలిగిన శాస్త్రి..ఒకపక్క పౌరోహిత్యం చేస్తూనే..పరిమి సుబ్రహ్మణ్య భాగవతుల రచనలు చదివి స్వయంగా కథాగానం సాధన చేశారు. తర్వాత అదే జీవనాధారమైంది. విజయవాడలో ఓగిరాల గోపాలం, తణుకులో మునునూరు సూర్యనారాయణమూర్తి భాగవతులు, తెనాలిలో భాగవతుల అన్నపూర్ణయ్య దగ్గర తన కథాగానాన్ని మెరుగుపరుచుకుంటూ, ప్రదర్శనలిస్తూ వచ్చారు. విజయనగరంలో ఏడేళ్లపాటు ఉండి ఆంధ్ర, ఒడిశా పరిసరాల్లో కథాగానం చేశారు.

హరికథను జనరంజకం చేసిన కోట..

57 ఏళ్ల క్రితం గుంటూరు చేరుకుని అక్కడే స్థిరపడ్డారు. ఆసక్తి కలిగిన శిష్యులకు శిక్షణనిస్తూ వచ్చారు. చతురోక్తులు, సరస సంభాషణలతో ప్రేక్షకుల మనసు తనపై లగ్నమయ్యేవరకు కాలక్షేపం చేసి, కథాంశంతో హరికథను ఆరంభించేవారు. భక్తిరస సినిమా పాటలు, సున్నితమైన హాస్య సంభాషణలను చొప్పించటం, నృత్యాలు, అభినయం, నాటకీయతను చేర్చి హరికథను జనరంజకం చేశారు. ఈ ప్రత్యేకతతో వారికి ఎంతో డిమాండ్ ఏర్పడింది. ఒక్కరోజు విరామం లేకుండా హరికథలు చెప్పేవారు. బొత్తిగా చదువులేని వారికీ విద్య నేర్పారు. ఎలాంటి ప్రతిఫలం తీసుకోలేదు. వారంతా హరికథ వృత్తిగా స్థిరపడినవారే. ఆకాశవాణిలో ఆయన టాప్ ఏ గ్రేడ్ ఆర్టిస్టు. ముఖ్యమైన పట్టణాలు, పుణ్యక్షేత్రాలు, లండన్, మారిషస్ వంటి దేశాల్లోనూ ప్రదర్శనలిచ్చారు. కంచిలోని పరమాచార్యులు చంద్రశేఖర సరస్వతి, శృంగేరీ పీఠాధిపతి, త్రిదండి చినజీయర్‌స్వామి, కుర్తాళం పీఠాధిపతుల సమక్షంలో కథాగానం చేశారు. టంగుటూరి ప్రకాశం పంతులు, ఆచార్య రంగా, నీలం సంజీవరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, తెన్నేటి విశ్వనాథం వంటి ప్రముఖులు సచ్చిదానందశాస్త్రి కథాగానానికి పరవశులయ్యారు. కోట్ల విజయభాస్కరరెడ్డి వీణను బహూకరిస్తే, ఎస్పీ బాలు చేతులమీదుగా అభిమానులు స్వర్ణకంకణం తొడిగారు. రాష్ట్ర ప్రభుత్వం 'కళారత్న'తో గౌరవించింది. విజయనగరం మహారాజా కళాశాల శతజయంతి ఉత్సవాల్లో హరికథా పితామహ ఆదిభట్ల నారాయణ దాసు పురస్కారంతో సచ్చిదానందను సత్కరించారు. హరికథా త్రిమూర్తులుగా పేరొందిన ఆదిభట్ల నారాయణదాసు, పెద్దింటి సూర్యనారాయణ దీక్షిత్, పరిమి సుబ్రహ్మణ్యం భాగవతులు ఆరాధన ఉత్సవాలను గత 26 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు సచ్చిదానందశాస్త్రి. కోట హరికథాగాన కళాపీఠం పేరుతో జరిపే ఆ ఉత్సవాల్లో 25–30 ప్రోగ్రాములు, ప్రతిరోజూ అన్నదానం, ఏడు పదులు పైబడిన హరికథకులను సత్కరిస్తూ వస్తున్నారు. 'హరికథ సజీవకళ. దీనిని ఉద్ధరించాలి' అనేది సచ్చిదానందశాస్త్రి ఆశయం. 'ఆదిభట్ల'తో సహా ఏ ఒక్క హరికథకుడికీ దక్కని పద్మశ్రీ గౌరవం తనకు దక్కటం అదృష్టమని చెప్పారు. ప్రతి దేవస్థానంలో ఒక హరికథకుడిని నిర్ణయించటం, సంప్రదాయ కళారూపాల కోసం ఒక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయగలిగితే కళలు పదికాలాల పాటు నిలిచి ఉంటాయని చెప్పేవారు.


హరికథాగాన పరవశం...


సాంస్కృతిక ఉత్సవాల్లో సత్కారం అందుకుంటూ...

గుంటూరులో సచ్చిదానందశాస్త్రి తుదిశ్వాస

నగరంపాలెం: ప్రముఖ హరికథా భాగవతార్, పద్మశ్రీ అవార్డు గ్రహీత కోట సచ్చిదానందశాస్త్రి (90) కన్నుమూశారు. వృద్ధాప్యంతో బాధపడుతోన్న ఆయన సోమవారం రాత్రి గుంటూరు అమరావతిరోడ్‌లోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య సీతాదేవి, కుమారులు శివశాస్త్రి, శ్రీరామచంద్రమూర్తి, కృష్ణ మోహన్, కుమార్తె దుర్గవెంకటసుబ్బలక్ష్మీ ఉన్నారు. ఆయన భార్య గతంలోనే చనిపోయారు. సోమవారం సాయంత్రం అంత్యక్రియలను గుంటూరు బొంగరాల బీడు శ్మశానవాటికలో నిర్వహించినట్లు పెద్ద కుమారుడు శివశాస్త్రి తెలిపారు. సచ్చిదానందశాస్త్రి గతేడాది జనవరిలో పద్మశ్రీ అవార్డు, 2022లో సంగీతనాటక అకాడమి అవార్డు, 2023 నవంబర్‌లో వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు, 2015లో హంసా పురస్కారం, 2009లో కొప్పరపు కవుల పురస్కారాలను అందుకున్నారు.

క్లుప్తంగా...

శ్రీశైలానికి తగ్గుతున్న వరద




శ్రీశైలం ప్రాజెక్ట్/విజయపురిసౌత్: శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం క్రమంగా తగ్గుతోంది. అయినా దిగువ ప్రాంతాలకు నీటిని విడుదల చేస్తూనే ఉన్నారు. మంగళవారం సాయంత్రానికి జూరాల, సుంకేసుల నుంచి 40,947 క్యూసెక్కుల నీరు శ్రీశైలానికి వచ్చి చేరుతోంది. సోమవారం నుంచి మంగళవారం వరకు శ్రీశైలానికి ఎగువ ప్రాజెక్ట్‌ల నుంచి 35,945 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు 1,05,142 క్యూసెక్కులు విడుదల చేశారు. కుడిగట్టు కేంద్రంలో 14.962 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 16.838 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ప్రస్తుతం జలాశయంలో 197.4616 టిఎంసీల నీరు నిల్వ ఉండగా.. డ్యాం నీటి మట్టం 881.70 అడుగులకు చేరింది.

సాగర్ నీటి మట్టం 589.90 అడుగులు

నాగార్జునసాగర్‌లో మంగళవారం 2 రేడియల్ క్రస్ట్‌గేట్ల ద్వారా 24,884 క్యూసెక్కులు దిగువ కృష్ణా నదిలోకి విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి 70,762 క్యూసెక్కులు వస్తుండగా అంతే నీటిని విడుదల చేస్తున్నారు. కుడి కాలువ ద్వారా 10,080, ఎడమ కాలువ ద్వారా 4,613, ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా 28,785 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీకి 1800 క్యూసెక్కులు, వరదకాల్వకు 600 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయ నీటిమట్టం 589.90 అడుగుల వద్ద ఉంది. ఇది 311.7462 టీఎంసీలకు సమానం.

నేడు తిరుమల డిసెంబర్ కోటా టికెట్లు ఆన్‌లైన్‌లో విడుదల



తిరుమల: శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన డిసెంబర్ కోటాను సెప్టెంబర్ 18న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎల్రక్టానిక్ డిప్ కోసం సెప్టెంబర్ 20న ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్లను 21న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను 21న మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేయనుంది. అంగప్రదక్షిణం టోకెన్లను 23న ఉదయం 10 గంటలకు, శ్రీవాణి ట్రస్ట్ టికెట్లను ఉదయం 11 గంటలకు టీటీడీ విడుదల చేయనుంది. వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారికి ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను 23న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ విడుదల చేయనుంది.

24న ఎస్ఈడీ కోటా

ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల డిసెంబర్ కోటాను సెప్టెంబర్ 24న ఉదయం 10 గంటలకు..తిరుమల, తిరుపతిల్లో గదుల కోటాను 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. 27న తిరుమల–తిరుపతి శ్రీవారి సేవ కోటా ఉదయం 11 గంటలకు, నవనీత సేవ మధ్యాహ్నం 12 గంటలకు, పరకామణి సేవ మధ్యాహ్నం 1 గంటకు https:// ttdevasthanams.ap.gov.in లో టీటీడీ విడుదల చేయనుంది

మాజీ ఎంపీ సురేష్‌కు పూర్తయిన పోలీస్ కస్టడీ

- గుంటూరు జైలుకు తరలింపు



మంగళగిరి: పోలీస్ కస్టడీ ముగియడంతో బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను పోలీసులు మంగళవారం గుంటూరు జైలుకు తరలించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో నందిగం సురేష్‌పై అక్రమ కేసు నమోదు చేసిన పోలీసులు ఇటీవల అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. పోలీస్ కస్టడీలో భాగంగా చివరి రోజైన మంగళవారం ఉదయం నందిగం సురేష్‌ను న్యాయవాది సమక్షంలో ఎస్పీ సతీష్‌కుమార్, డీఎస్పీ బాల మురళీకృష్ణ విచారించారు. అనంతరం సురేష్‌ను కోర్టులో హాజరుపరిచి.. గుంటూరు జైలుకు తరలించారు. ఎస్పీ సతీష్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. మాజీ ఎంపీ నందిగం సురేష్ పోలీసుల విచారణకు పూర్తిగా సహకరించారని చెప్పారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో 110 మందికి పైగా పాల్గొన్నారని.. విచారణ కొనసాగుతోందన్నారు. ముగ్గురిని ఇప్పటికే అరెస్ట్ చేశామని.. నలుగురికి కోర్టు నుంచి రక్షణ ఉందని.. మిగిలిన వారిని త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు. ముందస్తు బెయిల్ తీసుకున్న వారిని.. గడువు తర్వాత అదుపులోకి తీసుకుంటామన్నారు. కోర్టు ద్వారా రక్షణ పొందిన ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురామ్, నాయకుడు దేవినేని అవినాశ్‌ను అవసరమైతే మళ్లీ పిలిచి విచారిస్తామన్నారు.

టీడీపీ నేత కాలేజీలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

- టెర్రస్ మీద ఉన్న షెడ్డుకు ఉరేసుకుని బలవన్మరణం
- ఒంగోలు టీడీపీ నేత గోరంట్ల రవికుమార్‌కి చెందిన కాలేజీలో ఘటన
- ఫీజుల కోసం వేధించి తన బిడ్డ ప్రాణాలు తీశారంటూ తల్లి ఆవేదన


భావన మృతదేహం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు : టీడీపీ నేత గోరంట్ల రవికుమార్‌కు చెందిన శ్రీహర్షిణి జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న వడ్డిముక్కల భావన(16) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. జరుగుమల్లి మండలం పచ్చవ గ్రామానికి చెందిన వడ్డిముక్కల చిన బ్రహ్మయ్య, ధనలక్ష్మి దంపతుల చిన్న కుమార్తె భావన. వినాయక చవితి సెలవుల సందర్భంగా భావన 4వ తేదీన ఇంటికి వెళ్లింది. తిరిగి 16 మధ్యాహ్నం కాలేజీకి వచ్చింది. రాత్రి 8 గంటల సమయంలో తల్లికి ఫోన్ చేసి మాట్లాడింది. ఇంతలోనే ఏం జరిగిందో ఏమో గానీ కళాశాల టెర్రస్‌పై ఉన్న షెడ్డు కప్పునకు ఉన్న ఫ్యాన్‌కు తెల్లవారుజామున ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఉరికి వేలాడుతున్న భావనను మంగళవారం ఉదయం విద్యార్థినులు చూసి సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారొచ్చి భావనను కిందకు దింపడంతో అప్పటికే బాలిక మృతి చెందింది. వెంటనే ఆమె తల్లికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఫీజులు కట్టాలంటూ కాలేజీ యాజమాన్యమే వేధించి తన బిడ్డను పొట్టన పెట్టుకుందని ఆమె కన్నీటిపర్యంతమైంది. బాలిక తల్లి ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ నాగరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు. భావన తండ్రి పదేళ్ల కిందట చనిపోవడంతో తల్లి కూలి పనులు చేసుకుంటూ ఇద్దరు పిల్లలనూ పోషిస్తోంది. కాగా, కళాశాలలో విద్యార్థిని ఆత్మహత్య విషయం తెలిసి కూడా గోరంట్ల రవికుమార్ పత్తా లేకుండా పోయారు. ఆయనతో పాటుగా కళాశాల హెచ్ఆర్ సురేష్, కేర్ టేకర్ చాముండేశ్వరి కూడా కనిపించలేదు. కళాశాల ప్రిన్సిపాల్‌కు బదులుగా డీన్ ఆంజనేయులు మీడియాతో మాట్లాడారు. ఒక్కసారిగా వీరంతా కనిపించకుండా పోవడంపై మృతురాలి సోదరి ఐశ్వర్య అనుమానం వ్యక్తం చేశారు. రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి బాలిక మృతదేహాన్ని పరిశీలించారు. కళాశాల చైర్మన్ అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాల నిర్వాహణ లోపాలపై ప్రశ్నించారు. మూడు రోజుల్లోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా అధికారులను ఆదేశించారు. భావన ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వినోద్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ డిమాండ్ చేశారు.


శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ న్యాయమూర్తికి పవిత్రాన్ని అందజేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి జ్ఞాపికను, ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని ఏఈవో ఆనంద్ కుమార్ అందించారు. - సింహాచలం

చిగురిస్తున్న 'టమాటా' ఆశలు

పుంజుకుంటున్న ధరలు

పలమనేరు: ధరలుంటే సరుకుండదు... సరుకుంటే ధరలుండవు... ఇదీ కొన్నేళ్లుగా చిత్తూరు జిల్లా, పలమనేరు ప్రాంతంలో టమాటా రైతుల దుస్థితి. ఈనెల మొదటివారంలో 14కిలోల బాక్స్ ధర రూ.200 నుంచి రూ.250 దాకా ఉండగా, గడచిన రెండ్రోజుల నుంచి ఆ ధర క్రమేపీ పెరుగుతూ వచ్చింది. మంగళవారం నాటికి బాక్స్ ధర రూ. 500కు చేరింది. ప్రస్తుతం బయటి రాష్ట్రాలనుంచి వ్యాపారులు టమాటా కొనుగోలు నిమిత్తం పలమనేరు మార్కెట్‌కు వస్తున్నారు. దీనికి తోడు ఇప్పుడు కోత కోస్తున్న స్థానిక టమాటా తగ్గుతోంది. ఇప్పటికే కోతలు ముగిసిన తోటలు వడిగిపోతున్నాయి. ప్రస్తుతం కోతదశలో ఉన్న తోటలకు గిరాకీ తగిలే అవకాశాలున్నట్లు వ్యాపారులు అంచనా వేస్తున్నారు.



బయటి రాష్ట్రాల్లో తగ్గిన పంట

బయటి రాష్ట్రాలైన తమిళనాడు, తెలంగాణ, ఒడిశా, మహారాష్ట్రల్లో టమాట పంట తగ్గింది. కర్ణాటకలో వైరస్ కారణంగా పంట దిగుబడులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. దీంతో డిమాండ్ పెరగడంతో పలమనేరు టమాటాధర పెరుగుతోందని వ్యాపారులు చెబుతున్నారు. ఇదే సమయంలో ఇతర రాష్ట్రాల్లో సరుకు లేనందున ఈ రెండు వారాల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉంటుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

నాపై 'లుక్ ఔట్'ను ఉపసంహరించండి

హైకోర్టులో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పిటిషన్



సాక్షి, అమరావతి: ఓ కేసుకు సంబంధించి పోలీసులు గతంలో జారీ చేసిన లుక్ ఔట్ నోటీసు ఇప్పటికీ కొనసాగిస్తుండటాన్ని సవాలు చేస్తూ వైఎస్సార్‌సీపీ నేత చెవిరెడ్డి మోహిత్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. లుక్ ఔట్ నోటీసును ఉపసంహరించేలా పోలీసులను ఆదేశించాలని కోర్టును కోరారు. గత ఎన్నికల సందర్భంగా ఎస్వీయూ క్యాంపస్ పోలీసులు నమోదు చేసిన కేసులో తనపై పోలీసులు లుక్ ఔట్ నోటీసు జారీ చేశారని పేర్కొన్నారు. ఆ కేసులో పోలీసులు కోర్టు ఆదేశాల మేరకు తనకు సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసులు జారీ చేశారని గుర్తు చేశారు. దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తున్నానని చెప్పారు. ఎస్వీయూ పోలీసులు నమోదు చేసిన కేసులో హైకోర్టు తనకు పలు షరతులతో ముందస్తు బెయిల్ కూడా మంజూరు చేసిందని, విదేశాలకు వెళ్లకుండా ఎలాంటి నిషేధం విధించలేదన్నారు. తను విదేశాల్లో విద్యాభ్యాసం చేశానని, అందుకు సంబంధించి కొన్ని పనులను పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. తన సోదరుడు విదేశాల్లో చదువుకోవాలని భావిస్తున్నారని, అందువల్ల అతనికి సహకరించేందుకు వీలుగా తను విదేశాలకు వెళ్లడం తప్పనిసరన్నారు. ఈ కారణాలతో తనపై జారీ చేసిన లుక్ ఔట్ నోటీసును ఉపసంహరించాలని పోలీసులను కోరినా ప్రయోజనం లేకపోయిందన్నారు. అందువల్లే హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఈ వ్యాజ్యంపై బుధవారం హైకోర్టు విచారణ జరపనుంది.

తిరుమలలో శాస్త్రోక్తంగా చక్రస్నానం



తిరుమల: తిరుమలలో అనంత పద్మనాభ వ్రతం సందర్భంగా మంగళవారం ఉదయం శ్రీవారి పుష్కరిణిలో శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. ఏటా భాద్రపద శుక్ల చతుర్దశినాడు తిరుమలలో అనంత పద్మనాభ వ్రతాన్ని నిర్వహిస్తారు. శ్రీవారి ఆలయంలో ఉదయం పూజలు చేసిన తరువాత శ్రీ సుదర్శన చక్రత్తాళ్వారును ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లి పుష్కరిణిలో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం చేశారు. అనంతరం చక్రస్నానం నిర్వహించారు. తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజున, వైకుంఠ ద్వాదశి, రథసప్తమి, అనంత పద్మనాభవ్రతం పర్వదినాల్లో మాత్రమే చక్రస్నానం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో జె.శ్యామలరావు, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, భక్తులు పాల్గొన్నారు.

శ్రీ పద్మావతి అమ్మవారికి పవిత్ర సమర్పణ




ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు (ఇన్‌సెట్‌లో) ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చంద్రగిరి (తిరుచానూరు): తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా రెండోరోజు మంగళవారం శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ జరిగింది. ఉదయం 11.30 గంటల నుంచి ఈకార్యక్రమం నిర్వహించారు. ఇందులో అమ్మవారి మూలమూర్తికి, ఉత్సవమూర్తులకు, ఉప ఆలయాలకు, పరివార దేవతలకు, విమానప్రాకారానికి, ధ్వజస్తంభానికి పవిత్రాలు సమర్పించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు తిరుమలలో పౌర్ణమి గరుడసేవ

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం పౌర్ణమి గరుడసేవ జరుగనుంది. ప్రతినెలా పౌర్ణమి సందర్భంగా ఈ సేవ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. బుధవారం రాత్రి 7 నుంచి రాత్రి 9 గంటల నడుమ సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు స్వర్ణ కాంతులీనుతున్న గరుడునిపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు.

ఎంపీ మిథున్‌రెడ్డి పర్యటనలో పోలీసుల అత్యుత్సాహం

చౌడేపల్లె: నేరుగా ప్రజలను కలిసి ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి నిర్వహించతలపెట్టిన పర్యటనకు బందోబస్తు పేరిట పోలీసులు తీవ్ర ఆంక్షలు విధించారు. ఈ క్రమంలో మంగళవారం చిత్తూరు జిల్లా చౌడేపల్లి ఎంపీడీఓ కార్యాలయం వద్ద జరుగనున్న కార్యక్రమానికి వాహనాల తనిఖీ పేరిట ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. ఎంపీ కాన్వాయ్ వెంట సైతం ఐదు వాహనాలు మాత్రమే లోపలికి వెళ్లాలని ఆంక్షలు పెట్టి ఇబ్బందులు పెట్టారు. జనం ఎంపీని చూసేందుకు కలిసేందుకు రాగా డ్రోన్ కెమెరాతో మొత్తం వీడియో, ఫొటోలు తీసి, వచ్చిన జనాన్ని ఏఆర్ ఫోర్సు ద్వారా బయటకు పంపేలా చేశారు. ప్రజలు గుంపులుగా ఉండకూడదని చెదరగొట్టారు. మండలం సరిహద్దులైన ఆమినిగుంట, శెట్టిపేట, బోయకొండ బైపాస్ ఆర్చి, బస్టాండు కూడళ్లలో బ్యారికేడ్లు ఏర్పాటు చేసి ప్రజల రాకపోకలను అడ్డుకున్నారు. దీంతో ఎంపీని కలిసి తమ సమస్యలను చెప్పుకునే అవకాశం లేకుండా చేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ భారీ ఎత్తున ఎంపీని కలిసేందుకు ప్రజలు తరలివచ్చారు. పలమనేరు డీఎస్పీ ప్రభాకర్, స్పెషల్ బ్రాంచి డీఎస్పీ భాస్కర్ ఆధ్వర్యంలో సీఐలు రామ్ భూపాల్, శ్రీనివాసులతో పాటు సుమారు 200 మంది పోలీసు సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు.


చౌడేపల్లె ఎంపీడీఓ కార్యాలయం వద్ద పోలీసుల హంగామా

ద్రోణాదులలో పురాతన శాసనాలు



మార్టూరు: బాపట్ల జిల్లా, మార్టూరు మండలం, ద్రోణాదుల గ్రామంలో మంగళవారం పురాతన శాసనాలు వెలుగు చూశాయి. ప్రముఖ చరిత్రకారుడు, శాసన పరిశోధకుడు విద్వాన్ జ్యోతి చంద్రమౌళి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పరిశోధనలో ఈ విషయాలు వెలుగు చూశాయి. స్థానిక వీరేశ్వర స్వామి ఆలయంలో గుర్తించిన శాసనం క్రీస్తు శకం 1710వ సంవత్సరానికి చెందిందని చంద్రమౌళి తెలిపారు. గ్రామం వెలుపల ద్రోణాదులమ్మ ఆలయ సమీపంలో దొరికిన మరొక శాసనం శాలివాహన శకం 1556 భావనామ సంవత్సరం జ్యేష్ఠ మాసం బహుళ పాడ్యమి నాటిదిగా ఆయన పేర్కొన్నారు. వీటి ప్రకారం ద్రోణాదుల గ్రామం క్రీస్తుపూర్వం ఏడో శతాబ్దం నాటికే ఈ ప్రాంతంలో జనసంచారం ఉన్నట్లుగా తెలుస్తోందన్నారు. వీరు సంచార జాతుల వారు అని వీరు పోడు వ్యవసాయం ద్వారా జీవనం సాగించే వారని తెలుస్తోందని వివరించారు. ద్రోణాదుల గ్రామంలో పరిశోధనలు నిర్వహిస్తే మరిన్ని చారిత్రక శాసనాల వెలుగు చూసే అవకాశం ఉందని చంద్రమౌళి పేర్కొన్నారు.

కవల సోదరీమణులకు మెడిసిన్ సీట్లు


అడ్మిషన్ అందుకుంటున్న కవలలు

కర్నూలు (హాస్పిటల్): నంద్యాల జిల్లా నందికొట్కూరుకు చెందిన కవల సోదరీమణులు నీట్ యూజీలో మంచి ర్యాంకులు సాధించి ఒకే కళాశాలలో సీటు సాధించారు. నందికొట్కూరుకు చెందిన సత్యనారాయణ కిరాణా వ్యాపారం చేస్తుంటారు. ఆయనకు భార్య కళావతి, నలుగురు (ముగ్గురు ఆడపిల్లలు, ఒక అబ్బాయి) సంతానం. కుమారుడు ఇంటర్, పెద్ద కుమార్తె సీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. రెండో సంతానంగా జన్మించిన దక్షిత, దాక్షాయని మెడికల్ సీటు సాధించారు. నీట్ యూజీలో దక్షిత 667 మార్కులతో 251వ ర్యాంకు, దాక్షాయని 661 మార్కులతో 348వ ర్యాంకు సాధించారు. వీరికి కన్వీనర్ కోటాలో కర్నూలు మెడికల్ కళాశాలలో సీటు దక్కింది. మంగళవారం వీరిద్దరూ కళాశాలలో అడ్మిషన్ తీసుకున్నారు. వీరిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ అభినందించారు.

నైట్ షిఫ్టులు వద్దంటారా?

మహిళా డాక్టర్ల కెరీర్ దెబ్బ తినదా? ● మమత సర్కారుకు సుప్రీం ప్రశ్న

- అలా చెప్పే అధికారం మీకు లేదు
- వారికి భద్రత కల్పించడం మీ బాధ్యత
- పైలట్లు, సైనికులుగా నైట్‌షిఫ్టులు చేయట్లేదా?
- ప్రభుత్వాన్ని మందలించిన సీజేఐ ధర్మాసనం
- విచారణ ప్రత్యక్ష ప్రసారం నిలిపివేతకు నిరాకరణ
- ఏం జరుగుతోందో ప్రజలకు తెలియాలని వ్యాఖ్య

న్యూఢిల్లీ: మహిళా వైద్యులు నైట్ డ్యూటీలు చేయొద్దన్న పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ నిర్దేశాలను సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. అలా చెప్పే అధికారం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేసింది. ''పైలట్లుగా, సైనికులుగా మహిళలు రాత్రి విధులు నిర్వహించడం లేదా? మీ నిర్దేశాలు మహిళా వైద్యుల కెరీర్‌పై ప్రభావం చూపుతాయి. రాత్రి విధుల్లో సమస్యలు ఎదుర్కోకుండా వారికి అవసరమైన భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత. అంతే తప్ప వాటిని మానుకోవాలని చెప్పడం సరికాదు'' అంటూ సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్డీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ధర్మాసనం మందలించింది. దాంతో సదరు నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకుంటామని బెంగాల్ సర్కారు విన్నవించింది. కోల్‌కతాలో ఆర్‌జీ కర్ ప్రభుత్వాసుపత్రిలో ట్రైనీ వైద్యురాలు రాత్రి విధుల్లో ఉండగా హత్యాచారానికి గురవడం, ఈ ఉదంతం దేశవ్యాప్త ఆందోళనలకు దారితీయడం తెలిసిందే. దాంతో నెల రోజులకు పైగా మమత సర్కారు ఉక్కిరిబిక్కిరవుతోంది. ఈ నేపథ్యంలో మహిళా వైద్యుల భద్రత నిమిత్తం సలహాలు, సూచనలతో 'రాతిరేర్ సాథి' పేరిట ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. వైద్యురాలి హత్యాచారోదంతంపై విచారణ సందర్భంగా మంగళవారం ఈ అంశం ధర్మాసనం దృష్టికి రావడంతో రాష్ట్ర ప్రభుత్వ తీరును ఆక్షేపించింది. ఆస్పత్రుల్లో వైద్యులు, ఇతర సిబ్బంది భద్రత నిమిత్తం కాంట్రాక్టు ప్రాతిపదికన ప్రైవేట్ సెక్యూరిటీని నియమించాలన్న నిర్ణయాన్ని కూడా తీవ్రంగా తప్పుబట్టింది. ''వైద్యులకు భద్రతే లేని పరిస్థితి నెలకొని ఉంది. కనుక ప్రభుత్వాసుపత్రుల్లో పోలీసు సిబ్బందినైనా నియమించడం రాష్ట్ర ప్రభుత్వ కనీస బాధ్యత. వాటిలో యువ వైద్య విద్యార్థులు, ఇంటర్న్‌లు పని చేస్తున్నారు'' అని గుర్తు చేసింది.

సీరియస్ అంశాలివి!

వైద్యురాలి కేసులో దర్యాప్తు ప్రగతిపై సీబీఐ సమర్పించిన స్థాయీ నివేదికను సీజేఐ ధర్మాసనం మంగళవారం పరిశీలనకు స్వీకరించింది. అందులోని అంశాలు తమనెంతగానో కలచివేశాయంటూ ఈ సందర్భంగా ఆవేదన వెలిబుచ్చింది. ''నివేదికలో సీబీఐ పేర్కొన్నవి చాలా సీరియస్ అంశాలు. వాటిని చదివిన మీదట మేమెంతో ఆందోళనకు లోనవుతున్నాం. అయితే వాటిని ఈ దశలో వెల్లడించలేం. అది తదుపరి దర్యాప్తుకు విఘాతం కలిగించవచ్చు'' అని పేర్కొంది. ''జరిగిన దారుణానికి సంబంధించి మృతురాలి తండ్రి కొన్ని విలువైన అంశాలను కోర్టు దృష్టికి తెచ్చారు. వాటిపైనా దర్యాప్తు చేయండి'' అని సీబీఐకి సూచించింది. ఆర్‌జీ కర్ ప్రభుత్వాసుపత్రి ఆర్థిక అవకతవకల కేసు దర్యాప్తుపైనా స్థాయీ నివేదిక సమర్పించాలిందిగా నిర్దేశించింది. విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

మా లాయర్లకు బెదిరింపులు: సిబల్

ఈ కేసు విచారణను ప్రత్యక్ష ప్రసారం చేయొద్దని బెంగాల్ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ విజ్ఞప్తి చేశారు. అందుకు ధర్మాసనం నిరాకరించింది. ''ఇది ప్రజాప్రయోజనాలు ముడిపడి ఉన్న కేసు. దీని విచారణ ఎలా జరుగుతోందో దేశ ప్రజలంతా తెలుసుకుని తీరాలి'' అని స్పష్టం చేసింది. ప్రత్యక్ష ప్రసారం తమ లాయర్ల బృందానికి సమస్యలు సృష్టిస్తోందని సిబల్ వాదించారు. ''ఇది విపరీతమైన భావోద్వేగాలతో కూడిన కేసు. మేం వాదిస్తోంది బాధితురాలి తరఫున కాదు గనుక మా బృందంలోని మహిళా లాయర్లకు యాసిడ్ దాడులు, అత్యాచారాలు చేస్తామంటూ బెదిరింపులు వస్తున్నాయి. పైగా మా క్లయింట్ (బెంగాల్ సర్కారు) గురించి ధర్మాసనం ఎలాంటి వ్యాఖ్యలు చేసినా లాయర్లుగా పేరుప్రఖ్యాతు లన్నీ మట్టిలో కలిసిపోతున్నాయి'' అంటూ ఆందోళన వెలిబుచ్చారు. లాయర్లకు రక్షణ లభించేలా జోక్యం చేసుకుంటామని ధర్మాసనం హామీ ఇచ్చింది. ప్రత్యక్ష ప్రసారాన్ని మాత్రం ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. మమత రాజీనామాకు ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్‌ను ధర్మాసనం కొట్టేసింది. ఇదేమీ రాజకీయ వేదిక కాదంటూ సదరు న్యాయవాదికి తలంటింది.



పేరు, ఫొటో తొలగించండి
వికీపీడియాకు ఆదేశం

హతురాలి పేరు, ఫొటో ఇప్పటికీ వికీపీడియాలో కనిపిస్తున్నట్టు సీబీఐ తరఫున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దాంతో వాటిని తక్షణం తొలగించాలని వికీపీడియాను ధర్మాసనం ఆదేశించింది. ఈ విషయంలో తామిచ్చిన గత ఆదేశాలకు కట్టుబడాలని స్పష్టం చేసింది. సమ్మె, ఆందోళనలు చేస్తున్న జూనియర్ వైద్యులు, ఇతర వైద్య సిబ్బందిపై ఎలాంటి క్రమశిక్షణ చర్యలూ చేపట్టబోమని బెంగాల్ ప్రభుత్వం ఈ సందర్భంగా హామీ ఇచ్చింది. వైద్యురాలిపై అఘాయిత్యం జరుగుతుండగా అక్కడ ఎవరెవరున్నదీ జూనియర్ వైద్యులకు తెలుసని వారి తరఫు న్యాయవాది ఇందిరా జైసింగ్ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఆ సమాచారాన్ని సీబీఐకి సీల్డ్ కవర్లో అందజేస్తామన్నారు. తక్షణం విధుల్లో చేరాల్సిందిగా డాక్టర్లకు ధర్మాసనం మరోసారి సూచించింది.

బుల్డోజర్లకు బ్రేక్

సుప్రీంకోర్టు అనుమతి లేకుండా ఏ కట్టడాన్నీ కూల్చొద్దు

- చట్టవిరుద్ధ కూల్చివేతలు రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం
- నిందితుల ఇళ్ల జోలికి వెళ్లొద్దు
- అక్టోబర్ 1 దాకా ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయి: సుప్రీం
- ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలను తొలగించొచ్చు

న్యూఢిల్లీ: కొన్ని రాష్ట్రాల్లో అమలవుతున్న బుల్డోజర్ న్యాయానికి సుప్రీంకోర్టు చెక్ పెట్టింది. సుప్రీంకోర్టు అనుమతి లేకుండా దేశవ్యాప్తంగా ఎలాంటి కూల్చివేతలు చేపట్టవద్దని ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణ జరిగే అక్టోబర్ ఒకటో తేదీదాకా నిందితులతో సహా ఎవరి ఇళ్లనూ కూల్చవద్దని ఆదేశించింది. అయితే రోడ్లు, ఫుట్‌పాత్‌లు, రైల్వే స్థలాలు, తదితర ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలను నిరభ్యంతరంగా తొలగించవచ్చని తెలిపింది. తమ ఆదేశాలు ప్రభుత్వ స్థలాల్లోని అక్రమ నిర్మాణాలకు వర్తించవని జస్టిస్ బి.ఆర్.గవాయి, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టత ఇచ్చింది. చట్టవిరుద్ధంగా ఒక్క కూల్చివేత చోటుచేసుకున్నా.. అది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని వ్యాఖ్యానించింది. తమ అనుమతి లేకుండా ఎలాంటి కూల్చివేతలు చేపట్టవద్దనే ధర్మాసనం ఆదేశాలపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభ్యంతరం వ్యక్తం చేశారు. చట్టబద్ధ సంస్థల చేతులను ఇలా కట్టేయలేరని అన్నారు. అయినా ధర్మాసనం తమ ఆదేశాలపై వెనక్కి తగ్గలేదు. కూల్చివేతలు రెండు వారాలు ఆపితే ముంచుకొచ్చే ప్రమాదమేమీ లేదని వ్యాఖ్యానించింది. 15 రోజుల్లో ఏమీ జరిగిపోదని పేర్కొంది. కార్యనిర్వాహక వర్గం న్యాయమూర్తి పాత్ర పోషించలేదని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా అధికారవర్గాలను కూల్చివేతలు ఆపివేయమని తాను కోరలేనని తుషార్ మెహతా నివేదించగా.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద సంక్రమించిన ప్రత్యేక అధికారాల మేరకు.. కూల్చివేతలు నిలిపివేయమని ఆదేశాలు జారీ చేశామని తెలిపింది. పలు రాష్ట్రాల్లో క్రిమినల్ కేసుల్లో నిందితులుగా ఉన్న వారి ఇళ్లను, ఇతర నిర్మాణాలను కూల్చివేస్తున్నారని దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు మంగళవారం విచారించింది. కూల్చివేతలపై తప్పుడు అభిప్రాయాన్ని వ్యాప్తిలోకి తెచ్చారని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అన్నారు. 'తాను ఒక నిర్దిష్ట మతానికి చెందినందువల్లే తన నిర్మాణాలను కూల్చివేశారని ఒకరు పిటిషన్ వేశారు. చట్టపరమైన ప్రక్రియను పాటించకుండా కూల్చివేతకు దిగిన ఒక్క సంఘటనను ధర్మాసనం దృష్టికి తెమ్మనండి. ప్రభావిత పక్షాలేవీ కోర్టును ఆశ్రయించలేదు. ఎందుకంటే తమకు నోటీసులు అందాయని, తమవి అక్రమ కట్టడాలని వారికి తెలుసు' అని తుషార్ మెహతా వాదించారు.

బుల్డోజర్లు ఆగవని ఎలా అంటారు?

సెప్టెంబర్ 2న విచారణ సందర్భంగా కూల్చివేతలను నిలిపివేయాలని, ఈ అంశంలో మార్గదర్శకాలు జారీచేస్తామని సుప్రీంకోర్టు చెప్పినా.. కొందరు ధిక్కార ప్రకటనలు చేయడం పట్ల జస్టిస్ గవాయి, జస్టిస్ విశ్వనాథన్‌ల ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. 'అయినా బుల్డోజర్లు ఆగవని, స్టీరింగ్ ఎవరి చేతుల్లో ఉందనే దాన్ని బట్టే ఇది నిర్ణయమవుతుందని ప్రకటనలు చేశారు. వీటిపై ఇంతకంటే ఎక్కువగా మాట్లాడకుండా సంయమనం పాటిస్తున్నాం. కూల్చివేతలపై మార్గదర్శకాలు రూపుదిద్దుకున్నాక.. బుల్డోజర్ల సంస్కృతిని గొప్పగా, ఘనతగా చెప్పుకోవడాన్ని ఎలా నిరోధించాలనే విషయంలో మీరు మాకు సహాయపడండి' అని తుషార్ మెహతాకు సూచించింది. నిందితుడు అయినంత మాత్రాన ఇళ్లు కూల్చేస్తారా? ఒకవేళ అతను దోషిగా తేలినా సరే.. చట్టపరమైన ప్రక్రియను పాటించకుండా కూల్చివేతలకు దిగలేరు. ఇదెక్కడి బుల్డోజర్ న్యాయమని సెప్టెంబర్ 2న విచారణ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

ఢిల్లీ సీఎం ఆతిశి

- కేజ్రీవాల్ స్థానంలో ఎన్నుకున్న ఆప్
- శాసనసభాపక్షం ఏకగ్రీవ నిర్ణయం
- రాజీనామా సమర్పించిన కేజ్రీవాల్
- వారంలో సీఎంగా ఆతిశి ప్రమాణం
- సుష్మ, షీలా తర్వాత మూడో మహిళ

సాక్షి, న్యూఢిల్లీ: సస్పెన్స్ వీడింది. ఢిల్లీ సీఎం పీఠం ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నాయకురాలు ఆతిశీ మార్లీనాకు దక్కింది. పార్టీ శాసనసభాపక్షం మంగళవారం ఈ మేరకు ఏకగ్రీవ నిర్ణయం తీసుకుంది. అనంతరం కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేశారు. సాయంత్రం లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాకు ఆయన రాజీనామా లేఖ అందజేయడం, ఆ వెంటనే ప్రభుత్వ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేస్తూ ఎల్‌జీకు ఆతిశి లేఖ సమర్పించడం వెంటవెంటనే జరిగిపోయాయి. వారంలోగా ఆమె ప్రమాణస్వీకారం చేయనున్నారు. అనంతరం 26, 27 తేదీల్లో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో లాంఛనంగా మెజారిటీ నిరూపించుకుంటారు. కేజ్రీవాల్ కేబినెట్‌లో ఆర్థికం, విద్య, సాగు నీరు సహా 14 శాఖల బాధ్యతలను మోస్తూ వచ్చిన ఆతిశి త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల దాకా సీఎంగా ప్రభుత్వాన్ని నడపనున్నారు. ఢిల్లీకి ఆమె మూడో మహిళా సీఎం. గతంలో బీజేపీ దిగ్గజం సుష్మా స్వరాజ్, కాంగ్రెస్ నాయకురాలు షీలా దీక్షిత్ సీఎంలుగా చేశారు. మమతా బెనర్జీ (పశ్చిమ బెంగాల్) తర్వాత ప్రస్తుతం దేశంలో రెండో మహిళా సీఎం కూడా ఆతిశే కానున్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఐదు నెలల పై చిలుకు కారాగారవాసం నుంచి కేజ్రీవాల్ వారం క్రితం బెయిల్‌పై బయటికి రావడం, సీఎం పదవికి రాజీనామా చేస్తానంటూ ఆదివారం సంచలన ప్రకటన చేయడం తెలిసిందే. దాంతో తదుపరి సీఎంగా ఆతిశితో పాటు కేజ్రీవాల్ భార్య సునీత తదితర పేర్లు రెండు రోజులుగా తెరపైకొచ్చాయి. మంగళవారం ఆప్ ఎల్పీ భేటీలో కేజ్రీవాల్ సూచన మేరకు ఆతిశి పేరును పార్టీ సీనియర్ నేత దిలీప్ పాండే ప్రతిపాదించారు. ఎమ్మెల్యేలంతా నిలబడి ఆమోదం తెలిపారు. 2013లో ఆప్ ఆవిర్భావం నుంచి పార్టీలో ఆతిశి క్రియాశీలంగా ఉన్నారు. 2015 నుంచి కేజ్రీ ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 2018 దాకా నాటి ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా చూసిన విద్యా శాఖకు సలహాదారుగా ఉన్నారు. 2020లో కాల్కాజీ అసెంబ్లీ స్థానం నుంచి తొలిసారి గెలుపొందారు. మద్యం కుంభకోణంలో మంత్రి పదవులకు సిసోడియా, సత్యేంద్ర జైన్ రాజీనామా తర్వాత ఆమె మంత్రి అయ్యారు. కీలకమైన ఆర్థిక, విద్య, తాగునీరు సహా 14 శాఖలు చూస్తున్నారు. కేజ్రీవాల్ అరెస్ట్ తర్వాత అటు పార్టీని, ఇటు ప్రభుత్వాన్ని సర్వం తానై నడిపించారు.



ఢిల్లీ ఎల్జీ వీకే సక్సేనాకు పుష్పగుచ్ఛమిస్తున్న ఆప్ శాసనసభా పక్ష నేత ఆతిశి, కేజ్రీవాల్

కేజ్రీవాల్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే మా ఏకైక లక్ష్యం: ఆతిశి

ఆప్ శాసనసభాపక్ష నేతగా ఎన్నికయ్యాక ఆతిశి మీడియాతో మాట్లాడారు. తన గురువు కేజ్రీవాల్‌కు ధన్యవాదాలు తెలిపారు. ''సీఎం పదవికి ఆయన రాజీనామా చేస్తున్నందుకు ఎంతో బాధగా ఉంది. నన్ను నమ్మి ఇంతటి బాధ్యత కట్టబెట్టారు. ఎమ్మెల్యేను చేశారు. మంత్రిని చేశారు. ఇప్పుడిలా సీఎంనూ చేశారు. ఇది ఆప్‌లో మాత్రమే సాధ్యం. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన నా వంటివారికి మరో పార్టీలో అయితే కనీసం ఎమ్మెల్యే టికెట్ కూడా దక్కదు. ఢిల్లీ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కేజ్రీవాల్ మార్గదర్శకత్వంలో సాగుతా. ఆయన్ను తిరిగి సీఎం చేయడమే లక్ష్యంగా పని చేస్తాం'' అన్నారు. నిజాయితీపరుడైన కేజ్రీవాల్‌పై తప్పుడు అభియోగాలు మోపారన్నారు. త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌ను గెలిపించి ఆయన్ను మళ్లీ సీఎం చేయాలని ఢిల్లీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. షెడ్యూల్ ప్రకారం అవి వచ్చే ఫిబ్రవరిలో జరగాల్సి ఉంది. మహారాష్ట్రతో పాటే నవంబర్లోనే జరపాలని కేజ్రీవాల్ డిమాండ్ చేయడం తెలిసిందే. ఆ అవకాశం లేదని ఈసీ వర్గాలంటున్నాయి.

మారింది ముఖమే: బీజేపీ

సీఎంగా ఆతిశి ఎంపికపై బీజేపీ పెదవి విరిచింది. కేవలం ముఖాన్ని మార్చినంత మాత్రాన పార్టీ స్వభావం మారబోదని పార్టీ ఢిల్లీ విభాగం చీఫ్ వీరేందర్ సచ్‌దేవ అన్నారు. ఈ రాజకీయ జూదంతో కేజ్రీవాల్‌కు లాభించేదేమీ ఉండబోదని ఆయన జోస్యం చెప్పారు.

ప్రభుత్వ సలహాదారు నుంచి ప్రభుత్వాన్నే నడిపించేదాకా.. ప్రత్యేక కథనం ఈ- పేపరులో

పేజర్లే బాంబులై...

లెబనాన్‌లో విధ్వంసం ● ఉన్నట్టుండి పేలిన వైనం
2,800 మందికి గాయాలు ● ఇప్పటికే 9 మరణాలు
వందల మంది విషమం ● ఇజ్రాయెల్ పనే: హెజ్బొల్లా

బీరూట్: ఇజ్రాయెల్‌కు తమ ఆనుపానులు చిక్కొద్దనే ఉద్దేశంతో వాడుతున్న పేజర్లు చివరికి హెజ్బొల్లా మిలిటెంట్ల ప్రాణాలకే ముప్పు తెచ్చిపెట్టాయి. మంగళవారం దేశంలో పలు ప్రాంతాల్లో వేలాది పేజర్లు ఉన్నపళాన పేలిపోయాయి. ఈ వింత పేలుళ్లలో కనీసం 2,800 మందికి పైగా గాయపడ్డారు. చాలామంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. ''కనీసం 200 మందికి పైగా ప్రాణాలతో పోరాడుతున్నారు. ఇప్పటిదాకా 9 మంది మృత్యువాత పడ్డారు'' అని ఆరోగ్య మంత్రి ఫిరాస్ అబియద్ తెలిపారు. పేలుళ్లు జరిగిన ప్రాంతాలన్నీ హెజ్బొల్లా కంచుకోటలే. రాజధాని బీరూట్‌లో పలుచోట్ల జనం తమ చేతులు, ప్యాంటు జేబులు, బెల్టుల్లోని పేజర్లు పేలి గాయాలపాలవుతున్న వీడియోలు, ఫొటోలు వైరల్‌గా మారాయి. ఆస్పత్రుల్లో ఎమర్జెన్సీ వార్డులన్నీ క్షతగాత్రులతో నిండిపోతున్నట్టు స్థానిక ఏపీ ఫొటోగ్రాఫర్లు తెలిపారు. ప్రధానంగా నడుము, కాళ్లకు గాయాలైనట్టు చెప్పారు. లెబనాన్‌లోని తమ రాయబారి కూడా పేజర్ పేలి గాయపడ్డట్టు ఇరాన్ ధ్రువీకరించింది. సిరియాలోనూ పేజర్ పేలుళ్లు జరిగాయి.




పేజర్ పేలుళ్ల తాలూకు వైరల్ వీడియోను చూస్తున్న ఓ నెటిజన్

ప్రతీకారం తప్పదు: హెజ్బొల్లా

ఇది కచ్చితంగా ఇజ్రాయెల్ పనేనని హెజ్బొల్లా మండిపడింది. ప్రతీకారం తప్పదంటూ ప్రకటన విడుదల చేసింది. మిలిటెంట్లు వాడుతున్న పేజర్లనే ఇజ్రాయెల్ వారిపైకి ఆయుధాలుగా మార్చి ప్రయోగించిందని ఏపీ అభిప్రాయపడింది. అత్యాధునిక టెక్నాలజీ సాయంతో అవి ఏకకాలంలో పేలేలా చేసిందని చెప్పుకొచ్చింది. దీనిపై స్పందించేందుకు ఇజ్రాయెల్ నిరాకరించింది. సెల్ ఫోన్లు వాడితే తమ కదలికలను ఇజ్రాయెల్ కనిపెడుతుందనే భయంతో వాటి వాడకాన్ని హెజ్బొల్లా అధినేత హసన్ నస్రల్లా గతంలోనే ఆదేశించారు. దాంతో కమ్యూనికేషన్ కోసం మిలిటెంట్లు పేజర్లు వాడుతున్నారు. ఆ క్రమంలో ఇటీవల కొనుగోలు చేసిన కొత్త బ్రాండ్ పేజర్లే పేలాయని హెజ్బొల్లా ప్రతినిధి చెప్పుకొచ్చారు. ''అవి ముందుగా వేడెక్కాయి. కాసేపటికే పేలిపోయాయి. వాటిలోని లిథియం బ్యాటరీలే కొంపముంచినట్టున్నాయి'' అంటూ వాపోయారు. శత్రువు పని పట్టడంలో ఆరితేరిన ఇజ్రాయెల్ గూఢచారి సంస్థ మొసాద్ ఇలా వినూత్నంగా ప్లాన్ చేసిందన్న వ్యాఖ్యలు విన్పిస్తున్నాయి.

ఈ టర్మ్‌లోనే జమిలి ఎన్నికలు

- వక్ఫ్ బిల్లుకు త్వరలో ఆమోదం
- మోదీ 3.0 వంద రోజుల పాలన విజయాలపై మాట్లాడిన హోంమంత్రి అమిత్ షా



న్యూఢిల్లీ: ప్రస్తుత ప్రభుత్వ పాలనా కాలంలోనే జమిలి(ఒకేసారి దేశవ్యాప్త) ఎన్నికలు నిర్వహిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టంచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో మూడోసారి ప్రభుత్వం ఏర్పాటయ్యాక తొలి 100 రోజుల పాలనలో సాధించిన విజయాలపై మంగళవారం పత్రికాసమావేశంలో మంత్రి అశ్వనీవైష్ణవ్‌తో కలిసి అమిత్ సుదీర్ఘంగా మాట్లాడారు.

జనగణన ఎప్పుడో త్వరలో చెప్తాం

జనగణన ఎప్పుడు జరపబోయేది త్వరలోనే వెల్లడిస్తామని, ప్రకటన చేశాక సంబంధిత వివరాలను తెలియజేస్తామని అమిత్ చెప్పారు. జనగణన, కులగణన తక్షణం జరపాలంటూ విపక్షాల నుంచి విపరీతమైన డిమాండ్లు వెల్లువెత్తుతున్న తరుణంలో అమిత్ ఈ ప్రకటన చేయడం గమనార్హం.

రైతుల కోసం రూ.15 లక్షల కోట్ల పథకాలు

''రైతాంగం బాగు కోసం సాగురంగంలో 14 విభాగాల్లో రూ.15 లక్షల కోట్ల విలువైన పథకాలను ఈ 100 రోజుల్లో అమల్లోకి తెచ్చాం. వ్యవసాయంలో మౌలిక వసతుల కల్పనకు మౌలిక సాగు నిధి ఏర్పాటుచేశాం. మోదీ మూడోసారి ప్రధాని అయ్యాక తొలి నిర్ణయం రైతుల కోసమే తీసుకున్నారు. మెరుగైన మౌలిక వసతులకు రూ.3 లక్షల కోట్లు కేటాయించాం. 25వేలకు పైగా కుగ్రామాలకు రోడ్ల అనుసంధానం పెంచుతున్నాం. ఉల్లి, బాస్మతి బియ్యంపై కనీస ఎగుమతి ధరను తొలగించాం. వక్ఫ్ ఆస్తులను కాపాడేందుకు కట్టుబడ్డాం. ఆస్తుల దుర్వినియోగాన్నీ వక్ఫ్ (సవరణ) బిల్లు అడ్డుకుంటుంది. గత నెలలో లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టాం. సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు బిల్లును పంపాం. త్వరలోనే పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందుతుంది'' అని షా అన్నారు.

గణపతి పూజలో పాల్గొన్నా కాంగ్రెస్‌కు నచ్చట్లేదు

- అధికార దాహంతో విభజన రాజకీయాలు చేసే వాళ్లకు నేనంటే కోపం
- సీజేఐ ఇంట్లో పూజకు హాజరవడంపై స్పందించిన ప్రధాని నరేంద్ర మోదీ

భువనేశ్వర్: సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నివాసంలో గణపతి పూజలో పాల్గొన్నందుకు తనపై విమర్శలు పెంచిన కాంగ్రెస్‌కు ప్రధాని మోదీ మంగళవారం దీటుగా బదులిచ్చారు. ఒడిశాలోని భువనేశ్వర్‌లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న సందర్భంగా మోదీ ప్రసంగిస్తూ కాంగ్రెస్‌పై విమర్శలు ఎక్కుపెట్టారు. ''గణేశ్ ఉత్సవం దేశంలో కేవలం మత విశ్వాసాలకు సంబంధించిన వేడుక కాదు. దేశ స్వాతంత్ర్యోద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉత్సవం. ఆకాలంలో బ్రిటిష్ పాలకులు సైతం గణేశ్ ఉత్సవాలను ద్వేషించాలంటూ భారత్‌లో విభజించు, పాలించు కుట్రను అమలుచేశారు. ఇప్పుడు కూడా అధికార దాహంతో కొట్టుమిట్టాడుతున్న కొందరు గణపతి పూజలో పాల్గొంటే సమస్యలొస్తాయంటూ సమాజాన్ని విభజించే పనిలో బిజీగా మారారు. గణపతి పూజలో పాల్గొన్న నాపై కాంగ్రెస్, దాని మిత్రపక్షాల్లో పీకలదాకా కోపముంది. కాంగ్రెస్‌పాలిత కర్ణాటకలో గొడవలు జరుగుతాయంటూ ఏకంగా గణపతి విగ్రహాన్నే కటాకటాల వెనక్కి నెట్టారు. పోలీస్‌వ్యాన్‌లో గణపతి విగ్రహం ఫొటో చూసి యావత్‌భారతావని బాధపడింది. ఇక ఇలాంటి విద్వేష శక్తుల ఆట కట్టించాల్సిందే. దేశాన్ని కుల, మత ప్రాతిపదికన బ్రిటిషర్లు విభజించాలని చూస్తే లోకమాన్య తిలక్ గణేశ్ ఉత్సవాలతో దేశ సమైక్య స్ఫూర్తిని మరింతగా రగిల్చారు. కుల మతాల కతీతంగా ఐక్యంగా ఎలా ఉండాలో గణేశ్ ఉత్సవాలు మనకు చాటిచెప్పాయి'' అని మోదీ అన్నారు.



చిన్నారితో ముచ్చటిస్తున్న మోదీ

రూ.2,871 కోట్ల ప్రాజెక్టులకు ప్రారంభం

తన నాయకత్వంలో మూడోదఫా పాలన మొదలై 100 రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా మంగళవారం మోదీ ఒడిశాలో రూ.2,871 కోట్ల విలువైన రైల్వే, జాతీయ రహదారులకు సంబంధించిన పలు ప్రాజెక్టుల్లో కొన్నింటికి శంకుస్థాపనలు చేసి కొన్నింటిని ప్రారంభించారు. ఒడిశా బీజేపీ ప్రభుత్వ కీలక పథకం ' సుభద్ర యోజన'ను ప్రారంభించారు. భువనేశ్వర్‌లోని సబర్ సాహీ మురికివాడలో ప్రధానమంత్రి ఆవాస్‌యోజన(పట్టణ) 20 మంది లబ్ధిదారుల ఇళ్లను మోదీ స్వయంగా ప్రారంభించి వారితో మోదీ ముచ్చటించారు. పుట్టినరోజున తమ ఇంటికొచ్చిన మోదీకి ఆ గిరిజనులు అంగవస్త్రం ఇచ్చి ఆహ్వానించి నుదుటిన గంధంబొట్టు పెట్టారు. ప్రేమతో తనకు వారు ఇచ్చిన తీపి వంటకం ఖీర్‌ను మోదీ రుచిచూశారు.

కోల్‌కతా సీపీగా మనోజ్ వర్మ

వైద్య విద్య, వైద్య సేవల డైరెక్టర్ల తొలగింపు

కోల్‌కతా: జూనియర్ డాక్టర్లు డిమాండ్ చేసినట్లుగానే కోల్‌కతా పోలీసు కమిషనర్ వినీత్ గోయల్‌పై వేటు పడింది. కొత్త కమిషనర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి మనోజ్ కుమార్ వర్మను బెంగాల్ ప్రభుత్వం మంగళవారం నియమించింది. జూడాలకు ఇచ్చిన హామీ మేరకు ఆరోగ్య సేవల డైరెక్టర్ దేవాశిష్ హల్దర్, వైద్య విద్య డైరెక్టర్ కౌస్తవ్ నాయక్‌లను మమత సర్కారు తొలగించింది. కోల్‌కతా నార్త్ డివిజన్ డిప్యూటీ పోలీసు కమిషనర్ అభిషేక్ గుప్తా పైనా వేటు వేసింది. మనోజ్ వర్మ జంగల్‌మహల్ ప్రాంతంలో మావోయిస్టుల ఏరివేతలో కీలకపాత్ర పోషించారు. కిషన్‌జీ (కోటేశ్వర రావు) ఎన్‌కౌంటర్‌లోనూ ముఖ్యభూమిక వహించారు. ఆర్.జి.కర్ ఆసుపత్రిలో ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనను నిరసిస్తూ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్లు 39 రోజులుగా విధులను బహిష్కరిస్తున్నారు. సోమవారం రాత్రి మమతతో సమావేశమయ్యారు. వారి ప్రధాన డిమాండ్లను మమత అంగీకరించడం తెలిసిందే.

కశ్మీర్‌లో నేడే తొలి దశ

- 24 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్
- కశ్మీర్లో 16, జమ్మూలో 8 సీట్లు
- బరిలో 219 మంది అభ్యర్థులు
- వారిలో 90 మంది స్వతంత్రులే!
- కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు



శ్రీనగర్/జమ్మూ: జమ్మూ కశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల పోరు కీలక దశకు చేరింది. 7 జిల్లాల పరిధిలో 24 అసెంబ్లీ స్థానాలకు బుధవారం తొలి విడతలో పోలింగ్ జరగనుంది. వీటిలో 8 స్థానాలు జమ్మూలో, 16 కశ్మీర్ ప్రాంతంలో ఉన్నాయి. 90 మంది స్వతంత్రులతో కలిపి మొత్తం 219 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వారి భవితవ్యాన్ని 23 లక్షల పై చిలుకు ఓటర్లు బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం చేయనున్నారు. జమ్మూ కశ్మీర్‌లో పదేళ్ల అనంతరం అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండటం విశేషం. పైగా జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను, ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తున్న ఆర్టికల్ 370ని రద్దు చేశాక జరుగుతున్న తొలి అసెంబ్లీ ఎన్నికలివి. దాంతో ప్రజల తీర్పు ఎలా ఉండనుందోనని ఆసక్తి నెలకొంది. ఉగ్ర ముప్పు నేపథ్యంలో సీఏపీఎఫ్, స్థానిక పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలింగ్ బూత్‌లకు, సిబ్బందికి అదనపు భద్రత కల్పిస్తున్నారు. సెప్టెంబర్ 25, అక్టోబర్ 1న రెండు, మూడో విడతతో పోలింగ్ ప్రక్రియ ముగుస్తుంది. ఫలితాలు అక్టోబర్ 8న వెల్లడవుతాయి.

అంకెల్లో తొలి విడత

పోలింగ్ జరిగే అసెంబ్లీ స్థానాలు	24
అభ్యర్థులు	219
మొత్తం ఓటర్లు	23,27,580
పురుషులు	11,76,462
స్త్రీలు	11,51,058
18-19 ఏళ్లవారు	1.23 లక్షలు
పోలింగ్ స్టేషన్లు	3,276
పోలింగ్ సిబ్బంది	14,000

పార్టీలన్నింటికీ ప్రతిష్టాత్మకమే

ప్రధాన ప్రాంతీయ పార్టీలు నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ), పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ)తో పాటు కాంగ్రెస్, బీజేపీ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. వేర్పాటువాద జమాతే ఇస్లామీ, అవామీ ఇత్తెహాద్ పార్టీ, డీపీఏపీ కూడా బరిలో ఉన్నాయి. కాంగ్రెస్, ఎన్‌సీ పొత్తు పెట్టుకున్నా మూడుచోట్ల స్నేహపూర్వక పోటీ చేస్తున్నాయి. మరో చోట ఎన్‌సీ రెబెల్ బరిలో ఉన్నారు. కశ్మీర్‌పై కాషాయ జెండా ఎగరేయజూస్తున్న బీజేపీని రెబెల్స్ బెడద పీడిస్తోంది. అసెంబ్లీ నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణలో హిందూ ప్రాబల్య జమ్మూ ప్రాంతంలో సీట్లు 37 నుంచి 43కు పెరిగాయి. ముస్లిం ప్రాబల్య కశ్మీర్‌లో ఒక్క సీటే పెరిగింది.

బరిలో ప్రముఖులు: మొహమ్మద్ యూసుఫ్ తరిగమీ (సీపీఎం) కుల్గాం నుంచి వరుసగా ఐదో విజయంపై కన్నేశారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి గులాం అహ్మద్ మీర్‌దూరు నుంచి మూడోసారి గెలుపుపై ఆశలు పెట్టుకున్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ నేత సకీనా (దమ్హాల్ హాజిపురా), పీడీపీ నేతలు సర్తాజ్ మద్నీ (దేవ్‌సర్), అబ్దుల్ రెహ్మాన్ వీరి (షంగస్-అనంత్‌నాగ్), మెహబూబా ముఫ్తీ కూతురు ఇల్తిజా (శ్రీగుఫ్వారా-బిజ్‌బెహరా), వహీద్ పరా (పుల్వామా) తదితర ప్రముఖులు తొలి విడతలో అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

ప్రధాన సమస్యలు ఇవే...

- నిరుద్యోగం, అణచివేత, మానవ హక్కుల ఉల్లంఘన వంటివి జమ్మూ కశ్మీర్ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు.
- పూర్తిస్థాయి రాష్ట్ర హోదా లభిస్తేనే సమస్యలు తీరి తమ ప్రయోజనాలు నెరవేరతాయని వారు భావిస్తున్నారు. దాంతో దాదాపుగా పార్టీలన్నీ దీన్నే ప్రధాన హామీగా చేసుకున్నాయి.
- ఆర్టికల్ 370ని తిరిగి తెస్తామని కూడా ఎన్‌సీ వంటి పార్టీలు చెబుతున్నాయి. విద్య, వివాహాలు, పన్నులు, సంపద, అడవుల వంటి పలు అంశాలను రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలోకి తెస్తామంటున్నాయి.
- ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో కశ్మీరీలు భారీ సంఖ్యలో ఓటువేశారు. అసెంబ్లీ ఎన్నికల్లోనూ అదే ధోరణి కొనసాగుతుందని భావిస్తున్నారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

బుధవారం | 18 | సెప్టెంబర్ | 2024



హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులను ఆదరించాలి

హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను వివక్ష చూపించకుండా వారిని ప్రేమాభిమానాలతో ఆదరించాలని ఏపీ శాక్స్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఏ.సిరి సూచించారు. -8లో▸



పకడ్బందీగా 'మధ్యాహ్న' భోజనం

చిలకలపూడి(మచిలీపట్నం): పకడ్బందీగా మధ్యాహ్న భోజనం పథకం చేయాలని కలెక్టర్‌లోని సమావేశ హాల్లో కృష్ణా కలెక్టర్ బాలాజీ మంగళ వారం ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

'పర్యాటక' పునరుద్ధరణకు చర్యలు



పర్యాటక ప్రాంతాల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు. ఆయన మంగళవారం విజయవాడలోని బెరంపార్క్‌ను పరిశీలించారు. -8లో▸

న్యూస్‌రీల్

సీఎం సహాయ నిధికి రూ.10 లక్షల విరాళం



పామర్రు: పామర్రుకు చెందిన వ్యాపార వేత్త కిలారపు శ్రీనివాసరావు యాదవ్ వరద బాధితులకు చేయూతనివ్వడానికి రూ.10 లక్షల విరాళం అందించారు. ఈ మేరకు మంగళ వారం ఆయన స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబును కలిసి సీఎం సహాయ నిధికి రూ.10 లక్షల చెక్కు అందజేశారు. ఆయన వరద ప్రభావిత ప్రాంతాల్లో సేవలు అందించారు.

వరద బాధితులకు రూ.2.87లక్షలు



జురుపూడి(పామర్రు): ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) పిలుపు మేరకు ఆంధ్ర ప్రదేశ్ ఫ్లడ్ రిలీఫ్ ఫండ్‌కు జురువరం గ్రామం ఉషోదయ హైస్కూల్ విద్యార్థినీవిద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది, యాజమాన్యం వివిధ గ్రామాల ప్రజలు అందరూ కలిసి రూ.2,87,786 చెక్కు రూపంలో ప్రిన్సిపాల్ ఎండీ రఫీకి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ చెక్కును చీఫ్ మినిస్టర్ ఫ్లడ్ రిలీఫ్ ఫండ్‌కి అందజేయాలని అప్సా రాష్ట్ర అధ్యక్షుడు గొల్లపూడి మోహన్‌రావు ఇస్తామని తెలిపారు. చిన్న చేతులతో పెద్ద మొత్తాన్ని అందించిన చిన్నారులకు ప్రత్యేక అభినందనలు తెలిపి, సర్టిఫికెట్, మెమొంటోలను అందజేశారు. ఉషోదయ సిబ్బంది ఒక్కరోజు జీతాన్ని కూడా అందజేశారు.

20 నుంచి జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

గన్నవరం: పాత కృష్ణా జిల్లా స్థాయిలో పురుషుల బ్యాడ్మింటన్ పోటీలను ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు స్థానిక కేవీఆర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ కేవీ రమణ, కార్యదర్శి కేవీఆర్ కిషోర్ తెలిపారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సీనియర్ కేటగిరీలో 45 ఏళ్లలోపు, వెటరన్ కేటగిరీలో 45 ఏళ్లు దాటిన పురుషులకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ రెండు కేటగిరీల్లో ప్రథమ బహుమతి సాధించిన జట్టుకు రూ. 12 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 8 వేలు, తృతీయ బహుమతిగా రూ. 5 వేలు, నాలుగో బహుమతిగా రూ. 3 వేలు చొప్పున నగదు బహుమతులు, మెమెంటోలు అందజేయనున్నట్లు చెప్పారు. పోటీలు ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల నుంచి ప్రారంభమవుతాయని, క్రీడాకారులకు భోజన వసతి కల్పించినట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన జట్లు ఈ నెల 19వ తేదీలోపు 98850 68099, 91771 05146, 79812 61897 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

బుడమేరు యూటీని ఎత్తు పెంచి నిర్మించాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు వద్ద బుడమేరు యూటీని ఎత్తు పెంచి నిర్మించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ సూచించారు. ఎనికేపాడు కాల్వకట్ట ప్రాంతంలోని బుడమేరును మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి కాలువ ద్వారా ఏలూరు వెళ్లే నీరు ఒకవైపు, దాని దిగువ భాగాన బుడమేరు పారుతుందన్నారు. ఈ రెండు విడివిడిగా వెళ్లాల్సి ఉందన్నారు. 1902లో బ్రిటీష్ వారు కట్టిన దీన్ని ఇప్పటి అవసరాలకు అనుగుణంగా ఎత్తు పెంచాల్సి ఉందని చెప్పారు. ఏలూరు వెళ్లే నీళ్ల విడిగా, బుడమేరు నీరు అండర్ గ్రౌండ్‌గా పారాల్సి ఉందన్నారు. దీని ఎత్తు పెంచకుండా సీఎం చంద్రబాబు రాత్రి పూట బోట్లెక్కి తిరగడం వల్ల ప్రయోజనం ఉండదని తెలిపారు. ఇప్పటికైనా స్పందించి యుద్ధప్రాతిపదికన బుడమేరు పాత యూటీని తొలగించి, ఎత్తు పెంచి నిర్మించాలని లేకపోతే భవిష్యత్తులో ముప్పు తప్పదని హెచ్చరించారు.



పేద విద్యార్థులకు అందని ద్రాక్షగా..

మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తారనే నిర్ణయంతో పేద విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగా మారనుంది. నీట్‌లో మంచి ర్యాంక్ వస్తే పక్క రాష్ట్రాల్లో సీట్లు వస్తున్నాయి. మన రాష్ట్రంలో ర్యాంకులు సాధించినా సీట్ల కేటాయింపు కఠినమవడం బాధాకరం. పోటీకు అనుగుణంగా సీట్ల సంఖ్య కూడా పెంచితే వైద్య విద్య అభ్యసించాలనే కల చాలా మందికి తీరుతుంది. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలి. కొత్త వైద్య కళాశాలలను నెలకొల్పే దిశగా పాలకులు ముందుకెళ్లాలి. ఈ విధానాలు పాటిస్తే కొంత వరకైన పేద విద్యార్థుల వైద్య విద్య కల నెరవేరుతుంది.

- మసిముక్కు జాహ్నవి, నీట్ రాసిన విద్యార్థి, మచిలీపట్నం



మాలాంటి ఎందరికో అన్యాయం జరిగింది

రాష్ట్రంలో మరో ఐదు కొత్త వైద్య కళాశాలల్లో 750 ఎంబీబీఎస్ సీట్లు ఈ ఏడాది అడ్మిషన్లు జరపాల్సి ఉంది. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అవకాశం వచ్చేలా లేదు. దీంతో మాలాంటి వారికి సీట్లపై ఆశలు వదులుకోవాల్సిందే. అదే కొత్త వైద్య కళాశాలల్లో అడ్మిషన్లు జరుగుతుంటే మాకు ఇక్కడే సీట్లు వచ్చేవి. మాలాంటి వారికి ఎందరికో అన్యాయం జరిగింది. సీట్లు రాకపోవడంతో లక్షలాది రూపాయలు వెచ్చించి ఇతర రాష్ట్రాలకు వెళ్లి వైద్య విద్యను అభ్యసించాల్సిన పరిస్థితి నెలకొంది. అడ్మిషన్లు జరిగి కళాశాల ప్రారంభమైతే ఎంతోమంది రోగులు మెరుగైన చికిత్స పొందే అవకాశం ఉండేది.

- వాసంతి, నీట్ విద్యార్థి తల్లి, విజయవాడ

రహదారుణాలు

- ఇటీవల కురిసిన వర్షాలు, వరదలకు రోడ్లు ఛిద్రం
- పంచాయతీరాజ్ శాఖకు రూ.119.47 కోట్ల నష్టం
- ఆర్‌అండ్‌బీకి 189.44 కోట్ల నష్టం
- ప్రజలకు తప్పని ఇబ్బందులు



దెబ్బతిన్న జి.కొండూరు మండలం వెల్లటూరు-కుంటముక్కల రోడ్డు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వచ్చిన వరదలకు రహదారులు దెబ్బతిన్నాయి. ఇవి రోడ్లకు నష్టాన్ని కలుగజేశాయి. వాగులు, వంకలు కాలువలు ఉన్న చోట్ల రహదారులకు గండ్లు పడ్డాయి. కొన్ని చోట్ల తారు లేచి గోతులు పడ్డాయి. మరికొన్ని చోట్ల రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రోడ్లకు తీవ్ర నష్టం వాటిల్లింది. జిల్లాలోని ప్రధాన రోడ్లన్నీ ఛిద్రమయ్యాయి.

రోడ్లకు కోత.. గోతులు

ప్రధానంగా మున్నేరు, కట్టలేరు, బుడమేరు వాగులు పొంగడం.. దీంతోపాటు భారీ వర్షాలు కురవడంతో రోడ్లు కోతకు గురయ్యాయి. కల్వర్టులు కొట్టుకుపోవడంతో, భారీగా గోతులు పడ్డాయి. గతంలో ఎప్పుడూ లేనివిధంగా రోడ్లు దెబ్బతినడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాత్కాలికంగా మరమ్మతులు చేసినా ఉపయోగం లేదని, శాశ్వతంగా బాగు చేస్తేనే ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉంటుంది.

ఆర్‌అండ్‌బీకి కోలుకోలేని దెబ్బ

వరదల్లో ప్రధానంగా ఆర్‌అండ్‌బీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. స్టేట్ హైవే (ఎస్‌హెచ్), మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లు (ఎండీఆర్) కు సంబంధించి జిల్లాలో 26 చోట్ల రోడ్లు ధ్వంసమయ్యాయి. 60 చోట్ల రోడ్లు గోతులు పడి దెబ్బతిన్నాయి. 690.94 కిలోమీటర్ల పరిధిలో రోడ్లు గుంతలు, పడటంతో పాటు, పలుచోట్ల దెబ్బతిన్నాయి. ఈ రోడ్లను తాత్కాలికంగా బాగు చేయడానికి రూ.21.76 కోట్లు, శాశ్వత మరమ్మతులకు రూ.189.44 కోట్లు అవుతుందని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి 13 చోట్ల రోడ్లు ధ్వంసమయ్యాయి. 115 చోట్ల రహదారులు దెబ్బతిన్నాయి. పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి 714 మీటర్ల మేర రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. 284.71 కిలోమీటర్ల పరిధిలో కొన్ని చోట్ల దెబ్బతినడంతో పాటు, గోతులు పడ్డాయి. ఈ రోడ్లకు సంబంధించి తాత్కాలిక మరమ్మతులకు రూ. 2.05 కోట్లు, శాశ్వత మరమ్మతులకు రూ.119.47 కోట్లు అవుతుందని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

ఆర్‌అండ్‌బీకి సంబంధించి....

డివిజన్	కిలోమీటర్లు	శాశ్వత మరమ్మతులకు (కోట్లలో)
ఎన్టీఆర్ (ఎస్‌హెచ్)	156.26	53.50
(ఎండీఆర్)	239.68	78.24
మైలవరం (ఎస్‌హెచ్)	100.00	27.10
(ఎండీఆర్)	195 .00	30.60
మొత్తం	690.94	189.44

పంచాయతీరాజ్‌కు సంబంధించి..

నియోజక వర్గం	రోడ్డు డ్యామేజి (మీ)	సర్ఫేస్ డ్యామేజి (కి.మీ)	శాశ్వత మరమ్మతులకు.. రూ.కోట్లలో
నందిగామ	140.00	114.55	34.39
మైలవరం	159.00	53.11	20.88
జగ్గయ్యపేట	295.00	54.90	27.52
తిరువూరు	120.00	62.15	36.68
మొత్తం	714	284.71	119.47

ప్రధానంగా దెబ్బతిన్న రోడ్లు ఇవే..

జగ్గయ్యపేట-వైరా, చెవిటికల్లు-వత్సవాయి, నూజివీడు-ఆగిరిపల్లె, మక్కపేట-పెనుగంచిప్రోలు, గంగినేని-ఎరగంగినేని-ఎర్రుపాలెం, నూజివీడు-గంపలగూడెం, నందిగామ-పుట్రేల, నెమలి- సిరిపురం, కొత్తపాడు-కాకర్ల, ఎంఎస్‌రోడ్డు-గంగుపాడు, తిరువూరు-సత్యపాడు-గోసవీడు, చెన్నవరం-మైలవరంరోడ్డు, కొట్టిపాడు-కాకర్లరోడ్డు, తిరువూరు -రాజుపాలెం. నేషనల్ హైవే-కంచికచర్ల, జి.కొండూరు-వెల్లటూరు, జి.కొండూరు-ఆత్కూరు ప్రధాన రహదారి, పరిటాల-కొత్తపేట, కంచికచర్ల-అమరవరం,బత్తినపాడు-చెవిటికల్లు రోడ్లు ప్రధానంగా దెబ్బతిన్నాయి.

పంచాయతీ రోడ్లు ఇవే..

ఐటీరోడ్డు-కవులూరు, కంచర్ల-కేతవీరునిపాడు, ఎస్‌జీరోడ్డు-కొత్తపల్లి, బీటీరోడ్డు-వేదాద్రి, ఐటీరోడ్డు-జంగాలపల్లి, తండా వంటి రోడ్లు బాగా దెబ్బతిని ఉన్నాయి.



పెనుగంచిప్రోలు-వేములనర్వ ఆర్‌అండ్‌బీ రోడ్డు



కంచికచర్ల మండలం పరిటాల-కొత్తపల్లి రోడ్డు ఇలా



మునేరు వరదకు దారుణంగా మారిన పెనుగంచిప్రోలు-ముచ్చింతాల ఆర్‌అండ్‌బీ రోడ్డు

వాహనాలు వరదార్పణం

- నీట మునిగిన 23 వేల వాహనాలు
- లెక్కలు తేల్చిన అధికారులు
- బీమా అందక వాహన యాజమానుల ఇక్కట్లు



అజిత్‌సింగ్‌నగర్‌లో ఓ మోటార్ వాహన షోరూం వద్ద నీటిలో మునిగి పాడైన ద్విచక్ర వాహనాలు



వరద నీటిలో మునిగి పాడైన వాహనం

విజయవాడ స్పోర్ట్స్: భారీ వర్షాలు, బుడమేరు వరద బీభత్సంతో నగరం కొన్ని రోజులు నీట మునిగింది. మోటారు వాహనాలు కూడా వరదార్పణమయ్యాయి. దీంతో బైక్‌లు, ఆటోలు, కార్లు పూర్తిగా పాడయ్యాయి. వాటి మరమ్మతులకు యజమానులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. బండి నడవక.. బతుకు సాగడం లేదంటూ వాహనాలపై ఆధారపడి జీవించే కుటుంబాలు వాపోతున్నాయి. ప్రభుత్వం ప్రత్యేక యాప్ ద్వారా నిర్వహించిన సర్వేలో వరదలో మునిగి వేలాది వాహనాలు పాడైనట్లు అధికారులు చెబుతున్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని అజిత్‌సింగ్‌నగర్, లూనా సెంటర్, లెనిన్‌సెంటర్, వాంబేకాలనీ, వడ్డెరకాలనీ, కృష్ణాహోటల్‌సెంటర్, పైపుల రోడ్డు, శాంతినగర్, ప్రశాంతినగర్, ఆంధ్రప్రభకాలనీ, తోటవారివీధి, నందమూరినగర్, న్యూఆర్‌ఆర్‌పేట, ఎల్‌బీఎస్‌నగర్, సుందరయ్యనగర్, ప్రకాష్‌నగర్, రాజీవ్‌నగర్, కండ్రిగ, ఉడాకాలనీలతో పాటు పశ్చిమ నియోజకవర్గంలోని భవానీపురం, రామరాజ్యనగర్, ఏకలవ్యనగర్, సితార, కబేళా ప్రాంతాల్లో వారం రోజుల పాటు వాహనాలు నీటిలోనే ఉన్నాయి. రూరల్‌లోని అంబాపురం, జక్కంపూడి ప్రాంతాల్లోని కొన్ని వీధుల్లో వీధులు నేటికీ వరద నీటిలోనే ఉండటంతో వాహనాలు ముంపులోనే కొనసాగుతున్నాయి.

లెక్క తేల్చారు

విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 32 డివిజన్లతో పాటు రూరల్‌లోని రెండు మేజర్ గ్రామ పంచాయతీల్లో 23,821 వాహనాలు నీట మునిగినట్లు రవాణా శాఖ అధికారుల తేల్చారు. అత్యధికంగా బైక్‌లు 19,937, కార్లు 1,274, పాసింజర్ ఆటోలు 1,758, గూడ్స్ ఆటోలు 336, గూడ్స్ కారియర్‌లు 245, కాబ్‌లు 100 వ్యవసాయ ట్రాక్టర్లు 20, బస్సులు 18, రెండు అంబులెన్స్‌లు ఉన్నాయి.

కోలుకోలేని దెబ్బ

వరద ప్రాంతాల్లో నివసిస్తూ ఆటోమొబైల్‌రంగంపై ఆధారపడ్డ 95 శాతం పేద, మధ్యతరగతి ప్రజల జీవనోపాధిని బుడమేరు ప్రశ్నార్థంగా మార్చింది. ఫైనాన్స్‌తో ఆటో, కారు తీసుకుని కుటుంబాలను నెట్టుకొచ్చే కుటుంబాలను ఆర్థికంగా కోలుకోలేని దెబ్బతీసింది. ఓలా బైక్‌లు నడిపేవారు, మోటారు వాహనంపై ఐస్‌క్రీం విక్రయదారులు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఆటో, కారు, బైక్‌లపై ఆధారపడిన కుటుంబాలను ప్రస్తుతం ఈఎంఐ సమస్య తీవ్రంగా పీడిస్తోంది.

ముఖం చాటేస్తున్న బీమా కంపెనీలు

బాధితులను ఆదుకోవడంలో బీమా కంపెనీలు వెనకడుగు వేస్తున్నాయని వాహన యజమానులు వాపోతున్నారు. వన్ టైం సెటిల్‌మెంట్ పేరుతో 10 శాతం మరమ్మతుల ఖర్చులు సైతం ఇవ్వడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంజిన్లలోకి నీరు వెళ్లడంతో ద్విచక్ర వాహనానికి రూ. 15 నుంచి 20 వేలు వరకు ఖర్చు అవుతుంటే బీమా కంపెనీలు నామమాత్రంగా పరిహారం ఇస్తూ చేతులు దులుపుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని చెబుతున్నారు.

స్పేర్ పార్ట్స్ ధర పెంపు

ఆటోమొబైల్ షాపుల యజమానులు నిలువునా దోచుకుంటున్నారని వాహన యజమానులు చెబుతున్నారు. కంపెనీల నుంచి పార్ట్స్ రవాణా నిలిచిపోయిందని, గోదాముల్లో నిల్వ లేదని సాకులు చెబుతూ పలువురు బ్లాక్ దందా సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెలతో పోల్చితే ఒక్కో పార్ట్ ధరను రెట్టింపు చేసి విక్రయిస్తున్నారని చెబుతున్నారు.

పకడ్బందీగా వాహనాలకు మరమ్మతులు



ముంపునకు గురైన ప్రతి వాహనాన్ని రిపేరు చేసేందుకు పకడ్బందీగా ప్రణాళిక చేశాం. ఎన్టీఆర్, గుంటూరు, ఏలూరు, కృష్ణాజిల్లాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి 32 మంది ఎంవీఐలను రంగంలోకి దింపి కార్పొరేషన్ డివిజన్‌కు ఒక్కరు చొప్పున నియమించాం. వరద ప్రభావిత ప్రాంతాల్లో 312 మెకానిక్‌లను మ్యాపింగ్ చేసి అన్ని వాహనాలను అక్కడకు తరలిస్తున్నాం. నగరంలోని 61 ఆథరైజ్డ్ సర్వీసింగ్ స్టేషన్‌లకు పలు వాహనాలను తరలిస్తున్నాం. ఈ నెల 16కు 4,709 వాహనాల మరమ్మతులు పూర్తి చేయించాం. బీమా కంపెనీలతో వన్ టైం సెటిల్‌మెంట్ కారణంగా ఉత్పన్నమయ్యే సమస్యపై దృష్టిసారిస్తున్నాం. స్పేర్ పార్ట్స్ ధర పెంచి విక్రయిస్తున్న విషయం నా దృష్టికి రాలేదు. అధికారులను అప్రమత్తం చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– ఎం.పురేంద్ర, డెప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, ఎన్టీఆర్ జిల్లా

ప్రతి రంగంలో సైన్స్ అండ్ టెక్నాలజీ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రతి రంగంలోనూ సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధి చెందాలని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (స్పా) కళాశాల డైరెక్టర్ ఎస్.రమేష్ చెప్పారు. 'ఇస్రో' ఆధ్వర్యంలో ప్రయోగించిన వివిధ ప్రాజెక్టు నమూనాలతో కూడిన బస్సు (స్పేస్ ఆన్ వీల్స్)ను 'స్పా' కళాశాల ఆవరణలో విద్యార్థుల సందర్శనార్థం మంగళవారం నగరానికి తీసుకువచ్చారు. రమేష్ మాట్లాడుతూ భారతీయ విజ్ఞాన మండలి, విజ్ఞాన భారతి, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సంయుక్తంగా ఈ బస్సును నగరానికి తీసుకువచ్చారని చెప్పారు.



ప్రదర్శనలోని అంశాలను చూస్తున్న విద్యార్థులు

వరద బాధితులకు అండగా వైఎస్సార్ సీపీ



నిత్యావసరాల పంపిణీ వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి కారుమూరి , మాజీ ఎమ్మెల్యే మల్లాది , మేయర్ భాగ్యలక్ష్మి, తూర్పు, పశ్చిమ ఇన్‌చార్జిలు అవినాష్, షేక్ ఆసిఫ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైపరీత్యాల సమయంలో వైఎస్సార్ సీపీ పేదలు, బాధితులకు అండగా నిలుస్తుందని ఆ పార్టీ నేతలు అన్నారు. హనుమాన్ పేటలోని గోడౌన్ వద్ద మంగళవారం 50 వేల కుటుంబాలకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన కిట్లను వాహనాల్లో మూడు నియోజకవర్గాల్లోని వరద ప్రభావిత ప్రాంతాలకు తరలించారు. వాహనాలను ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, మేయర్ భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, తూర్పు, పశ్చిమ ఇన్‌చార్జిలు దేవినేని అవినాష్, షేక్ ఆసిఫ్, పార్టీ నేత పోతిన వెంకట మహేష్‌తో కలిసి ప్రారంభించారు. వరద ప్రభావిత ప్రాంతాలకు కేటాయించిన వాహనాల్లోకి దేవినేని స్వయంగా కిట్లు లోడ్ చేయించి నియోజకవర్గాలకు పంపించారు. నేతలు మాట్లాడుతూ వరదల్లో చిక్కుకుని సర్వం కోల్పోయిన వారికి తమ వంతు బాధ్యతగా మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిత్యావసర సరుకులు అందజేస్తున్నట్టు తెలిపారు. వరద నుంచి తేరుకున్న తర్వాత అవసరాలను గుర్తించి 8 నిత్యావసర సరుకులతో కూడిన కిట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఎప్పుడు విపత్తులు వచ్చినా తమ పార్టీ ముందుండి పనిచేసిందని చెప్పారు. నియోజకవర్గాలకు పంపిన కిట్లను ఆయా డివిజన్ల వారీగా కేటాయించి పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్పొరేటర్లు బాపతి కోటిరెడ్డి, ఎండీ ఇర్ఫాన్, వై.ఆంజనేయ రెడ్డి, యలకల చలపతి రావు, ఇసరపు రాజా, గుండె సుందర్‌పాల్, ఆలంపూర్ విజయ్, ఇతర పార్టీ నేతలు పాల్గొన్నారు.

నగరంలో వరద బాధితులకు 50 వేల కిట్లు పంపిణీ

క్లుప్తంగా

పోరంకిలో యువకుడి ఆత్మహత్య

పెనమలూరు: పోరంకిలో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు ఎస్ఐ ఉషారాణి తెలిపిన వివరాల ప్రకారం పోరంకి సాలిపేటలో బట్టు సీతారామరాజు కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సీతారామరాజు సెక్యూరిటీ గార్డుగా పని చేస్తాడు. అతని కుమారుడు బట్టు ప్రదీప్(21) ఐటీఐ పూర్తి చేసి బోరు పనులు చేస్తాడు. సీతారామరాజు మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో నిద్రపోతున్న సమయంలో కుమారుడు ప్రదీప్ బయట పనులు ముగించుకుని ఇంటికి వచ్చి బెడ్‌రూమ్‌లో నిద్రపోయాడు. సీతారామరాజు సాయంత్రం లేచి చూడగా కుమారుడు ప్రదీప్ బెడ్‌రూమ్ నుంచి బయటకు రాలేదు. తలుపు లోపల గడి వేసి ఉంది. కిటికీలో నుంచి చూడగా ప్రదీప్ చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకోని వేలాడుతూ కనిపించాడు. ఇరుగుపొరుగు వారి సాయంతో తలుపులు తెరిచి చూడగా అప్పటికే అతను మృతి చెందాడు. మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది తన కుమారుడు ఆత్మహత్య చేసుకుని ఉంటాడని సీతారామరాజు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

డ్రెయినేజీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



భవానీపురం(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని చిట్టినగర్ డ్రెయిన్ కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిట్టినగర్ సెంటర్‌లోని శ్రీమయి రెస్టారెంట్ అండ్ బార్ సిబ్బందికి మంగళవారం సాయంత్రం బార్ ముందున్న డ్రెయినేజీ కాలువలో సుమారు 50 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనబడింది. చుట్టుపక్కల అతడిని ఎప్పుడూ చూడలేదని, ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయి చనిపోయి ఉండవచ్చని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పర్‌ను ఢీకొట్టి ద్విచక్ర వాహనదారుడు మృతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక విజయవాడ రోడ్డులో ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టిన ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఏలూరు జిల్లా పెదపాడు మండలం ఏపూరుకు చెందిన భోగోలు వెంకటేష్(28) బైక్‌పై విజయవాడ వైపు నుంచి హనుమాన్‌జంక్షన్ వస్తుండగా సోమవారం రాత్రి ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. రహదారిపై టిప్పర్‌ను నిలిపి ఉంచడంతో రాత్రి వేళలో దాన్ని గుర్తించని వెంకటేష్ బైక్‌తో ఢీ కొట్టాడు. దీంతో తలకు తీవ్రగాయమై రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ ఏడీఎల్ జనార్దన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వేధిస్తున్న కీళ్ల నొప్పులు

- జ్వర బాధితుల్లో నెల రోజులకు తగ్గని వైనం
- కొందరు మంచానికే పరిమితమవుతున్న దుస్థితి
- దోమ కాటుతో ఇదో రకం చికున్‌గున్యాగా చెబుతున్న వైద్యులు



జ్వరం కారణంగా వాచిన కాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది జ్వరాలు చాలా డిఫరెంట్‌గా ఉన్నాయి. జ్వరం వచ్చి తగ్గిన తర్వాత కూడా కీళ్ల నొప్పులు వేధిస్తున్నాయి. ఎంతగా అంటే మంచంపై నుంచి కాలు కింద పెట్టలేనంత నొప్పితో బాధితులు బాధపడుతున్నారు. నడవడమే కాదు మంచంపై పడుకున్నా నొప్పులు భరించలేనంతగా ఉంటున్నాయని, నరకయాతన అనుభవిస్తున్నట్లు వైద్యుల వద్దకు వస్తున్న వారు చెబుతున్నారు. ఇలా ఎందుకు జరుగుతాయంటే వైద్యులు సైతం ఇప్పటి వరకూ ఖచ్చితమైన అంచనా వేయలేక పోయారు. జ్వరాలు డిఫరెంట్‌గా ఉన్నాయని మాత్రమే చెబుతున్నారు. దీంతో దాదాపు నెల రోజుల పాటు కీళ్ల నొప్పులతో ఇబ్బంది పడుతున్నారు.

అడుగు వేయలేకపోతున్నాం..

మారుతీనగర్‌కు చెందిన సురేంద్రకు ఆగస్టు 6న జ్వరం వచ్చి, ఒక్క పూటలోనే తగ్గిపోయింది. మూడు రోజుల తర్వాత శరీరంపై రాష్ వచ్చాయి డెంగీగా భావించి పరీక్ష చేయిస్తే నెగిటివ్ వచ్చింది. వారం రోజులకు కీళ్ల నొప్పులు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు మంచంపై నుంచి కాలు కింద పెట్టలేని స్థితిలో బాధపడ్డానని, ఇప్పటికీ జ్వరం వచ్చి 40 రోజులైనా నడవడం చాలా ఇబ్బందిగా ఉందని చెబుతున్నాడు.

– లబ్బీపేటకు చెందిన వెంకట్ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. నెల రోజుల కిందట ఆగస్టు 18న జ్వరం వచ్చింది. రెండు రోజులు జ్వరం తీవ్రంగా ఉండి తగ్గిపోయింది. ఆ తర్వాత రెండు రోజులకు శరీరంపై రాష్ వచ్చి ఒక్క రోజులో తగ్గిపోయింది. మరుసటి రోజు నుంచి కీళ్ల నొప్పులు ప్రారంభమయ్యాయి. ఒకసారిగా బాడీ పెయిన్స్, కీళ్ల నొప్పులు రావడంతో మంచం దిగడం దేవుడెరుగు, పడుకోవడం కూడా కష్టంగా మారిందని, నడిచే పరిస్థితి లేక ఆఫీసుకు 15 రోజులు సెలవు పెట్టినట్లు చెబుతున్నాడు.

ఇలా వీరిద్దరే కాదు ఇలాంటి వారు వందల సంఖ్యలో ఉన్నారు. ఇప్పుడు ఎక్కడ చూసినా కుంటుతూ నడుస్తున్న వాళ్లు కనిపిస్తున్నారు. ఏమైంది ఏమైనా దెబ్బ తగిలిందా అంటే జ్వరం వచ్చింది, జ్వరంలో కీళ్ల నొప్పులు వచ్చాయంటున్నారు.

చికున్ గున్యా నెగిటివ్ వస్తుంది..

జ్వరంలో కీళ్ల నొప్పులు వస్తున్న బాధితులకు వైద్యులు చికున్ గున్యాగా భావించి నిర్ధారణ పరీక్షలు చేస్తే నెగిటివ్‌గా వస్తుంది. దీంతో వైరల్ జ్వరాల్లోనే కీళ్ల నొప్పులు వస్తున్నాయా, లేకుండా ఇదో రకం గున్యాగా భావిస్తున్నారు. ఇలాంటి వారికి జ్వరం ఒక రోజు వచ్చి తగ్గిపోవడంతో పారాసెట్మాల్‌తో సరిపోతుంది. అనంతరం నొప్పుల మందులు వాడినా కీళ్ల నొప్పులు మాత్రం అదుపులోకి రావడం లేదు. దోమకాటు ద్వారా వ్యాప్తి చెందుతుందా, వైరల్ జ్వరాల అనేది ఖచ్చితంగా నిర్ధారణ కాలేదు.

వైరల్ ఆర్థ్రరైటీస్‌గా భావిస్తున్నాం..



ఈ ఏడాది జ్వరాలు డిఫరెంట్‌గా ఉన్నాయి. జ్వరం తగ్గిన తర్వాత కీళ్ల నొప్పులు వస్తున్నాయి. వైరల్ జ్వరంలో కూడా తీవ్రమైన బాడీ పెయిన్స్ వచ్చే అవకాశం ఉంది. కీళ్ల నొప్పులు రావడాన్ని వైరల్ ఆర్థ్రరైటీస్‌గా భావిస్తున్నాం. ఇది తాత్కాలికమే 15 నుంచి నెల రోజుల్లో సాధారణ స్థితికి చేరుకుంటారు. నొప్పులు క్రమేణా తగ్గుతూ వస్తాయి. అధికంగా నొప్పుల మందులు, స్టెరాయిడ్స్ వంటివి వాడటం మంచిది కాదు. రెస్ట్ తీసుకోవాలి, ఎక్కువ మంచినీరు తాగాలి.

– డాక్టర్ ఎస్.రాకేష్, జనరల్ మెడిసిన్ నిపుణులు

చిన్నారులు ఆరోగ్యవంతంగా ఎదగాలి



పోరంకి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న జిల్లా వైద్యాధికారి గీతాబాయి

పెనమలూరు: చిన్నారులు ఆరోగ్యవంతంగా ఎదగాలంటే ప్రతి ఏడాది క్రమం తప్పకుండా రెండు సార్లు నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలని జిల్లా వైద్యాధికారి జి.గీతాబాయి అన్నారు. పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే)లో (డీవార్మింగ్ డే)భాగంగా విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా గీతాబాయ్ మాట్లాడుతూ.. 0–19 సంవత్సరాల లోపు పిల్లలు ఏడాదికి రెండు సార్లు నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలన్నారు. దీని వలన పిల్లలు ఆరోగ్యవంతంగా ఎదుగుతారని తెలిపారు. పిల్లల్లో రక్తహీనత రాకుండా ఉంటుందని, మానసికంగా ఎదిగేందుకు దోహదపడుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం సమతుల్యంతో కూడిన ఆహారం ఉంటున్నందున విద్యార్థులు పాఠశాలల్లోనే భోజనం తినాలని సూచించారు. మండల పరిధిలో ఇప్పటి వరకు 53,056 మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశామని ఆర్‌బీఎస్‌కే జిల్లా కార్యనిర్వహణాధికారి డాక్టర్ హిమబిందు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు మహేష్, సాయికిరణ్, శ్వేత, సూపర్‌వైజర్ పురుషోత్తమరాజు, వైద్య సిబ్బంది ఏఎన్ఎంలు, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

పెద్ద అవుటపల్లి పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో



పీహెచ్‌సీ అధికారులు, సిబ్బందితో డీఎంహెచ్‌వో గీతాబాయి

ఉంగుటూరు: పీహెచ్‌సీ వైద్య అధికారులు ధర్నాలో ఉన్నందున సూపర్ వైజర్లే జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి జి.గీతాబాయి ఆదేశించారు. పెద్ద అవుటపల్లి పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో మంగళవారం సందర్శించారు. అక్కడ రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అత్యవసర సమయంలో వైద్యులు పీహెచ్‌సీలకు వస్తున్నారని సిబ్బంది చెప్పారు. అలాగే యలమర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి కె.శ్రీనివాసరావు బాపులపాడు, ఉంగుటూరు నులిపురుగు నిర్మూలన దినోత్సవ ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తున్నారు. పెద్ద అవుటపల్లి, ఆత్కూరు పాఠశాలల్లో జరుగుతున్న నులిపురుగు నిర్మూలన మాత్రల పంపిణీని పరిశీలించారు. హెచ్ఎస్ నాగమల్లేశ్వరరావు, ఎంపీహెచ్‌వో జీవన్ కాంతరాజు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలకు దరఖాస్తు చేసుకోండి

చిలకలపూడి(మచిలీపట్నం): ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కానూరులోని ఫెడరల్ స్కిల్ అకాడమీలో ట్యాలీలో ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. అభ్యర్థులు కానూరు తులసీనగర్‌లోని ట్రైనింగ్ సెంటర్‌లో లేదా 87146 92747 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కుమారుడితో కలిసి రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం

– తండ్రి మృతి, కుమారుడికి గాయాలు



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



చికిత్స పొందుతున్న బాలుడు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): నాలుగేళ్ల కుమారుడితో కలిసి తండ్రి రైలు కింద పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా తండ్రి తీవ్ర గాయాలతో మృతి చెందగా, కుమారుడు స్వల్పగాయాలతో బయటపడిన ఘటనపై విజయవాడ జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం రాత్రి 10 గంటల సమయంలో 40 ఏళ్ల వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి తన నాలుగేళ్ల కుమారుడితో కలిసి మధురానగర్ రైల్వే స్టేషన్ సమీపంలో కదులుతున్న రైలు కిందకు దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో తండ్రి అక్కడికక్కడే మృతిచెందగా బాలుడు స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

కేసు నమోదు చేసిన పోలీసులు

బాలుడి ఏడుపు విని అక్కడకి చేరుకున్న స్థానికులు 108కి సమాచారం అందించారు. 108 వాహనంలో తండ్రి మృతదేహంతో పాటు బాలుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దీనిపై విజయవాడ జీఆర్పీ పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. తన పేరు రాకేష్‌వర్ధన్ అని, తండ్రి పేరు ఆనంద్ అని మాత్రమే బాలుడు చెబుతున్నాడు. ఇతర వివరాలు చెప్పలేకపోతున్నాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు, బాలుడి వివరాలు తెలిసిన వారు విజయవాడ జీఆర్పీ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

విషజ్వరంతో పారిశుద్ధ్య కార్మికుడి మృతి



రాందాసు(ఫైల్)

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న కంపా రాందాసు(55) విషజ్వరంతో మంగళవారం మృత్యువాత పడ్డాడు. వరద ప్రభావం తర్వాత మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికి ముగ్గురు మరణించడం ప్రజలను విస్మయానికి గురి చేస్తోంది. ఇప్పటికే ప్రసాద్‌నగర్‌లో వారం క్రితం 12 ఏళ్ల బాలుడు జాన్‌వెస్లీ మృతి తర్వాత అదే ప్రాంతానికి చెందిన లంకే అజయ్ కుమార్(28) కూడా రెండు రోజుల క్రితం జ్వరంతో మరణించాడు. మున్సిపాలిటీ పరిధిలో వరుస మరణాలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అస్తవ్యస్తమైన పారిశుద్ధ్యం, దోమల పెరుగుదల, కలుషిత తాగునీరే జ్వరాలకు ప్రధాన కారణమని ప్రజాసంఘాలు ఆరోపించాయి. మృతి చెందిన రాములు మృతదేహాన్ని మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన, ఏఈ సాయిగణేష్ సందర్శించి, మట్టి ఖర్చులకు రూ.10 వేలు అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పుల కుమార్, ప్రజాప్రతినిధులు, పారిశుద్ధ్య కార్మికులు శ్రద్ధాంజలి ఘటించారు.

చెక్ బౌన్స్ కేసులో కానిస్టేబుల్‌కు జైలు శిక్ష

ఉయ్యూరు: చెక్ బౌన్స్ కేసులో అగ్నిమాపక శాఖలో పనిచేస్తున్న కానిస్టేబుల్‌కు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ ఉయ్యూరు కోర్టు న్యాయమూర్తి కె.శ్రీహరి మంగళవారం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే.. అగ్నిమాపకశాఖలో బత్తుల రవికుమార్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఉయ్యూరు పట్టణానికి చెందిన లక్కింశెట్టి అనూరాధ, లక్కింశెట్టి రాఘవేంద్రరావుల వద్ద ఒక్కొక్కరి వద్ద నుంచి రూ 2.50 లక్షలు అప్పుగా తీసుకుని సదరు అప్పు నిమిత్తం ఒక్కొక్కరికీ రూ.5 లక్షలు చొప్పున రెండు బ్యాంకు చెక్కులు ఇచ్చారు. అప్పు వసూలులో భాగంగా ఆ చెక్కులను బ్యాంకులో జమ చేయగా అవి బౌన్స్ అయ్యాయి. దీంతో బత్తుల రవికుమార్‌పై ఉయ్యూరు పదో అదనపు మెట్రోపాలిటిన్ మేజిస్ట్రేట్ కోర్టులో రెండు కేసులు ఫైల్ చేశారు. ఫిర్యాదుదారుల తరపున న్యాయవాది మోర్ల అంకశ్రీనివాసరావు వాదనలు వినిపించారు. విచారణ అనంతరం రవికుమార్‌పై నేరం రుజువు కావటంతో ఒక్కొక్క కేసుకు సంబంధించి రూ.7,92,500 చొప్పున జరిమానా, ఏడాది పాటు జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి కె.శ్రీహరి తీర్పునిచ్చారు.

హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులను ఆదరించాలి

- నూరు శాతం అవగాహన కల్పించేందుకు చర్యలు
- ఏపీ శాక్స్ పీడీ ఏ.సిరి



విజయవాడలో బెలూన్లను ఎగురవేస్తున్న ఏపీ శాక్స్ పీడీ సిరి, డీసీపీ శాలిని తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను వివక్ష చూపించకుండా వారిని ప్రేమాభిమానాలతో ఆదరించాలని ఏపీ శాక్స్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఏ.సిరి సూచించారు. విజయవాడ బీఆర్టీఎస్ రోడ్డులో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యాన రాష్ట్ర స్థాయి 5కే మారథాన్ రన్ నిర్వహించారు. మీసాల రాజారావు వంతెన నుంచి మధురానగర్ బీఆర్టీఎస్ వంతెన వరకు జరిగిన 5కే రన్‌ను డీసీపీ శాలినితో కలిసి ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. యువతలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ 5కే రన్ మారథాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా స్థాయిలో యువతకు మారథాన్ పోటీలు నిర్వహించి విజేతలకు ఇప్పుడు రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర స్థాయిలో గెలిచిన విజేతలను నవంబర్ 10వ తేదీన గోవాలో నిర్వహించబోయే జాతీయ స్థాయి 10కే రన్ పోటీలకు పంపుతామన్నారు. రాష్ట్రంలో 10 వేల మందికి పైగా హెచ్ఐవీ బాధితులు ఉన్నారని, హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై పురుషుల్లో 25 శాతం, స్త్రీలలో 38 శాతం మాత్రమే అవగాహన కలిగి ఉన్నారని చెప్పారు. మన రాష్ట్రంలో 2030 నాటికి జీరో శాతం వ్యాధి వ్యాప్తి నిరోధకమే లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. అనంతరం రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.35 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.25 వేలు, ప్రశంసా పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ శాక్స్ జాయింట్ డైరెక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ కామేశ్వర్ ప్రసాద్, డాక్టర్ టి.మంజుల, డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చక్రవర్తి, జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి, కో ఆర్డినేటర్లు డా.రాజేంద్ర ప్రసాద్, ఆదిలింగం, ఏపీ శాక్స్ సిబ్బంది పాల్గొన్నారు.

5కే మారథాన్ రాష్ట్ర స్థాయి పోటీల విజేతలు..

పురుషుల విభాగంలో తొలి మూడు స్థానాల్లో ఎ.పైడప్పడు (ఎన్టీఆర్ జిల్లా), సీహెచ్.సురేష్ (శ్రీకాకుళం జిల్లా), వి.రమేష్ (అల్లూరి సీతారామరాజు జిల్లా) నిలిచారు. అలాగే మహిళలు విభాగంలో ఎల్.మేరీ గ్రేస్(విశాఖపట్నం జిల్లా), వి.చెన్నసీల(బాపట్ల జిల్లా), ఎన్.రమ్య జాయ్(బాపట్ల జిల్లా), ట్రాన్స్ జెండర్ విభాగంలో మెల్లాకా నరేష్(మన్యం జిల్లా), గౌడు రమేష్ (మన్యం జిల్లా), జి. లీలావతి(కర్నూలు జిల్లా) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

వరదల్లో దెబ్బతిన్న పర్యాటక ప్రాంతాల పునరుద్ధరణకు చర్యలు



భవానీ ఐలాండ్‌లో ముంపునకు గురైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్

భవానీపురం(విజయవాడపశ్చిమ): భారీ వర్షాలు, వరద ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థకు(ఏపీటీడీసీ, బీఐటీసీ) చెందిన బెరంపార్క్(పున్నమి హోటల్), భవానీ ద్వీపానికి మరమ్మతులు చేసి త్వరితగతిన పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. బెరంపార్క్‌లో, భవానీ ద్వీపంలో దెబ్బతిన్న ప్రదేశాలను మంత్రి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. భవానీ ద్వీపంలో వరద నీటితో మునిగిపోయిన రిసెప్షన్ కౌంటర్‌తో పాటు లోపల వివిధ ప్రదేశాలను పరిశీలించారు. విజయవాడ డివిజనల్ మేనేజర్ పి.కృష్ణచైతన్య, బెరంపార్క్ యూనిట్ మేనేజర్ కె.శ్రీనివాస్ వరద తీవ్రతపై వీడియో క్లిప్పింగ్‌లను చూపించారు.

రూ.10 కోట్ల మేర నష్టం..

మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. బెరంపార్క్, భవానీ ద్వీపం ప్రదేశాల్లో పునరుద్ధరణ చర్యలు చేపట్టి సాధ్యమైనంత త్వరలో పూర్వవైభవం తీసుకువస్తామని చెప్పారు. ఈ రెండు ప్రదేశాల్లో సుమారు రూ.10 కోట్ల మేర నష్టం వాటిల్లిందని అధికారులు చెబుతున్నారని, ఈ విషయాన్ని కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రికి వివరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఏపీటీడీసీ ఈడీ పద్మావతి, బీఐటీసీ జీఎం వెంకట రమణి, విజయవాడ డీవీఎం కృష్ణచైతన్య, ఈఈ ఎం.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి డీఈ శ్రీనివాస్ యాదవ్, బెరంపార్క్, భవానీ ఐలాండ్ యూనిట్ల మేనేజర్లు కె.శ్రీనివాస్, డి.సుధీర్, బీఐటీసీ మేనేజర్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు .

దసరా ఉత్సవ ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలి



దేవదాయ శాఖాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ సత్యనారాయణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నిర్వహించే దసరా ఉత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ ఎస్. సత్యనారాయణ ఆదేశించారు. దుర్గగుడి ఇంజినీరింగ్, ముఖ్య అధికారులతో కమిషనర్ సత్యనారాయణ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని చేపట్టిన పనులపై ఈవో కె.ఎస్.రామరావు కమిషనర్‌కు వివరించారు. ఉత్సవాల్లో అమ్మవారి అలంకారాలు, ఆర్జిత సేవలు, ప్రసాదాల తయారీ అంచనా, భక్తులకు ఉచిత అన్న ప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలపై చర్చించారు. ఉత్సవాలకు మరో రెండు వారాలు గడువు మాత్రమే ఉందని, ఏర్పాట్లను ఆయా విభాగాల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పనుల పురోగతిని తనకు తెలియజేయాలని ఆదేశించారు. ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చే అవకాశం ఉందని, వారికి అమ్మవారి దర్శనంలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. సమీక్ష సమావేశంలో దేవదాయ శాఖ సీఈ శేఖర్, ఏడీసీ చంద్రకుమార్, చంద్రశేఖర్ ఆజాద్, డీఈవో లీలాకుమార్, ప్రధాన అర్చకులు బద్రీనాథ్‌బాబు, దుర్గాప్రసాద్, వైదిక కమిటీ సభ్యులు శంకర శాండిల్య, మురళీ, ఆలయ ఈఈలు కేవీఎస్ కోటేశ్వరరావు, ఎల్.రమాదేవి, ఏఈవోలు ఎన్.రమేష్‌బాబు, చంద్రశేఖర్, సుధారాణి, బి.వెంకటరెడ్డి, జే శ్రీనివాస్, ఆలయ డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.

నేరాల కట్టడికి ప్రత్యేక ప్రణాళిక



మాట్లాడుతున్న సీపీ రాజశేఖరబాబు

విజయవాడస్పోర్ట్స్: నేరాలను కట్టడి చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక ద్వారా ముందుకు సాగుతున్నామని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. పోలీస్ కమిషనరేట్‌లో మంగళవారం నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో పోలీసు అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. చిన్నారులు, మహిళలపై జరిగే నేరాలు, సైబర్ నేరాలు, గంజాయి, మద్యం అక్రమ రవాణా, చోరీలు, వ్యక్తుల పరస్పర దాడులు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సమావేశం వివరించారు. కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్ విధానంపై దృష్టి సారించాలని, చెడు నడత కలిగిన వారిని నగరం నుంచి బహిష్కరించాలని చెప్పారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి నేరాలకు పాల్పడే నేరస్తులపై పీడీ యాక్ట్‌లు అమలు చేసేందుకు వెనకడుగు వేయొద్దని సూచించారు. రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు సమష్టిగా కృషి చేద్దామని తెలిపారు.

దసరా మహోత్సవాలకు పటిష్ట బందోబస్తు

దసరా మహోత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని సీపీ చెప్పారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. విజుబుల్ పోలీసింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించి బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్ కదలికలపై దృష్టి సారించాలని సూచించారు. ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, కేసులను వెంటనే దర్యాప్తు చేసి చార్జ్‌షీట్ ఫైల్ చేయాలన్నారు. సారా తయారీ, అక్రమ మద్యం, గంజాయి అక్రమ రవాణాలపై పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలిచ్చారు. దిశా వాహనాల సిబ్బంది నిర్మానుష్య ప్రదేశాల్లో గస్తీ ఎక్కువగా తిరగాలని, పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు. సమావేశంలో డీసీపీలు గౌతమీ శాలి, కె.ఎం.మహేశ్వరరాజు, కృష్ణమూర్తి నాయుడు, ఏడీసీపీలు జి.రామకృష్ణ, ఎ.వి.ఎల్.ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

మహిళా రేషన్ డీలర్‌పై రెవెన్యూ అధికారి వేధింపులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: మహిళా రేషన్ డీలర్‌తో బాపులపాడు తహసీల్దార్ కార్యాలయంలోని ఓ కీలక అధికారి అసభ్యంగా ప్రవర్తించటం, వేధింపులకు పాల్పడిన ఘటన కలకలం రేపుతోంది. ఆ మహిళా రేషన్ డీలర్‌తో సదరు అధికారి ఫోన్ సంభాషణ రికార్డింగ్ తాజాగా సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. బాపులపాడు మండలంలో రేషన్ షాపు నిర్వహిస్తున్న ఓ మహిళా డీలర్‌తో అసభ్యకరంగా ప్రవర్తించటంతో పాటు ఆయన కోరిక తీర్చలేదనే అక్కసుతో ఆమె రేషన్ షాపును సైతం సీజ్ చేశారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల చొరవతో ఇటీవలే రేషన్ షాపు తెరిచేందుకు అనుమతి ఇచ్చినప్పటికీ, దానికి కూడా సదరు రెవెన్యూ అధికారి కాలు అడ్డుపెడుతున్నారు. తరుచూ ఫోన్‌లు చేయటం, వేళ కానీ వేళలో ఇంటికి రావటం, అసభ్యకరంగా మాట్లాడటం ఆయనకు పరిపాటిగా మారటంతో విసుగు చెందిన మహిళా రేషన్ డీలర్ ఆ రెవెన్యూ అధికారిపై జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. తనతో పాటుగా తోటి మహిళా రేషన్ డీలర్లుతోనూ ఆయన అనుచితంగా ప్రవర్తించేవారని ఆరోపించారు. గతంలో గన్నవరం పీడీఎస్ డీటీగా పనిచేస్తూ ముసునూరు మండలం గోపవరంలో ఓ రైస్ మిల్లును కూడా భార్య పేరిట కొనుగోలు చేశారు. అధికార పార్టీ నాయకుల ఆశీస్సులతో మళ్లీ బదిలీపై అదే పోస్టులోకి వెళ్లేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ ఉదంతంపై బాపులపాడు తహసీల్దార్ కార్యాలయంలో గుట్టుచప్పుడు కాకుండా పంచాయితీ చేసేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి.

క్లుప్తంగా

ట్రాన్స్‌జెండర్లకు నిత్యావసరాల పంపిణీ



పటమట(విజయవాడతూర్పు): స్టెల్లా కళాశాల పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో జెండర్ ఈక్విటీపై మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సామాజిక వేత్త అమిత ట్రాన్స్‌జెండర్‌ల స్థితిగతులను చర్చిస్తూ వారికి తగినంత ప్రోత్సాహం ఆర్థికంగా, సాంఘికంగా లభించాలని, ప్రభుత్వాలు కూడా వీరిపై దృష్టి సారించాలని కోరారు. సమాజంలో గౌరవంగా బతికే హక్కు కల్పించాలన్నారు. అనంతరం కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో కండ్రికలో వరద బాధిత ట్రాన్స్‌జెండర్‌లకు బియ్యం, నూనె, కందిపప్పు, కారం, ఇతర నిత్యావసర సామగ్రిని అందించారు. కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి సూరయ్య, అధ్యాపకురాలు రజిని, డాక్టర్ లావణ్య, సిస్టర్ ఆశ, సిస్టర్ లావణ్య, సిస్టర్ అమిత, సిస్టర్ సుజాత, స్వప్న ఉన్నం, స్వరూప రాణి, సుప్రియ, శైలజ, పాస్టర్ కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వరదల్లో మునిగిన ఆరోగ్య కేంద్రాల పరిశీలన



లబ్బీపేట(విజయవాడతూర్పు): బుడమేరు వరదలో మునిగిన నగరంలోని పలు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంగళవారం ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని పరిశీలించారు. రాజీవ్‌నగర్, ప్రకాష్ నగర్, శాంతినగర్, కండ్రిక, సింగ్‌నగర్, లంబాడీపేటల్లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వరదలతో సేవలు పూర్తిగా నిలిచిపోవడంతో, మళ్లీ సేవలు ప్రారంభించేలా చేస్తున్న ఏర్పాట్లను ఆమె తిలకించారు. ఆయా యూపీహెచ్‌సీల్లో నీటిలో మునిగి పాడైన సామగ్రి, మందులు, వ్యాధి నిర్ధారణ యంత్రాలను పరిశీలించారు. వరదలతో ఏర్పడిన అపరిశుభ్ర పరిస్థితిని త్వరగా పరిశుభ్రం చేయాలన్నారు. రోగులకు వీలైనంత త్వరగా సేవలు అందించేలా యూపీహెచ్‌సీలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట డీపీఓ మహేష్, ఆయా కేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

ముంపు బాధితులకు భారత్ వికాస్ పరిషత్ వితరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాలైన విద్యాధరపురం, హౌసింగ్‌బోర్డ్ కాలనీ, అజిత్‌సింగ్‌నగర్, కండ్రిక, వాంబేకాలనీ, రాజీవ్‌నగర్‌లోని బాధితులకు భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం నిత్యావసర వస్తువులు, దోమ తెరలు, దుప్పట్లు వితరణగా అందజేశారు. ఆదామా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సౌజన్యంతో సత్యనారాయణపురంలోని విజ్ఞాన్ విహార్, శిశు విద్యామందిర్ పాఠశాలల్లో పైన పేర్కొన్న ప్రాంతాల్లోని సుమారు వెయ్యి మంది బాధితులకు ఆయా వస్తువులతో కూడిన కిట్లను అందజేశారు.

వరద బాధితులకు అండగా వైఎస్సార్ సీపీ

- కృష్ణలంకలో 6 వేల మందికి నిత్యావసరాలు పంపిణీ
- వరద బాధితులను ఆదుకోవడంలో టీడీపీ ప్రభుత్వం విఫలం
- వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్



రాణిగారి తోట, తారకరామనగర్ కరకట్ట వద్ద వరద బాధితులకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న దేవినేని అవినాష్ తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): అధికారంలో ఉన్నా లేకున్నా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పేద ప్రజల పక్షాన పనిచేస్తుందని, వరద బాధితులకు అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. స్థానిక రాణి గారితోట, 17వ డివిజన్‌లోని తారకరామనగర్ కరకట్ట వరద బాధితులకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అవినాష్ పాల్గొని ఇంటింటికీ వెళ్లి వరద బాధితులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ నగరంలోని వరద బాధితులను ఆదుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. వరద బాధితుల సహాయార్థం మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద మనసుతో రూ.కోటి పది లక్షలు ప్రకటించారన్నారు. ఆయన చొరవతో నగరంలో 50 వేల బాధిత కుటుంబాలకు ఇంటింటికీ నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం చేపట్టామని, అందులో భాగంగా కృష్ణలంకలోని 15, 16, 17, 18 డివిజన్లలో వరద ప్రభావానికి గురైన సుమారు 6 వేల కుటుంబాలకు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురి చేసినా జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సహాయ కార్యక్రమాల్లో పాల్గొని బాధితులకు అండగా నిలిచారన్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా నిస్వార్థ సేవ చేస్తున్నామన్నారు. వరద బాధితులను ఆదుకోవడంలో టీడీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. నగరం వరద ముంపునకు గురై 15 రోజులు దాటినప్పటికీ ప్రభుత్వ పని తీరుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే, అతని అనుచరులు ప్రమోషన్ రాజకీయాలు చేస్తూ సోషల్ మీడియా ప్రచారం చేసుకునే పనిలో ఉన్నారని విమర్శించారు. ఈ వరదలకు టీడీపీ, సీఎం చంద్రబాబు వైఫల్యం కారణం కాదా అని ప్రశ్నించారు. 100 రోజుల కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు తప్ప చేసిందేమీ లేదని, ఇకనైనా చంద్రబాబు కక్ష సాధింపు చర్యలు మాని పాలనపై దృష్టి సారించాలని హితవు పలికారు. మంత్రులే అధికారులను తిడుతున్నారంటే టీడీపీ పాలన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఇప్పటికీ వరద నష్ట ప్రభావం ప్రజలపై ఉందన్నారు. కృష్ణలంకకు రిటైనింగ్ వాల్ లేకపోతే సగం విజయవాడ మునిగిపోయేదన్నారు. రిటైనింగ్ వాల్ నిర్మించిన జగన్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటామని ప్రజలు చెబుతుండడం చాలా సంతోషంగా ఉందన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రతి కుటుంబం లక్ష రూపాయలకు పైగా నష్టపోయిందని, ప్రభుత్వం అందజేసే రూ.5వేలు, రూ.10 వేలు ఏమూలకు సరిపోవన్నారు. ఈ సందర్భంగా తమ పిల్లలకు అమ్మఒడి రాలేదని, జగన్ సీఎంగా ఉంటే ఇప్పటికే అమ్మఒడి వచ్చి ఉండేదని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో 17వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలి



ప్రభుత్వ నిర్లక్ష్యం వలన తారకరామనగర్ వరద ముంపునకు గురైంది. ఇళ్లల్లోకి వరద చేరడంతో గృహోపకరణాలు అన్నీ పాడైపోయాయి. అధికారంలో లేకపోయినా దేవినేని అవినాష్ బాధితుల ఇంటికి వచ్చి నిత్యావసరాలు పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉంది. వరదలకు తీవ్రంగా నష్టపోయాం. వెంటనే ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలి. నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న జగన్‌కు ధన్యవాదాలు.

–ఎ.లక్ష్మి, తారకరామనగర్, రాణిగారితోట

నిత్యావసరాలు పంపిణీ చాలా సంతోషం



అధికారంలో లేకపోయినా వరద బాధితులకు సహాయ కార్యక్రమాలు చేస్తున్న వైఎస్సార్ సీపీకి కృతజ్ఞతలు. వరదలకు ఇళ్లు మునిగిపోయి తీవ్రంగా నష్టపోయాం. వరద బాధితులను ఆదుకునేందుకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో దేవినేని అవినాష్ ఇంటింటికీ వచ్చి నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉంది. బాధితులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలి.

–వి.సూరమ్మ, తారకరామనగర్, రాణిగారితోట

స్వభావంలో, సంస్కారంలో స్వచ్ఛత ఉండాలి

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు



స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో మాట్లాడుతున్న గంధం చంద్రుడు

పటమట(విజయవాడతూర్పు): స్వభావంలో, సంస్కారంలో స్వచ్ఛత ఉండాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు అన్నారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అజిత్‌సింగ్‌నగర్‌లోని మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరిగే స్వచ్ఛతా హి సేవ కార్యక్రమ ప్రారంభోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రుడు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం తాను అమెరికాలో చదువుకుంటున్నప్పుడు బోస్టన్‌లో చార్లెస్ రివర్ దగ్గర ఓ మహిళ పెంపుడు కుక్కని తీసుకురాగా అనుకోని పరిస్థితిలో అది మలవిసర్జన చేసిందని, ఆ మహిళ అలాగే వదిలేయకుండా దాన్ని పరిశుభ్రపరిచారని, ఆ తరహాలోనే ప్రతి ఒక్కరూ తామంత తామే పరిశుభ్రత పట్ల దృఢ సంకల్పంతో ఉండాలన్నారు. సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిరోజు మన ఇంటిని మన పరిసరాలని ఎలా పరిశుభ్రంగా ఉంచుకుంటామో అంత కంటే ఎక్కువ పరిశుభ్రంగా మన విజయవాడని ఉంచాలని అన్నారు. మొక్కలు నాటడం ఒక అలవాటుగా చేసుకోవాలని, అవి మనిషికి ప్రాణవాయువు ఇస్తాయని అన్నారు. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ 2014లో స్వచ్ఛభారత్ మిషన్ మొదలుపెట్టాక, ఈ పదేళ్లలో విజయవాడ నగరపాలక సంస్థ 3, 5, 6వ స్థానాలు కైవసం చేసుకుందని, దీనికి నగర ప్రజలందరి సహకారమే కారణమని అన్నారు. అనంతరం స్వచ్ఛ విజయవాడ బ్రాండ్ అంబాసిడర్ డాక్టర్ జి.సమరం మొక్కలు నాటారు. అంతకు ముందు స్వచ్ఛత హి సేవ కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించే ర్యాలీ నిర్వహించారు. అనంతరం 58, 59, 60 వ డివిజన్లలో పరిసరాలన్నీ పరిశుభ్రపరిచారు. కార్యక్రమంలో విజయవాడ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, డిప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు, జోనల్ కమిషనర్లు, ఎస్ఆర్‌కే ఇంజినీరింగ్ విద్యార్థులు, ఆంధ్ర లయోలా కళాశాల విద్యార్థులు, ఎంకే బేగ్ స్కూల్ విద్యార్థులు, డాక్టర్ జేడీఎంఎంసీ హైస్కూల్ విద్యార్థులు, ఎస్పీఎస్ఎంసీ స్కూల్ విద్యార్థులు, వివేకానంద సెంటినరీ హైస్కూల్, పోలీస్ బృందం, సీవీఆర్ లయన్స్ క్లబ్, డీబీఆర్సీ ఎన్జీవో, అమృత హస్తం చారిటబుల్ ట్రస్ట్ తదితరులు పాల్గొన్నారు.

30న మినీ బ్యూటీ ఎక్స్‌పో

- హాజరుకానున్న హెయిర్ డిజైనర్స్, బాలీవుడ్‌కు చెందిన మేకప్ ఆర్టిస్టులు
- పోస్టర్ ఆవిష్కరించిన నిర్వాహకులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విజయవాడ బందరురోడ్డులోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాలులో ఈ నెల 30న మినీ బ్యూటీ ఎక్స్‌పో నిర్వహిస్తున్నామని ఎస్‌బీఎంఎస్ అకాడమీ ప్రతినిధులు మోక్స్, రాఘవరెడ్డి చెప్పారు. బ్యూటీ ఎక్స్‌పోకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం మొగల్రాజపురంలోని ఒక హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఎక్స్‌పోలో బాలీవుడ్‌కు చెందిన సెలబ్రిటీల మేకప్ ఆర్టిస్టులతో పాటుగా ప్రముఖ హెయిర్ డిజైనర్ జావిద్ హబీబ్, డాక్టర్ ఆమోద్ పాల్గొంటారని తెలిపారు. ఈనెల 30వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు ఈ ఎక్స్‌పో జరుగుతుందన్నారు. హెయిర్ కట్, హెయిర్ డిజైనింగ్, మేకప్‌లకు సంబంధించిన ఉత్పత్తుల ప్రదర్శన కూడా ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సూరిబాబు మాట్లాడుతూ బాలీవుడ్ సెలబ్రిటీ హెయిర్ కట్స్ గురించి, ఎస్ఎఫ్ఎక్స్, లోకల్ సెలబ్రిటీస్ మేకప్‌ల గురించి అవగాహన సదస్సులతో పాటుగా ఈ రంగంలోని నిష్ణాతులకు సన్మానం అనంతరం ఫ్యాషన్ షో ఉంటాయని చెప్పారు. మేకప్ ఆర్టిస్టులు జ్యోతి, లిల్లీ, షహనా, ప్రణవి, రజియా, రుక్సానా, ఉదయ, సిరి తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ రైల్వేడివిజన్‌లో స్వచ్ఛతా హీ సేవా ప్రచారం



ప్రయాణికులకు నార సంచులు పంపిణీ చేస్తున్న డీఆర్ఎం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ వ్యాప్తంగా 'స్వచ్ఛత హీ సేవా' పేరుతో పర్యావరణంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా పక్షం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాలు అక్టోబర్ 2న ముగుస్తాయి. అందులో భాగంగా మంగళవారం విజయవాడ స్టేషన్ క్లాక్ టవర్ వద్ద జరిగిన కార్యక్రమంలో డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ పాల్గొని అధికారులు, సిబ్బందితో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ప్లకార్డులను చేతపట్టుకుని క్లాక్ టవర్ నుంచి 1వ నంబర్ ప్లాట్‌ఫామ్‌లోని గాంధీ వెయిటింగ్ హాల్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పార్శిల్ కార్యాలయం వద్ద బ్రాంచ్ అధికారులతో కలసి మొక్కలు నాటి, పరిసరాలను శుభ్రపర్చారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతాల్లోని రైల్వే ట్రాక్‌లు, డ్రైన్‌లు, మరుగుదొడ్లు, ఇతర బహిరంగ ప్రదేశాలను శుభ్రపర్చడంపై శ్రద్ధ పెట్టినట్లు తెలిపారు. అందుకోసం 500 సీటీయూ (క్లీన్‌నెస్ టార్గెట్ యూనిట్స్)లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డివిజన్‌లో పర్యావరణ అనుకూల పద్ధతులను ప్రోత్సహించేందుకు క్లాత్, పేపర్, జనపనార సంచులను ఉపయోగించాల్సిందిగా పిలుపునిచ్చారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌లపై నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రయాణికులకు క్లాత్ బ్యాగులను పంపిణీ శారు. కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో మంగళవారం కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. కూచిపూడి గ్రామానికి చెందిన సత్యకృష్ణ కూచిపూడి కళా నిలయానికి చెందిన పలువురు కళాకారులు అమ్మవారి సన్నిధిలో నృత్య ప్రదర్శన ఇచ్చారు. మంగళవారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై నృత్య ప్రదర్శన ఇవ్వగా, భక్తులు విశేషంగా తరలివచ్చి వీక్షించారు.

22న అక్షర శిల్పి ఆత్రేయ గ్రంథావిష్కరణ

విజయవాడకల్చరల్: ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22 వ తేదీ సాయంత్రం 6 గంటలకు ప్రముఖ సినీ పరిశోధకుడు పైడిపాల రచించిన ''అక్షర శిల్పి ఆత్రేయ'' గ్రంథావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష , కార్యదర్శులు కొల్లూరి, బోడి ఆంజనేయ రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి, విశ్వహిందీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, సీనియర్ జర్నలిస్ట్ రెంటాల జయదేవ, యువజన క్రీడల శాఖా మంత్రి మండపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

శ్రీవారి లడ్డూప్రసాదాల విక్రయాలు

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రీతిపాత్రమైన లడ్డూ ప్రసాదాలను పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణమండపంలో మంగళవారం విక్రయించారు. బుధవారం కూడా విక్రయాలుంటాయని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. టెంపుల్ సూపరింటెండెంట్ మల్లికార్జున మాట్లాడుతూ ఉదయం 8.30 గంటలకు కౌంటర్ ప్రారంభిస్తామని తెలిపారు.

పీఎంఏవై 2.0 మార్గదర్శక సూత్రాలు విడుదల

పటమట(విజయవాడతూర్పు): అందరికీ గూడు కల్పించాలనే సంకల్పంతో ప్రారంభించిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై)లో పేదలందరికీ ఇళ్లను సమకూర్చాల్సిన బాధ్యత ఉందని వీఎంసీ అడిషనల్ కమిషనర్(జనరల్) డాక్టర్ ఎ. మహేష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, నూతన భవనం సమావేశపు హాల్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 ఆపరేషన్ గైడ్‌లైన్స్‌ను భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించారు. పట్టణాల్లో నివసిస్తున్న ప్రజలందరికీ పక్కా ఇళ్లను కల్పించేందుకు దేశ వ్యాప్తంగా కోటి ఇళ్లను నిర్మిస్తున్నట్లు ప్రధాని పేర్కొన్నారని, దీనికి అధికారులు కృషి చేయాలని అడిషనల్ కమిషనర్ కోరారు. సమావేశంలో ఏపీ టిడ్కో ఎస్ఈ భూక్యా చిన్నోడు, కార్పొరేటర్లు బి.వి.కుమార్, వి.లలిత, అపర్ణ, ఉమ్మడి వెంకటేశ్వరరావు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన లబ్ధిదారులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం

జాతీయ రహదారుల వెంట మొక్కలు నాటిన ఎన్‌హెచ్‌ఏఐ విజయవాడ ఇన్‌చార్జ్ ఆర్‌కే సింగ్



ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్‌హెచ్‌ఏఐ, ఎంఈఐఎల్ అధికారులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు జాతీయ రహదారులను సుందరీకరించేందుకు నేషనల్ హైవేల సమీపంలో మొక్కలు పెంచే కార్యక్రమాన్ని చేపట్టామని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) విజయవాడ ప్రాంతీయ అధికారి ఆర్‌కే సింగ్ చెప్పారు. విజయవాడ సమీపంలోని చినఅవుటపల్లి దగ్గర మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) నిర్మిస్తున్న చినఅవుటపల్లి–గొల్లపూడి బైపాస్ రోడ్డులో ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఆర్‌కే సింగ్ హాజరై విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారుల వెంట పర్యావరణాన్ని కాపాడటంతో పాటు వాహనదారులకు స్వచ్ఛమైన గాలిని అందించేందుకు తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. ఎన్‌హెచ్‌ఏఐ విజయవాడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు సంభవించినపుడు నేల కోతకు గురి కాకుండా చెట్లు కాపాడతాయన్నారు. మొక్కల పెంపకంతో పాటు జాతీయ రహదారులను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం మొక్కలను నాటి వాటిని సంరక్షిస్తామంటూ ఎన్‌హెచ్‌ఏఐ, ఎంఈఐఎల్ అధికారులు, సిబ్బందితో పాటుగా పాఠశాల, కళాశాల విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఎన్‌హెచ్‌ఏఐ (మొక్కల పెంపకం విభాగం) ఇన్‌చార్జి కె.సూర్యనారాయణ, డీజీఎంలు నీరజాగుప్తా, కేవీడీ రజని, కృష్ణమూర్తి, మేనేజర్లు వీవీ లక్ష్మి, కె.లత పాల్గొన్నారు.

26 నుంచి దసరా సాంస్కృతికోత్సవాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): దసరా పండుగను పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీ నుంచి మూడు రోజుల పాటు దసరా సాంస్కృతికోత్సవాలు నిర్వహిస్తున్నామని ఎం.బి.విజ్ఞాన కేంద్రం బాధ్యులు స్వరూపరాణి, సేఫ్ అధ్యక్షురాలు జి.జోత్స్న తెలిపారు. రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి. విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో దసరా సాంస్కృతికోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతీ యువకుల్లో సృజనాత్మకత, సమాజం పట్ల అవగాహన పెంచేందుకు దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. దసరా ఉత్సవాలు చెడు నుంచి మంచి వైపు యువతను తీసుకువెళ్లడానికి ఉపయోగపడేందుకు దోహదపడాలని 'చెడును దునుమాడుదాం–మంచిని పెంచుదాం' అనే థీమ్‌తో ఈవెంట్స్‌ను రూపొందించామన్నారు. ఎం.బి.విజ్ఞాన కేంద్రం, సేఫ్, తరుణీ తరంగాలు, స్నేహస్ఫూర్తి ఆర్గనైజేషన్, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, జన శిక్షణ సంస్థాన్, భారత మహిళా మండలి, ఇన్నర్ వీల్–దివాస్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 26, 27, 28 తేదీలలో విజయవాడలో దసరా సాంస్కృతికోత్సవాలు జరుగుతాయన్నారు. 26, 27 తేదీల్లో విజ్ఞాన కేంద్రంలో శాస్త్రీయ, జానపద నృత్యాలు, అభ్యుదయ దేశభక్తి గీతాలాపన, లఘు నాటికలు, స్పాట్ స్కిట్స్, వ్యక్తిత్వ పోటీలు, వీధి నాటకం, వక్తృత్వం, వాద ప్రతివాదాలు, 28న ఉదయం 10 గంటలకు సిద్ధార్థ అకాడమీలో కోలాటాలు, ఫ్లాష్ మాబ్ జరుగుతాయని వివరించారు. పెద్ద సంఖ్యలో పాల్గొని దసరా ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఆసక్తి కలవారు ఈ నెల 20వ తేదీ లోగా దరఖాస్తులు పంపాలని కోరారు. సమావేశంలో పి.విజయ, పి.వాణి, ఎ.సుమబిందు, శాంతి రెడ్డి, పి.శ్వేత, వి.సూర్యకామేశ్వరి, ఉషారాజా, ఎ.పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

నాడు కళకళ - నేడు వెలవెల

- లారీ బాడుగలు లేక దిగాలు
- రెండు నెలల నుంచి బోణీ కూడా లేదు..
- షాపుల్లో పేరుకుపోతున్న పాత టైర్లు..పాత లారీ డిస్పోజ్ వస్తువులు
- వడ్డీలు చెల్లించలేక పోతున్నామని వాపోతున్న వ్యాపారులు
- ఇది జవహర్ ఆటోనగర్‌లో పరిస్థితి



ఆటోనగర్‌లో ఖాళీగా కనబడుతున్న టైర్ల కొట్టు బజారు

ఆటోనగర్(విజయవాడతూర్పు): నిత్యం వ్యాపారంతో రద్దీగా ఉండే ఆటోనగర్‌లో వ్యాపారులు గత రెండు నెలల నుంచి వ్యాపారాలు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా డిస్పోజల్, (పాత లారీసామాన్ల వ్యాపారం), టైర్ల వ్యాపారాలు కనీసం బోణి కూడా కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. దీంతో రూ.లక్షలు విలువ చేసే వస్తువుల నిల్వలు పేరుకు పోయాయి. తెచ్చిన అప్పులకు వడ్డీ పెరిగిపోయి ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో వ్యాపారులు కొట్టుమిట్టాడుతున్నారు. ఆటోనగర్‌లో డిస్పోజల్ షాపులు 250కు పైగా ఉన్నాయి. టైర్ల షాపులు 350 ఉన్నాయి. వీటిలో పనిచేసే కార్మికులు కూడా చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉన్నారు. వ్యాపారాలు లేక వీరి ఉపాధి ప్రశ్నార్థకంగా మారింది. లారీ బాడుగలు తగ్గిపోవడం వల్ల ఈ దుస్థితికి కారణం అయిందని చెబుతున్నారు.

తీసుకున్న అప్పులు ఇవ్వడంలేదు..

గతంలో పాత లారీ సామాన్లు..టైర్లు తీసుకున్న వారు గతంలో అప్పు ఉన్నవారు కనీసం ఫోన్‌లు కూడ లిఫ్ట్ చేయడం లేదు. కొత్తగా సామాన్లు తీసుకోకపోయినా, గతంలో తీసుకున్న అప్పు కూడా ఇవ్వక పోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నామని వ్యాపారులు వాపోతున్నారు. ఉన్న సరుకు అమ్ముడు పోక.. రావాల్సిన డబ్బులు రాక దిక్కు తోచని స్థితిలో ఉన్నామన్నారు. గత రెండు నెలల నుంచి షాపు అద్దె ఖర్చులు కూడా రావడం లేదని, కార్మికులకు జీతాలు కూడ ఇవ్వలేని స్థితిలో ఉన్నామంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


తెలుగు రాష్ట్రాల నుంచి...

రెండు తెలుగు రాష్ట్రాల నుంచి స్పేర్ పార్ట్స్ (లారీ పాతవస్తువులు)ను కొనుగోలు చేసేందుకు తెలుగు రాష్ట్రాల్లోని ఖమ్మం, నల్గొండ, గుంటూరుతో పాటు పలు జిల్లాల నుంచి, ఒడిశా రాష్ట్రం నుంచి లారీ స్పేర్‌పార్ట్స్ వస్తువుల కోసం ఎక్కువగా ఇక్కడికి వచ్చేవారని చెబుతున్నారు. ఇవి కాకుండా పాత టైర్ల కోసం కూడా వేరే ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తుంటారు. ఇక్కడ రీబటన్, సేల్స్, హిట్‌ప్యాచ్‌లు, వల్కనైజింగ్ పాయింట్లు కూడా ఉన్నాయి. వీటిని కొనుగోలు చేసేవారు కూడా రావడం లేదని, పెట్టుబడి పెట్టిన సరకు అమ్ముడు పోవడం లేదని టైరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికంతటికి కారణం బాడుగలు లేకపోవడమేనని చెబుతున్నారు.

జిల్లాలో పలు చోట్ల ...

ఎన్టీఆర్ జిల్లాలోని కంచికచర్ల, నందిగామ, గన్నవరం, హనుమాన్‌జంక్షన్ తో పాటు గుంటూరు జిల్లా మంగళగిరి, గుంటూరులో పాత లారీ వస్తువుల షాపులు, పాత టైర్ల వ్యాపార షాపులు ఉండటం వల్ల ఇక్కడ వ్యాపారం పడిపోయినట్టు వ్యాపారులు చెబుతున్నారు.


వ్యాపారాలు లేవు



గత రెండు నెలల నుంచి పాత లారీ సామాన్ల వ్యాపారాలు లేవు. కనీసం షాపు అద్దె కూడా రావడంలేదు. కార్మికుల జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి. గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి రాలేదు.

–హబీబ్‌ఖాన్, పాత లారీ సామాన్ల వ్యాపారి, ఆటోనగర్

కనీసం బోణీ కావడం లేదు



గత రెండు నెలల నుంచి బోణీ కావడంలేదు. బయట అప్పులు తీసుకొచ్చి పెట్టుబడులు పెట్టాం. షాపులో ఉన్న సరుకు అమ్ముడు పోవడం లేదు. పరిస్థితి ఇలానే కొనసాగితే అప్పులు పాలవుతాం.

–బాబు, టైర్ల వ్యాపారి ఆటోనగర్

సచ్చిదానంద శాస్త్రి మృతి హరికథా రంగానికి తీరని లోటు



పద్మశ్రీ వచ్చిన సందర్భంగా కోట సచ్చిదానంద శాస్త్రికి నగరంలో జరిగిన సత్కార సభ(ఫైల్)

విజయవాడ కల్చరల్: ప్రముఖ హరికథా భాగవతార్, పద్మశ్రీ అవార్డు గ్రహీత కోట సచ్చిదానంద శాస్త్రి మృతి హరికథా రంగానికి తీరని లోటు అని విశ్వమాత చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు నిడుమోలు రమా సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. కేబీఎన్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కప్పగంతు రామకృష్ణ మాట్లాడుతూ పద్మశ్రీ వచ్చిన సందర్భంగా డాక్టర్ దమ్మాలపాటి రామారావు మెమోరియల్ ట్రస్ట్ పక్షాన నగరంలో ఆయనను ఘనంగా సత్కరించిన సంగతిని గుర్తు చేసుకున్నారు.

సాంస్కృతిక సంస్థల సంతాపం

నగరానికి చెందిన వివిధ సాహితీ కళా సంస్థల ప్రతినిధులు, దమ్మాలపాటి చంద్రశేఖర్, చింతకాయల చిట్టిబాబు, శింగంశెట్టి చంద్రశేఖర్, బోడి ఆంజనేయరాజు, అమ్ముల ప్రసాద్, బ్యాంక్ ప్రసాద్, పరుచూరి విజయలక్ష్మి, శింగంశెట్టి చంద్రశేఖర్, కొల్లూరి బీవీఎస్ శర్మ సంతాపం వ్యక్తం చేశారు.

మా కలలు చిదిమేసిన ప్రభుత్వం

కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలు వచ్చి ఉంటే మాకు ఈ దుస్థితి వచ్చేది కాదు

మా కలలను ప్రభుత్వం చిదిమేసింది. మా ఆశలను అడియాశలు చేసింది. గత ఏడాది కటాఫ్ కన్నా ఎక్కువగా మార్కులు వచ్చాయన్న ఆనందాన్ని ఆవిరి చేసింది. రిజర్వేషన్ కోటాలో అయినా సీటు వస్తుందని ఎదురు చూసినా నిరాశనే మిగిల్చింది. మా భవిష్యత్‌ను ప్రశ్నార్థకంగా మార్చింది. కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేయాలని చంద్రబాబు సర్కారు తీసుకున్న నిర్ణయం మాకు పెనుశాపంగా మారింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు వైద్య విద్యకు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా కళాశాలలు, ఎంబీబీఎస్ సీట్లు పెంచుకుంటూ వెళుతుంటే... ఒక్క మన రాష్ట్రంలో మాత్రమే మంజూరు చేసిన కళాశాలలు, ఎంబీబీఎస్ సీట్లను సైతం వద్దని ప్రభుత్వమే అడ్డుకుంటున్న దౌర్భాగ్య పరిస్థితులు నెలకొన్నాయి... అని పలువురు నీట్ ర్యాంకర్లు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం దుర్మార్గంగా తీసుకున్న నిర్ణయాలతో ఈ ఒక్క ఏడాదే ఏకంగా 700 ఎంబీబీఎస్ సీట్లను కోల్పోయి తమ పిల్లల భవిష్యత్ తలకిందులైందని పలువురు తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఎన్నికలకు ముందు కొత్త వైద్య కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు రద్దు చేస్తామని చంద్రబాబు, లోకేశ్ హామీ ఇస్తే నమ్మామని... అధికారంలోకి వచ్చాక ఆ జీవోలు రద్దు చేయకపోగా... ప్రభుత్వ కళాశాలల ప్రైవేటీకరణ... అంటూ అసలు రూపం బయటపెట్టారు. నమ్మించి గొంతు కోశారు... అని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. - సాక్షి, అమరావతి/నెట్‌వర్క్

- ఎంబీబీఎస్ సీట్లు వద్దని ప్రభుత్వమే చెప్పడం దుర్మార్గం
- గత ఏడాది కన్నా ఎక్కువ మార్కులు వచ్చినా సీట్లు రాలేదు
- ఎన్నికల ముందు ఒకమాట.. ఎన్నికల తర్వాత మరోమాట
- నమ్మించి అడ్డంగా మోసం చేసిన చంద్రబాబు, లోకేశ్
- నీట్ ర్యాంకర్లు, వారి తల్లిదండ్రుల ఆగ్రహం

నా కల చెదిరింది



వైద్య విద్యను అభ్యసించి సమాజానికి సేవ చేయాలనుకునే నా కల చెదిరింది. కటాఫ్ పెంచి నా భవితను చిదిమేశారు. ఓసీ వర్గానికి చెందిన నేను 540 మార్కులు సాధించినా సీటు రాలేదు. గత ప్రభుత్వంలో వైద్య విద్యకు ఎనలేని ప్రాధాన్యం లభించింది. ప్రస్తుత ప్రభుత్వంలో ప్రాధాన్యత కొరవడటంతో నాలాంటి ఎందరో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. వెంటనే ప్రభుత్వం వైద్య విద్యకు తగిన ప్రాధాన్యత కల్పించాలి.

– గరికిన సత్య సంతోష్, గొడారిగుంట, కాకినాడ

ఇక మెడిసిన్ కలగానే...



విజయవాడలోని ఓ కోచింగ్ సెంటర్‌లో సంవత్సరం నుంచి నీట్ శిక్షణ తీసుకుంటున్నా. ఇంటర్‌లో గురుకుల పాఠశాలలో చదువుకున్నా. గత ఏడాది మొదటి సారి నీట్ రాస్తే 388 మార్కులు వచ్చాయి. ఈ సారైనా మెడికల్ సీటు సాధించాలనే లక్ష్యంతో కష్టపడి చదివా. 720 మార్కులకు 524 మార్కులు వచ్చాయి. ప్రభుత్వం నూతనంగా ఐదు మెడికల్ కాలేజీలకు అనుమతులు ఇచ్చి ఉంటే 750 సీట్లు అదనంగా వచ్చేవి. దీంతో నాకు సీటు వచ్చే అవకాశం ఉండేది. అలా జరగకపోవడంతో నా లాంటి ఎంతో మంది పేద విద్యార్థుల డాక్టర్ కల కలగానే మిగిలిపోనుంది. బీసీ–బీ కురుబ అయినా నాకు సీటు రాలేదు.

– ముత్తుకూరు సరిత, సంతేకుడ్లూరు గ్రామం, ఆదోని మండలం

తీవ్ర నిరాశకు గురయ్యా



నాన్న డాక్టర్ బి.సురేష్, రేడియాలజిస్టు. అమ్మ డాక్టర్ ఉమాదేవి గైనకాలజిస్టు. ఇద్దరూ డాక్టర్లు కావడంతో నన్ను కూడా డాక్టర్‌ను చేయాలని వారు ఎంతో ఆశగా చదివించారు. వారి ఆశలను వమ్ము చేయకుండా నేను కూడా ఎంతో కష్టపడి చదువుతున్నాను. మాది బీసీ–బీ కేటగిరీ. నీట్‌లో 527 మార్కులు తెచ్చుకున్నా సీటు రాలేదు. కటాఫ్ 556 దగ్గర ఆగిపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యాను. మన రాష్ట్రంలో కొత్తగా ఐదు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను అందుబాటులోకి తీసుకువచ్చి ఉంటే నాకు సీటు వచ్చి ఉండేదని లెక్చరర్లు చెబుతున్నారు. నాకు సీటు రాకపోవడంతో మా అమ్మానాన్న కూడా ఎంతో బాధపడ్డారు.

– బి.ప్రణవ్, కర్నూలు



సీట్లు పెరిగితే ఈ పరిస్థితి ఉండేది కాదు



మాది వ్యవసాయ కుటుంబం. మాది బీసీ–ఏ కేటగిరీ. నన్ను ఎలాగైనా డాక్టర్‌ను చేయాలని మా అమ్మ వరలక్ష్మి, నాన్న వెంకటేశ్వర్లు చాలా కష్టపడి చదివిస్తున్నారు. నేను కూడా కష్టపడి చదివి మా అమ్మానాన్నల కలలను సాకారం చేయాలని ప్రయత్నిస్తున్నాను. నీట్‌లో 528 మార్కులు సాధించినా సీటు రాలేదు. కటాఫ్ 561 వద్దే ఆగిపోయింది. రాష్ట్రంలో మెడికల్ సీట్లు పెరిగి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు. గత సంవత్సరం ఐదు కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రారంభమయ్యాయి. ఈసారి కూడా మరికొన్ని కాలేజీలు వస్తాయని, మరో 500 నుంచి 700 వరకు సీట్లు పెరుగుతాయని భావించాను. కానీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో మాలాంటి విద్యార్థులకు తీవ్ర నిరాశే మిగిలింది. – బి.జాహ్నవి, కర్నూలు

597 మార్కులు వచ్చినా సీటు రాలేదు



ఎంబీబీఎస్‌లో కన్వీనర్ కోటా కింద మొదటి కౌన్సిలింగ్‌లో సీట్లు కేటాయింపు పూర్తయింది. నాకు 597 మార్కులు వచ్చినా సీటు రాలేదు. పులివెందులలో మెడికల్ కళాశాల ఉండి ఉంటే ఈజీగా నాకు సీటు వచ్చి ఉండేది. నాకు సీటు రాకపోవడం చాలా బాధ కలిగిస్తోంది. నీట్ రాసి 597 మార్కులు సాధించినప్పటికీ సీటు రాకపోవడం కలచివేస్తోంది. ప్రభుత్వ తీరు వల్లే నాకు అన్యాయం జరిగింది.

– సాయి విఘ్నేశ్వరరెడ్డి, పులివెందుల, వైఎస్సార్ జిల్లా

భవిష్యత్ ప్రశ్నార్థకమైంది



గత ఏడాది రెండు మార్కుల తేడాతో కన్వీనర్ కోటా ఎంబీబీఎస్ అడ్మిషన్ కోల్పోయాను. మేనేజ్‌మెంట్ కోటాలో చదవాలంటే కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహకరించవు. దీంతో ఏడాదిపాటు లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకున్నాను. కష్టపడి చదివి నీట్ యూజీ–2024లో 610 స్కోర్ చేశా. ఈ ర్యాంక్‌కు గత ఏడాది గుంటూరు మెడికల్ కాలేజీలో ఓసీకి చివరి సీట్ వచ్చింది. గత ఏడాది ప్రభుత్వ కళాశాలల్లో 750 సీట్లు పెరిగాయి. ఈసారి కూడా మరో 750 సీట్లు పెరుగుతాయన్నారు. వాటికితోడు కొత్త వైద్య కళాశాలల్లో సెల్ఫ్‌ఫైనాన్స్ విధానం రద్దు చేస్తామని టీడీపీ చెప్పింది. ఇలా కూడా మరికొన్ని సీట్లు కలిసి వస్తాయని అనుకున్నా. మంచి స్కోర్ చేశాను. సీట్లు కూడా పెరిగితే తొలి దశ కౌన్సెలింగ్‌లోనే సీట్ వచ్చేస్తుందని కుటుంబం అంతా ఆశపెట్టుకున్నాం. కౌన్సెలింగ్ మొదలయ్యే నాటికి కొత్త కళాశాలలు ప్రారంభం కాలేదు. సెల్ఫ్‌ఫైనాన్స్ విధానం రద్దు చేయలేదు. దీంతో సీట్లు పెరగలేదు. ఏయూ రీజియన్‌లో ఓసీ విభాగంలో 615 స్కోర్‌కు ఆఖరి సీట్ దక్కింది. రెండు, మూడు కౌన్సెలింగ్‌లలో సీట్ వస్తుందన్న నమ్మకం లేదు. ఈ ప్రభుత్వం నిర్ణయంతో నా భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది.

– యశ్వంత్‌రెడ్డి, నీట్ ర్యాంకర్, విశాఖపట్నం

కొత్త కాలేజీలో సీటు వస్తుందని ఆశపడ్డా



బీసీ–డీ సామాజికవర్గానికి చెందిన నేను నీట్‌లో 541 మార్కులు తెచ్చుకున్నాను. కొత్త మెడికల్ కళాశాలలు ఏర్పాటు కావడంతో ఎంబీబీఎస్ సీటు వస్తుందని ఆశపడ్డాను. కొత్త కళాశాలలు అందుబాటులోకి వచ్చి ఉంటే మాలాంటి పేద విద్యార్థులకు అవకాశం లభించేది. పులివెందుల మెడికల్ కళాశాలకు 50 సీట్లు మంజూరు కాగా, రద్దు చేయాలని ప్రభుత్వం కోరడం వల్ల మాలాంటి బీసీ విద్యార్థులకు తీవ్ర నష్టం కలుగుతుంది. ఇక డబ్బులు కట్టి పేద విద్యార్థులు వైద్యవిద్యను అభ్యసించడం కష్టమే.

– దేవేశ్, నీట్ విద్యార్థి, రాజంపేట, అన్నమయ్య జిల్లా

లాంగ్ టర్మ్ శిక్షణ తీసుకున్నా..



నేను మూడేళ్లగా నీట్ కోసం లాంగ్‌టర్మ్ శిక్షణ తీసుకుంటున్నా. ఈ ఏడాది నీట్‌లో 500 మార్కులు సాధించాను. ఈ ఏడాది కొత్త కాలేజీలు వస్తాయనే ఆశతో బీసీ–ఈ కోటాలో ఎలాగైనా ఎంబీబీఎస్ సీటు వస్తుందనే ఆశతో ఉన్నా. కానీ కొత్త మెడికల్ కాలేజీలు రాకపోవటం, పులివెందులకు కేటాయించిన సీట్లను ప్రభుత్వం వద్దనడంతో ఈ ఏడాది కూడా సీటు వస్తోందో.. రాదో అని భయంగా ఉంది. మా తల్లిదండ్రులు పేదలు అయినా నన్ను డాక్టర్‌గా చూడాలని లాంగ్‌టర్మ్‌లో చేర్పించారు. ఇప్పుడు సీటు రాకపోతే తీవ్రంగా నష్టపోతాం.

– షేక్ తజ్మీన్, దువ్వూరు, వైఎస్సార్ జిల్లా

సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు ఎత్తేస్తామన్నారని టీడీపీకి ఓటు వేశా



మా నాన్న బాలవెంకటరమణ ప్రభుత్వ ఉద్యోగి. మాది బీసీ-ఏ కేటగిరీ. నాకు నీట్ యూజీలో 531 మార్కులు వచ్చాయి. కటాఫ్ 562 మార్కుల వద్ద ఆగిపోయింది. వాస్తవానికి నీట్‌లో 500లకు పైగా మార్కులు రావడంతో సీటు వస్తుందని ఎంతో ఆశపడ్డాను. సీటు రాకపోవడంతో నేను తీవ్ర నిరాశకు గురయ్యాను. అమ్మా, నాన్న కూడా ఎంతో బాధపడ్డారు. ప్రభుత్వం మెడిసిన్ సీట్లు సాధించకపోవడం, వచ్చిన సీట్లు కూడా వద్దని చెప్పడం మాలాంటి విద్యార్థులకు తీవ్ర నష్టం కలిగించింది. టీడీపీ అధికారంలోకి వస్తే సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు ఎత్తేస్తామన్నారు. అందువల్ల టీడీపీ వస్తే మెడికల్ సీటు వస్తుందని భావించి నేను కూడా ఓటేశాను. కానీ నాకు చివరికి ఇలా జరిగింది.

- బి.సాయిమనోజ్, కర్నూలు

సీట్లు వదులుకోవడం సరికాదు



బీసీ–ఈ కేటగిరీకి చెందిన నేను నీట్‌లో 545 మార్కులు సాధించాను. అయినా సీటు రాలేదు. బీసీ–ఈ కటాఫ్ 553 వద్ద ఆగిపోయింది. గత సంవత్సరం బీసీ–ఈ కేటగిరీ కటాఫ్ 496 మార్కులు. అందువల్ల ఈ ఏడాది నాకు 545 మార్కులు రావడంతో తప్పకుండా సీటు వస్తుందని ఎంతో ఆశపడ్డాను. దీనికి తోడు రాష్ట్రంలో మెడికల్ సీట్లు పెరుగుతాయన్న ఆశ కూడా ఉండేది. కానీ మా ఆశలను ప్రభుత్వం నీరుగార్చింది. సీట్లు పెంచేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఆర్థిక ఇబ్బందుల పేరుతో ప్రభుత్వం మెడికల్ కాలేజీల నిర్మాణాలను కొనసాగించలేదు. ఎన్ఎంసీ ఇచ్చిన సీట్లు కూడా వదులుకుంది. ఫలితంగా మాలాంటి వారికి తీవ్ర అన్యాయం జరిగింది. విలువైన మెడికల్ సీట్లు వదులుకోవడం సరికాదు. ఇప్పటికైనా ప్రభుత్వం మెడికల్‌సీట్లు సాధించాలి.

– హెచ్ఎం ఫర్హా అన్జుమ్, కర్నూలు

570 వచ్చినా సీటు లేదు...



నాకు నీట్ యూజీలో 570 మార్కులు వచ్చాయి. నేను ఓసీ కేటగిరీ. గత ఏడాది మా రీజియన్‌లో ఓసీ కేటగిరీ కటాఫ్ 542 వద్ద ఆగిపోయింది. ఓసీ కేటగిరీలో పోటీ తీవ్రంగా ఉంటుందని తెలుసు. అందుకే మొదటి నుంచి ఎంతో కష్టపడి చదువుతున్నాను. నీట్‌లో 570 మార్కులు సాధించినా ఫలితం లేకపోయింది. కటాఫ్ 601 వద్దే ఆగిపోయింది. గత సంవత్సరం కటాఫ్ 542 వద్ద ఆగిపోవడంతో ఈ సంవత్సరం నాకు వచ్చిన మార్కులకు తప్పకుండా సీటు వస్తుందని ఎంతో ఆశతో ఉన్నాను. రాష్ట్ర ప్రభుత్వం కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణాలను త్వరగా పూర్తిచేసి, ఎన్ఎంసీ ద్వారా సీట్లు సాధించి ఉంటే మాలాంటి వారికి తప్పకుండా సీట్లు వచ్చేవి. ప్రభుత్వ చర్యల వల్ల ఈ ఏడాది మాలాంటి విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగింది.

– వి.సాయిసృజన, కర్నూలు

రిజర్వేషన్ ఉన్నా మా అబ్బాయికి సీటు రాలేదు

గత ఏడాది బీసీ–డీలో 497 స్కోర్ వరకు కన్వీనర్ కోటాలో సీటు వచ్చింది. ఈసారి మా అబ్బాయి 541 స్కోర్ చేశాడు. 83 మార్కుల మేర స్కోర్ పెరిగింది. ఈ క్రమంలో తొలి రౌండ్‌లో కన్వీనర్ కోటా సీటు వస్తుందని ఆశపడ్డాం. కానీ, తొలి రౌండ్‌లో ఎస్వీయూ రీజియన్‌లో బీసీ–డీలో 560 వరకు సీటు వచ్చింది. మా అబ్బాయికి సీటు రాలేదు. గత ఏడాది నంద్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీలో 519 స్కోర్‌కు సీట్ వచ్చింది. ఆ ఏడాది పోటీకి తగ్గట్టుగా ప్రభుత్వ కళాశాలలు పెరిగి సీట్లు పెరగడంతో 519 ర్యాంక్‌కు ప్రభుత్వ కాలేజీలో సీటు వచ్చింది. పులివెందుల కాలేజీకి అనుమతులు వచ్చినా వద్దని లేఖ రాశారు. సీట్లు పెంచకుండా ఈ ప్రభుత్వం అడ్డుపడి మాలాంటి వాళ్లకు ద్రోహం తలపెట్టింది. వేరే దేశానికి వెళ్లి అక్కడ ప్రైవేట్ కంపెనీల్లో పని చేసి వచ్చిన జీతంలో తిని తినక దాచిపెట్టి నా కొడుక్కు లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇప్పించా. మంచి స్కోరు, రిజర్వేషన్ ఉన్నా ప్రభుత్వ కోటాలో సీటు రాలేదు. ఇక మాలాంటి వాళ్లు ఎంబీబీఎస్ వంటి ఉన్నత చదువులు ఎలా చదువుతారు. – పెంచలయ్య, నీట్ ర్యాంకర్ తండ్రి, అన్నమయ్య జిల్లా

ఆంధ్రాలో పుట్టడమే నేరమా?



నా కుమార్తెకు బీసీ–ఏ కేటగిరీలో 565 మార్కులు వచ్చినా మెడికల్ సీటు రాలేదు. పేదవాళ్లం అయినప్పటికీ మా కుమార్తెను డాక్టర్‌గా చూడాలని సుమారు రూ.4లక్షలు ఖర్చు చేసి లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇప్పించాం. ఎంబీబీఎస్ సీటు వస్తుందని ఆశపడ్డాం. చివరకు కన్నీరే మిగిలింది. గత ఏడాది 501 మార్కులకు ఎంబీబీఎస్ సీటు వచ్చింది. కానీ, ఈ ఏడాది 565 మార్కులు వచ్చినా నా బిడ్డకు సీటు రాలేదు. మాలాంటి వాళ్లని ఎంతోమందిని ఈ ప్రభుత్వం మోసం చేసింది. కొత్త కాలేజీలు వస్తే మాలాంటి వారి జీవితాలు బాగుపడతాయని ఎదురు చూశాం. తీరా ఇప్పుడు సీట్లు తగ్గించారు. ఆంధ్రాలో పుట్టడమే నేరమా.. అన్నట్లు ఉంది.

– కె.నవీన్, విద్యార్థిని తండ్రి, టెక్కలి

పేద పిల్లలకు శరాఘాతం



ప్రభుత్వం కొత్తగా మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయకపోవడంతో సీట్లు తగ్గాయి. నా లాంటి విద్యార్థులకు నష్టం కలిగింది. ఎంబీబీఎస్ పూర్తిచేయాలన్న ఆశతో కష్టపడి చదివాను. సీటు వచ్చే అవకాశం లేదు. మళ్లీ లాంగ్ టర్మ్ కోచింగ్‌లో చేరాను. వైద్య విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు ప్రభుత్వ నిర్ణయం శరాఘాతం వంటిది. మెడికల్ కాలేజీలకు ప్రైవేట్‌కు అప్పగించాలనే ప్రభుత్వ నిర్ణయం విద్యార్థులకు శాపం.

– కె.మానస, కిండం అగ్రహారం గ్రామం, బొండపల్లి మండలం

మా భవిత ప్రశ్నార్థకం



నేను బీసీ వర్గానికి చెందిన విద్యార్థిని. కటాఫ్ మార్కులు పెరగడంతో నీట్ సీటు చేజారింది. మాది పేద కుటుంబం. డాక్టర్ కావాలన్నది నా ఆశయం. వైద్య కళాశాలలు పెరగడంతో కచ్చితంగా సీటు వస్తుందని భావించాను. ఎంతో ఉన్నత భవిష్యత్ ఉంటుందని ఊహించాను. అయితే ప్రభుత్వం కొత్త కాలేజీలు తీసుకురాకపోవడంతో మా ఆశలన్నీ అడియాశలయ్యాయి. ప్రభుత్వమే ఇలా చేయడమే సరికాదు.

– ఎండీ ఖాసీం, జె.రామారావుపేట, కాకినాడ

వైద్య విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం



విద్యార్థి సంఘాల నాయకులతో ఎంపీ గురుమూర్తి

విద్యార్థి సంఘాల హెచ్చరిక

తిరుపతి సిటీ: రాష్ట్రంలో కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటును అడ్డుకున్న కూటమి ప్రభుత్వంపై యుద్ధం చేయాల్సిన సమయం ఆసన్నమైందని విద్యార్థి సంఘాల నేతలు పిలుపునిచ్చారు. వైద్య విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని ప్రకటించారు. మంగళవారం తిరుపతిలోని సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన 17 కొత్త మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం బడాబాబుల చేతుల్లో పెట్టేందుకు ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య విద్యను కార్పొరేట్ విద్యగా మార్చి.. పేద విద్యార్థులకు అందకుండా చేస్తోందని మండిపడ్డారు. చంద్రబాబు ప్రభుత్వ తీరుతో వచ్చే రెండేళ్లలో రాష్ట్ర విద్యార్థులు సుమారు 1,750 ఎంబీబీఎస్ సీట్లు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. తక్షణమే పులివెందుల కాలేజీకి 50 సీట్లు దక్కేలా చర్యలు తీసుకోవాలని.. కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణాలను అడ్డుకోవద్దని డిమాండ్ చేశారు. ఈ నెల 19న నిర్వహించబోతున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని విద్యార్థులను కోరారు. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్ఓ, పీడీఎస్‌యూ, ఏఐడీఎస్ఓ, వైఎస్సార్‌సీపీ విద్యార్థి సంఘాలు నేతలు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల కలలపై కూటమి కుట్ర: ఎంపీ

డాక్టర్ కావాలనే కలను నెరవేర్చుకునేందుకు ఎంతో శ్రమిస్తున్న పేద విద్యార్థులపై కూటమి ప్రభుత్వం కుట్ర పన్నిందని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'రాష్ట్రంలో వైద్య విద్యను ప్రైవేటుపరం చేసి సంపన్నులకే ఎంబీబీఎస్ చేసే అవకాశం కల్పించే విధంగా చంద్రబాబు ప్రభుత్వం అడుగులు వేయడం దారుణం. తమిళనాడు, తెలంగాణ, కర్ణాటకతో పోల్చిచూస్తే.. ఏపీలో కేవలం 50 శాతం సీట్లు మాత్రమే ఉన్నాయి. వాటిలో సైతం కోత విధిస్తే విద్యార్థుల పరిస్థితి ఏమిటి? వైఎస్ జగన్ పాలనలో ప్రభుత్వాస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేశారు. కానీ కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తోంది' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బాలికల హాస్టల్‌లో కీచకపర్వం

ఏలూరులోని ఓ సేవాశ్రమంలో కామాంధుడి స్వైరవిహారం

ఏలూరు టౌన్: పేద బాలికల కోసం ఏర్పాటు చేసిన సేవాశ్రమంలో ఓ కామాంధుడు కొంతకాలంగా చెలరేగిపోతున్నాడు. వార్డెన్ భర్తగా ఎంటరైన సుమారు 55 ఏళ్ల వయసున్న ఆ కీచకుడు బాలికలను చెరబట్టడమే పనిగా పెట్టుకున్నాడు. తన కోరికను కాదంటే బాలికలను దారుణంగా కొడతాడు. చాలా కాలంగా అతని దుర్మార్గాలను తట్టుకున్న ఆ బాలికలకు ఓపిక నశించింది. సేవాశ్రమంలోని వారంతా మంగళవారం సాయంత్రం ఏలూరు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమకు న్యాయం చేయాలంటూ పోలీస్ అధికారులను వేడుకున్నారు. ఆ కామాంధుడి లీలలు వెలుగులోకి రావడంతో ఏలూరు నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఆ ఘోరకలికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఏలూరు అమీనాపేటలో శ్రీ స్వామి దయానంద సరస్వతి సేవాశ్రమం ఆధ్వర్యంలో బాలికల వసతి గృహాన్ని నిర్వహిస్తున్నారు. ఈ హాస్టల్‌ను నిర్వాహకులు సేవాభావంతో ఏర్పాటు చేయగా.. గత కొంతకాలంగా హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్న మణిశ్రీ భర్త శశికుమార్ బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడుతూ అత్యంత దారుణంగా వేధిస్తున్నాడు. శశికుమార్ ఏలూరు ఎన్ఆర్‌పేటలో మణి ఫొటో స్టూడియో నడుపుతూ, మరోవైపు ఏలూరు జిల్లా యర్రగుంటపల్లి బీసీ హాస్టల్లో కూడా పనిచేస్తున్నాడు. స్థానికంగా ఉన్న తన పలుకుబడితో కొంతకాలం క్రితం తన రెండో భార్య మణిశ్రీని సేవాశ్రమంలో వార్డెన్‌గా చేర్పాడని సమాచారం.



ఏలూరు అమీనాపేటలోని ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికల వసతిగృహం

బాలికలపై లైంగిక దాడులు

ఆ బాలికల సేవాశ్రమంలో పేద వర్గాలకు చెందిన విద్యార్థినులు వసతి సదుపాయం పొందుతున్నారు. వీరు స్థానికంగా పలు పాఠశాలలు, కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు. కామాంధుడైన శశికుమార్ ఆ బాలికలపై కన్నేసి సేవాశ్రమంలోకి వార్డెన్ భర్తగా ఎంటరయ్యాడు. పదుల సంఖ్యలో బాలికలను లైంగికంగా వేధించినట్టు బాధిత బాలికలు చెబుతున్నారు. ఆదివారం ఒక బాలికను బాపట్లకు ఫొటో షూట్ కోసమని తీసుకువెళ్లిన శశికుమార్.. సోమవారం రాత్రి తిరిగి తీసుకువచ్చాడు. రాత్రివేళ ఆ బాలిక తన దుస్తులను ఉతుక్కుంటూ ఏడుస్తూ ఉండగా సహచర బాలికలు ప్రశ్నించారు. జరిగిన దారుణాన్ని ఆమె చెప్పింది. అదే సమయంలో అక్కడికి వచ్చిన శశికుమార్ జరిగిందంతా ఆ బాలిక సహచరులకు చెప్పిందనే అక్కసుతో అక్కడ ఉన్న బాలికలను అందరినీ మోకాళ్లపై కూర్చోబెట్టి దారుణంగా కొట్టాడు. రాత్రి బాలికల ఏడుపులు వినిపించాయని స్థానికులు కూడా చెప్పారు. శశికుమార్ దారుణాలను ఇక భరిస్తూ ఉండకూడదనే ఉద్దేశంతో బాలికలు మంగళవారం ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. బాధిత బాలికల బంధువులు, తల్లిదండ్రులు కూడా పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకోవటంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

ఫొటో షూట్‌లంటూ..

ఫొటో షూట్‌ల కోసమని శశికుమార్ ఒక్కొక్క బాలికను దూరప్రాంతాలకు తీసుకువెళతాడనీ, అక్కడ కాళ్లుచేతులూ కట్టేసి అఘాయిత్యానికి పాల్పడతాడని, కాదంటే ఇష్టారాజ్యంగా కొడతాడని బాధిత బాలికలు కన్నీటి పర్యంతమవుతూ చెప్పారు. మీకు బాయ్‌ఫ్రెండ్స్ ఉంటే చెప్పండి వాళ్ల దగ్గరకు మిమ్మల్ని పంపుతాను, రూమ్‌లు ఏర్పాటు చేస్తానంటూ బ్లాక్ మెయిల్ చేయడానికి ప్రయత్నిస్తాడని చెప్పుకొచ్చారు. బయటకు తీసుకెళ్లి టీ, కాఫీ ఇప్పించి సగం తాగిన అనంతరం కప్పు తీసుకుని తాగుతూ వక్రంగా మాట్లాడుతూ పైశాచికత్వాన్ని చూపిస్తాడని వివరించారు. ఇక స్థానికంగా ఇతర ప్రభుత్వ హాస్టళ్లకు వచ్చే బాలికలను ఈ సేవాశ్రమానికి పంపాలంటూ శశికుమార్ ఆయా హాస్టళ్ల వార్డెన్లను కోరతాడని, అతని కోరిక మేరకు ఆ హాస్టళ్ల వార్డెన్లు బాలికలను ఇక్కడకు పంపుతారని తెలిసింది.

బాలికలను భయపెట్టి నీరుగార్చే ప్రయత్నం

సేవాశ్రమంలో జరిగిన దారుణాలపై పూర్తిస్థాయిలో పోలీసులు దర్యాప్తు చేస్తారా... అనేది ప్రశ్నార్థకంగా మారింది. పోలీసులకు ఫిర్యాదు చేసే ముందే బాలికలు మీడియాకు జరిగినదంతా వివరించారు. అయినా పోలీసులు మాత్రం బాలికలను భయపెట్టి ఈ దారుణ సంఘటనను నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వార్డెన్ మణిశ్రీకి ఏలూరులోని ఓ ప్రజాప్రతినిధి వత్తాసు పలికినట్లు, అలాగే స్థానిక ఎంపీ కార్యాలయానికి చెందిన వ్యక్తులు సైతం రంగంలోకి దిగి పోలీస్ అధికారులపై ఒత్తిడి చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఫిర్యాదులో కేవలం వేధింపులకు గురిచేసినట్టుగానే బాలికలతో పోలీసులు రాయించినట్లు తెలుస్తోంది.

ఏలూరు డీఎస్పీ దర్యాప్తు

ఏలూరు అమీనాపేటలోని బాలికల వసతి గృహంలో జరిగిన ఘటనపై ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ వెంటనే స్పందించారు. సేవాశ్రమం వద్దకు చేరుకుని ఆరా తీశారు. ఏలూరు మహిళా స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు, ఏలూరు టూటౌన్ సీఐ వైవీ రమణ, బాలల సంరక్షణ అధికారి సూర్యచక్రవేణి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఏలూరు డీఎస్పీ మాట్లాడుతూ.. ముగ్గురు బాలికలు పోలీసులకు ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేశామని తెలిపారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి, నిందితులపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. బాలికలపై లైంగిక దాడి జరిగినట్టు ఫిర్యాదు చేశారని, వీటిపై విచారణ చేస్తామని తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకునేందుకు చర్యలు చేపట్టామన్నారు.



కోల్‌కతాలో హత్యాచార ఘటన జరిగాక
స్కూలుకెళ్లే ఆడపిల్లల తల్లిదండ్రులు...
ఉద్యోగం కోసం, ఇంటి పనుల కోసం బయటకు వెళ్లే ఆడపిల్లల తల్లిదండ్రులు
ఆ పిల్లల క్షేమం గురించి ఆందోళన పెంచుకున్నారు.
గంట గంటకూ ఫోన్ చేసి 'ఎక్కడున్నావ్' అంటున్నారు.
సాయంత్రం ట్యూషన్లు మాన్పిస్తున్నారు.
కాని అంత భయపడాల్సిన అవసరం భయపెట్టాల్సిన అవసరం లేదు.
జాగ్రత్తలు ఏం తీసుకోవాలో చెప్తే చాలు.

మా అమ్మాయి సేఫ్‌గా ఉందా?

ఒక పెద్ద ఘటన జరిగినప్పుడు చుట్టూ ఉన్న వాతావరణం మొత్తం గాయపడుతుంది. గాయం తీవ్రంగా ఉన్నప్పుడు అయోమయం, ఆందోళన, భయం, అభద్రత అన్నీ చుట్టుముడతాయి. ఇవన్నీ పిల్లల గురించి, ఆడపిల్లల గురించి అయినప్పుడు ఆ ఆందోళనకు అంతు ఉండదు. ఇప్పుడు కోల్‌కతాలోని స్కూళ్లు చైల్డ్ సైకాలజిస్టులు, కౌన్సెలర్లతో కిటకిటలాడుతున్నాయి.

అక్కడ ఏం జరిగింది?

పిల్లలకు సహజంగానే కుతూహలం అధికం. కోల్‌కతాలోని ఆర్.జి.కర్ ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్‌పై దారుణకాండ జరిగిన సంగతి దేశాన్ని కుదిపేస్తే కోల్‌కతా హోరెత్తింది. ఇంటా బయట ఆ సంఘటన గురించే చర్చలు. పిల్లల చెవుల్లో ఆ మాటలు పడనే పడతాయి. అదొక్కటే కాదు... వారికి ఆ సంఘటన గురించి దాచి పెట్టాల్సిన అవసరం కూడా లేదు. స్కూళ్లు కొన్ని తన విద్యార్థులతో స్వచ్ఛందంగా నిరసనల్లో పాల్గొని ప్రభుత్వం నుంచి నోటీసులు అందుకున్నాయి కూడా. వీటన్నింటి దరిమిలా పిల్లలు ముఖ్యంగా ఆడపిల్లలు ప్రశ్నలతో ముంచెత్తసాగారు టీచర్లని, తల్లిదండ్రులను. డాక్టర్‌కు ఏం జరిగింది? ఆమె ఎలా చనిపోయింది? చేసిన వారిని పట్టుకున్నారా? అలాంటివి మాక్కూడా జరుగుతాయా?... ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక టీచర్లు అవస్థ పడి కౌన్సెలర్లను స్కూళ్లకు పిలుస్తున్నారు.

రెండు విధాలా...

ఇప్పుడు స్కూలు పిల్లలు, ఇంటర్ స్థాయి పిల్లలకు బయట దారుణమైన మనుషులు ఉంటారనే భయంతో వేగడం ఒక సమస్య అయితే అంత వరకూ కొద్దో గొప్పో స్వేచ్ఛ ఇస్తూ వచ్చిన తల్లిదండ్రులు స్కూల్ నుంచి లేట్‌గా వచ్చినా, ట్యూషన్‌కు వెళ్లినా, ఇంటి పనుల కోసం బయటకు వెళ్లినా పదే పదే ఫోన్లు చేసి వెంటపడటం వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. కొందరు తల్లిదండ్రులు పెప్పర్ స్ప్రేలు కొనిస్తుండటంతో పిల్లలు మరింత బెంబేలు పడుతున్నారు.

పిల్లలకు ధైర్యం చెప్పాలి

ఇప్పుడు జరగాల్సినది... పిల్లలకు ధైర్యం చెప్పడమే కాకుండా రక్షణ గురించి తల్లిదండ్రులు కూడా అవగాహన కల్పించుకోవాలి. నిర్లక్ష్యం అసలు పనికిరాదని కోల్‌కతా ఘటన తెలియచేస్తోంది. ఎవరూ లేని హాల్లో ఒంటరిగా నిద్రపోవడం ఎంత సురక్షితమో ఆ డాక్టర్ అంచనా వేసుకోలేకపోయింది. తల్లిదండ్రులు కూడా నైట్ డ్యూటీ సమయంలో వీడియో కాల్స్ చేసి ఆమె తిరుగాడక తప్పని పరిసరాలను గమనించి ఉంటే తగిన సూచనలు చేసి ఉండేవారు. అందుకే తల్లిదండ్రులు, పిల్లలు ఇద్దరూ తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.

● పిల్లల రాకపోకల సమయాలను నిర్దిష్టంగా తల్లిదండ్రులు తెలుసుకుని ఉండాలి ● స్కూల్‌కు వెళ్లే సమయం వచ్చే సమయం వారు వచ్చి వెళ్లే దారి, రవాణ వ్యవస్థ, ఎవరైనా కొత్త మనుషులు కలుస్తున్నారా... వంటివి ఎప్పటికప్పుడు పరిశీలించుకుంటూ ఉండాలి ● ర్యాపిడో వంటి వాహనాలు ఎక్కి రావాల్సి ఉంటే ఎక్కే ముందు ఆ డ్రైవర్‌తో మాట కలిపించి, అతని నంబర్ తీసుకోవాలి లేదా తల్లిదండ్రులే ఫోన్‌పే చేస్తే అతని నంబర్ వచ్చేసినట్టే. ● కొత్త ప్రాంతాలకు వెళ్లేటప్పుడు అవి ఏ మేరకు సురక్షితమో తెలుసుకుని పంపాలి. ●పిల్లలు బయట ఉన్నప్పుడు తప్పకుండా ఫోన్ ఉండేలా చూసుకోవాలి. అది సైలెంట్ మోడ్‌లో లేకుండా పెట్టమని చెప్పాలి. ● పిల్లలను ఊరికే కాల్ చేసి విసిగించకుండా ప్రతి గంటకూ ఒకసారి మెసేజ్ పెడితే చాలని చెప్పాలి. ● పోలీసులకు కాల్ చేయడానికి భయపడకూడదని తెలియజేయాలి. ● ఇంటి బయట, స్కూల్ దగ్గర, బంధువులుగాని, స్కూలు సిబ్బందిగాని ఎవరైనా అనుమానాస్పదంగా ప్రవర్తిస్తుంటే వెంటనే తమకు చెప్పాలని భయపడకూడదని తెలియజేయాలి. ●చట్టం చాలా శక్తిమంతమైనా, ఆపదలో చిక్కుకున్నప్పుడు దూసుకొచ్చే సాటి మనుషులు ఉంటారని, గట్టిగా సాయం కోరితే అందరూ కాపాడతారని పిల్లలకు చెబుతుండాలి. ● అపరిచిత కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దని ఊరికే భయపెట్టే విషయాలను ఆలోచిస్తూ కూచోవద్దని చెప్పాలి. ●ధ్యాస మళ్లించే మంచి స్నేహాలలో ఉండేలా చూసుకోవాలి.



● కాస్మటిక్స్‌తో అర్లీ ప్యూబర్టీ

చిన్నారికి పెద్ద సమస్య

పిల్లలు బాల్యాన్ని ఆస్వాదించాలి. బాల్యపు ఛాయలు వీడక ముందే పెద్దయితే ఎలా? ఈ అవాంఛిత మార్పుకు కారణాలు అనేకం. అర్లీ ప్యూబర్టీలో సౌందర్య సాధనాల పాత్ర చాలా పెద్దదని చెప్తోంది యూఎస్‌లోని అధ్యయన సంస్థ.

చిన్నప్పుడే పెద్దవుతున్నారు!

బాలికల్లో అర్లీ ప్యూబర్టీకి దారి తీస్తున్న కారణాల మీద యూఎస్‌లో ఒక అధ్యయనం జరిగింది. 1990ల కాలంతో పోలిస్తే ఇటీవల బాలికలు చాలా త్వరగా యుక్తవయసులోకి వస్తున్నారు. పునరుత్పత్తి వ్యవస్థ పరిణతి చెంది రుతుక్రమం మొదలవుతోంది. యూఎస్‌లో ప్రతి పదిమంది బాలికల్లో ఎనిమిది మంది చాలా చిన్న వయసు నుంచే మేకప్ వేసుకుంటున్నట్లు వెల్లడైంది. అర్లీ ప్యూబర్టీకి అల్ట్రా ప్రాసెస్డ్ ఆహారం కూడా ఒక కారణమే అయినప్పటికీ బాలురతో పోలిస్తే బాలికల్లో ఈ లక్షణాలు ఎక్కువగా కనిపించడానికి కారణం సౌందర్య సాధనాలుగా గుర్తించారు. రోజువారీ డిటర్జెంట్‌లు, పెర్‌ఫ్యూమ్‌లతోపాటు మేకప్ సాధనాల పాత్ర చాలా ఎక్కువగా ఉంటోందని అంచనా. యూఎస్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ ఇదే అంశం మీద నిర్వహించిన జీబ్రాఫిష్ పరిశోధన కూడా ఈ రసాయనాల ప్రభావాన్ని నిర్ధారించింది. అర్లీ ప్యూబర్టీ కారణంగా పదేళ్లలోపే రుతుక్రమం మొదలవడం ఒక సమస్య అయితే దీర్ఘకాలంలో స్థూలకాయం, గుండె సమస్యలు, బ్రెస్ట్ క్యాన్సర్‌తోపాటు అనేక ఇతర ఆరోగ్య సమస్యలకు దారి తీసే ప్రమాదం ఉందని ఎండోక్రైనాలజీ జర్నల్ ప్రచురించింది.

క్యాన్సర్ కూడా ముందుకొచ్చింది!

అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్ కారణంగా పెరుగుతున్న క్యాన్సర్‌ల విషయానికి వస్తే... గతంలో క్యాన్సర్ బారిన పడడానికి సగటు వయసు 70 ఏళ్లుగా ఉండేది. ఇప్పుడు 35 ఏళ్ల లోపే క్యాన్సర్ బారిన పడుతున్నారు. క్యాన్సర్ పరిశోధనల్లోనూ సౌందర్యసాధనాల పాత్రను ప్రధానంగా గుర్తిస్తున్నారు నిపుణులు. అల్ట్రా ప్రాసెస్డ్ కాస్మటిక్స్ స్కిన్ క్యాన్సర్‌కు కారణమవుతున్నాయి. ముఖం, జుట్టు, చర్మం అందంగా కనిపించడానికి వాడే సౌందర్యసాధనాల్లో ఉపయోగించే రసాయనాల కారణంగా ఎగ్జిమా, వెయిట్ గెయిన్ సమస్యలు కూడా వస్తున్నాయని అర్థమైంది. కొన్ని సందర్భాలో అర్లీ ప్యూబర్టీకి దారి తీసే పరిస్థితులు గర్భస్థ శిశువుగా ఉన్నప్పుడే మొదలవుతాయి. గర్భిణిగా ఉన్నప్పుడు తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనయితే ఆ ప్రభావం పుట్టే బిడ్డ మీద ఉంటుందని కొన్ని అధ్యయనాలు తెలియచేశాయి. నెయిల్ పాలిష్‌లలో ఉండే ఫార్మాల్డిహైడ్ వంటి కొన్ని విషపూరిత రసాయనాలు క్యాన్సర్‌కు కారణమవుతున్నాయి. డిబ్యూటిల్‌ఫ్తాలేట్ పునరుత్పత్తి వ్యవస్థ మీద దుష్ప్రభావాన్ని చూపిస్తుంది. మూత తీయగానే ఘాటు వాసన వచ్చే నెయిల్ పాలిష్‌లు, గ్లిట్టర్ పాలిష్‌లు మరింత హానికరమని అనేక అధ్యయనాల్లో వెల్లడైంది.

మేకప్ అవసరం లేదు!

అర్లీ ప్యూబర్టీ ఆందోళన కలిగించే విషయమే. రసాయనాల ప్రభావానికి సంబంధించిన పరిశోధనలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. నిజానికి దేహ ఆరోగ్యాన్ని కచ్చితంగా కాపాడుకుంటే సన్‌స్క్రీన్, మాయిశ్చరైజర్ తప్ప ఇతర సౌందర్యసాధనాల అవసరమే ఉండదు. బాల్యంలోనే వీటి మాయలో పడుతున్నారంటే ప్రకటనల ప్రభావంతోపాటు అవి అందుబాటులో ఉండడం కూడా కారణమే. కొన్ని ప్రత్యేకమైన, అరుదైన సందర్భాల్లో మేకప్ తప్పనిసరి కావచ్చు. అలా ఉపయోగించేటప్పుడు కూడా ఆ బాలికలను డాక్టర్‌కు చూపించి వారి అభిప్రాయాన్ని తీసుకోవాలి. బాలిక చర్మతత్వాన్ని బట్టి సైడ్ ఎఫెక్ట్స్ లేని మేకప్ తదితర సౌందర్యసాధనాలను సూచించగలుగుతారు.



– డాక్టర్ స్వప్నప్రియ, దర్మటాలజిస్ట్

మన దేశంలో బాలికల్లో కాస్మటిక్స్ వాడకం అమెరికాతో పోలిస్తే అంత తీవ్రంగా లేకపోయినప్పటికీ స్థూలకాయం, దేహ కదలికలు తగినంతగా లేని జీవనశైలి, చదువు ఒత్తిడి బాలికల్లో అర్లీ ప్యూబర్టీకి కారణమవుతున్నాయి. కాబట్టి తోటి పిల్లలతో కలిగి దేహానికి శ్రమ కలిగించే ఆటలను ప్రోత్సహించాలని, పిల్లలను పిక్‌నిక్‌లకు తీసుకువెళ్లడం ద్వారా వాళ్ల దృష్టిని అనేక ఇతర సామాజికాంశాల మీదకు మళ్లించాలని నిపుణులు సూచిస్తున్నారు. నాట్య ప్రదర్శనలు, ఇతర స్టేజ్ షోలలో పాల్గొనే పిల్లలకు మేకప్ తప్పని సరి అవుతుంది. అలాంటప్పుడు నిపుణుల సూచన మేరకు హానికరం కాని సౌందర్య సాధనాలను మాత్రమే ఉపయోగించాలి. మన దైనందిన జీవితంలో డిటర్జెంట్‌ల వాడకం తప్పదు, పైగా వాటి ప్రమాణాలను సంస్థాగతంగా తప్ప వ్యక్తులుగా నిర్దేశించలేం. మరో ముఖ్యమైన విషయం... రోజుకు మూడు నుంచి నాలుగు లీటర్ల నీటిని తాగే అలవాటుంటే ఇక ముఖం మీద ఏ సౌందర్యసాధనమూ అవసరం లేదని కూడా అధ్యయనాలు సూచిస్తున్నాయి.

● రాలిపోయిన బ్లాక్‌స్టార్

నృత్యం కాదు 'యుద్ధమే' చేసింది

'మేము షాక్‌లో ఉన్నాం' అంటూ మైఖేలా డిప్రిన్స్ ఆకస్మిక మరణంపై స్పందించారు ఆమె కుటుంబ సభ్యులు.

అయితే 29 ఏళ్ల 'బ్యాలే ఐకాన్' మైఖేలా డిప్రిన్స్ మరణం ఆమె కుటుంబ సభ్యులను మాత్రమే కాదు ప్రపంచవ్యాప్తంగా ఎంతోమందిని దిగ్భ్రాంతికి గురి చేసింది. చిన్న వయసులోనే బ్యాలే ప్రపంచంలో పెద్ద పేరు తెచ్చుకున్న మైఖేలా డిప్రిన్స్ తన కీర్తి దగ్గరే ఆగిపోలేదు. ఆఫ్రికాలోని తన మూలాల్లోకి వెళ్లింది. యుద్ధ బాధిత పిల్లల కన్నీళ్లు తుడిచింది. వారికి ధైర్యాన్ని బహుమానంగా ఇచ్చి వెళ్లింది.





మైఖేలా డిప్రిన్స్

దేశంలో ఎటు చూసినా అల్లర్లు. అంతులేని హింస. ఆ అంతర్యుద్ధకాలంలో మూడేళ్ల మాబింటి తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మారింది. బంధువులు ముఖం చాటేశారు. అనాథాశ్రమంలోనూ ఆ అమ్మాయి ఎన్నో కష్టాలు పడింది. చర్మ సమస్యలతో బాధ పడుతున్న మాబింటిని తోటి వాళ్లు 'దెయ్యం పిల్ల' అని వెక్కిరించేవాళ్లు. ఒక అమెరికన్ కుటుంబం మాబింటి బంగురాను దత్తత తీసుకోవడంతో ఆమె పేరు మైఖేలా డిప్రిన్స్‌గా మారింది. కష్టాలకు 'శుభం' కార్డు పడినట్లు అనిపించినా అది తాత్కాలికమే. ఎప్పటికప్పుడు కొత్త కొత్త సమస్యలు ఎదురొచ్చేవి.

ఐదవ ఏట బ్యాలేలో శిక్షణ తీసుకోవడం మొదలు పెట్టింది డిప్రిన్స్.

రాక్ స్కూల్ ఫర్ డ్యాన్స్ ఎడ్యుకేషన్ స్టూడెంట్ అయిన డిప్రిన్స్ ప్రతిష్ఠాత్మకమైన అమెరికన్ బ్యాలే థియేటర్‌లో చదవడానికి ఎంపికైంది. కెరీర్ ప్రారంభంలోనే 'బోస్టన్ బ్యాలే' లాంటి ప్రసిద్ధ కంపెనీలతో కలిసి పని చేసింది.

కొద్దికాలంలోనే 'బ్యాలే' లో ప్రపంచ స్థాయి గుర్తింపు పొందింది. హైస్కూల్ చదువు పూర్తయిన తరువాత ప్రసిద్ధ హార్లెం డాన్స్ థియేటర్‌లో అది పిన్న వయస్కురాలు అయిన మెయిన్ డ్యాన్సర్‌గా డిప్రిన్స్ చరిత్ర సృష్టించింది. వృత్తి విజయాల మాట ఎలా ఉన్నా మరోవైపు... జాత్యహంకార కామెంట్స్ డిప్రిన్స్‌కు తరచుగా ఎదురయ్యేవి. అయితే తనని ఎవరైనా కించపరిచేలా కామెంట్ చేస్తే గట్టిగా సమాధానం చెప్పేది. తన జాతి జనుల గురించి, వారి సంస్కృతి గురించి గొప్పగా మాట్లాడేది.

'బ్యాలే'కు ఎంత ప్రాధాన్యత ఇచ్చేదో మానవత్వానికి అద్దం పట్టే కార్యక్రమాలకూ అంతే ప్రాధాన్యత ఇచ్చేది. తాను పుట్టి పెరిగిన ఆఫ్రికాలోని సియోరలియోన్ దేశంలో పేద పిల్లల కోసం డ్యాన్స్ స్కూల్ స్థాపించింది.

'మార్పు తెచ్చే శక్తి కళకు ఉంది. నా విషయానికి వస్తే నృత్యం అనేది ఇతరులతో నా భావోద్వేగాలను పంచుకోవడానికి ఉపకరణంలా పనికి వచ్చింది' అనేది డిప్రిన్స్.

'వార్ చైల్డ్ నెదర్‌ల్యాండ్స్' అంబాసిడర్‌గా పనిచేసిన డిప్రిన్స్ 'డేర్ టు డ్రీమ్' సంస్థ ద్వారా యుద్ధబాధిత పిల్లల మానసిక ఆరోగ్యం కోసం కృషి చేసింది. సేవారంగంలో డిప్రిన్స్ కృషిపై 'ఫస్ట్ పొజిషన్' అనే డాక్యుమెంటరీ వచ్చింది. డిప్రిన్స్ ఎదుర్కొన్న కష్టాలకు ఆమె రాసిన 'టేకింగ్ ఫ్లైట్: ఫ్రమ్ వార్ ఆర్ఫన్ టు స్టార్ బ్యాలెరీన' పుస్తకం అద్దం పడుతుంది.

కూతురిని వెదుక్కుంటూ వెళ్లింది

తన కుమార్తె మైఖేలా డిప్రిన్స్ మరణించిన 24 గంటల్లోనే ఆమె తల్లి ఎలైన్ డిప్రిన్స్ కన్నుమూసింది. ఆస్పత్రిలో సర్జరీకి సన్నద్ధమవుతున్న సమయంలో ఎలైన్‌కు కుమార్తె మరణం గురించి తెలియదు. డిప్రిన్స్‌ను దత్తపుత్రిక అని ఆమె ఎప్పుడూ అనుకోలేదు. సొంతబిడ్డలాగే చూసుకుంది. బ్యాలేపై డిప్రిన్స్ ఆసక్తిని గమనించి శిక్షణ ఇప్పించింది. ఎలైన్, చార్లెస్ దంపతులకు 11 మంది పిల్లలు. వీరిలో తొమ్మిదిమంది దత్తత తీసుకున్న పిల్లలే.



మైఖేలా డిప్రిన్స్ తల్లి ఎలైన్

తాము పని చేస్తున్న రంగంలో పెద్ద పేరు రాగానే చాలామంది కళ్లు ఆకాశానికేసి మాత్రమే చూస్తాయి. కాని మైఖేలా డిప్రిన్స్ విషయంలో అలా జరగలేదు. ఆమె నేల కేసి చూడడమే కాదు, తాను నడిచి వచ్చిన దారిని బాగా గుర్తు పెట్టుకుంది.

అందుకే 'బ్యాలే ఐకాన్'గా కంటే 'మానవతావాది' 'ఆత్మాభిమానం మూర్తీభవించిన సాహసి'గా మైఖేలా డిప్రిన్స్‌ను గుర్తు తెచ్చుకోవడానికి అభిమానులు ఇష్టపడతారు.

లీగల్

మీకు తప్పనిసరిగా గ్రాట్యుటీ చట్టం వర్తిస్తుంది

నేను ఒక చిన్న కంపెనీలో ఆరేళ్లుగా సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగం చేస్తున్నాను. ఒక నెల నోటీసు ఇచ్చి నిన్ను ఫైర్ చేస్తున్నాం, వెళ్లిపొమ్మన్నారు. నేను గ్రాట్యుటీ పొందడానికి అర్హుడినా?

– శ్రీకాంత్, విశాఖపట్నం

పీ.ఎఫ్., గ్రాట్యుటీ, ఈ.ఎస్.ఐ. వంటివి సాంఘిక సంక్షేమ పథకాలు. వాటిద్వారా లభించే ఆర్థిక ప్రయోజనాలను ఎవరూ కాదనలేరు. అలా చేస్తే చట్టం అంగీకరించదు. గ్రాట్యుటీ చెల్లింపుల చట్టం 1972 ప్రకారం, ఐదు సంవత్సరాలు ఒకే సంస్థలో పనిచేసిన ప్రతి ఒక్క ఉద్యోగికీ గ్రాట్యుటీ లభిస్తుంది. కొన్ని హై కోర్టులు ఇచ్చిన తీర్పులలో 4 సంవత్సరాల 7 నెలలు పూర్తి అయినా ఐదేళ్లుగా పరిగణించి గ్రాట్యుటీ ఇవ్వాలి అని పేర్కొనటం జరిగింది. ఒక సంవత్సరం వ్యవధిలో కనీసం 10 మంది పనిచేసిన సంస్థ లేదా షాపులకి కూడా గ్రాట్యుటీ చట్టం వర్తిస్తుంది. యాజమాన్యం మిమ్మల్ని ఉద్యోగంలో నుంచి తీసేసి, గ్రాట్యుటీ ఇవ్వను పొమ్మంటే, మీరు లేబర్ కమిషనర్ దగ్గర దరఖాస్తు చేసుకోవచ్చు. సదరు అధికారి మీ దరఖాస్తును పరిశీలించి, యాజమాన్య పక్షం వాదనలు కూడా విని తీర్పుని ఇస్తారు. సాధారణంగా పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లోని పోస్ట్ మాన్‌లకు వారి పదవీ విరమణ సమయంలో కొద్దిమొత్తం డబ్బులు ఇస్తారు. ఒక పోస్ట్ మాన్ వేసిన కేసులో వీరికి కూడా గ్రాట్యుటీ వర్తించాలి అని పూణేలోని లేబర్ కమిషనర్ ఆదేశించారు. గ్రాట్యుటీకి సంబంధించి ఒక కాలిక్యులేషన్ ఉంటుంది. అది 15 x బేసిక్ + డీఏ x పనిచేసిన సంవత్సరాలు / 26. ఉదాహరణకి మీ బేసిక్ + డీ.ఏ నెలకి 50 వేలు, 10 సంవత్సరాలు పనిచేశారు అనుకోండి, అప్పుడు 15 x 50,000 x 10/26 = 2,88,461/- గ్రాట్యుటీ వస్తుంది.

అలాగే, కనీసం 20 మంది పనిచేస్తున్న సంస్థ లేదా షాపులకి కూడా ప్రావిడెంట్ ఫండ్ (పీ.ఎఫ్.) చట్టం వర్తిస్తుంది. ఒకవేళ మీ యాజమాన్యం పీ.ఎఫ్. మీ అకౌంట్లలోకి జమ చేయని పక్షంలో, పీ.ఎఫ్. కమిషనర్ ముందు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అలా చేస్తే, పూర్వబకాయిలు సైతం కట్టించి మీకు ఇప్పిస్తారు. పీ.ఎఫ్. అలాగే గ్రాట్యుటీ వంటి ప్రయోజనాలకి సగటు ఉద్యోగి లేబర్ పరిధిలోకి రానవసరం లేదు. అలాగే, కొన్ని సందర్భాలలో సాఫ్ట్ వేర్ కంపెనీ ఉద్యోగస్తులకు సైతం లేబర్ చట్టాలు వర్తిస్తాయి.

ఒక పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న కొంతమంది ఉద్యోగులను తొలగించినప్పుడు, హైదరాబాద్ లోని లేబర్ కోర్టు సదరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా లేబర్ చట్టం పరిధిలోకి వస్తారు అని తీర్పు ఇస్తూ, తొలగించిన ఉద్యోగులను తిరిగి విధులలోకి తీసుకోవాలి లేదా వారు కోల్పోయిన సమయానికి సరైన పరిహారం ఇవ్వాల్సిందే అని తీర్పునిచ్చింది. అయితే అందరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు లేబర్ చట్టం కిందకి రాకపోవచ్చు. ఒకసారి లాయర్ సలహా పొందండి.



- శ్రీకాంత్ చింతల
హైకోర్టు న్యాయవాది

● ఇన్‌స్పిరేషన్

డాటర్ ఆట చూసి అమ్మ అంపైరయింది

తల్లి నుంచి స్ఫూర్తి పొందే పిల్లలే కాదు పిల్లల నుంచి స్ఫూర్తి పొందే తల్లులు కూడా ఉంటారని చెప్పడానికి బలమైన ఉదాహరణ... సలీమా ఇంతియాజ్.

కూతురి క్రీడానైపుణ్యాన్ని చూసి... 'ఆడితే ఇలా ఆడాలి' అనుకునేది.

ఆటలో కూతురి కష్టాన్ని చూసి 'కష్టపడితే ఇలా పడాలి' అనుకునేది.

క్రికెట్‌లో కూతురు పాకిస్తాన్ తరపున ప్రాతినిధ్యం వహించినప్పుడు...

అంతర్జాతీయ స్థాయిలో తాను కూడా ప్రాతినిధ్యం వహించాలని కలలు కన్నది.

నమ్మకమైన, గౌరవప్రదమైన అంపైర్‌గా పేరు తెచ్చుకున్న సలీమా ఇంతియాజ్ 'ఐసీసీ ఇంటర్నేషనల్ ప్యానెల్ ఆఫ్ డెవలప్‌మెంట్ అంపైర్స్'కు నామినేట్ అయిన తొలి పాకిస్తానీ మహిళగా చరిత్ర సృష్టించింది.



సలీమా ఇంతియాజ్



కైనత్

సలీమా కెరీర్‌కు సంబంధించి 2022 కీలక సంవత్సరం. బంగ్లాదేశ్‌లో జరిగిన మహిళల ఆసియా కప్ కోసం మహిళా అంపైర్ల ప్యానెల్‌ను ఏర్పాటు చేయాలని ఆసియా క్రికెట్ కౌన్సిల్(ఏసీసీ) నిర్ణయించింది. బంగ్లాదేశ్‌లోని సిల్హెట్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో భారత్, శ్రీలంక జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో సలీమా అరంగేట్రం చేసింది. ఈ మ్యాచ్‌తో తొలిసారి అంతర్జాతీయ మ్యాచ్‌కు అంపైర్‌గా వ్యవహరించింది.

2008లో పాకిస్తాన్ క్రికెట్ బోర్డ్(పీసీబీ) మహిళా అంపైర్ల ప్యానెల్లో చేరిన సలీమా, కుమార్తె కైనత్ ఇంతియాజ్ తనకు స్ఫూర్తి అంటుంది. పాకిస్థాన్ తరఫున అంతర్జాతీయ క్రికెట్ ఆడిన కైనత్ కామెంటేటర్‌గా కూడా పని చేసింది.

'చిన్నప్పుడు క్రికెట్ బాగా ఆడేదాన్ని. క్రికెట్‌లో పాకిస్థాన్‌కు ప్రాతినిధ్యం వహించాలనేది నా కల. నా కూతురు కైనత్ వల్ల నా కల నెరవేరింది. ఆమె నా కూతురు మాత్రమే కాదు. నా స్నేహితురాలు. ఆమె నుంచి ఎంతో నేర్చుకున్నాను. ఎంతో స్ఫూర్తి పొందాను' అని కైనత్ గురించి మురిపెంగా చెబుతుంది సలీమా. 2010లో క్రికెట్‌లో అరంగేట్రం చేసింది కైనత్.

'అమ్మను చూస్తే గర్వంగా అనిపిస్తుంది. క్రికెట్ గ్రౌండ్‌లో కనిపించాలనేది అమ్మ కల. అంపైరింగ్ ద్వారా తన కలను నెరవేర్చుకుంది. క్రికెట్ పట్ల ఆమె అభిరుచి, అంకితభావం అంటే నాకు ఇష్టం. ఈ విషయంలో నేను అమ్మలా ఉండాలనుకుంటున్నాను' అంటుంది కైనత్.

సలీమా, ఆమె భర్త స్పోర్ట్స్ ఇన్‌స్ట్రక్టర్‌లు కావడంతో ఇంట్లో ఎప్పుడూ క్రికెట్ గురించి చర్చలు జరిగేవి.

స్థానిక క్రికెట్ టోర్నమెంట్‌లలో తల్లి అంపైర్‌గా వ్యవహరించిన మ్యాచ్‌లలో కైనత్ ఆడింది.

'అంపైర్ అంటే ఇలా ఉండాలి' అని ప్రేక్షకుల నుంచి వచ్చిన ప్రశంసలను ఎన్నోసార్లు విన్నది.

తాజా రికార్డ్ నేపథ్యంలో... 'ఇది నా విజయం మాత్రమే కాదు. పాకిస్థాన్‌లోని ప్రతి ఔత్సాహిక మహిళా క్రికెటర్, అంపైర్‌ల విజయం. నా విజయం క్రికెట్‌లో తమదైన ముద్ర వేయాలని కలలు కనే అసంఖ్యాక మహిళలకు స్ఫూర్తి ఇస్తుందని ఆశిస్తున్నాను. నా ప్రయాణంలో కష్టాలు ఉన్నాయి. వ్యక్తిగత త్యాగాలు ఉన్నాయి. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే అవి ఎంతో విలువైనవి అనిపిస్తాయి' అంటుంది సలీమ.

'తన రికార్డ్‌తో ఎన్నో అడ్డంకులను ఛేదించడమే కాకుండా తర్వాతి తరం మహిళా క్రికెట్ ప్రొఫెషనల్స్‌కు ఆమె స్ఫూర్తిదాయకమైన ఉదాహరణగా నిలుస్తుంది' అని సలీమా ఇంతియాజ్‌ను ప్రశంసించింది పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్.

చెస్ ఒలింపియాడ్: నేడు చైనా, జార్జియాలతో భారత్ పోరు



చెస్ ఒలింపియాడ్‌లో వరుస విజయాలతో దూసుకెళ్తున్న భారత జట్లు విరామం తర్వాత తదుపరి పోటీలను తాజాగా ప్రారంభించేందుకు సిద్ధమయ్యాయి. మంగళవారం విశ్రాంతి దినం తర్వాత బుధవారం పురుషుల జట్టు చైనాను ఢీకొంటుండగా, మహిళల జట్టు జార్జియాతో తలపడుతుంది. భారత జట్లు ఈ టోర్నీలో వరుసగా ఆరు రౌండ్లలోనూ విజయాలు సాధించాయి. పురుషుల జట్టులో భారత నంబర్‌వన్ ర్యాంకర్ ఇరిగేశి అర్జున్, దొమ్మరాజు గుకేశ్ కీలక పాత్ర పోషిస్తూ జట్టును ముందుండి నడిపిస్తున్నారు. చైనా గట్టి ప్రత్యర్థి కావడంతో ఈ మ్యాచ్ ఫలితం భారత్ పతక వేటను శాసించనుంది. తర్వాత అమెరికా, ఉజ్బెకిస్తాన్‌లతో భారత పురుషుల జట్టు తలపడుతుంది. మహిళల ఈవెంట్‌లో జార్జియా కూడా కఠినమైన ప్రత్యర్థే కావడంతో ఏడో రౌండ్లో భారత గ్రాండ్‌మాస్టర్లకు కష్టమైన సవాళ్లు ఎదురవనున్నాయి. ఆరు రౌండ్లు ముగిసేసరికి భారత జట్లు 12 పాయింట్లతో పురుషుల, మహిళల కేటగిరీలో అగ్రస్థానంలో కొనసాగుతున్నాయి.



‘ప్రతీ టెస్టు మ్యాచ్ కీలకమే’

- కొత్త కోచింగ్ బృందంతో సమన్వయం బాగుంది
- భారత కెప్టెన్ రోహిత్ శర్మ
- రేపటి నుంచి బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు





రోహిత్

చెన్నై: బంగ్లాదేశ్, న్యూజిలాండ్, ఆ్రస్టేలియా... భారత క్రికెట్ జట్టు వచ్చే 15 వారాల వ్యవధిలో ఈ మూడు జట్లతో కలిపి 10 టెస్టు మ్యాచ్‌లు ఆడనుంది. వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పరంగా ఇప్పటికే అగ్ర స్థానంలో ఉండి ఫైనల్‌కు చేరువగా ఉన్న టీమిండియా తుది పోరుకు తమ స్థానాన్ని ఖాయం చేసుకునే అవకాశం ఉంది. అయితే ఈ సుదీర్ఘ సీజన్ నేపథ్యంలో అన్ని మ్యాచ్‌లు ఆడించకుండా కొందరు కీలక ఆటగాళ్లు, ముఖ్యంగా బౌలర్లకు మధ్య మధ్యలో విరామం ఇవ్వాల్సి ఉంటుందని భారత కెప్టెన్ రోహిత్ శర్మ వెల్లడించాడు. గురువారం నుంచి బంగ్లాదేశ్‌తో మొదటి టెస్టు జరగనున్న నేపథ్యంలో రోహిత్ మీడియాతో పలు అంశాలపై మాట్లాడాడు. నెల రోజులకు పైగా విశ్రాంతి తర్వాత టీమిండియా ఆటగాళ్లు అంతర్జాతీయ క్రికెట్ బరిలోకి దిగబోతున్నారు. ‘సుదీర్ఘ సీజన్‌లో కొందరికి అప్పుడప్పుడు విశ్రాంతినివ్వక తప్పదు. మీ అత్యుత్తమ ఆటగాళ్ల ప్రతీ మ్యాచ్‌లోనూ ఆడాలని అంతా కోరుకుంటారు. కానీ వాస్తవికంగా చూస్తే అది సాధ్యం కాదు. టెస్టులు మాత్రమే కాదు, మరో వైపు టి20 మ్యాచ్‌లు కూడా ఉన్నాయి. ఇంత ఎక్కువ క్రికెట్ సాగుతుంటే మనం అన్నీ అర్థం చేసుకొని ముందుకెళ్లాలి. ముఖ్యంగా బౌలర్ల విషయంలో మరీ కష్టం. వీరి పని భారాన్ని ఎలా తగ్గించాలనే అంశంపై మాకూ కొన్ని ప్రణాళికలు ఉన్నాయి. మ్యాచ్‌ల మధ్యలో వారి ఫిట్‌నెస్ ఎలా ఉంటోంది. స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ పరిస్థితి ఏమిటి. ఫిజియో ఇచ్చే నివేదికను కూడా పరిగణలోకి తీసుకోవడంతో పాటు ఏ సమయంలో విశ్రాంతినివ్వాలో ఆలోచించి నిర్ణయం తీసుకుంటాం. ఇంగ్లండ్ లాంటి పటిష్టమైన జట్టుపై కూడా ఇది చేయగలిగాం. ఆ సిరీస్‌లో ఒక టెస్టులో బుమ్రాకు, మరో టెస్టులో సిరాజ్‌కు విశ్రాంతినిచ్చాం’ అని రోహిత్ గుర్తు చేశాడు.

పేసర్ల కొరత లేదు...

దేశవాళీ క్రికెట్‌లో పెద్ద సంఖ్యలో పేస్ బౌలర్లు వెలుగులోకి వస్తుండటం మంచి పరిణామమని రోహిత్ వ్యాఖ్యానించాడు. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో కీలకం అయ్యే అవకాశం ఉందని సెలక్టర్లు భావించడంతో లెఫ్టార్మ్ పేసర్ యశ్ దయాళ్‌ను కూడా బంగ్లాతో సిరీస్‌కు జట్టులోకి తీసుకొని అతడిని సానపెడుతున్నారు. ‘మనకు చాలా మంది బౌలర్లు అందుబాటులో ఉన్నారు. దులీప్ ట్రోఫీలో కూడా చాలా మందిని నేను చూశాను. అసలు కొత్తగా బౌలర్ల కోసం ఆందోళన చెందాల్సిన అవసరమే లేని పరిస్థితి మనకు ఉంది. ఇది చాలా సానుకూలాంశం’ అని కెప్టెన్ అన్నాడు.

అందరితో కలిసి పని చేశాను...

కొత్త హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ నేతృత్వంలో భారత జట్టు తొలిసారిగా టెస్టు సిరీస్ బరిలోకి దిగుతోంది. నెల రోజుల క్రితం ఇదే బృందం శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్‌లో కూడా టీమ్‌తో కలిసి పని చేసింది. అయితే పేరుకు వారంతా కొత్తే అయినా తనకు అందరితో మంచి సంబంధాలు ఉన్నాయని రోహిత్ అన్నాడు. ద్రవిడ్ తదితరులతో కూడిన కోచింగ్ స్టాఫ్‌తో పోలిస్తే పనితీరు భిన్నమే అయినా...ఎలాంటి సమస్య లేదని అతను అభిప్రాయ పడ్డాడు. ‘కోచింగ్ బృందం కొత్తదే కావచ్చు. కానీ నాకు గంభీర్, అభిషేక్ నాయర్ బాగా తెలుసు. వీరిద్దరితో ఇప్పటికే శ్రీలంకతో కలిసి పని చేశాను. మోర్కెల్, డస్కటేలకు ప్రత్యర్థిగా ఆడాను. వారిద్దరితో ఎక్కువగా మాట్లాడలేదు కానీ వారు మా జట్టు గురించి బాగా అర్థం చేసుకోగలగడం నేను గుర్తించాను. ద్రవిడ్, రాథోడ్, మాంబ్రేలతో పోలిస్తే వీరి శైలి భిన్నం. పనితీరులో ఎవరి పద్ధతి వారికుంటుంది. అది పెద్ద సమస్య కాదు. ఇప్పటి వరకు ఎలాంటి ఇబ్బందీ రాలేదు. ఆటగాళ్లందరూ పరిస్థితికి తగినట్లుగా కోచింగ్ బృందంతో సరిగా సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లడం ముఖ్యం. అది మేం చేయగలం’ అని రోహిత్ వివరించాడు.

రిహార్సల్స్ సిరీస్ కాదు...

రాబోయే ఆస్ట్రేలియా వంటి కీలక పర్యటనకు సన్నాహకంగా బంగ్లాదేశ్ సిరీస్‌ను చూడటం లేదని రోహిత్ శర్మ స్పష్టం చేశాడు. ప్రతీ టెస్టు మ్యాచ్‌కు ప్రాధాన్యత ఉంటుందని, ప్రత్యర్థి బలం గురించి కాకుండా తాము ఏం చేయగలం అనేది చూస్తామని అతను చెప్పాడు. ‘సిరీస్ ఏదైనా దేశం తరఫున ఆడుతున్నామనేది మర్చిపోవద్దు. కాబట్టి ఇక్కడేమీ రిహార్సల్స్ జరగడం లేదు. ప్రతీ టెస్టుకు ప్రాధాన్యత ఉంది. డబ్ల్యూటీసీ కోణంలో చూస్తే ఉదాసీనతకు అవకాశం లేదు. ఎక్కడ ఆడతామనేది విషయం కాదు. గెలవడమే అన్నింటికంటే ప్రధానం. మ్యాచ్‌కు వారం రోజుల ముందే ఇక్కడకు వచ్చాం. సన్నాహకాలు చాలా బాగా సాగాయి. దొరికిన కాస్త సమయాన్ని బాగా వాడుకున్నాం. మేమందరం టెస్టు సిరీస్ కోసం ఉత్సాహంగా ఎదురు చూస్తున్నాం’ అని రోహిత్ శర్మ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు.

అజేయంగా ‘ఆసియా’ విజేతగా

ఆసియా చాంపియన్స్ ట్రోఫీ టైటిల్ గెలుచుకున్న భారత్

డిఫెండింగ్ చాంపియన్ హోదాకు తగినట్టుగానే టోర్నీలో ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ జయకేతనం ఎగురవేసిన భారత హాకీ జట్టు ఆసియా చాంపియన్స్ ట్రోఫీ (ఏసీటీ)లో వరుసగా రెండోసారి విజేతగా నిలిచింది. టైటిల్ హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన భారత్‌కు చైనాతో తుదిపోరు అందరు అనుకున్నంత సులువుగా సాగలేదు. భారత్ స్థాయికి ఏమాత్రం సరితూగని చైనా ప్రతి క్వార్టర్‌లోనూ ఊహించని విధంగా ప్రతిఘటించింది. దీంతో భారత్ గోల్ చేసేందుకు ఆఖరి క్వార్టర్ దాకా నిరీక్షించక తప్పలేదు. చివరకు జుగ్‌రాజ్ చేసిన గోల్‌తో టీమిండియా ఏసీటీలో ఓవరాల్‌గా ఐదో టైటిల్‌ను కైవసం చేసుకుంది.



- ఫైనల్లో 1–0తో చైనాపై గెలుపు
- ఐదో సారి టైటిల్ కైవసం
- పాకిస్తాన్‌కు మూడో స్థానం

హులుంబుయిర్: పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచిన భారత హాకీ జట్టు ఆసియా చాంపియన్స్ ట్రోఫీ (ఏసీటీ)లో వరుసగా రెండోసారి విజేతగా నిలిచింది. చైనాలో జరిగిన ఈ ఈవెంట్‌లో పరాజయం ఎరుగని టీమిండియా జైత్రయాత్ర టైటిల్ నిలబెట్టుకునేదాకా అజేయంగా సాగింది. మంగళవారం జరిగిన ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ టీమిండియా 1–0తో చైనా జట్టుపై గెలిచి టోర్నీ చరిత్రలో ఐదోసారి చాంపియన్‌షిప్‌ను సాధించింది. ఇప్పటి వరకు 8 ఏసీటీ ఈవెంట్లు జరిగితే ఇందులో అత్యధికంగా ఐదుసార్లు భారత్ 2011, 2016, 2018 (పాక్‌తో కలిసి సంయుక్త విజేత), 2023లలో విజేతగా నిలవడం విశేషం. డిఫెండర్ జుగ్‌రాజ్ సింగ్ ఆఖరి క్వార్టర్‌లోని 51వ నిమిషంలో చేసిన ఫీల్డ్ గోల్‌తో భారత్ విజయం సాధించింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో గానీ, ఆటతీరులో గానీ సాటిరాని చైనా జట్టు ఫైనల్లో హర్మన్‌ప్రీత్ సేనకు ఊహించని విధంగా పోటీ ఇచ్చింది. ఈ టోర్నీలో లీగ్ దశ పోటీల్లో 3–0తో చైనా, 5–1తో జపాన్, 8–1తో మలేసియా, 3–1తో కొరియా, 2–1తో పాకిస్తాన్‌లను ఓడించిన భారత్ సెమీస్‌లో 4–1 కొరియాను ఓడించి టైటిల్‌పోరుకు చేరింది. దీంతో సులువైన ప్రత్యర్థి చైనాపై కనీసం రెండు, మూడు గోల్స్ తేడాతో విజయం ఖాయమని విశ్లేషకులు, అభిమానులు భావించారు. కానీ వారి అంచనాలన్నీ తారుమారయ్యాయి. తుదిపోరులో కేవలం ఒకే ఒక్క గోల్ తేడాతో భారత్ గెలిచింది. చైనా డిఫెండర్లు భారత స్ట్రయికర్లను సమర్థంగా నిలువరించారు. దీంతో ఈ టోర్నీలోనే అతి తక్కువ గోల్స్ తేడాతో, భారత్ గెలిచిన మ్యాచ్ ఇదే కావడం గమనార్హం!

మూడు క్వార్టర్ల పాటు...

చైనా డిఫెండర్ల ఆటతీరు భారత ఫార్వర్డ్ లైన్‌కు గోడ కట్టినట్లుగా సాగింది. మూడు క్వార్టర్ల పాటు ప్రత్యర్థి రక్షణ శ్రేణి భారత సేనను సమర్థవంతంగా నిలువరించింది. భారత్ ప్రత్యర్థి గోల్ పోస్ట్ లక్ష్యంగా చేసిన దాడులన్నీ చైనా ఆటగాళ్ల పోరాటపటిమతో విఫలమయ్యాయి. నిజానికి ఇప్పటివరకు ఎన్నో ఫైనల్స్ ఆడిన చరిత్ర భారత్‌ది కాగా... చైనాకు మాత్రం ఇది రెండో టైటిల్ పోరు. 2006 ఆసియా క్రీడల ఫైనల్లో చైనా 1–3తో కొరియా చేతిలో ఓడింది. ఫైనల్స్ మ్యాచ్‌ల అనుభవం తక్కువే అయినా ప్రదర్శనతో చైనా ఆకట్టుకుంది. ఆట ఆరంభం నుంచి భారత స్ట్రయికర్లను ఎక్కడికక్కడ నిలువరించడంతో రాజ్ కుమార్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్, నీలకంఠ శర్మ తొలి క్వార్టర్‌లో కొట్టిన టార్గెట్ షాట్లు నిర్వీర్యమయ్యాయి. రెండో క్వార్టర్‌లోనూ ఇదే ఆటతీరు కొనసాగింది. 27వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచేందుకు సుఖ్‌జీత్ సింగ్, హర్మన్‌ప్రీత్‌లు చేసిన ప్రయత్నాల్ని చైనా గోల్‌కీపర్ వాంగ్ వీహావ్ చాకచక్యంగా అడ్డుకున్నాడు. ఎట్టకేలకు ఆఖరి క్వార్టర్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ వద్దకు వచ్చిన బంతిని నేర్పుగా చైనా డిఫెండర్లను ఏమార్చుతూ డి ఏరియా వద్ద అప్రమత్తంగా ఉన్న జుగ్‌రాజ్‌కు పాస్ చేశాడు. అతను ఎలాంటి పొరపాటుకు తావివ్వకుండా బంతిని గోల్‌పోస్టులోకి తరలించడంతో భారత్ శిబిరం ఎట్టకేలకు సంబరాల్లో మునిగింది. వర్గీకరణ పోరులో పాకిస్తాన్ 5–2తో కొరియాను ఓడించి మూడో స్థానంలో నిలిచింది.

వైఎస్ జగన్ ప్రశంస: ఆసియా చాంపియన్స్ ట్రోఫీ నెగ్గిన భారత జట్టును ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అభినందించారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



● మోహన్‌లాల్, మమ్ముట్టి

పదేళ్ల తర్వాత మళ్లీ ఒకే ఫ్రేమ్‌లో...

మలయాళ సినీ పరిశ్రమలో దిగ్గజ హీరోలైన మమ్ముట్టి, మోహన్ లాల్ దశాబ్దం తర్వాత మళ్లీ కలిసి నటించి ఫ్యాన్స్‌ను ఖుషీ చేయనున్నారు. మహేశ్ నారాయణ్ దర్శకత్వంలో త్వరలోనే వీళ్లిద్దరి కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కనుంది. మమ్ముట్టి కంపెనీ, ఆశీర్వాద్ సినిమాస్ సంయుక్తంగా ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని నిర్మించనున్నాయి. 30 రోజుల పాటు శ్రీలంకలో ఈ చిత్రాన్ని షూట్ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మూవీ స్టోరీలైన్‌కి తగ్గట్టు షూటింగ్ లొకేషన్ పర్మిషన్ కోసం నిర్మాతలు శ్రీలంక ప్రధానమంత్రితో కూడా చర్చలు జరిపినట్టు కేరళ సినీ వర్గాలు చెబుతున్నాయి. ఎక్కువ శాతం షూటింగ్ శ్రీలంకలోనూ మిగతాది కేరళ, ఢిల్లీ, లండన్‌లోనూ జరిపేలా ప్లాన్ చేస్తున్నారు. మమ్ముట్టి, మోహన్ లాల్ కాంబినేషన్ కావడంతో ఫ్యాన్స్ అంచనాలకు తగ్గట్టుగా స్క్రిప్ట్‌ను సిద్ధం చేసుకుంటున్నారు దర్శకుడు మహేశ్ నారాయణ్. 50 చిత్రాల్లో భిన్న పాత్రల్లో కలిసి నటించి, ప్రేక్షకులను మెప్పించిన మమ్ముట్టి, మోహన్‌లాల్ చివరిగా 2013లో ‘కాథల్ కదన్ను ఒరు మాతుకుట్టి’ అనే చిత్రంలో సిల్వర్ స్క్రీన్‌ను షేర్ చేసుకున్నారు.

సుందర్ డైరెక్షన్‌లో...



● నయనతార

నయనతార, ఆర్‌జే బాలాజీ లీడ్ రోల్స్‌లో నటించిన తమిళ ఫ్యాంటసీ కామెడీ ఫిల్మ్ ‘ముకుత్తి అమ్మన్’ (తెలుగులో ‘అమ్మోరు తల్లి’). ఆర్‌జే బాలాజీ, ఎన్‌జే శరవణన్ కలిసి దర్శకత్వం వహించిన ఈ సినిమా 2020 నవంబరులో డైరెక్ట్‌గా ఓటీటీలో విడుదలై, విశేష ప్రేక్షకాదరణను దక్కించుకుంది. వేల్స్ ఫిల్మ్ ఇంటర్‌నేషనల్ సంస్థ నిర్మించింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా ‘ముకుత్తి అమ్మన్ 2’ రానుందని, ఇందులోనూ నయనతార లీడ్ రోల్‌లో నటిస్తారని, ఈ ఏడాది జూలైలో వేల్స్ ఫిల్మ్ ఇంటర్‌నేషనల్ ప్రకటించింది. కానీ ఆ సమయంలో దర్శకుడి పేరును వెల్లడించలేదు. తాజాగా ‘ముకుత్తి అమ్మన్ 2’ సినిమాకు సుందర్. సి దర్శకత్వం వహించనున్నట్లుగా వెల్లడించారు మేకర్స్. ఈ చిత్రంలో సుందర్. సి ఓ పాత్ర చేసే చాన్స్ కూడా ఉందట. కాగా ‘ముకుత్తి అమ్మన్ 2’కు ఆర్‌జే బాలాజీ దర్శకత్వం వహిస్తారని, త్రిష లీడ్ రోల్‌లో నటిస్తారని ప్రచారం జరిగింది. అయితే తొలి భాగంలో లీడ్ రోల్‌లో నటించిన నయనతారనే మలి భాగంలోనూ లీడ్ రోల్ చేయనున్నట్లుగా ప్రకటన వచ్చింది. ఆర్‌జే బాలాజీ స్థానంలో దర్శకుడిగా మాత్రం సుందర్. సి వచ్చారు. ఇలా ‘ముకుత్తి అమ్మన్ 2’ డైరెక్టర్ మారారు. త్వరలోనే చిత్రీకరణ ఆరంభం కానుంది.

జేమ్స్ కామెరూన్ లాస్ట్ ట్రైన్ ఫ్రమ్ హిరోషిమా



హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు జేమ్స్ కామెరూన్ ‘లాస్ట్ ట్రైన్ ఫ్రమ్ హిరోషిమా’ పేరుతో ఓ సినిమా చేయనున్నారనే టాక్ వినిపిస్తోంది. అమెరికన్ ప్రముఖ రచయిత చార్లెస్ ఆర్. పెల్లెగ్రినో రాసిన ‘ఘోస్ట్స్ ఆఫ్ హిరోషిమా’ బుక్ హక్కులను సొంతం చేసుకున్నారు జేమ్స్ కామెరూన్. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి నగరాలపై అమెరికా అణు బాంబులతో దాడి చేసింది. ఆ సమయంలో ప్రాణాలతో బతికి బయటపడ్డ జపాన్ ఇంజనీర్ సుటోము యమగుచి జీవితం ఆధారంగా ‘లాస్ట్ ట్రైన్ ఫ్రమ్ హిరోషిమా’ సినిమా తెరకెక్కనుందని హాలీవుడ్‌లో వార్తలు వస్తున్నాయి. చార్లెస్ రాసిన ‘ఘోస్ట్స్ ఆఫ్ హిరోషిమా’, ‘లాస్ట్ ట్రైన్ ఫ్రమ్ హిరోషిమా’... ఈ రెండు బుక్స్‌ని కలిపి సినిమా తీయనున్నారట జేమ్స్ కామెరూన్. ప్రస్తుతం ‘అవతార్’ ఫ్రాంచైజీతో జేమ్స్ కామెరూన్ బిజీగా ఉన్నారు. ఈ ఫ్రాంచైజీ నుంచి ఇప్పటికే ‘అవతార్ (2019), అవతార్: ద వే ఆఫ్ వాటర్’ (2022) చిత్రాలు విడుదల అయ్యాయి. ‘అవతార్: ఫైర్ అండ్ యాష్’ (అవతార్ 3) చిత్రం 2025లో రిలీజ్ కానుంది. ఇంకా ‘అవతార్ 4, అవతార్ 5’ చిత్రాలు కూడా ఉన్నాయి. మరి... ‘అవతార్’ ఫ్రాంచైజీని పక్కన పెట్టి జేమ్స్ కామెరూన్ ‘లాస్ట్ ట్రైన్ ఫ్రమ్ హిరోషిమా’ చేస్తారా? లేదా అనే అంశంపై ఓ స్పష్టత రావాల్సి ఉంది. ఒకవేళ ‘అవతార్’ ఫ్రాంచైజీలకన్నా ముందే ‘లాస్ట్ ట్రైన్ ఫ్రమ్ హిరోషిమా’ సినిమాను సెట్స్‌పైకి తీసుకువెళితే 1997లో వచ్చిన ‘టైటానిక్’ తర్వాత జేమ్స్ కామెరూన్ దర్శకత్వం వహించే నాన్ అవతార్ ఫిల్మ్ ‘లాస్ట్ ట్రైన్ ఫ్రమ్ హిరోషిమా’నే అవుతుంది.

దీపావళికి జీబ్రా



● సత్యదేవ్

సత్యదేవ్, డాలీ ధనుంజయ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా ‘జీబ్రా’. ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వంలో పద్మజ ఫిలింస్ ప్రైవేట్ లిమిటెడ్, ఓల్డ్ టౌన్ పిక్చర్స్ బ్యానర్లపై ఎస్ఎన్ రెడ్డి, ఎస్ పద్మజ, బాలసుందరం, దినేష్ సుందరం నిర్మించారు. ఈ సినిమాను దీపావళి సందర్భంగా అక్టోబరు 31న తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. జెన్నిఫర్ పిసినాటో, సునీల్, ప్రియా భవానీ శంకర్, సత్య అక్కల ఇతర కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్.

ఇండస్ట్రీలోని మహిళలకు ఆ ధైర్యం ఇవ్వలేకపోతున్నాం

- తమ్మారెడ్డి భరద్వాజ



● ఝాన్సీ, కావ్య, వివేక్ కూచిభొట్ల, తమ్మారెడ్డి భరద్వాజ, దామోదర్ ప్రసాద్

‘‘**తె**లుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ 2018లో సెక్సువల్ హెరాస్‌మెంట్ రెడ్రెసెల్ ప్యానెల్ (లైంగిక వేధింపుల పరిష్కార ప్యానెల్)ను ఆరంభించడం జరిగింది. మా దృష్టికి వచ్చిన ఫిర్యాదులను షరిష్కరించాం. పదిహేను రోజుల క్రితం ఓ కేసు మా దృష్టికి వచ్చింది. వారిద్దరి వ్యక్తిగత స్టేట్‌మెంట్స్‌ను తీసుకోవడం జరిగింది. కొన్ని ఆధారాల కోసం ఎదురు చూస్తున్నాం. అలాగే క్రిమినల్ కేసు కూడా నమోదు అయ్యిందన్న విషయం మా దృష్టికి వచ్చింది. ఇన్వెస్టిగేషన్ జరుగుతోంది. మా రిపోర్ట్‌ను కూడా సబ్‌మిట్ చేస్తాం’’ అని సెక్రటరీ, కన్వీనర్, నిర్మాత కేఎల్ దామోదర్ ప్రసాద్ అన్నారు. ఇదిలా ఉంటే... కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. ఈ విషయం చర్చనీయాంశమైంది. సినిమా ఇండస్ట్రీలో మహిళల భద్రత గురించి కూడా చర్చలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేఎల్ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ– ‘‘ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి డ్యాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్నాడు. ఈ వివాదం తేలేవరకూ అతన్ని డ్యాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్ష పదవి నుంచి తప్పించాలని, అసోసియేషన్ కార్యక్రమాల్లో పాల్గొనకూడదని ఫెడరేషన్‌కు చెప్పాం. అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న విషయంపై ఇంటర్నల్ రిపోర్ట్ వచ్చాక నిర్ణ యిస్తాం. చాంబర్ కార్యాలయంలో ఓ కంప్లైంట్ బాక్స్ ఉంది. ఎవరైనా ఫిర్యాదులు చేయవచ్చు. ఫోన్‌కాల్, మెయిల్, పోస్ట్ సౌకర్యాలు కూడా ఉన్నాయి. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. ఇది ఎప్పట్నుంచో ఉంది. అలాగే ఇండస్ట్రీలో ఉమెన్ సపోర్ట్ టీమ్ కూడా ఉంది. ఈ విషయం కొంత మందికి తెలియకపోవచ్చు. ప్రస్తుత వివాదం ముగిసిపోగానే ఈ టీమ్ గురించి అన్ని అసోసియేషన్‌లకు అవగాహన కల్పిస్తాం’’ అని అన్నారు. లైంగిక వేధింపుల పరిష్కార ప్యానెల్ చైర్‌పర్సన్ ఝాన్సీ మాట్లాడుతూ– ‘‘శ్రీరెడ్డి ఇష్యూ తర్వాత ఓ కమిటీని ఫామ్ చేశాం. ఇతర ఇండస్ట్రీస్‌లో జరగుతున్న సెక్సువల్ హెరాస్‌మెంట్ ఇక్కడ కూడా జరుగుతోంది. ఇండస్ట్రీకి చెందిన ఇద్దరు కొరియోగ్రాఫర్స్ మధ్య నెలకొన్న వివాదం ఇది. మేం ఇద్దరి స్టేట్‌మెంట్స్‌ను రికార్డ్ చేశాం. అయితే ఆమె స్టేట్‌మెంట్ రికార్డు చేసే సమయంలో తెలిసింది... కేసు చాలా సీరియస్ అని. లీగల్ సపోర్ట్ కూడా ఆ అమ్మాయికి అవసరం అని అర్థమైంది. మా పరిధిలో మేం చేయాల్సినది ఆమెకు చేశాం. బాధితురాలిగా చెప్పబడిన అమ్మాయి మైనర్‌గా ఉన్నప్పట్నుంచే ఇండస్ట్రీలో పని చేస్తోంది. అయితే మైనర్‌గా ఇండస్ట్రీలో ఆమెకు చోటు కల్పించిన విధానం ప్రోటోకాల్ ప్రకారంగానే జరిగిందా? లేదా అనే విషయంపై కూడా ఎంక్వయిరీ జరుగుతోంది. మా ప్రస్తుత గైడ్‌లైన్స్ ప్రకారం 90 రోజుల్లో కేసును పరిష్కరించాలి. కానీ అంతకు ముందే ముగించాలని మేం అనుకుంటున్నాం. ఎంక్వయిరీ తర్వాత మా రిపోర్ట్ చెబుతాం. ఎలాంటి చర్యలు తీసుకుంటామో చెబుతాం. ఇండస్ట్రీలోని వారంతా ఈ ఇష్యూపై బయటకు మాట్లాడకపోయినా అంతర్గతంగా చర్చిస్తున్నారు. ఆమెకు సపోర్ట్‌గా ఉంటామని ఓ పెద్ద హీరో తన మేనేజర్‌తో చెప్పించారు. దర్శకులు– నిర్మాతలు స్పందిస్తున్నారు. ఇండస్ట్రీలో టాలెంట్‌కు వర్క్ ఉంటుంది. ఒకవేళ ఫేక్ కంప్లైంట్స్ వస్తే ఎలాంటి చర్యలు తీసుకోవాలని కూడా ప్రత్యేక సెక్షన్ ఉంది. ఇండస్ట్రీలోని మహిళల రక్షణకు సంబంధించి ప్రభుత్వం తరఫు నుంచి సరైన గైడ్‌లైన్స్ లేవు. అలాగే ‘వాయిస్ ఆఫ్ ఉమెన్’ గురించి సమంత గారు సోషల్ మీడియాలో స్పందించారు. కానీ ‘వాయిస్ ఆఫ్ ఉమెన్’ అనేది ఇండస్ట్రీ నుంచి సెపరేట్ కాదు. దీనికి సంబంధించి ప్రభుత్వంతో చర్చలు జరుగుతూనే ఉన్నాయి. బయటకు రాలేదు అంతే. సరైన సమయంలో పెద్దలు మాట్లాడతారు. అలాగే ఈ కేసుకు సంబంధించి బాధితురాలి ఫేస్‌ను మీడియా బయటపెట్టకూడదని కోరుతున్నాం’’ అని పేర్కొన్నారు. ‘‘2013లో ఆసరా అని పెట్టి, కొన్ని కేసులను పరిష్కరించడం జరిగింది. 2018లో సరికొత్తగా ఈ ప్యానెల్ పెట్టాం. ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తూనే ఉన్నాం. కానీ ఇండస్ట్రీలో ఉన్న మహిళలకు ధైర్యం ఇవ్వలేకపోతున్నాం. ఫలానా చోటుకు వచ్చి మీ సమస్యలపై ఫిర్యాదు చేస్తే న్యాయం చేస్తామని చెప్పలేకపోతున్నామని నా వ్యక్తిగత అభిప్రాయం. ఈ తరహా కేసులు లేవని కాదు. జరుగుతున్నవి జరిగినా కానీ, చాలా కేసులు రావడం లేదని నా అభిప్రాయం. వచ్చినవరకు సాల్వ్ చేస్తున్నాం. సినిమాల్లో తనకు ఏదైనా అన్యాయం జరిగితే సపోర్ట్ చేసేందుకు ఇండస్ట్రీ ఉందనే ధైర్యం అమ్మాయిలకు రావాలి. ఆ ధైర్యం రావాలంటే కమిటీ ఉండాలి. వచ్చిన కేసులను మంచిగా సాల్వ్ చేయాలి. ప్రస్తుత కేసును సాల్వ్ చేయడానికి కొంత సమయం ఉంది. అలాగే ఇండస్ట్రీలో ఉన్న ప్రతి యూనియన్‌కు ఓ కంప్లైంట్ కమిటీ ఉండాలని సూచించాం. అలాగే మాకు కూడా డైరెక్ట్‌గా కంప్లైంట్ చేయవచ్చు’’ అని ‘లైంగిక వేధింపుల పరిష్కార ప్యానెల్’ అంతర్గత సభ్యులు, దర్శక– నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ వెల్లడించారు. చిత్ర పరిశ్రమలో మైనర్లు ఎందుకు పని చేయాల్సి వచ్చిందన్న ప్రశ్నకు నిర్మాత వివేక్ కూచిభొట్ల స్పందిస్తూ– ‘‘చిన్నారులు డ్యాన్స్ చేయాల్సి అవసరం వచ్చినప్పుడు వారి తల్లిదండ్రుల అనుమతి తీసుకుంటాం. మేజర్ అయితే సభ్యత్వం ఇస్తాం’’ అని కమిటీ అంతర్గత సభ్యులు, నిర్మాత వివేక్ కూచిబొట్ల అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది, ‘పీఓఎస్‌హెచ్’ (ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హెరాస్‌మెంట్) ఎక్స్‌పర్ట్ కావ్య మండవ తదితరులు మాట్లాడారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	91	83,080
నిఫ్టీ ▲	35	25,419

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	17,589	▽ 3
డోజోన్స్	41,558	▽ 64
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,310	▲ 31
డాక్స్	18,726	▲ 93
షాంఘై (మంగళవారం ముగింపు)	2,704	▽ 13
నికాయ్	36,203	▽ 379

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారెట్)	72,920
బంగారం (22 క్యారెట్)	69,450
వెండి (కేజీ)	97,000

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	82.05	85.73
£	బ్రిటన్ పౌండ్	107.85	112.79
€	యూరో	90.84	95.34
¥	జపాన్ ఎన్ (100)	48.00	70.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	53.96	58.83
S$	సింగపూర్ డాలర్	62.31	67.01
SAR	సౌదీ రియాల్	21.47	23.03
UAE D	యూఏఈ దిర్హామ్	21.95	23.73
¥	చైనా యువాన్	10.95	12.79

ఎగుమతులు ఢమాల్!

- ఆగస్టులో 9.3 శాతం క్షీణత...
- అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి నేపథ్యం
- భారీ దిగుమతులతో 10 నెలల గరిష్టానికి వాణిజ్య లోటు



న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి భారత్ వస్తు ఎగుమతులపై ప్రభావం చూపింది. ఆగస్టులో ఎగుమతులు గడచిన 13 నెలల్లో ఎన్నడూ లేని స్థాయిలో 9.3 శాతం క్షీణించి (2023 ఆగస్టు నెలతో పోల్చి) 34.71 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. జూలైలో కూడా ఎగుమతుల విలువ పడిపోయినప్పటికీ అది కేవలం 1.5 శాతంగా ఉండడం గమనార్హం.

దిగుమతులు రికార్డు...

ఇక దిగుమతులుసైతం రికార్డు స్థాయిలో 3.3 శాతం పెరిగి 64.36 బిలియన్ డాలర్లకు ఎగశాయి. వెరసి ఎగుమతులు–దిగుమతులు మధ్య నికర వ్యత్యాసం – వాణిజ్యలోటు 10 నెలల గరిష్ట స్థాయిలో 29.65 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

బంగారం, వెండి ప్రభావం..

బంగారం, వెండి దిగుమతులు భారీగా పెరగడం తీవ్ర స్థాయి వాణిజ్యలోటుకు ఒక కారణం. 2023 ఆగస్టులో బంగారం దిగుమతులు 4.93 బిలియన్ డాలర్లుకాగా, ఈ ఆగస్టులో రెట్టింపై 10.06 బిలియన్ డాలర్లకు చేరాయి. వెండి దిగుమతులుసైతం ఇదే సమయంలో 159 మిలియన్ డాలర్ల నుంచి 727 మిలియన్ డాలర్లకు ఎగశాయి. బడ్జెట్లో బంగారంపై కస్టమ్స్ సుంకాలను (15% నుంచి 6%కి) తగ్గించడం, పండుగ సీజన్ డిమాండ్ దిగుమతులు భారీగా పెరగడానికి కారణం. కాగా, ఏప్రిల్ నుంచి ఆగస్టు మధ్య వస్తు ఎగుమతుల విలువ 1.14% పెరిగి 178.68 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

ట్రయంఫ్ రెండు కొత్త బైక్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం బజాజ్ ఆటో తాజాగా భారత మార్కెట్లో ట్రయంఫ్ స్పీడ్ టీ4, ఎంవై25 స్పీడ్ 400 బైక్స్‌ను పరిచయం చేసింది. 398 సీసీ టీఆర్ సిరీస్ ఇంజిన్‌తో ఇవి తయారయ్యాయి. ఎక్స్‌షోరూంలో ధర వరుసగా రూ.2.17 లక్షలు, రూ.2.40 లక్షలు ఉంది. సరికొత్త స్పీడ్ టీ4 ట్రయంఫ్ 400 సీసీ మోడర్న్ క్లాసిక్ ఫ్యామిలీలో చేరిపోయింది. మాన్యువల్ థ్రాటిల్ బాడీ కంట్రోల్, స్లిప్పర్ క్లచ్, డ్యూయల్ చానెల్ ఏబీఎస్‌తో ప్రోగ్రెసివ్ బ్రేకింగ్, యూఎస్‌బీ పోర్ట్ వంటి ఫీచర్లు ఉన్నాయి. 2023లో మార్కెట్లోకి వచ్చిన ఎంవై25 స్పీడ్ 400ను మరింతగా ఆధునీకరించారు. రైడ్ బై వైర్ థ్రాటిల్, స్విచ్చేబుల్ ట్రాక్షన్ కంట్రోల్, టార్క్ అసిస్ట్ క్లచ్, డ్యూయల్ చానెల్ ఏబీఎస్ వంటి హంగులు జోడించారు. ట్రయంఫ్‌కు దేశవ్యాప్తంగా 120కిపైగా డీలర్‌షిప్ కేంద్రాలు ఉన్నాయి. వచ్చే ఏడాదికల్లా ఈ సంఖ్యను 200కు చేర్చనున్నారు.



గోల్డ్ ఈటీఎఫ్‌లు జిగేల్!

ఇన్వెస్టర్లు పుత్తడి పెట్టుబడుల వెంట పడుతున్నారు. భారీగా లాభాలందిస్తున్న సావరీన్ గోల్డ్ బాండ్ల (ఎస్‌జీబీ) జారీ నిలిచిపోవడం... తాజా బడ్జెట్లో పన్ను ఊరట.. బంగారం రేట్లు అంతకంతకూ దూసుకుపోతుండటంతో మదుపరులు మళ్లీ ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్) ద్వారా బంగారం కొనుగోళ్లకు సై అంటున్నారు.

మళ్లీ జోరందుకున్న పెట్టుబడులు...

- బడ్జెట్లో సుంకం కోత.. పన్ను ఊరట ప్రభావం
- తాజా గోల్డ్ బాండ్ల జారీ ఇప్పట్లో లేనట్టే!

– సాక్షి, బిజినెస్ డెస్క్

గత కొంతకాలంగా మెరుపు కోల్పోయిన గోల్డ్ ఈటీఎఫ్‌లు మళ్లీ తళుక్కుమంటున్నాయి. ఈ ఏడాది ఇప్పటిదాకా రూ. 6,134 కోట్ల విలువైన పెట్టుబడులు గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి వచ్చినట్లు అంచనా. ఇందులో రూ.4,500 కోట్లు గత నాలుగు నెలల్లోనే మదుపరులు ఇన్వెస్ట్ చేయడం విశేషం. అంతేకాదు, ఒక్క ఆగస్ట్ నెలలోనే మునుపెన్నడూ లేనంత స్థాయిలో రూ.1,611 కోట్ల నిధులు వెల్లువెత్తాయి. బడ్జెట్లో కస్టమ్స్ సుంకాన్ని భారీగా తగ్గించడంతో ఒక్కసారిగా బంగారం రేట్లు రూ. 3,000కు పైగా దిగొచ్చిన సంగతి తెలిసిందే. దీంతో పసిడి ప్రియులు పండుగ చేసుకున్నారు. ఆభరణాల కొనుగోళ్లు జోరందుకోవడంతో పాటు అటు డిజిటల్ రూపంలో కూడా ఇన్వెస్టర్లు పెట్టుబడుల స్పీడ్ పెంచారు. ఇది లాఉంటే, అంతర్జాతీయంగా పుత్తడి సరికొత్త ఆల్‌టైమ్ గరిష్టాలతో దూసుకెళ్తూనే ఉంది. తాజాగా ఔన్స్ రేటు 2,600 డాలర్లను అధిగమించి చరిత్ర సృష్టించింది. దీంతో దేశీయంగానూ సుంకం కోతకు ముందు స్థాయికి, అంటే 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.75,500కు చేరింది.

గోల్డ్ బాండ్ల నిలిపివేత ఎఫెక్ట్...



గోల్డ్ ఈటీఎఫ్‌లకు ఆదరణ తగ్గేందుకు గోల్డ్ బాండ్లు ప్రధాన కారణం. దేశంలో బంగారం దిగుమతులకు అడ్డుకట్టవేయడం కోసం 2016లో ప్రవేశపెట్టిన ఎస్‌జీబీ స్కీమ్‌ను ప్రభుత్వం ఈ ఏడాది ఆరంభం వరకు పక్కాగా అమలు చేసింది. క్రమంతప్పకుండా ఎస్‌జీబీలను జారీ చేస్తూ వచ్చింది. అటు బంగారం ధర భారీగా పెరగడంతో పాటు వార్షికంగా 2.5% వడ్డీ రేటు లభించడం.. 8 ఏళ్ల మెచ్యూరిటీ వరకు పెట్టుబడులను కొనసాగిస్తే మూలధన లాభాల పన్ను మినహాయింపు వంటి ప్రయోజనాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు గోల్డ్ బాండ్లపై బాగా ఆసక్తి చూపారు. ఈ ఏడాది ఆగస్ట్‌లో గడువు తీరిన ఎస్‌జీబీలపై 120 శాతం పైగానే రాబడి లభించడం విశేషం. ప్రస్తుతం ఇంకా రూ.27,000 కోట్ల విలువైన గోల్డ్ బాండ్లు ఇన్వెస్టర్ల వద్ద ఉన్నాయి. అయితే, బంగారం ధర భారీగా పెరిగిపోవడంతో ప్రభుత్వ ఖజానాకు భారంగా మారిన నేపథ్యంలో కేంద్రం కొత్త గోల్డ్ బాండ్ల జారీకి ముఖం చాటేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి తర్వాత మళ్లీ ఆ ఊసే లేదు. దీంతో ఇక ఈ స్కీమ్‌కు ప్రభుత్వం నీళ్లొదిలినట్టేననేది పరిశీలకుల అభిప్రాయం.

ఈటీఎఫ్‌ల వైపు చూపు...

గడిచిన ఏడాది కాలంలో గోల్డ్ 20 శాతం మేర రాబడులు అందించింది. గోల్డ్ బాండ్ల జారీ నిలిచిపోవడంతో ఇన్వెస్టర్లకు ప్రధానంగా రెండే ఆప్షన్లున్నాయి. ఇప్పటికే ట్రేడవుతున్న గోల్డ్ బాండ్లను కొనుగోలు చేయడం, లేదంటే గోల్డ్ ఈటీఎఫ్‌లలో ఇన్వెస్ట్ చేయడం. 'బడ్జెట్లో బంగారం పెట్టుబడులపై సానుకూల పన్ను విధానం, కస్టమ్స్ సుంకం తగ్గింపు, తాజా గోల్డ్ బాండ్ల జారీ లేకపోవడం వంటి కారణాలతో ఇన్వెస్టర్లు మళ్లీ గోల్డ్ ఈటీఎఫ్‌ల బాట పడుతున్నారు' అని మనీ మంత్ర ఫౌండర్ విరల్ భట్ పేర్కొన్నారు. గోల్డ్ బాండ్ల మెచ్యూరిటీ తర్వాత భారీగా లాభాలను కళ్లజూసిన ఇన్వెస్టర్లు సైతం మళ్లీ ఆ ఆప్షన్ లేకపోవడంతో గోల్డ్ ఈటీఎఫ్‌లకు తిరిగొస్తున్నారని ఫండ్ డిస్ట్రిబ్యూటర్లు చెబుతున్నారు. తాజా బడ్జెట్లో బంగారం పెట్టుబడులపై దీర్ఘకాల మూలధన లాభాల పన్ను తగ్గింపు కూడా గోల్డ్ ఈటీఎఫ్‌లకు సానుకూలంగా మారింది. పెట్టుబడిని రెండేళ్లకు పైగా కొనసాగిస్తే 12.5% సుంకం చెల్లిస్తే సరిపోతుంది. గతంలో ఇన్వెస్టర్ల ట్యాక్స్ శ్లాబ్‌ను బట్టి పన్ను విధింపు ఉండేది.

రేటు రయ్ రయ్...

భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల కోత ఖాయంగా కనిపిస్తుండటంతో బంగారం రేట్లు మరింత ఎగబాకే అవకాశం ఉందనేది ఫండ్ మేనేజర్ల అంచనా. 'మెరుగైన రాబడుల నేపథ్యంలో పసిడి పెట్టుబడుల ట్రెండ్ కొనసాగనుంది. ఉక్రెయిన్–రష్యా యుద్ధానికి తోడు పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణంతో సురక్షిత పెట్టుబడి సాధనమైన పుత్తడిలోకి పెట్టుబడులు పెరిగాయి. సెంట్రల్ బ్యాంకులు సైతం పసిడి నిల్వలను భారీగా పెంచుకుంటున్నాయి. ఇవన్నీ గోల్డ్ రష్‌కు మరింత దన్నుగా నిలుస్తున్నాయి' అని క్వాంటమ్ మ్యూచువల్ ఫండ్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ చిరాగ్ మెహతా అభిప్రాయపడ్డారు.

వే2న్యూస్‌కు 117 కోట్ల నిధులు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హైపర్‌లోకల్ న్యూస్ ప్లాట్‌ఫామ్ వే2న్యూస్ తాజాగా సిరీస్–బి రౌండ్‌లో రూ.117 కోట్ల నిధులను అందుకుంది. వెస్ట్‌బ్రిడ్జ్ క్యాపిటల్, వెంచర్ క్యాపిటలిస్ట్ శశిరెడ్డి నుంచి కంపెనీ ఈ మొత్తాన్ని అందుకుంది. ఈ ఇన్వెస్టర్ల నుంచి 2022లో సిరీస్–ఏ రౌండ్‌లో 16.75 మిలియన్ డాలర్ల నిధులను సంస్థ స్వీకరించింది. వే2న్యూస్‌ను 2015లో రాజు వనపాల స్థాపించారు.

రిలయన్స్ డిజిటల్ స్టోర్లలో ఐఫోన్ 16 సిరీస్ ఫోన్లు

హైదరాబాద్: యాపిల్ కొత్తగా మార్కెట్లోకి విడుదల చేసిన ఐఫోన్ 16 ఫోన్లు రిలయన్స్ డిజిటల్ స్టోర్లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌లో లభిస్తాయని కంపెనీ తెలిపింది. ప్రజలకు ఐఫోన్ల పట్ల ఆసక్తి పెరగడంతో రిలయన్స్ డిజిటల్ ప్రీ బుకింగ్స్ రెట్టింపయ్యాయి. కస్టమర్లు బుక్ చేసుకున్న ఐఫోన్లను కచ్చితమైన సమయానికి డెలివరీ చేస్తామని వివరించింది. 'కస్టమర్లకు మెరుగైన సేవలే మా తొలి ప్రాధాన్యత. రెండు రెట్ల రీఫండ్ పాలసీ ద్వారా సర్వీసుల్లో సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టాము' అని రిలయన్స్ డిజిటల్ అధికార ప్రతినిధి తెలిపారు.

రికార్డుల ర్యాలీ..

- తొలిసారి 83,000పైన ముగిసిన సెన్సెక్స్
- 25,400 ఎగువకు నిఫ్టీ



ముంబై: దేశీ స్టాక్ సూచీలు మంగళవారం ఇంట్రాడే, ముగింపులోనూ సరికొత్త రికార్డులు నమోదు చేశాయి. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలోని నెలకొన్న సానుకూల సంకేతాలు కలిసొచ్చాయి. సెన్సెక్స్ 91 పాయింట్లు లాభపడి తొలిసారి 83 వేల స్థాయిపైన 83,080 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 35 పాయింట్లు పెరిగి 25,400 ఎగువన 25,419 వద్ద నిలిచింది. ఇరు సూచీలకిది ఇది సరికొత్త రికార్డు ముగింపు. ఇంట్రాడేలో సెన్సెక్స్ 83,152 వద్ద, నిఫ్టీ 25,442 వద్ద జీవితకాల గరిష్టాలను నమోదు చేశాయి.

- బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ షేరు లిస్టింగ్ జోరును కొనసాగించింది. బీఎస్‌ఈలో 10% పెరిగి రూ.181 వద్ద వరుసగా రెండోరోజూ అప్పర్ సర్క్యూట్ తాకింది.
- బ్రోకరేజ్ సంస్థల 'బై' రేటింగ్‌తో ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ షేరు 10 శాతం పెరిగి రూ.118 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకి.. అక్కడే ముగిసింది.

పీఎన్ గాడ్గిల్ బంపర్ లిస్టింగ్

లిస్టింగ్‌లో పీఎన్ గాడ్గిల్ జ్యువెలర్స్ షేరు మెప్పించింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర (రూ.480)తో పోలిస్తే 74% ప్రీమియంతో రూ.834 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 76% పెరిగి రూ.844 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 65% లాభంతో రూ.793 వద్ద నిలిచింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.10,758 కోట్లుగా నమోదైంది.

'సాక్షి ప్లస్' ఈ–పేపర్‌లో ..

టర్మ్ డిపాజిట్లకు ఆదరణ	27 లక్షల మహిళా పారిశ్రామికవేత్తలకు లబ్ధి

టోకు ధరల ఊరట..

ఆగస్టు ద్రవ్యోల్బణం 1.31 శాతం

న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం ఆగస్టులో 1.31 శాతంగా (2023 ఇదే నెలతో పోల్చి) నమోదయ్యింది. గడచిన 4 నెలల్లో ఇంత తక్కువస్థాయి టోకు ద్రవ్యోల్బణం నమోదుకావడం గమనార్హం. కూరగాయలు, ఇంధనం ధరలు తగ్గడం దీనికి ప్రధాన కారణం. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధానానికి ప్రాతిపదిక అయిన వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం కూడా జూలై, ఆగస్టుల్లో 4% లక్ష్యాల దిగువకు (వరుసగా 3.6 శాతం, 3.65 శాతం) చేరిన సంగతి తెలిసిందే. తాజా టోకు గణాంకాల్లో ఫుడ్ ఐటమ్స్ ద్రవ్యోల్బణం 3.11% గా నమోదయ్యింది. కూరగాయల ధరలు 10% తగ్గాయి. అయితే ఆలూ, ఉల్లి ధరలు భారీగా 77.96%, 65.75% చొప్పున పెరిగాయి.



సూక్ష్మ సేద్యం అమల్లో ఏపీకి ఆరో స్థానం

గత ఐదేళ్లలో రాష్ట్రంలో 3.09 లక్షల హెక్టార్లలో సూక్ష్మ సేద్యం విస్తరణ

తద్వారా 2,73,888 మంది అన్నదాతలకు ప్రయోజనం

రైతులకు డ్రిప్ పరికరాలు కూడా ఇవ్వలేదని ఇన్నాళ్లూ టీడీపీ ప్రచారం

అదంతా అవాస్తవమేనని స్పష్టం చేస్తోన్న కేంద్ర గణాంకాలు



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు సూక్ష్మ సేద్యం పరికరాలు కూడా ఇవ్వలేదని టీడీపీ నేతలు చేస్తోన్న ప్రచారంలో వాస్తవం లేదని కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించిన గణాంకాల ద్వారా స్పష్టమైంది. గత ఐదేళ్లలో సూక్ష్మ సేద్యం అమల్లో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ఆరో స్థానంలో నిలిచింది. గత ఐదేళ్లలో ఏపీ ప్రభుత్వం 3.09 లక్షల హెక్టార్లలో సూక్ష్మ సేద్యాన్ని విస్తరించినట్లు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ తెలిపింది. తద్వారా ఏపీలో ఐదేళ్లలో 2,73,888 మంది రైతులకు ప్రయోజనం చేకూర్చినట్లు వివరించింది. సూక్ష్మ సేద్యం కింద డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలతో నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని వెల్లడించింది. ఈ పథకంపై నీతి ఆయోగ్ అధ్యయనం నిర్వహించిందని, జాతీయ ప్రాధాన్యతలను సాధించడంలో ఈ పథకం కీలకమని పేర్కొందని కేంద్ర మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ పథకం ద్వారా నీటి వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరిచి, పంట ఉత్పాదనను, ఉత్పత్తిని పెంచుకుని, ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు రైతుల ఆదాయం పెరుగుతుందని నీతి ఆయోగ్ ప్రశంసించినట్లు కేంద్ర మంత్రిత్వ శాఖ తెలిపింది. సెంటర్ ఫర్ మేనేజ్‌మెంట్ ఇన్ అగ్రికల్చర్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (అహ్మదాబాద్) ద్వారా 2023లో ఏపీతో సహా దేశంలోని 6 రాష్ట్రాల్లో అధ్యయనం చేసినట్లు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిత్వ శాఖ తెలిపింది. నీటి వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరచడం కోసం మైక్రో ఇరిగేషన్ కవరేజీపై అధ్యయనం చేసిందని పేర్కొంది. ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి సిఫార్సులు చేసిందని తెలిపింది. నీటి కొరత, నీటి ఒత్తిడి, క్లిష్టమైన పరిస్థితుల్లో మైక్రో ఇరిగేషన్‌ను ప్రోత్సహిస్తున్నట్లు కేంద్రం పేర్కొంది. తద్వారా భూగర్భ నీటిని సంరక్షించడానికి సూక్ష్మ సేద్యాన్ని మరింత ఎక్కువ విస్తీర్ణంలో విస్తరించే విధంగా రైతులను ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొంది. గత ఐదేళ్లలో (2019–20 నుంచి 2023–24) సూక్ష్మ సేద్యంలో కర్ణాటక 13.30 లక్షల హెక్టార్లలో తొలి స్థానంలో ఉండగా ఆ తరువాత తమిళనాడు 7.79 లక్షల హెక్టార్లు, రాజస్థాన్ 6.16 లక్షల హెక్టార్లు, ఒడిశా 5.91 లక్షల హెక్టార్లు, గుజరాత్ 5.24 లక్షల హెక్టార్లు, ఆంధ్రప్రదేశ్ 3.09 లక్షల హెక్టార్లలో సూక్ష్మ సేద్యం విస్తరించినట్లు వివరించింది.

గత ఐదేళ్లలో సూక్ష్మ సేద్యం విస్తరణ ఇలా..

జిల్లా పేరు	విస్తీర్ణం (హెక్టార్లలో)	జిల్లా పేరు	విస్తీర్ణం (హెక్టార్లలో)
అనంతపురం	58,572	కృష్ణా	4,934
వైఎస్సార్	44,830	పల్నాడు	4,546
ప్రకాశం	31,384	విజయనగరం	3,651
చిత్తూరు	27,103	ఎన్టీఆర్	3,506
కర్నూలు	24,796	శ్రీకాకుళం	3,369
అన్నమయ్య	18,541	తిరుపతి	3,222
శ్రీ సత్యసాయి	16,985	విశాఖ	2,379
నెల్లూరు	10,725	బాపట్ల	2,286
తూర్పు గోదావరి	10,183	కాకినాడ	1,829
పశ్చిమ గోదావరి	10,134	అనకాపల్లి	1,665
ఏలూరు	8,368	పార్వతీపురం మన్యం	1,043
నంద్యాల	8,122	అల్లూరి సీతారామరాజు	533
గుంటూరు	6,264	అంబేడ్కర్ కోనసీమ	141
		మొత్తం	3,09,111

ఇసుక లారీలకు డిపాజిట్టా?

ప్రభుత్వంపై ఇసుక లారీ ఓనర్ల మండిపాటు

- ఎవరి నిర్ణయమిది.. ఎందుకు చేయాలి?
- మైనింగ్ శాఖతో ఒప్పందం చేసుకోవాలా?
- లారీ కిరాయిపై జీఎస్టీ ఎలా విధిస్తారు?
- రవాణాలో జాప్యం జరిగితే జరిమానా విధిస్తారా?



సమావేశంలో మాట్లాడుతున్న ఇసుక లారీ ఓనర్లు

భవానీపురం (విజయవాడ పశ్చిమ): లక్షలాది రూపాయలు అప్పులు చేసి, లారీ కొనుక్కొని కిరాయికి తిప్పుకుంటున్న తమను ప్రభుత్వం వేధిస్తోందని ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక సరఫరాకు తాము ప్రభుత్వానికి ముందస్తుగా ఎందుకు డిపాజిట్ చెల్లించాలని, ఇది ఎవరి నిర్ణయమని నిలదీశారు. పైగా రూ.50 బాండ్ పేపర్‌పై మైనింగ్ శాఖతో అగ్రిమెంట్ (ఒప్పంద పత్రం) చేసుకుని, లారీని కిరాయికి తిప్పుకోవాలా? అని ప్రశ్నించారు. విజయవాడ విద్యాధరపురంలోని ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఉచిత ఇసుక పాలసీపై ధ్వజమెత్తుతూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఇసుక రీచ్‌కు లోడు కోసం వెళితే ఎప్పుడు బయటకు వస్తామో తెలియని పరిస్థితి నెలకొందని తెలిపారు. కొన్ని ఊళ్లల్లో స్థానిక కూటమి నాయకులు లోకల్ అంటూ రోజుకు మూడు ట్రిప్పులు తోలుకుంటుంటే తాము అలా వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వడ్లమూడి వెంకటేశ్వరరావు (విజయవాడ అర్బన్ శాండ్ లారీ ఓనర్స్ అసోసియేషన్), అన్నే చిట్టిబాబు (ఎన్టీఆర్ జిల్లా గౌరవాధ్యక్షుడు) సూరెడ్డి సాంబిరెడ్డి (ఫైవుల రోడ్ శాండ్ లారీ ఓనర్ల అసోసియేషన్), చుక్కాపు రమేష్, రత్తయ్య, తన్నీరు పాపారావు (డిస్ట్రిక్ట్ శాండ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు) తదితరులు పాల్గొన్నారు.

ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పండి

- కిరాయికి ఇసుక తోలే ట్రాక్టర్‌కు రూ.1500, 6 టైర్ల లారీకి రూ.3 వేలు, 10 టైర్ల లారీకి రూ.6 వేలు, 12–14 టైర్ల లారీకి రూ.10 వేలు డిపాజిట్ చేయాలనడం దుర్మార్గమైన చర్య కాదా?
- ఇసుక రవాణా చార్జీల విషయంలో రవాణా శాఖ, కలెక్టర్, మైనింగ్ శాఖ అధికారులు లారీ యజమానులతో చర్చించకుండా వారి ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకోవడం లారీ ఓనర్లను మోసం చేయడం కాదా?
- లారీ కిరాయి ధర్పై జీఎస్‌టీ విధింపు ఎంత వరకు సమంజసం?
- బుక్ చేసుకున్న వారికి లోడును చేరవేయడంలో జాప్యం (ట్రాఫిక్ రద్దీ లేదా లారీ రిపేర్) జరిగితే జరిమానా విధిస్తామని చెప్పడం ఎంత వరకు న్యాయం?
- ఇంతకూ ఇసుక కిరాయి ఎవరు ఇస్తారు.. ఎప్పుడు ఇస్తారు.. ఎక్కడ ఇస్తారు?
- వేలకు వేలు ట్యాక్స్‌లు, డ్రైవర్ జీతభత్యాలు కట్టుకుంటూ ప్రభుత్వ ఆంక్షలు పాటించే కంటే మా లారీలను సర్కారుకే అప్పగిస్తాం.. అలా చేస్తే నెలకు ఎంత ఇస్తారు?

రాజకీయాల్లేకుండా వరద బాధితులకు నష్ట పరిహారమివ్వాలి

- శాసనమండలిలో విపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ డిమాండ్
- కృష్ణాకు రిటైనింగ్ వాల్ వల్ల విజయవాడకు పెద్ద ముప్పు తప్పింది
- బాధితులకు వైఎస్సార్‌సీపీ వరద సహాయం





విజయవాడ హనుమాన్ పేటలో వైఎస్సార్‌సీపీ అందజేస్తున్న నిత్యావసర సరుకులను తీసుకెళ్తున్న బాధితులు



మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

సాక్షి ప్రతినిధి, విజయవాడ: బుడమేరు వరదల విషయంలో సీఎం చంద్రబాబు చెప్పిందే చెప్పి అబద్ధాన్ని నిజం చేయాలనుకుంటారని శాసనమండలిలో ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. మూడు రోజుల పాటు చాలా మంది బాధితులకు నీరు, పాలు, ఆహారం అందలేదన్నారు. తాము ఆహారం, నీరు అందించేత వరకు ప్రభుత్వం స్పందించలేదని మండిపడ్డారు. రాజకీయాలకు అతీతంగా వరద సాయాన్ని అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరద బాధితులకు అందించే నిత్యావసర సరుకుల వాహనాలను మంగళవారం బొత్స సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. విజయవాడ హనుమాన్‌పేటలో వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు వెలంపల్లి, మాజీ మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్, వైఎస్సార్‌సీపీ నేతలు పోతిన వెంకట మహేష్, కార్పొరేటర్లు పాల్గొన్నారు. మూడు నియోజకవర్గాలకు నిత్యావసర సరుకులను తరలించి ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో బాధితులకు పంపిణీ చేశారు. అనంతరం బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. ''వరద బాధితుల సహాయార్థం నిత్యావసర సరుకులను ప్రతి ఇంటికి చేర్చాలని పార్టీ నిర్ణయించింది. గత ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తోంది తప్ప ప్రజా సమస్యలపై కూటమి ప్రభుత్వానికి అసలు ఆలోచనే లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృష్ణా నదికి రిటైనింగ్ వాల్ కట్టడంతో నగరానికి చాలా పెద్ద ముప్పు తప్పింది'' అని చెప్పారు.

ఇసుక ఫ్రీ అని చెప్పి బ్లాక్‌లో అమ్ముకుంటారా?

భవన నిర్మాణ కార్మికుల ఆగ్రహం



ఆందోళనలో పాల్గొన్న కార్మికులు

దాబాగార్డెన్స్: ఇసుక ఫ్రీగా ఇస్తామని చెప్పి ధరలు మరింత పెంచి బ్లాక్‌లో అమ్ముతూ.. భవన నిర్మాణ కార్మికుల పొట్టలు కొడుతున్న చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ కార్మికులను తీవ్రంగా మోసం చేశారని భవన నిర్మాణ కార్మికులు ధ్వజమెత్తారు. అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకొచ్చిన కూటమి ప్రభుత్వాన్ని నడిపే సత్తా లేకపోతే వెంటనే దిగిపోవాలని డిమాండ్ చేశారు. ఇసుక దొరకక భవన నిర్మాణ కార్మికులకు పనుల్లేక రోడ్డున పడ్డామంటూ సిటూ ఆధ్వర్యంలో మంగళవారం గొల్లలపాలెం సింగ్ హోటల్ జంక్షన్ వద్ద నిరసనకు దిగారు. కూటమి ప్రభుత్వం డౌన్ డౌన్ అంటూ ప్లకార్డులు పట్టుకుని, నినాదాలు చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఎం.సుబ్బారావు, కె.నర్సింగరావు, చంద్రమౌళి, సిమ్మినాయుడు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఎన్నో హామీలిచ్చిన కూటమి.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలన్నీ గాల్లోకి వదిలేసిందన్నారు. ఇసుక లభించకపోవడంతో వేలాది మంది భవన నిర్మాణ రంగ కార్మికులు రోడ్డున పడ్డారని వాపోయారు. భవన నిర్మాణ రంగ కార్మికులు ఇంతగా రోడ్డున పడినా.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించకపోవడం దారుణమని మండిపడ్డారు.

ముగిసిన ఐ-సెట్ ప్రవేశాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎంసీఏ, ఎంబీఏ కోర్సు(ఐసెట్-2024)ల్లో తుది దశ ప్రవేశాలు ముగిసినట్టు ఉన్నత విద్యా మండలి వైస్ చైర్ పర్సన్ పి.ఉమామహేశ్వరి దేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు	23,737
వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకున్న వారు	20,862
సీట్లు కేటాయించింది	20,009

ఉపాధ్యాయుని కీచకపర్వం!

- పాఠశాల వద్ద తల్లిదండ్రుల నిరసన
- తనపై ఫిర్యాదు చేశారన్న అక్కసుతో విద్యార్థినులపై కక్ష
- క్లాసులకు రావొద్దంటూ హుకుం
- తమ చదువు ఏమవుతుందోనని ఆందోళనలో విద్యార్థులు



రేణిగుంట: సభ్యసమాజం తలదించుకునేలా ఓ ఉపాధ్యాయుడు కీచక అవతారం ఎత్తిన ఘటన తిరుపతి జిల్లా రేణిగుంట మండలం ఆర్.మల్లవరం హైస్కూల్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత విద్యార్థినుల తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఆర్.మలవరం హైస్కూల్లో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న రవి ఇటీవల 10వ తరగతి విద్యార్థినులను పాఠాలు చెప్పే క్రమంలో వారి ప్రైవేటు భాగాలపై చేతులు వేసి అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆ ఇద్దరు విద్యార్థినులు తల్లిదండ్రులకు చెప్పారు. తల్లిదండ్రులు స్కూల్ వద్దకు వచ్చి టీచర్ రవితో వాగ్వాదానికి దిగారు. హెచ్ఎం వెంకటరమణ కలుగజేసుకుని ఇకపై అలా జరగకుండా చర్యలు తీసుకుంటానని సర్దిచెప్పి పంపారు. అయితే అప్పటి నుంచి తనపై ఫిర్యాదు చేసిన విద్యార్థినులపై టీచర్ రవి కక్ష కట్టారు. తన క్లాసుకు రావద్దంటూ విద్యార్థినులను బయటకు పంపారు. దీంతో తమ చదువులు ఏమైపోతాయోనని భయాందోళన చెందుతున్నారు. ఆయనపై చర్యలు తీసుకుని బదిలీ చేయాలని పలువురు విద్యార్థులు కోరుతున్నారు. ఈ ఘటనపై టీచర్ రవి మాట్లాడుతూ.. విద్యార్థినుల ఆరోపణలను ఖండించారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ వారం రోజుల కిందట ఇద్దరు విద్యార్థినుల తల్లిదండ్రులు వచ్చి వారి పిల్లలను టీచర్ రవి తాకరాని చోట తాకినట్లు ఫిర్యాదు చేశారని, భవిష్యత్తులో ఇలాంటివి జరగవని సర్ది చెప్పి పంపించానన్నారు.

రేపటి నుంచి ఆన్‌లైన్‌లో టెట్ నమూనా పత్రాలు

సాక్షి, అమరావతి: వచ్చే నెల 3వ తేదీ నుంచి జరగనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్షకు సంబంధించి టెట్ నమూనా పరీక్ష పత్రాలు ఈనెల 19 నుంచి https://cse.ap.gov.in/ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని పాఠశాల విద్య డైరెక్టర్ విజయ్ రామరాజు ఓ ప్రకటనలో తెలిపారు. టెట్ కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు తమ మొబైల్ ఫోన్ లేదా కంప్యూటర్‌లో మాక్ టెస్ట్‌లను సాధన చేయవచ్చని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈనెల 22 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు.

24 వరకు ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తు గడువు

సాక్షి, అమరావతి: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష దరఖాస్తు గడువును ఈనెల 24వరకు పొడిగించినట్టు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 8న ఈ పరీక్ష జరగనున్నదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మేనేజ్‌మెంట్‌లోని పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ, కుటుంబ వార్షికాదాయం రూ.3.50 లక్షల లోపు ఉన్నవారు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

దొంగ కెమెరాలపై ఓ కన్నేద్దాం



ఈ టెక్నాలజీ యుగంలో వ్యక్తుల గోప్యత, భద్రతకు రక్షణ లేకుండా పోతోంది. రహస్య కెమెరాల ద్వారా వ్యక్తిగత జీవితాన్ని చిత్రీకరించి.. తద్వారా బ్లాక్‌మెయిల్ చేసే సంస్కృతి ఏటేటా పెరిగిపోతోంది. రహస్య కెమెరాలను గుర్తించడం కొంత కష్టమైనా.. అసాధ్యం మాత్రం కాదు. కొత్త ప్రదేశాలకు వెళ్లినప్పుడు, లేదా నిత్యం సంచరించే ప్రాంతాల్లో కూడా వాటి పట్ల అలెర్ట్‌గా ఉండటం మేలు. కొంత జాగ్రత్త వహిస్తే రహస్య కెమెరాల కంట్లో పడకుండా సులువుగా తప్పించుకోవచ్చు.

సాధారణంగా గదుల్లో రహస్య కెమెరాలు ఎక్కడెక్కడ ఉండే అవకాశాలు ఉన్నాయి

- మంచం ఫ్రేములు, మంచానికి ఉండే హెడ్ బోర్డులలో..
- గోడ గడియారాలు, బల్బులు, లైట్ల స్విచ్‌బోర్డులు, ఇతర ఎలక్ట్రికల్ డివైజ్‌లలో..
- డ్రస్సింగ్ టేబుల్స్ అద్దాల్లో, ఇతర టేబుల్స్ పైన ఉండే వస్తువుల్లో..
- పిక్చర్ ఫ్రేమ్‌లు, వాల్ హ్యాంగింగ్, డెకరేటివ్ ఐటమ్స్, ప్లాంట్‌లలో..
- బాత్‌రూమ్‌లు, టాయ్‌లెట్లలో ఉండే డెకరేటివ్ ఐటమ్స్‌లో, షవర్ హెడ్స్, అద్దాల వెనుక..
- గది సీలింగ్ మూలల్లో.. కిటికీల ఫ్రేముల్లో, అనుమానాస్పదంగా కనిపించే వైర్లలో..
- డోర్ హ్యాండిల్స్, డోర్ బెల్స్, యూఎస్‌బీ చార్జింగ్ పాయింట్లు, స్క్రూలు, క్లాత్ హ్యాంగర్లలో..



ఎలా గుర్తించాలి

- **క్షుణ్ణంగా పరిశీలన:** కొత్త రూమ్‌లోకి అడుగుపెట్టినప్పుడు లోపల అంతా క్షుణ్ణంగా పరిశీలించాలి. బెడ్‌రూమ్‌లోనూ, బాత్‌రూంలోనూ అసాధారణంగా ఉండే వస్తువులను పరిశీలించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- **వస్తువులను చెక్ చేయాలి:** రోజువారీ వినియోగించే సామగ్రిలో రహస్య కెమెరాలు ఉంచే అవకాశం కూడా ఉంటుంది. స్విచ్ బోర్డులు, అద్దాల వెనక, స్మోక్ డిటెక్టర్లు ఉంటే వాటిలో, ల్యాంప్స్, డెకరేటివ్ వస్తువులను చెక్ చేయాలి.
- **ఫ్లాష్ లైట్‌తో గుర్తింపు:** రూమ్‌లో ముఖ్యంగా చీకటిగా ఉండే ప్రాంతాల్లో ఫ్లాష్ లైట్ వేయాలి. దీనివల్ల ఇతర వస్తువులపై పడే లైట్ కన్నా కెమెరాల లెన్స్‌పై పడిన లైట్ విభిన్నంగా ప్రతిబింబిస్తుంది. అలాగే రూమ్‌లో లైట్లు ఆర్పేసి ఫ్లాష్‌లైట్ ఆన్ చేస్తే రహస్య కెమెరాల నుంచి వచ్చే రిఫ్లెక్షన్ ద్వారా వాటిని గుర్తించవచ్చు.
- **స్మార్ట్‌ఫోన్ యాప్స్:** రహస్య కెమెరాల ఇన్‌ఫ్రారెడ్ లైట్‌ను గుర్తించే స్మార్ట్ ఫోన్ యాప్స్ అందుబాటులో ఉన్నాయి. ఈ యాప్స్‌ను వినియోగించడం ద్వారా రహస్య కెమెరాలను గుర్తించవచ్చు.



- **ఆర్‌ఎఫ్ డిటెక్టర్స్:** కెమెరాల నుంచి వచ్చే వైర్‌లెస్ సిగ్నల్స్‌ను పోర్టబుల్ రేడియో ఫ్రీక్వెన్సీ (ఆర్‌ఎఫ్) డిటెక్టర్స్ ద్వారా గుర్తించవచ్చు. ఇతర నిఘా పరికరాల ఫ్రీక్వెన్సీలను కూడా ఆర్‌ఎఫ్ డిటెక్టర్ల ద్వారా గుర్తించవచ్చు.
- **వైర్లు, కేబుల్స్:** సాధారణంగా ఉండే వైర్లు, కేబుల్స్ కాకుండా.. అనుమానాస్పదంగా ఉండే కేబుళ్లు, వైర్లను క్షుణ్ణంగా పరిశీలించాలి. ఇవి రహస్య కెమెరాలకు ఎలక్ట్రిసిటీని అందించేవి లేదా డేటా ట్రాన్స్‌ఫర్ చేసేవి కావచ్చు.
- **వైఫై నెట్‌వర్క్ స్కానర్లు:** పబ్లిక్ ప్లేసుల్లో ఉచితంగా లభించే వైఫై నెట్‌వర్క్ వినియోగించడం అంత మంచిది కాకపోయినా.. వైఫై స్కానర్ ఓపెన్ చేసి అనుమానాస్పదంగా ఉండే నెట్‌వర్క్‌లు కనిపిస్తే జాగ్రత్తగా ఉండటం మంచిది.
- **భౌతిక పరిశీలన:** రహస్య కెమెరాలు పెట్టే అవకాశం ఉన్న ప్రాంతాల్లో సున్నితంగా తట్టినప్పుడు అక్కడ డొల్ల శబ్దం కనుక వస్తే అనుమానించాలి.
- **ఫోన్ ఇన్‌ఫ్రారెడ్ కెమెరా:** మన ఫోన్ కెమెరా ఇన్‌ఫ్రారెడ్ కెమెరా అయితే.. దాని ద్వారా రహస్య కెమెరాలను గుర్తించవచ్చు. ఆ కెమెరాను ఓపెన్ చేసి రూమ్‌ను స్కాన్ చేస్తే చిన్న చిన్న బరస్ట్‌లు, ఫ్లాష్ లైట్ కనబడితే అక్కడ రహస్య కెమెరా ఉందని గుర్తించవచ్చు.



రహస్య కెమెరాలను గుర్తించే కొన్ని యాప్స్

- **హిడెన్ కెమెరా అండ్ డివైజ్ ఫైండర్:** రహస్య కెమెరాలను వేగంగా, సులువుగా గుర్తించగలం అని యాప్ డెవలపర్లు చెబుతున్నారు. ఎలాంటి రహస్య కెమెరానైనా యాప్‌లో వైఫై, బ్లూటూత్ టెక్నాలజీతో గుర్తించవచ్చు.
- **హిడెన్ స్పై కెమెరా డిటెక్టర్:** ఈ యాప్‌లో ఆల్ ఇన్ వన్ నెట్‌వర్క్ స్కానర్ ఉంది. దీనితో జీపీఎస్ ట్రాకర్లు, రహస్య కెమెరాలను వేగంగా గుర్తించే సామర్థ్యం దీని సొంతం.
- **హిడెన్ కెమెరా డిటెక్టర్– స్పై సీ:** ఏదైనా అనుమానాస్పదంగా ఉన్న వస్తువు వద్దకు కెమెరాను తీసుకెళితే యాప్ ద్వారా దానిలో రహస్య కెమెరా ఉందో, లేదో గుర్తించవచ్చు. దీనికి అదనంగా దీనిలో మేగ్నెటోమీటర్ కూడా ఉంది. దీనితో కెమెరాలు, స్పీకర్ల నుంచి వెలువడే అయస్కాంత తరంగాలను సులువుగా గుర్తించవచ్చు.
- **హిడెన్ స్పై కెమెరా డిటెక్టర్:** ఈ యాప్ రహస్య కెమెరాలను, ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలను గుర్తించడానికి సహాయ పడుతుంది.
- **హిడెన్ కెమెరా డిటెక్టర్ ప్రో:** రహస్య కెమెరాలనే కాకుండా, రహస్య మైక్రోఫోన్లను కూడా ఈ యాప్ ద్వారా గుర్తించవచ్చు. ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలను గుర్తించడమే కాకుండా, యూజర్ల రక్షణ కోసం టిప్స్, మెలకువలు కూడా అందిస్తామని యాప్ చెబుతోంది.
- **హిడెన్ పిన్‌హోల్ కెమెరా డిటెక్టర్:** రహస్యంగా రికార్డు చేసే కెమెరాల విషయంలో ఈ యాప్ యూజర్లను ముందస్తుగా అలెర్ట్ చేస్తుంది. నిఘాకు అనువుగా ఉండే ప్రాంతాల విషయంలో ముందస్తు హెచ్చరికలు చేస్తుంది.



-ఏపీ సెంట్రల్ డెస్క్

క్లుప్తంగా...

వేసవిలో విధులకు ఆర్జిత సెలవులు ఇవ్వాలి



సాక్షి, అమరావతి: గత వేసవి సెలవుల్లో విధులు నిర్వహించిన ప్రధానోపాధ్యాయులకు ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈమేరకు పరిషత్ ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎఫ్ షరీఫ్, అధికార ప్రతినిధి ఎం.వీరబ్రహ్మం పాఠశాల విద్య డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఆర్బీకేల ద్వారా సూక్ష్మ పోషకాలు



సాక్షి, అమరావతి: రైతు సేవా కేంద్రాల(ఆర్బీకే) ద్వారా వచ్చే రబీ సీజన్ నుంచి సూక్ష్మపోషకాలు పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. నోడల్ ఏజెన్సీగా ఏపీ స్టేట్ కో–ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్ (ఏపీ మార్క్‌ఫెడ్)కు బాధ్యతలు అప్పగిస్తూ వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పారా స్విమ్మింగ్‌లో సత్తాచాటాలి

శాప్ ఎండీ గిరీషా

సాక్షి, అమరావతి: రాష్ట్రస్థాయి పారా స్విమ్మింగ్ పోటీల్లో క్రీడాకారులు సత్తాచాటాలని శాప్ ఎండీ గిరీషా సూచించారు. మంగళవారం శాప్ కార్యాలయంలో 6వ రాష్ట్ర స్థాయి పారా స్విమ్మింగ్ పోటీల వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ప్రతి జిల్లా నుంచి పారా స్విమ్మింగ్ క్రీడాకారులు పోటీల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

దువ్వాడ పిటిషన్‌పై విచారణ వాయిదా



సాక్షి, అమరావతి: తానిచ్చిన ఫిర్యాదు ఆధారంగా తన భార్య వాణి, పెద్ద కుమార్తె హైందవిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటూ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణను 2 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పన వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి మంగళవారం ఉత్తర్వులిచ్చారు.

వేద విద్య నిరుద్యోగులకు రూ.3,000 భృతి



సాక్షి, అమరావతి: వేద విద్యను చదివి ప్రస్తుతం ఏ ఉపాధి లేకుండా ఉన్న బ్రాహ్మణ యువతకు రూ.3,000 చొప్పున భృతి చెల్లించేందుకు దేవదాయ శాఖ జిల్లాల వారీగా అర్హుల జాబితాలను సిద్ధం చేస్తోంది. ఈ మేరకు రెండు రోజుల్లో జాబితాలను పంపాలంటూ దేవదాయ శాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ మంగళవారం అన్ని జిల్లాల దేవదాయ శాఖ జిల్లా అధికారులకు ఆదేశించారు.

గిరిజన మహిళా ఎంపీటీసీపై దాడిని సుమోటోగా స్వీకరించాం


సాక్షి, అమరావతి: పార్వతీపురం మన్యం జిల్లా మరిపల్లి పంచాయతీలో గిరిజన మహిళా ఎంపీటీసీ జన్ని సీతారామ్‌పై జరిగిన దాడిని సుమోటోగా స్వీకరించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశాలు ఇచ్చినట్లు ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు తెలిపారు. ఈ ఘటనపై తీసుకున్న చర్యలను వివరిస్తూ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

జలగండం!

ప్రస్తుతం దేశంలో తలసరి నీటి లభ్యత 1,486 క్యూబిక్ మీటర్లు


- 2031 నాటికి 1,367, 2051కు 1,228 క్యూబిక్ మీటర్లకు తగ్గనున్న నీటి లభ్యత
- జనాభా వృద్ధికి అనుగుణంగా నీటి లభ్యత పెరగకపోవడమే కారణం
- కేంద్ర జల సంఘం తాజా అధ్యయనంలో వెల్లడి

సాక్షి, అమరావతి: జలసంక్షోభం ముంచుకొస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా తలసరి నీటి లభ్యత గణనీయంగా తగ్గుతోంది. మన దేశంలో 1951 నాటికి తలసరి నీటి లభ్యత 5,177 క్యూబిక్ మీటర్లు(ఒక క్యూబిక్ మీటర్‌కు వెయ్యి లీటర్లు) ఉంటే... ప్రస్తుతం అది 1,486 క్యూబిక్ మీటర్లకు తగ్గింది. ఇది 2031 నాటికి 1,367 క్యూబిక్ మీటర్లకు... 2051 నాటికి 1,228 క్యూబిక్ మీటర్లకు తగ్గుతుందని కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) అంచనా వేసింది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నీటి లభ్యత పెరగకపోవడం వల్లే తలసరి నీటి లభ్యత నానాటికీ తగ్గిపోతోందని వెల్లడించింది. సముద్రం పాలవుతున్న నదీ జలాలను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవడం, భూగర్భ జలాలను సంరక్షించుకోవడం, వ్యర్థ జలాలను శుద్ధిచేసి మళ్లీ వినియోగించుకోవడం ద్వారా తలసరి నీటి లభ్యతను పెంచుకోవచ్చని సూచించింది.



సీడబ్ల్యూసీ అధ్యయన నివేదికలో ప్రధాన అంశాలు...

- ప్రపంచంలో భూమిపై ఉన్న నీటిలో 97.5 శాతం ఉప్పునీరు. 2.5 శాతం మాత్రమే మంచినీరు. భూమిపై ఉన్న మంచినీటిలో 68.9 శాతం హిమానీనదాలు(గ్లేసియర్లు)లో ఉండగా, భూగర్భజలాలు, భూమిలో తేమ రూపంలో 30.8 శాతం, నదులు, సరస్సులలో 0.3 శాతం ఉంది.
- మన దేశ భౌగోళిక విస్తీర్ణం 328.75 మిలియన్ హెక్టార్లు. ప్రపంచ భౌగోళిక విస్తీర్ణంలో మన దేశ విస్తీర్ణం వాటా 2.44 శాతం. దేశంలో సగటున ఏటా 1,170 మిల్లీమీటర్ల వర్షపాతం కురుస్తుంది. వర్షపాతం వల్ల ఏటా 4,000 బిలియన్ క్యూబిక్ మీటర్లు(బీసీఎం) నీరు లభిస్తుంది. ఇందులో 1,999.2 బీసీఎంల నీటిని ఉపయోగించుకోవడానికి అవకాశం ఉంది. ప్రస్తుతం 1,139.18 బీసీఎంల నీటిని వినియోగించుకుంటున్నాం.
- ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ప్రమాణాల ప్రకారం తలసరి నీటి లభ్యత 5 వేల క్యూబిక్ లీటర్లు ఉండాలి. ఆ ప్రమాణాల మేరకు మన దేశంలో 1951లో మాత్రమే నీటి లభ్యత ఉంది. ఆ తర్వాత క్రమేణా జనాభా పెరుగుతూ ఉండటం, దానికి అనుగుణంగా నీటి లభ్యతను పెంచుకోకపోవడం వల్లే తలసరి నీటి లభ్యత తగ్గిపోతోంది.
- ఏ దేశంలో అయినా తలసరి నీటి లభ్యత 1,700 క్యూబిక్ లీటర్లు ఉంటే... ఆ దేశంలో నీటి కొరత తీవ్రంగా ఉన్నట్లు. ప్రస్తుతం మన దేశంలో తలసరి నీటి లభ్యత 1,486 క్యూబిక్ మీటర్లు ఉంది. ఈ లెక్కన మన దేశంలో తీవ్ర నీటి కొరత ఉన్నట్లు స్పష్టమవుతోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే 2051 నాటికి దేశంలో తీవ్ర జలసంక్షోభం తలెత్తడం ఖాయమని సీడబ్ల్యూసీ ఆందోళన వ్యక్తంచేసింది.



పిల్లలతో ప్రభుత్వం చెలగాటం

వైద్యులు అందుబాటులో లేకుండానే డీవార్మింగ్ డే

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా చిన్నారులు, పిల్లలతో ప్రభుత్వం చెలగాటం ఆడింది. పీహెచ్‌సీ వైద్యులు సమ్మెలో ఉన్న సమయంలో నులిపురుగుల నిర్మూలన దినోత్సవం (డీవార్మింగ్ డే)ను వైద్య శాఖ మంగళవారం చేపట్టింది. దీన్లోభాగంగా 1–19 ఏళ్లలోపు పిల్లలందరికీ వైద్యశాఖ ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తోంది. కొన్ని సందర్భాల్లో మాత్రలు వేసుకున్న అనంతరం పిల్లలు కళ్లు తిరిగి పడిపోవడం, అపస్మారక స్థితిలోకి వెళ్లడం వంటి ప్రతికూల ప్రభావాలు తలెత్తుతాయి. ఇలాంటి సందర్భాల్లో పీహెచ్‌సీ వైద్యులు వెంటనే చికిత్సలు అందించాల్సి ఉంటుంది. సమ్మె కారణంగా వైద్యులు సేవలకు దూరంగా ఉన్నప్పటికీ ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్‌లు, సీహెచ్‌వోలతో మాత్రలు పంపిణీ పూర్తి చేయాలని ఉన్నతాధికారులు డీఎంహెచ్‌వోలకు ఆదేశాలు జారీ చేశారు.

భద్రతను పునరుద్ధరించేలా ఆదేశాలివ్వండి

హైకోర్టులో మాజీ ఎమ్మెల్యే బ్రిజేంద్రరెడ్డి

సాక్షి, అమరావతి: తనకు 3+3 భద్రతను ఉపసంహరించడాన్ని సవాలు చేస్తూ ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రాణహాని నేపథ్యంలో తనకున్న భద్రతను పునరుద్ధరించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. భద్రతను ఉపసంహరించడాన్ని ఏకపక్షంగా, చట్ట విరుద్ధంగా ప్రకటించాలని అభ్యర్థించారు. 2019లో తనపై తన రాజకీయ ప్రత్యర్థులు దాడి చేశారని, ఇందులో పోలీసులు తీవ్రంగా గాయపడ్డారని పేర్కొన్నారు. తనపై పోటీ చేసిన అభ్యర్థి తరచూ నేరాలకు పాల్పడుతుంటారని, ఆమెపై పోలీసులు కేసులు నమోదయ్యాయన్నారు. ఆమె భర్తపై కూడా పలు క్రిమినల్ కేసులున్నాయని తెలిపారు. తనకు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా భద్రతను ఉపసంహరించారని తెలిపారు. సెక్యూరిటీ రివ్యూ కమిటీ సైతం తనకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదన్నారు. ఈ వ్యాజ్యంలో హోం శాఖ ముఖ్య కార్యదర్శి, సెక్యూరిటీ రివ్యూ కమిటీ అదనపు డీజీ, నంద్యాల ఎస్పీ, ఆళ్లగడ్డ పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోలను ప్రతివాదులుగా పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకూ మద్యం షాపులు కేటాయించాలి

ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్ విజ్ఞప్తి



సాక్షి, అమరావతి: మద్యం షాపులను ఎస్సీ, ఎస్టీలకు కూడా కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనాను వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో కలిసిన శంకర్‌నాయక్ మంగళవారం వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో కల్లుగీత కార్మికులకు పది శాతం మద్యం షాపులు కేటాయించేలా నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల పట్ల కూడా సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. జీవనోపాధి, కుటుంబ పోషణ కోసం గిరిజన యువత నాటుసారా తయారీ, గంజాయి స్మగ్లింగ్ వంటి అడ్డదారులు తొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి కూడా మద్యం షాపులను కేటాయించి ఉపాధి మార్గాన్ని చూపితే సారా, గంజాయి వంటి సామాజిక రుగ్మతల జోలికి పోకుండా గౌరవంగా జీవనం సాగించేలా ప్రభుత్వం దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని మీనా తెలిపినట్లు శంకర్‌నాయక్ స్పష్టం చేశారు.

బీసీలే టీడీపీ ప్రభుత్వానికి బ్యాక్ బోన్ : మంత్రి సవిత

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వానికి బీసీలే బ్యాక్ బోన్ అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖా మంత్రి ఎస్.సవిత తెలిపారు. విజయవాడ గొల్లపూడిలోని బీసీ భవన్‌లో మంగళవారం విశ్వకర్మ జయంత్యుత్సవాన్ని నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రపంచ తొలి వాస్తు శిల్పిగా, సృష్టికర్తగా విశ్వకర్మ పేరుగాంచారన్నారు. చేతి వృత్తులకు ఆద్యుడిగా విశ్వకర్మను ఆరాధిస్తున్నామని, ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామని చెప్పారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యమని, 2019కి ముందు బీసీల అభ్యున్నతి కోసం అమలు చేసిన పథకాలన్నింటినీ మరోసారి వర్తింపజేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. మాజీ మంత్రి నెట్టెం రఘురామయ్య, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి పోలా భాస్కర్, విశ్వకర్మ కార్పొరేషన్ జీఎండీ తనూజరాణి, తదితరులు పాల్గొన్నారు.

2030నాటికి సున్నా శాతానికి ఎయిడ్స్ వ్యాప్తి

సాక్షి, అమరావతి: ఎయిడ్స్ వ్యాప్తిని 2030 నాటికి సున్నా శాతానికి తగ్గించటమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపీశాక్స్) పీడీ డాక్టర్ ఎ. సిరి తెలిపారు. హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమంలో భాగంగా శాక్స్ ఆధ్వర్యంలో విజయవాడలో మంగళవారం 5కె రన్‌ను సిరి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపవద్దని కోరారు. ప్రస్తుతం 10 వేల మందికి పైగా బాధితులున్నారని తెలిపారు. 5కె రన్‌లో విజేతలకు నగదు బహుమతిగా చెక్కులు, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు.



శ్రీవారి దర్శనానికి 24 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూ కృష్ణతేజ అతిథిగృహం వద్దకు చేరుకుంది. సోమవారం అర్ధరాత్రి వరకు 76,200 మంది స్వామి వారిని దర్శించుకోగా 29,492 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.61 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ముక్కంటికి పవిత్రాల సమర్పణ



శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఆలయ అర్చకులు మూలవిరాట్‌లకు పవిత్రమాల ధారణతో విశేష పూజా కార్యక్రమాలు వేదోక్తంగా నిర్వహించారు. యాగశాలలో విశిష్ట పూజాద్రవ్యాలతో శాంతిహోమం పూజలు, చండికేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు.

వైభవంగా శ్రీశైలగిరి ప్రదక్షిణ



శ్రీశైలంటెంపుల్: పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీశైల క్షేత్రంలో మంగళవారం గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. సాయంత్రం స్వామిఅమ్మవార్ల మహా మంగళహారతుల అనంతరం శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి ప్రత్యేక పూజలు చేపట్టారు. పల్లకీ ఊరేగింపుతో శ్రీశైల గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. ఆలయ మహాద్వారం నుంచి మొదలైన గిరి ప్రదక్షిణ గంగాధర మండపం, అంకాళమ్మ గుడి, నందిమండపం, గంగాసదనం, బయలువీరభద్ర స్వామి ఆలయం, రింగ్‌రోడ్డు, ఫిల్టర్‌బెడ్, సిద్ధరామప్పకొలను, పుష్కరిణి వద్దకు చేరుకుంది. అక్కడి నుంచి తిరిగి నందిమండపం, ఆలయ మహాద్వారం వద్దకు చేరుకుంది.

సింహగిరిపై ముగిసిన పవిత్రోత్సవాలు




సింహాచలం: సింహగిరిపై గత ఐదు రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాలు మంగళవారం ఉదయం ఘనంగా ముగిశాయి. స్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ భోగమండపంలో వేంజేప చేసి పంచామృతాలు, గంగధార జలాలతో అభిషేకం నిర్వహించారు.

భ్రామరీకి లక్ష కుంకుమార్చన

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబాదేవికి మంగళవారం పౌర్ణమి ఘడియలు ప్రారంభమవడంతో సాయంత్రం లక్ష కుంకుమార్చన సేవను శాస్త్రోక్తంగా చేపట్టారు. శ్రీశైలానికి స్వయంగా విచ్చేయలేని భక్తులు పరోక్షసేవగా పాల్గొనే అవకాశం దేవస్థానం కల్పించింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి 22 మంది భక్తులు పరోక్షసేవ ద్వారా పాల్గొన్నారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన



డాబాగార్డెన్స్: విశాఖ నగరంలోని బురుజుపేట కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

ప్రారంభమైన పీజీ తరగతులు



తిరుపతి సిటీ: ఎస్వీయూ, పద్మావతి మహిళా వర్సిటీల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను మొదటి విడతలో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ కోర్సుల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు మంగళవారం నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరు కావాలని, వర్సిటీ నిబంధనల ప్రకారం హాజరు తగ్గితే సెమిస్టర్ పరీక్షలకు అనుమతించబోమని ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు ఒక ప్రకటనలో తెలిపారు.



గిరిజన విద్యార్థులకు ఫెలోషిప్ స్కాలర్‌షిప్‌లు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు జిల్లాలో ఉన్నత విద్య చదువుతున్న గిరిజన విద్యార్థులకు నేషనల్ ఫెలోషిప్ స్కాలర్‌షిప్ లు అందజేస్తారని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2024–25 సంవత్సరానికి కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ ఫెలోషిప్ స్కాలర్‌షిప్ లు అందజేస్తారన్నారు. www. fellowship.tribal.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 30 వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు.


జెనెసిక్ స్కీమ్ ఇంప్లిమెంట్ ఏజెన్సీగా మహిళా వర్సిటీ టీబీఐ

తిరుపతి సిటీ: కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖకు చెందిన జెనెసిక్ స్కీమ్ ఇంప్లిమెంటేషన్ ఏజెన్సీగా పద్మావతి మహిళా వర్సిటీలోని ఎస్ఎస్ఐఐఈ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ సెంటర్ ఎంపికైనట్లు అధికారులు వెల్లడించారు. పర్యావరణ వ్యవస్థను ప్రోత్సహించడం, మెరుగుపరచడమే ఈ జెనెసిక్ స్కీమ్ ప్రధాన లక్ష్యం.

ఏపీ పీజీ సెట్ రెండో విడత కౌన్సెలింగ్ ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ పీజీ సెట్–2024 రెండో విడత కౌన్సెలింగ్ మంగళవారం ప్రారంభమైంది. షెడ్యూల్ మేరకు ఈ నెల 19వ తేదీలోపు రిజిస్ట్రేషన్, 21లోను ఆన్‌లైన్‌లో ధ్రువీకరణ పత్రాల అప్‌లోడ్, 23 నుంచి 25వరకు వెబ్ ఆప్షన్లు, 26న ఆప్షన్ల మార్పునకు అవకాశం ఇచ్చారు. 28న అలాట్‌మెంట్‌లు ప్రకటిస్తారు. ఐదో తేదీ నుంచి క్లాస్‌వర్క్ ప్రారంభం కానుంది.

ఫెస్టివల్ సీజన్‌కూ క్యూ-కామర్స్ కిక్కు



తీవ్రమైన పోటీని ఎదుర్కొంటున్న సంప్రదాయ ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్స్

ఆన్‌లైన్ డెలివరీలతో ఈ డిమాండ్‌ను తట్టుకునేందుకు సిద్ధమవుతున్న సంస్థలు

హైదరాబాద్‌సహా పలు ముఖ్యమైన నగరాల్లో 'షిప్ రాకెట్ క్విక్ '

సాక్షి, హైదరాబాద్: భారత్‌లో పండుగల సీజన్ మొదలైంది. దేశవ్యాప్తంగా అంగరంగ వైభవంగా గణేశుని నిమజ్జనంతో వినాయకచవితి ఉత్సవాలు ముగియగా...ఇక దసరా, దీపావళి వరుస పండుగల సందడి ప్రారంభం కానుంది. వచ్చే జనవరి మధ్యలో జరగనున్న సంక్రాంతి దాకా రాబోయే ఫెస్టివల్ సీజన్‌కు ఈసారి క్విక్-కామర్స్ అనేది కీలకంగా మారనుంది. రెండు తెలుగు రాష్ట్రాలతో సహా మరికొన్ని రాష్ట్రాల్లో సంక్రాంతి ముగిసే దాకా సుదీర్ఘకాలం పాటు పండుగ ఉత్సవాలు కొనసాగుతాయి. ప్రస్తుత పోటీ ప్రపంచంలో వస్తువులు, ఆయా ఉత్పత్తులు వేగంగా ఇళ్లు, కస్టమర్లకు చేరవేయడం అనేది అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. దేశంలోని సంప్రదాయ ఎలక్ట్రానిక్ (ఈ)-కామర్స్ ప్లాట్‌ఫామ్స్ ఇప్పటికే వివిధ వర్గాల వినియోగదారులపై తమ ముద్రను బలంగానే చూపాయి. దీంతో రిటైల్ రంగంలోని వ్యాపార సంస్థలు, వ్యాపారులను ఈ-కామర్స్ దిగ్గజాలు కొంతమేరకు దెబ్బకొట్టాయి. అయితే మారుతున్న వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా ఈ-కామర్స్‌ను తలదన్నేలా క్విక్ (క్యూ)-కామర్స్ అనేది ఓ కొత్త కేటగిరీగా ముందుకొచ్చింది. అమెరికాతో సహా వివిధ దేశాల్లో నిత్యావసరాలు మొదలు వివిధ రకాల వస్తువులను ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేశాక మరుసటి రోజుకు చేరవేయడంలో సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇంటి పక్కనే ఉన్న దుకాణానికి వెళ్లి అవసరమైన వస్తువులను తెచ్చుకున్నంత సులువుగా వివిధ వినియోగ వస్తువులు, ఉత్పత్తులను పది నిమిషాల్లోనే కస్టమర్లకు చేరవేసే డెలివరీ మోడళ్లు మనదేశంలో హైదరాబాద్‌తో సహా పలు ప్రముఖనగరాల్లో ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి. దీంతో సంప్రదాయ ఈ-కామర్స్ సంస్థలకు పోటీగా క్యూ-కామర్స్ ఎదుగుతోంది. ఇదిలా ఉంటే...డైరెక్ట్ టు కన్జూమర్ బ్రాండ్స్ కూడా వేగంగా తమ వినియోగదారులను చేరుకోవడం ద్వారా తమ ఉత్పత్తుల విక్రయాలను పెంచుకోవాలని పట్టుదలతో ఉన్నాయి. ప్రస్తుత పండుగల సీజన్‌లో దేశవ్యాప్తంగా ఈ-కామర్స్ పరిశ్రమ ద్వారా 35 శాతం అమ్మకాలు పెరుగుతాయని 'టీమ్ లీజ్'తాజా నివేదిక వెల్లడించింది. డిమాండ్‌ను తట్టుకొని 'ఆన్ టైమ్ డెలివరీ'చేసేందుకు వీలుగా ఆయా సంస్థలు ఇప్పటి నుంచే ముందస్తు ఏర్పాట్లు చేసుకోవడంలో నిమగ్నమయ్యాయి.

- క్విక్-కామర్స్ సెగ్మెంట్‌లో.. వచ్చే అక్టోబర్‌లో నిర్వహించనున్న వార్షిక ఉత్సవం 'బిగ్ బిలియన్ డేస్-2024'కోసం ఫ్లిప్‌కార్ట్ 'మినిట్స్'ను ప్రారంభించింది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రధాననగరాల్లో వంద దాకా 'డార్క్ స్టోర్స్'ను తెరవనుంది
- ప్రస్తుతమున్న 639 డార్క్ స్టోర్ల నుంచి 2026 ఆఖరుకల్లా రెండువేల స్టోర్లకు (ఈ ఆర్థిక సంవత్సరంలోనే 113 స్టోర్ల ఏర్పాటు) బ్లింకిట్ ప్రణాళికలు సిద్ధం చేసింది
- వచ్చే మార్చికల్లా దేశవ్యాప్తంగా 700 డార్క్ స్టోర్లను ఏర్పాటు చేయాలని (ఇప్పుడున్న 350 స్టోర్ల నుంచి) జెప్టో నిర్ణయించింది.
- డెలివరీ పార్ట్‌నర్స్, లాజిస్టిక్స్ సపోర్ట్‌ను అందించే 'షిప్ రాకెట్, ఈ-కామ్ ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్‌బీస్ వంటివి కస్టమర్లకు వేగంగా డెలివరీలు చేసేందుకు వీలుగా తమ మౌలిక సదుపాయాలను మెరుగుపరుచుకుంటున్నాయి
- హైదరాబాద్‌తో సహా ఢిల్లీ, బెంగళూరు, ముంబై, చెన్నై, కొచ్చి, పుణే వంటి నగరాల్లో షిప్ రాకెట్ ఇప్పటికే 'షిప్ రాకెట్‌క్విక్'లను ప్రారంభించింది. పలు నగరాల్లో మరో నెలలో ఈ సరీస్ులు మొదలుకానున్నాయి
- కస్టమర్లకు వారి ఆర్డర్లను వేగంగా చేరవేసేందుకు వీలుగా షిప్‌రాకెట్ కంపెనీ స్థానిక లాజిస్టిక్ ప్లాట్‌ఫామ్స్ పోర్టర్, ఓలా, బోర్జె, ర్యాపిడో, షాడో ఫాక్స్‌తో భాగస్వామ్యాన్ని తయారు చేసుకుంది
- ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే దేశంలోని పది మెట్రో నగరాల్లో ఈ-కామ్ ఎక్స్‌ప్రెస్ అదే రోజు లేదా మరుసటి రోజు డెలివరీ సర్వీస్‌ను ప్రవేశపెట్టింది
- గిఫ్టింగ్ ప్లాట్‌ఫామ్స్ 'ఫెర్న్స్ ఎన్‌పెటల్స్'క్విక్ కామర్స్ ద్వారా పంపిణీకి సిద్ధం చేసిన ప్రత్యేక ఉత్పత్తుల రేంజ్‌లు సిద్ధం చేసింది. ఇందుకు ప్రముఖ కంపెనీలతో భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంది. దేశంలో క్యూ-కామర్స్‌కు ఆదరణ పెరిగిన నేపథ్యంలో ఈ పండుగల సీజన్‌లో తమ అమ్మకాలు గణనీయంగా పెరుగుతాయని విశ్వసిస్తోంది
- లాజిస్టిక్స్ మేజర్ డెలివరీ సంస్థ ఇప్పటికే ఈ-కామర్స్ కంపెనీలకు డార్క్ స్టోర్స్ నెట్‌వర్క్‌ను అందించేందుకు 'సేమ్‌డే డెలివరీ'అనే కొత్త సర్వీస్‌ను ప్రకటించింది

'డార్క్ స్టోర్స్'అంటే...

ఇలాంటి స్టోర్స్ కస్టమర్లు ప్రత్యక్షంగా వెళ్లి షాపింగ్ చేసేందుకు ఉద్దేశించినవి కాదు. వినియోగదారుల నుంచి వచ్చే ఆన్‌లైన్ ఆర్డర్లకు వీలైనంత ఎక్కువ వేగంగా వారి ఇళ్లకు డెలివరీ చేసేందుకు ఉద్దేశించి... విభిన్న రకాల వస్తువులు, ఉత్పత్తులను భద్రపరుచుకునేందుకు నగరంలోని బిజీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకునే స్టోర్లు ఇవి. పలురకాల వస్తువులను స్టోర్ చేయడానికి, ప్యాకింగ్ చేయడానికి, అక్కడి నుంచి కస్టమర్ల ఇళ్లకు తరలించడానికి ఉద్దేశించినవి. ఇవి డిస్ట్రిబ్యూషన్‌ఔట్‌లెట్లుగా పనిచేస్తాయి. ప్రధానంగా మెరుగైన పంపిణీ, వేగంగా డెలివరీ, విభిన్న రకాల ఉత్పత్తులను స్టోర్ చేసే అవకాశం, తదితరాలకు సంబంధించినవి.



ఆర్టీసీ ఈడీ వ్యవస్థలో మార్పులు?

ఆ తర్వాతే ఖాళీ అయిన పోస్టుల భర్తీ

ఇటీవల పదవీ విరమణ చేసిన ముగ్గురు ఈడీలు

ఐదుగురికి గాను ప్రస్తుతం ఉన్నది ఇద్దరే

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీలో కీలకమైన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పోస్టులను మార్చబోతున్నారు. ప్రస్తుతం ఉన్న విధానం సరిగా లేదని ఎండీ సజ్జనార్ భావిస్తున్నట్టు తెలిసింది. ఇటీవలే ముగ్గురు ఈడీలు పదవీ విరమణ చేయటంతో ఆ పోస్టులు ఖాళీ అయ్యాయి. కాగా, వాటిని వెంటనే భర్తీ చేయకుండా ఆయన పెండింగులో పెట్టారు. ఆ పోస్టులకు సంబంధించిన వ్యవస్థలో మార్పుల తర్వాతే భర్తీ చేస్తారన్న ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి ఆర్టీసీ విభజన తర్వాత తెలంగాణ ఆర్టీసీకి ఐదు ఈడీ పోస్టులు మంజూరయ్యాయి. ఐదుగురు ఈడీలలో ఇద్దరు కేంద్ర కార్యాలయం బస్‌భవన్‌లో ఉంటుండగా, ముగ్గురు క్షేత్రస్థాయిలో ఉంటున్నారు. హైదరాబాద్, గ్రేటర్ హైదరాబాద్, కరీంనగర్ జోన్‌లకు ఈ ముగ్గురు ప్రాతినిధ్యం వహిస్తారు. గత రెండు నెలల్లో ముగ్గురు ఈడీలు పదవీ విరమణ చేశారు. హైదరాబాద్, గ్రేటర్ హైదరాబాద్ జోన్‌ల ఈడీలు వెంకటేశ్వర్లు, పురుషోత్తమ్‌లు, బస్‌భవన్‌లోని ఈడీ (అడ్మిన్) కృష్ణకాంత్‌ల పదవీ కాలం ముగిసింది. దీంతో కరీంనగర్ ఈడీగా ఉన్న వినోద్‌ను బదిలీ చేసి హైదరాబాద్, గ్రేటర్ హైదరాబాద్ జోన్ల బాధ్యత అప్పగించారు. ఇక బస్‌భవన్‌లో ఉన్న మునిశేఖర్‌కు ఆపరేషన్స్, అడ్మినిస్ట్రేషన్, సంస్థ కార్యదర్శి, ఇంజనీరింగ్, మెడికల్‌తో పాటు కరీంనగర్ జోన్ బాధ్యతలు అప్పగించారు. ఇక ఈ ఇద్దరు ఈడీలతోనే ఆయా విభాగాలను నిర్వహించాలని ఎండీ నిర్ణయించినట్టుగా తొలుత భావించారు. కీలక విభాగాల హెచ్‌ఓడీలకు ఆయా బాధ్యతలు అప్పగించి నేరుగా ఎండీకే రిపోర్టు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారని, ఈడీల భర్తీ ఉండదని చర్చ జరిగింది. దీంతో ఖాళీ అయిన మూడు పోస్టులను ప్రభుత్వానికి సరెండర్ చేస్తారన్న అభిప్రాయాలూ వ్యక్తమయ్యాయి. అయితే, ఈడీల వ్యవస్థను సమూలంగా మార్చి, ఆమేరకు పదోన్నతులు కల్పిస్తారని, అందుకు కొంత సమయం పడుతుందని ప్రస్తుతం పేర్కొంటున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఈడీల తీరుపై నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర ఆగ్రహంతో ఉండేవారు. అదే సమయంలో బాధ్యతలు స్వీకరించిన సజ్జనార్‌కు కూడా తొలుత ప్రభుత్వం నుంచి అదే తరహా ఫీడ్ బ్యాక్ వచ్చింది. దీంతో ఆయన కొందరు ప్రైవేటు వ్యక్తులకు ఆర్టీసీలో కీలక బాధ్యతలు అప్పగించి వారి సలహాలతో పనులు నిర్వహిస్తూ వస్తున్నారు. ఇప్పటికీ ఆ ప్రైవేటు వ్యక్తులు కొనసాగుతున్నారు. దీంతో ఉన్న ఈడీలు పదవీ విరమణ చేసేకొద్దీ ఆ పోస్టులు రద్దు చేస్తారన్న మాటలు అప్పటి నుంచి వినిపిస్తూ వస్తున్నాయి. ఇప్పుడు ఖాళీ అయిన పోస్టుల భర్తీ లేకపోవటంతో అదే జరుగుతోందన్నది సంస్థలో అనుకుంటున్న మాట. కానీ, ఈడీల వ్యవస్థను పూర్తిగా మార్చి, తిరిగి భర్తీ చేస్తారని తాజాగా వినిపిస్తోంది.



మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆలయం వెలుపల మాజీ గవర్నర్ నరసింహన్ దంపతులు



సచివాలయంలో నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవంలో జెండా వందనం చేస్తున్న సీఎస్ శాంతికుమారి



లోకాయుక్త కార్యాలయంలో జరిగిన ప్రజాపాలన దినోత్సవంలో జెండా వందనం చేస్తున్న లోకాయుక్త జస్టిస్ సీవీ రాములు తదితరులు



బీజేపీ కార్యాలయంలో విమోచన దినోత్సవంలో జెండావందనం చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

కోత వద్దు.. డొనేషన్ ముద్దు

బొగ్గు గనులపై విరాళాల పెట్టెలు ఏర్పాటు చేయాలి

వరద బాధితులకు ఒకరోజు వేతనంపై కార్మికుల అసంతృప్తి

సింగరేణి నిర్ణయానికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ



జీడీకే ఓసీపీ -1 ఇన్‌చార్జి మేనేజర్ కోటయ్యకు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

సాక్షి, పెద్దపల్లి: ఇటీవల రాష్ట్రంలో కురిసిన భారీవర్షాలు, వరదలతో సర్వం కోల్పోయిన వారిని ఆదుకునేందుకు సింగరేణి యాజమాన్యం తీసుకున్న నిర్ణయంపై కార్మిక వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సినీ, రాజకీయ, ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు తదితరులు వరద బాధితులకు సాయం చేస్తున్నారు. ఇంకాకొందరు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో సింగరేణి కూడా ఒకరోజు వేతనాన్ని బాధితులకు అందిస్తామని కార్మికులకు లేఖ రాసింది. అదేవిధంగా సెప్టెంబర్ జీతంలోంచి ఒకరోజు బేసిక్ వేతనం కోతకు సమ్మతించాలని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీతోపాటు ఇతర కార్మిక సంఘాలకు లేఖలు రాసింది. ఈ లేఖ సింగరేణిలోని 11 ఏరియాల్లో గల సుమారు 40వేలమంది కార్మికుల్లో అసంతృప్తిని రాజేసింది. కార్మికుడి ఒకరోజు వేతనం సరాసరి రూ.3,000 వరకు ఉంటుంది. సింగరేణివ్యాప్తంగా లెక్కిస్తే ఈసొమ్ము దాదాపు రూ.12కోట్ల వరకు ఉంటుంది. ఇంతపెద్దమొత్తంలో ముఖ్యమంత్రి సహాయ నిధికి జమచేస్తామని యాజమాన్యం ఏకపక్షంగా నిర్ణయించడాన్ని కార్మికులు వ్యతిరేకిస్తున్నారు. కొందరు అధికారులు, యూనియన్ నాయకులు ప్రభుత్వ పెద్దల మెప్పు కోసం కార్మికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండానే ఈ నిర్ణయం తీసుకోవడం ఏమిటని మండిపడుతున్నారు. యాజమాన్యం నిర్ణయానికి వ్యతిరేకంగా ఇప్పటికే కార్మికులు సంతకాల సేకరణ ప్రారంభించారు. తమ అనుమతి లేకుండా వేతనంలో కోత విధించొద్దని ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేస్తూ నిరసన తెలుపుతున్నారు. సింగరేణి కార్మికుడు చనిపోతే బాధిత కుటుంబానికి అండగా ఉండేందుకు తోటి కార్మికుల వేతనంలో కేవలం రూ.40 నుంచి రూ.50 వరకే కోత విధిస్తున్నారని, అలాంటిది వరద బాధితుల కోసం తమ కుటుంబాలను పస్తులు ఉంచి ఒకరోజు వేతనంలో ఎలా కోత విధిస్తారని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడఏం జరిగినా సింగరేణి వైపు చూస్తున్నారని, కానీ తమ కష్టాలు, కన్నీళ్లు తుడిచిన వారు లేరని, కనీసం సమస్యలు పట్టించుకున్న నాథుడే లేడని వాపోతున్నారు. వరద బాధితులపై తమకూ సానుభూతి ఉందని, కానీ, కార్మికుల ఇష్టానుసారం విరాళం ఇచ్చే స్వేచ్ఛ ఉండాలని కోరుతున్నారు.

డొనేషన్ బాక్స్‌ల కోసం సంతకాల సేకరణ

వరద బాధితులను ఆదుకునేందుకు సింగరేణి కార్మిక సంఘాలకు రాసిన లేఖ ప్రకారం ఒకరోజు వేతనంలో కోత సరికాదని, ప్రతీ కార్యాలయంలో డొనేషన్ బాక్స్‌లు ఏర్పాటు చేసి కార్మికుల నుంచి స్వచ్ఛందంగా విరాళాలు సేకరించాలని డిమాండ్ చేస్తున్నారు. అప్పుడు వ్యక్తిగతంగా ఎవరికి తోచినంత వారు విరాళం అందజేస్తారంటున్నారు. కొందరు అధికారులు ప్రభుత్వ పెద్దల మెప్పు కోసం తమను అన్యాయం చేస్తున్నారని విమర్శిస్తున్నారు. ఈ విధానాన్ని నిరసిస్తూ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో కార్మికులు సంతకాల సేకరణ ప్రారంభించారు. ఓసీపీ-2లోని రిలే-బీలోని 60మంది కార్మికులు ఒకరోజు వేతనం కాకుండా డొనేషన్ బాక్స్‌లు ఏర్పాటు చేయాలని సంతకాలతో కూడిన ఒక వినతిపత్రాన్ని సిద్ధం చేసి ఓసీపీ-2కాలరీ మేనేజర్‌కు సమర్పించారు. ఇదేబాటలో పెద్దపల్లి, భద్రాద్రికొత్తగూడెం, భూపాలపల్లి, మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో పనిచేస్తున్న సింగరేణి కార్మికులు యాజమాన్యం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వినతిపత్రాలు సమర్పిస్తున్నారు.

మాకే కష్టాలుండగా...ఈ కోతలేంది?



సింగరేణి కార్మికులు భయంకరమైన పరిస్థితుల్లో పనిచేస్తున్నాం. ఈవిషయం ఎవరికీ తెలియదు. పైగా ఆదాయ పన్ను మినహాయింపు లేదు. దీంతో సంవత్సరంలో నాలుగు నెలల జీతం ఆదాయపు పన్నుగా చెల్లిస్తున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో ఒకరోజు వేతనంలో కోత విధించడం సరైన నిర్ణయం కాదు. నోటీసు ఇవ్వకుండా, మాకు చెప్పకుండా, కనీసం నోటీసు బోర్డుపై రాయకుండా వేతనంలో కోత పెట్టడం ఏమిటి?

– మామిడి తిరుపతి, ఈపీ ఆపరేటర్, ఓసీపీ -3, ఆర్జీ-2, యైటింక్లైన్‌కాలనీ

డొనేషన్ బాక్స్‌లు పెట్టండి



వరద బాధితులపై మాకూ సానుభూతి ఉంది. సాయం చేయాలనే ఆలోచన కూడా ఉంది. కానీ, విరాళం అనేది ఎవరికి నచ్చినంత, ఉన్నంతలో స్వచ్ఛందంగా ఇస్తారు. ఆలా కాకుండా, నిర్బంధంగా ఒకరోజు వేతనం ఇవ్వాలనడం సరికాదు. మా కార్మికులు చనిపోతేనే వారి కుటుంబాలకు మా వేతనంలోంచే రూ.40 నుంచి రూ.50 ఇస్తున్నాం. మాకు ఇతరులెవరూ సాయం చేసిన సందర్భాలు లేవు. అంతేకాదు.. సింగరేణి ప్రాంతంలో వరదలు వస్తే జీతంలో కోత పెట్టడం న్యాయం ఉంది. కానీ, మా అనుమతి లేకుండా మా జీతంలో కోత పెట్టడం సరికాదు.

–పల్లె నాగార్జున, ఈపీ ఆపరేటర్ ఓసీపీ - 3 ఆర్జీ-2 ఏరియా, యైటింక్లైన్‌కాలనీ



పరేడ్‌గ్రౌండ్స్‌లో నిర్వహించిన విమోచన దినోత్సవంలో బతుకమ్మ శకటం



మంగళవారం రాత్రి ట్యాంక్‌బండ్‌పై గణేశ్ నిమజ్జన కోలాహలం...

సాక్షి ప్లస్
బుధవారం ॥ 18-9-2024

సాగుబడి

ఉత్తర కార్తె:
సెప్టెంబర్ 26 వరకు





అత్యంత ఖరీదైన గింజ పంట

ఎక్కువగా ఆస్ట్రేలియా తదితర దేశాల్లో సాగవుతోంది..

మన దేశంలో ఈమధ్యనే సాగు ప్రారంభమైంది..

క్వీన్ ఆఫ్ నట్స్

కొత్త పంట

మకడమియ!

సంపూర్ణ ఆరోగ్యాన్నిచ్చే మకడమియ తోటల సాగు మనకు బాగా కొత్త. ప్రొటీసీ కుటుంబం. ఎన్నో పోషక విలువలతో కూడినది కావటం వల్ల దీనికి క్వీన్ ఆఫ్ ద నట్స్ అని పేరొచ్చింది. మకడమియ చెట్టు గింజలను క్వీన్స్‌లాండ్ నట్స్ లేదా ఆస్ట్రేలియన్ నట్స్ అని కూడా పిలుస్తారు. దక్షిణాది రాష్ట్రాల్లోని ఉష్ణమండల ప్రాంతాలు దీని సాగుకు అనుకూలం. గుండె జబ్బులు, కేన్సర్, షుగర్ రానివ్వకుండా చూసే ఈ అద్భుత పంటకు సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం..

మకడమియ దీర్ఘకాలిక పంట. గుబురుగా పెరిగే చెట్టుకు కాచే గుండ్రటి మకడమియ కాయల నుంచి వొలిచిన గింజలను తింటారు. ఈ గింజలు చూడడానికి పెద్ద శనగల మాదిరిగా ఉంటాయి. గుండ్రటి కాయలోని మరొక పొరలో ఈ గింజ దాక్కొని ఉంటుంది. మకడమియ చెట్లలో ఏడు జాతులున్నాయి. వాణిజ్యపరంగా సాగుకు అనువైనవి రెండు మాత్రమే. మకడమియ ఇంటెగ్రిఫోలియ (దీని కాయ పెంకు గుల్లగా ఉంటుంది), మకడమియ టెట్రాఫిల్లా (దీని కాయ పెంకు కొంచెం గట్టిగా ఉంటుంది). మిగతా రకాల గింజలు విషపూరితాలు, తినటానికి పనికిరావు.

కిలో గింజల ధర రూ. 1,175

మకడమియ పంట ఆస్ట్రేలియా, హవాయి, సౌతాఫ్రికా, మలావి, బ్రెజిల్, ఫిజి, కాలిఫోర్నియ (అమెరికా)లో ఎక్కువగా సాగవుతున్నది. తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్, ఈశాన్య రాష్ట్రాలు, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లో కొందరు రైతులు ఈ చెట్ల సాగును ఈ మధ్యనే ప్రారంభించారు. 2017 నాటి గణాంకాల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 48,544 టన్నుల మకడమియ కాయల వార్షిక ఉత్పత్తి జరుగుతోంది. ప్రధానంగా ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, కెన్యాల నుంచే 70% దిగుబడి వస్తోంది. డిమాండ్‌కు తగిన మకడమియ గింజల లభ్యత మార్కెట్‌లో లేదు. ఈ గింజల ఖరీదు కిలోకు 14 అమెరికన్ డాలర్లు. అంటే.. రూ. 1,175. ఇంత ఖరీదైన పంట కాబట్టే మకడమియ తోటల సాగుపై మన దేశంలోనూ రైతులు ఆసక్తి చూపుతున్నారు.

ఆరోగ్యదాయక పోషకాల గని

ఆరోగ్యదాయకమైన అనేక పోషకాలతో కూడి ఉండే మకడమియ గింజలు తియ్యగా, కమ్మని రుచిని కలిగి ఉంటాయి. మోనో అన్‌శాచ్యురేటెడ్ ఫాటీ ఆసిడ్లు ఉంటాయి. ఆస్ట్రేలియాలో జరిగిన పరిశోధనల ప్రకారం.. ఈ గింజలు తిన్న వారి రక్తంలో టోటల్, ఎల్‌డిఎల్ కొలెస్ట్రాల్ తగ్గింది. వంద గ్రాముల గింజలు 718 కేలరీల శక్తినిస్తాయి. గింజలకే కాదు దాని పైన పొరలో కూడా అధిక కేలరీలను ఇచ్చే శక్తి ఉంది.

ఆరోగ్యంగా ఉండటానికి అవసరమైన ఎన్నో రకాల పోషకాలు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు ఇందులో ఉన్నాయి. వంద గ్రాముల మకడమియ గింజల్లో 8.6 గ్రాములు లేదా రోజుకు మనిషికి కావాల్సిన 23% డైటరీ ఫైబర్ ఉంది. చెడు కొలెస్ట్రాల్ లేదు. బి-సిటోస్టెరాల్ వంటి ఫైటోస్టెరాల్స్ ఇందులో పుష్కలంగా ఉన్నాయి.

ఓలిక్ ఆసిడ్ (18:1), పాల్మిటోలీక్ ఆసిడ్ (16:1) వంటి మోనో అన్‌శాచ్యురేటెడ్ ఫాటీ ఆసిడ్స్ పుష్కలంగా ఉన్నాయి. కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, మాంగనీసు, జింగ్, సెలీనియం (గుండె రక్షణకు ఇది ముఖ్యం) వంటి ఎంతో ఉపయోగకరమైన మినరల్స్ ఉన్నాయి. ఇంకా.. జీవక్రియలకు దోహదపడే బి-కాంప్లెక్స్ విటమిన్లు కూడా ఉన్నాయి. వంద గ్రాముల మకడమియ గింజల్లో 15% నియాసిన్, 21% పైరిడాక్సిన్ (విటమిన్ బి-6), 100% థయామిన్, 12% రిబోఫ్లావిన్ వంటి కొవ్వులో కరిగే విటమిన్లు ఉన్నాయి. ఆక్సిజన్-ఫ్రీ రాడికల్స్ కలిగించే నష్టం నుంచి డీఎన్ఏను, కణజాలాన్ని రక్షించే యాంటీఆక్సిడెంట్లు మకడమియ గింజల్లో పుష్కలంగా ఉన్నాయి. అందుకే ఈ పంటకు అంత క్రేజ్!

12 అడుగుల ఎత్తు


మకడమియ ఉష్ణమండల పంట. అన్ని కాలాల్లోనూ పచ్చగా ఉంటుంది. అశోకా చెట్ల ఆకుల మాదిరిగా దీని ఆకులు ఉంటాయి. ఎత్తు 2-12 మీటర్లు, కొమ్మలు 5-10 మీటర్ల వరకు పెరగుతాయి. తెల్లటి పూలు గుత్తులుగా (8-10 సెం.మీ. పొడవున) వస్తాయి. శీతాకాలం మధ్యలో పూత ప్రారంభమవుతుంది. గుత్తికి 100కిపైగా పూలు ఉన్నా 2 నుంచి 10 కాయలు మాత్రమే వస్తాయి. స్వపరాగ సంపర్కం జరిగే పంట ఇది. కృత్రిమంగా పాలినేషన్ చేస్తే దిగుబడి పెరుగుతుంది.

మకడమియ కాయ పైన ఉండే మందపాటి పొరను తీసేస్తే గట్టి గుల్ల బయటపడతాయి. వాటిని పగులగొడితే మధ్యలో గింజలు ఉంటాయి. లేత పసుపు రంగులో మెత్తగా ఉండే గింజలు తియ్యగా ఉంటాయి. పూత వచ్చిన 7-8 నెలల్లో కాయలు కోతకొస్తాయి.

13 -31 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత దీనికి సూటబుల్. వార్షిక వర్షపాతం 125 సెం.మీ. చాలు. నీరు నిలవని సారవంతమైన లోమీ సాయిల్ (ఇసుక, బంకమన్ను, సేంద్రియ పదార్థం కలిసిన ఎర్ర ఒండ్రు భూములు) అనుకూలం. విత్తనాల ద్వారా, కొమ్మ కత్తిరింపుల ద్వారా మొక్కలు పెంచవచ్చు. నాటిన తర్వాత 4-5 ఏళ్లలో కాపు ప్రారంభమై.. 50-75 ఏళ్ల పాటు కాయల దిగుబడినివ్వటం ఈ చెట్ల ప్రత్యేకత.

గుండె ఆరోగ్యానికి మేలు.. షుగర్, కేన్సర్ రానివ్వవు..

- మకడమియ గింజలు గుండె ఆరోగ్యానికి మంచి చేస్తాయి.
- మెటబాలిక్ సింట్రోమ్ రిస్క్ తగ్గిస్తాయి.
- ఊబకాయాన్ని తగ్గిస్తాయి.
- జీర్ణ శక్తిని పెంచుతాయి.
- కేన్సర్ నిరోధక శక్తినిస్తాయి.
- మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి.
- చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తాయి.
- ఎముకలు, దంతాలను ఆరోగ్యంగా ఉంచుతాయి.
- మానసిక వత్తిడి నుంచి ఇన్‌ఫ్లమేషన్ నుంచి ఉపశమనం కలిగిస్తాయి.
- రక్తహీనత రాకుండా చూస్తాయి.
- మధుమేహం రాకుండా చూస్తాయి.



నిర్వహణ:
పంతంగి రాంబాబు
సాగుబడి డెస్క్

అర్బన్ అగ్రికల్చర్

సుస్థిర అభివృద్ధికి దోహదం!



- సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు అర్బన్ అగ్రికల్చర్ 6 విధాలుగా దోహదం.. 4 విధాలుగా విఘాతం కలిగే అవకాశం.
- సవాళ్లను అధిగమిస్తే అర్బన్ అగ్రికల్చర్‌తో సుస్థిర అభివృద్ధికి ఎంతో మేలు!
- ఈ నెల 22-23 తేదీల్లో జరగనున్న ఐక్యరాజ్యసమితి 'ఫ్యూచర్ 2024' సమావేశాల నేపథ్యంలో ఆసక్తికర అధ్యయనం

2030 నాటికి ప్రపంచాన్ని మెరుగ్గా తీర్చిదిద్దుకోవటానికి ఐక్యరాజ్యసమితి 2015లో ప్రపంచ దేశాలకు నిర్దేశించిన లక్ష్యాలే సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎస్.డి.జి.లు). ఇవి 17 రకాలు. ఈ లక్ష్యాల సాధన కృషి స్థితిగతులపై సమీక్షకు ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ఈనెల 22-23 తేదీల్లో కీలక శిఖరాగ్రసభ 'ఫ్యూచర్ 2024' జరగనుంది. ఈ నేపథ్యంలో అర్బన్ అగ్రికల్చర్ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను ఏ విధంగా ప్రభావితం చేస్తోందో తెలుసుకునేందుకు ఒక అధ్యయనం జరిగింది. యూనివర్సిటీ ఆఫ్ గ్రోనింగెన్ (నెదర్లాండ్స్)కు చెందిన డాక్టర్ ప్రజల్ ప్రధాన్ సారథ్యంలోని పరిశోధకుల బృందం ఈ అధ్యయనం నిర్వహించింది. అర్బన్ అగ్రికల్చర్ ఎస్.డి.జి.ల సాధన కృషిపై చూపుతున్న సానుకూల ప్రభావాలతో పాటు ప్రతికూల ప్రభావాలను చర్చించే 76,000 పరిశోధన పత్రాల్లో నుంచి 1,450ని ఎంపిక చేసి అధ్యయనం చేయటం విశేషం. ఈ తాజా అధ్యయన ఫలితాలను జర్నల్ సెల్స్ రిపోర్ట్ సస్టయినబిలిటీలో ప్రచురితమయ్యాయి.



ఇంటి పంట



అర్బన్ అగ్రికల్చర్.. అంటే?

నగరాలు, నగరాల పరిసర ప్రాంతాల్లో ఇళ్లపైన, ఖాళీ స్థలాల్లో చేపట్టే వ్యవసాయ కార్యకలాపాలనే అర్బన్ అగ్రికల్చర్‌గా చెప్పొచ్చు. నగర, పట్టణ ప్రాంతాల్లో ఇంటిపంటలు, మిద్దె తోటలు, పెరటి తోటలు, పశుపోషణ, పాడి పరిశ్రమలు. కోళ్ల, చేపల పెంపకం.. వంటి కార్యకలాపాలన్నీ ఈ కోవలోకే వస్తాయి. 17 ఎస్.డి.జి.లన్నిటితోనూ అర్బన్ అగ్రికల్చర్‌కు ప్రత్యక్షంగానో పరోక్షంగానో సంబంధం ఉంది.

నాణానికి అవతలి వైపు..


అర్బన్ అగ్రికల్చర్ వల్ల అభివృద్ధి లక్ష్యాల సాధనకు అంతా మేలే జరుగుతుందని చెప్పలేమని, చెడు కూడా జరుగుతోందని డాక్టర్ ప్రజల్ ప్రధాన్ స్పష్టం చేశారు. 'అర్బన్ అగ్రికల్చర్ సుస్థిర అభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తోంది. అయితే, ప్రతికూల ప్రభావాన్ని బాగా తగ్గించే అర్బన్ అగ్రికల్చర్ పద్ధతులను పాటించగలిగినప్పుడే దాని ద్వారా ప్రయోజనాలు ఒనగూడతాయి. ఐరాస 2024 ఫ్యూచర్ సమ్మిట్ లక్ష్యాల సాధనకు అర్బన్ అగ్రికల్చర్ దోహదపడేదైనప్పటికీ మరో కోణాన్ని కూడా ఆవిష్కరించటం కోసం ఈ అధ్యయనం చేశాం' అన్నారాయన.

వుహాన్ యూనివర్సిటీ (చైనా) అసోసియేట్ రిసెర్చ్ ప్రొఫెసర్ యుయాన్‌ఛావ్ హు మాట్లాడుతూ 'ఎస్.డి.జి.ల సాధన కృషికి అర్బన్ అగ్రికల్చర్ ఎంతగానో దోహదం చేస్తుంది. అయితే, విభిన్న ప్రదేశాల్లో ఈ కార్యకలాపాల వల్ల ఎదురయ్యే సవాళ్లను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అధిగమించటం ముఖ్యం' అన్నారు.

అర్బన్ అగ్రికల్చర్ కార్యకలాపాలలో సుస్థిరతకు దోహదం చేసే పద్ధతులను అనుసరించటం ద్వారా ప్రతికూల ప్రభావాలను తగ్గించవచ్చు. వాతావరణ మార్పులను తట్టుకునే విధంగా నగరాల అభివృద్ధికి ఇది దోహదం చేస్తుంది. 'అర్బన్ అగ్రికల్చర్ వల్ల చేకూరే అనుకూల, ప్రతికూల ప్రభావాల గురించి అందుబాటులో ఉన్న సైంటిఫిక్ లిటరేచర్‌ను విశ్లేషించడానికి మా అధ్యయనం ద్వారా కృషి చేశాం. మొత్తంగా చూసినప్పుడు అర్బన్ అగ్రికల్చర్ వల్ల ఆహారం, విద్య, సాంఘిక సదుపాయాలను కల్పించటంతో పాటు జీవవైవిధ్యాన్ని పెంపొందించేందుకు సుస్థిరత ఎలా చేకూరుతుందో శాస్త్రబద్ధంగా ఈ అధ్యయనం రుజువులు చూపింది' అని డాక్టర్ ప్రజల్ ప్రధాన్ వివరించారు.

తాజా పోషకాహారం లభ్యత

పోషకాలతో కూడిన తాజా ఆహారోత్పత్తులను స్థానికంగానే అందుబాటులోకి తేవటం.. దూర ప్రాంతాల నుంచి ఆహారాన్ని తరలించాల్సిన అవసరాన్ని తగ్గించటం.. ఆహారోత్పత్తుల్ని వందల కిలోమీటర్ల నుంచి తీసుకురావటానికి ఖర్చయ్యే ఇంధనాన్ని ఆదా చేయటం ద్వారా కాలుష్యాన్ని(ఫుడ్ మైల్స్‌ను) తగ్గించటం.. వివిధ సామాజిక వర్గాల ప్రజల మధ్య సాన్నిహిత్యాన్ని పెంపొందించటం.. మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించటం వంటివి అర్బన్ అగ్రికల్చర్ ప్రయోజనాలని ఈ అధ్యయనం తేల్చింది. బీజింగ్ ఫారెస్ట్ యూనివర్సిటీ (చైనా) పరిశోధక విద్యార్థి దయ రాజ్ సుదేబ్ ఇలా అన్నారు:'అవకాశాలను ఉపయోగించుకునేలా ప్రజలు, సంస్థలు, ప్రభుత్వాలు అర్బన్ అగ్రికల్చర్ పద్ధతుల్లో సుస్థిర లక్ష్యాల సాధన దిశగా పరివర్తన తేవాలి..'



ప్రతిబంధకాలు

శుద్ధమైన, చవక ఇంధనం లభ్యతకు సంబంధించి 3,6,7 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు. జలచరాల జీవన భద్రతకు సంబంధించి 11,12,14,16 ఎస్.డి.జి.లకు సంబంధించి అర్బన్ అగ్రికల్చర్ ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది. నీరు, ఇంధనం, ఎరువులు, పురుగుమందుల అధిక వాడకం వల్ల నేల, నీరు కలుషితం కావటం.. వనరులు ఉన్న వారికే ప్రయోజనాలను పరిమితం చేయటం ద్వారా పేదలకు ఫలితాలను అందించలేని పరిస్థితులు నెలకొనటం వంటి ప్రతిబంధనాలు అర్బన్ అగ్రికల్చర్‌కు ఉన్నట్లు ఈ అధ్యయనం గుర్తించింది. ఈ సవాళ్లను సమర్థవంతంగా అధిగమించడానికి చర్యలు తీసుకుంటే అర్బన్ అగ్రికల్చర్ సుస్థిర అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందనటంలో సందేహం లేదు.

మీకు తెలుసా?



శ్రీలంక ఎందుకు విఫలమైంది?



సేంద్రియ సేద్యంలో వైఫల్యానికి శ్రీలంకను ఒక ఉదాహరణగా చూపటం తరచుగా వినిపిస్తూ ఉంటుంది. అయితే, ఉన్నట్టుండి ఓ అర్థరాత్రి వేళ ప్రభుత్వం రసాయనిక వ్యవసాయాన్ని నిషేధించింది. ఇదే తమ ప్రభుత్వం చేసిన తప్పు అని శ్రీలంక వ్యవసాయ మంత్రి నేను ఉన్న సభలోనే ప్రకటించారు. అసలు నిజం ఇది.

– డాక్టర్ సుల్తాన్ ఇస్మాయిల్, ఎకోసైన్స్ రీసెర్చ్ ఫౌండేషన్, చెన్నై

జీవితాలను పండించుకుంటున్నారు!

ప్రకృతి సేద్యంలో మహిళా రైతుల ముందడుగు

ప్రస్తుతం వ్యవసాయంలో విచ్చలవిడిగా వినియోగిస్తున్న రసాయనాల వల్ల పంటలు కలుషితమవడంతో పాటు మట్టిలో సూక్ష్మజీవులు నశించిపోతున్నాయి. పర్యావరణానికి హాని కలగటమే కాకుండా మానవాళి అనారోగ్యానికి ఆహారంలోని రసాయనాల అవశేషాలు కారణమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని నరసరావుపేటకు చెందిన మహిళా రైతులు కొందరు ఈ ముప్పును గుర్తించారు. విషపూరిత ఆహార పదార్థాల నుంచి కుటుంబ సభ్యులను కాపాడుకునేందుకు ప్రకృతి సాగుకు నడుం బిగించారు. ఒకవైపు భూసారాన్ని పెంచుతూ మరోవైపు అధిక దిగుబడులు సాధిస్తూ తమ జీవితాలను పండించుకుంటున్నారు.



ప్రకృతి వ్యవసాయ విభాగం మహిళలకు ప్రకృతి సాగుపై అవగాహన కల్పిస్తోంది. అందులో భాగంగా పల్నాడు జిల్లాలో స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీల) ద్వారా మహిళా రైతులను గుర్తించి గ్రామాల వారీగా అవగాహన కల్పించి, ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులను సాధించేందుకు ప్రకృతి సేద్యమే ఏకైక మార్గమని నమ్ముతున్న మహిళా రైతులు ఇప్పుడిప్పుడే ప్రకృతి వ్యవసాయం వైపు ఆసక్తి చూపుతున్నారు. మహిళా సంఘాల్లోని ప్రతి మహిళా కనీసం తన ఇంటికి అవసరమైన కూరగాయలు, ఆకుకూరలనైనా పెరటి తోటల్లో ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించుకునే విధంగా అవగాహన కల్పించడమే లక్ష్యంగా గత ప్రభుత్వం తీసుకున్న చర్యలు, నిపుణులు, అధికారుల కృషి ఫలిస్తోంది. గత నాలుగేళ్లలో జిల్లాలో ప్రకృతి సాగు అంచనాకు మించి విస్తరించింది.

ప్రకృతి వ్యవసాయ సిబ్బంది దిని కూడా వ్యవసాయ శాఖ రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బికెల) పరిధిలోకి తీసుకొచ్చింది. దీంతో సిబ్బంది ఆర్‌బీకేల్లోనే రైతులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. వ్యవసాయానికి వాడే ఉత్పాదకాలను స్వయంగా రైతులే పొలం దగ్గర తయారు చేసుకొని వాడాలని, బయట కొనకూడదన్నది ఒక నియమం. అయితే, నాటు ఆవు లేక, ఉన్నా వాటిని తయారు చేసుకునే ఓపిక, తీరిక లేని వారు ప్రకృతి సాగుపై ఆసక్తి ఉన్నా ముందడుగు వేయలేకపోతున్నారు. అటువంటి వారి కోసం ఒక్కో మండలంలో ఐదు నుంచి పది వరకు ఎన్‌పీఎం(నాన్ పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్) షాపులను ప్రకృతి వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసింది.

ఈ పద్ధతిలో సాగు చేసిన రైతుల ఉత్పత్తులను మార్క్‌ఫెడ్ ద్వారా 10 నుంచి 15 శాతం అధిక మద్దతు ధర చెల్లించేలా ప్రకృతి వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంటోంది. ఆ మేరకు రైతులతో ముందస్తుగా ఒప్పందం చేసుకొని ఉత్పత్తులను సేకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రకృతి సిద్ధంగా పండించిన ఉత్పత్తులకు గిరాకీ పెరుగుతోంది. వినియోగదారులే రైతుల వద్దకు వచ్చి అధిక ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. దీనితో పాటు.. టీటీడీతో పాటు మరో 11 ప్రధాన దేవస్థానాలు మూడేళ్లుగా ప్రకృతి వ్యవసాయ దిగుబడులు కొనుగోలు చేస్తున్నాయి. దీంతో ప్రకృతి వ్యవసాయదారులకు మంచి గుర్తింపు లభిస్తోంది.

– పుట్లూరి శివకోటిరెడ్డి, సాక్షి, నరసరావుపేట రూరల్

ఉద్యమంగా ప్రకృతి వ్యవసాయం

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను నైవేద్యాల తయారీకి వాడేందుకు టీటీడీతో పాటు మరో 11 దేవస్థానాలు మూడేళ్లుగా కొనుగోలు చేస్తున్నాయి. ఇది ప్రకృతి వ్యవసాయదారులకు మంచి గుర్తింపు. సాగు విస్తీర్ణం పెంచడానికి ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్తున్నాం. ప్రకృతి వ్యవసాయాన్ని ఉద్యమంలా ముందుకు తీసుకువెళ్తున్నాం.

– కె.అమలకుమారి, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్, ప్రకృతి వ్యవసాయ విభాగం, నరసరావుపేట



పెట్టుబడి తక్కువ..



ఒక ఎకరంలో వరి, మరో ఎకరంలో మెట్ట పంటలు సాగు చేస్తున్నాం. ప్రకృతి వ్యవసాయంలో పెట్టుబడి తగ్గింది. దిగుబడి బాగుంది. ఈ ఉత్పత్తులకు అధిక ధర వస్తుండటంతో లాభదాయకంగా ఉంది.

– శివలక్ష్మి, మహిళా రైతు, ఏనుగుపాలెం, వినుకొండ మండలం, పల్నాడు జిల్లా

దిగుబడి బాగుంది..

మా రెండు ఎకరాల్లో పంట సాగు చేసేందుకు గతంలో రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడి దిగుబడులు రాక తీవ్రంగా నష్టపోయాం. కొన్ని సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయంలో వరి పంటను పండిస్తున్నాను. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అవగాహన కల్పించారు. ఖర్చులు తగ్గాయి. దిగుబడులు పెరిగాయి.



– లక్ష్మీదుర్గ, మహిళా రైతు, కారుమంచి, శావల్యాపురం మండలం

బిజినెస్ రీల్

ఏడాదిలోగా ఎక్ఛ్సేంజ్: ఐకియా



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫర్నీచర్ తయారీ దిగ్గజం ఐకియా '365 డేస్ టు ఛేంజ్ యువర్ మైండ్' పేరుతో కొత్త విధానాన్ని పరిచయం చేసింది. ఇందులో భాగంగా ఏదైనా ఉత్పత్తిని కొనుగోలు చేసిన ఏడాది కాలంలో మార్పిడి లేదా వెనక్కి ఇచ్చే వెసులుబాటు కల్పించింది. భారత్‌లో హోమ్ ఫర్నీషింగ్ పరిశ్రమలో ఇలా 365 రోజుల కాల పరిమితి ఇవ్వడం ఇదే తొలిసారి అని కంపెనీ సోమవారం తెలిపింది.

ఎల్ఐసీకి ఇన్ఫోసిస్ సర్వీసులు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ)కి డిజిటల్ పరివర్తన సర్వీసులు అందించే ప్రాజెక్టును దక్కించుకున్నట్లు ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ వెల్లడించింది. ఇన్ఫీ ఇందు కోసం నెక్స్ట్‌జెన్ డిజిటల్ ప్లాట్‌ఫాంను రూపొందించనుంది. కస్టమర్లు, ఏజెంట్లు, ఉద్యోగులకు డేటా ఆధారిత పర్సనలైజ్డ్ సేవలు అందించడం కోసం ఎల్ఐసీ చేపట్టిన డైవ్ (డిజిటల్ ఇన్నోవేషన్ అండ్ వేల్యూ ఎన్హాన్స్‌మెంట్) ప్రోగ్రాం కింద దీన్ని డిజైన్ చేయనుంది. అలాగే, డిజిటల్ పరివర్తనకు అవసరమైన మౌలిక సదుపాయాలను కూడా ఇన్ఫీ ఏర్పాటు చేస్తుంది. ప్లాట్‌ఫాం అందుబాటులోకి వచ్చాక దాని నిర్వహణ బాధ్యతలను కూడా చేపడుతుంది.

బీఎండబ్ల్యూ రిటైల్.నెక్ట్స్



న్యూఢిల్లీ: లగ్జరీ కార్ల తయారీ దిగ్గజం బీఎండబ్ల్యూ గ్రూప్ భారత్‌లో రిటైల్. నెక్ట్స్ పేరుతో దేశవ్యాప్తంగా షోరూంలను నెలకొల్పాలని నిర్ణయించింది. తొలి కేంద్రాన్ని గురుగ్రామ్‌లో ప్రారంభించింది. ఈ ఔట్‌లెట్లలో బీఎండబ్ల్యూ, మినీ, బీఎండబ్ల్యూ మోటరాడ్ బ్రాండ్ల వాహనాలను ఒకేచోట విక్రయిస్తారు. 36 నెలల్లో 33 నగరాల్లో రిటైల్.నెక్ట్స్ స్టోర్లు రానున్నాయి. ఇందుకోసం డీలర్లతో కలిసి బీఎండబ్ల్యూ గ్రూప్ రూ.365.6 కోట్లు పెట్టుబడి చేయనుంది. ఇప్పటి వరకు బీఎండబ్ల్యూ, మినీ, బీఎండబ్ల్యూ మోటరాడ్ బ్రాండ్ల వాహనాల అమ్మకాల కోసం వేర్వేరుగా ఔట్‌లెట్లను గ్రూప్ నిర్వహించింది. వన్ ఫ్లోర్, వన్ సీలింగ్ విధానాన్ని అమలు చేయాలన్నది సంస్థ భావన. నూతన వాహనాల సేల్స్‌తోపాటు, సర్వీస్, ప్రీ-ఓన్డ్ కార్స్ విభాగమైన బీఎండబ్ల్యూ ప్రీమియం సెలెక్షన్ సైతం ఒకే గూటి కిందకు రానున్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-9-2024	
విశాఖ	550-00
చిత్తూరు	553-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540-00
విజయవాడ	545-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
NTPC	411.65	2.55
JSWSTEEL	970.9	1.71
HINDALCO	684.5	1.67
SHRIRAMFIN	3,419.50	1.52
LT	3,657.85	1.24

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJFINANCE	7,342.00	-3.38
HINDUNILVR	2,869.50	-2.16
BAJAJFINSV	1,856.10	-2.02
SBILIFE	1,823.00	-1.27
BRITANNIA	6,069.15	-1.04

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,420
ఎన్ఎస్ఈ	1,07,676
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,60,420
ఎఫ్ఐఐ	+4,83
డీఐఐ	+874

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	70.02	$ 69.02
బ్రెంట్	73.72	$ 72.75

27 లక్షల మహిళా పారిశ్రామికవేత్తలకు లబ్ధి



- సీజీటీఎంఎస్ఈ పథకంతో ఎంఎస్ఎంఈ పరిశ్రమలకు ప్రయోజనం
- కేంద్ర మంత్రి జితన్‌రామ్ మాంఝీ

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం రూపొందించిన సీజీటీఎంఎస్ఈ పథకం కింద మహిళల ఆధ్వర్యంలోని సూక్ష్మ, చిన్న తరహా సంస్థలకు 90 శాతం వరకు మెరుగైన రుణ హామీ కవరేజీ లభిస్తుందని కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ తెలిపారు. 27 లక్షల మహిళల ఎంఎస్ఎంఈలకు (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు) దీని కింద ప్రయోజనం దక్కుతుందన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలు బ్యాంకుల నుంచి హామీలేని రుణ సాయాన్ని పొందే దిశగా ఇది కీలక నిర్ణయం అవుతుందన్నారు. క్రెడిట్ గ్యారంటీ ఫండ్ ట్రస్ట్ ఫర్ మైక్రో, స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ (సీజీటీఎంఎస్ఈ) బోర్డ్ ఆమోదానికి ముందు మహిళల ఆధ్వర్యంలోని సంస్థలకు 85 శాతం వరకే రుణ హామీ రక్షణ ఉండేది. దీన్ని 90 శాతానికి పెంచడం వల్ల మరింత మందికి ప్రయోజనం దక్కుతుందని మంత్రి మాంఝీ పేర్కొన్నారు. నరేంద్ర మోదీ సర్కారు 100 రోజుల పాలనలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎంఈ) మంత్రిత్వ శాఖ సాధించిన విజయాలను మంత్రి మీడియాకు వెల్లడించారు. 5.07 కోట్ల ఎంఎస్ఎంఈలు సంఘటిత వ్యవస్థలోకి చేరాయని, 21 కోట్ల ఉద్యోగాలు ఏర్పడినట్టు వివరించారు. ప్రధానమంత్రి ఉద్యోగ కల్పన కార్యక్రమం (పీఎంఈజీపీ) కింద గడిచిన 100 రోజుల్లో 26,426 సూక్ష్మ సంస్థలు ఏర్పాటయ్యాయని, వాటికి రూ.3,148 కోట్ల రుణాలు మంజూరైనట్టు మంత్రి వెల్లడించారు. వీటి రూపంలో 2.11 లక్షల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం పెరుగుతుందన్నారు.

14 టెక్నాలజీ కేంద్రాలు

రూ.2,800 కోట్లతో, ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం ద్వారా దేశవ్యాప్తంగా 14 టెక్నాలజీ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి జితన్ రామ్ మాంఝీ తెలిపారు. నాగ్‌పూర్, పుణె, బొకారోలోనూ వీటిని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. "వీటిని ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో నెలకొల్పుతాం. స్థానిక ఎంఎస్ఎంఈలు వీటి ద్వారా తయారీలో అత్యాధునిక సాంకేతికతలు, నైపుణ్యాభివృద్ధి, వ్యాపార సలహా సేవలు పొందొచ్చు. టెక్నాలజీ లభ్యతతో లక్ష ఎంఎస్ఎంఈలు ప్రయోజనం పొందుతాయి. వచ్చే ఐదేళ్ల కాలంలో 3 లక్షల మంది యువతకు శిక్షణ ఇస్తాం"అని మంత్రి వివరించారు. పీఎం విశ్వకర్మ పథకం మొదలై ఏడాది అయిన సందర్భంగా మహారాష్ట్రలోని వార్ధాలో ఈ నెల 20న ఓ మెగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు.

25న కేఆర్ఎన్ హీట్ ఐపీవో

విక్రయానికి 1.55 కోట్ల షేర్లు



న్యూఢిల్లీ: ఫిన్, ట్యూబ్ టైప్ హీట్ ఎక్స్ఛేంజర్ల తయారీ కంపెనీ కేఆర్ఎన్ హీట్ ఎక్స్ఛేంజర్ అండ్ రిఫ్రిజిరేషన్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఇష్యూ ఈ నెల 25న ప్రారంభమై 27న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 24న షేర్లను కేటాయించనుంది. ఐపీవోలో భాగంగా 1.55 కోట్ల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. నిధులను రాజస్తాన్ కంపెనీ విస్తరణ ప్రణాళికల అమలుకు వినియోగించనుంది. కంపెనీ ప్రధానంగా హీట్ వెంటిలేషన్, ఎయిర్ కండిషనింగ్, రిఫ్రిజిరేషన్ పరిశ్రమల్లో వినియోగించే హీట్ ఎక్స్ఛేంజర్ ప్రొడక్టులను రూపొందిస్తోంది. ఐపీవో నిధులను పూర్తి అనుబంధ సంస్థ కేఆర్ఎన్ హెచ్‌వీఏసీ ప్రొడక్ట్స్ అల్వార్‌లోని నీమ్‌రాణాలో ఏర్పాటు చేయనున్న కొత్త తయారీ ప్లాంటుకు వెచ్చించనుంది. వైట్‌గూడ్స్ దిగ్గజాలు డైకెన్ ఏసీ ఇండియా, ష్నీడర్ ఎలక్ట్రిక్ ఐటీ బిజినెస్ ఇండియా, కిర్లోస్కర్ చిల్లర్స్, బ్లూ స్టార్ తదితరాలకు ప్రొడక్టులను సరఫరా చేస్తోంది. కంపెనీ ప్రీఐపీవో ప్లేస్‌మెంట్‌లో భాగంగా షేరుకి రూ. 200 ధరలో 4.77 లక్షల ఈక్విటీ షేర్లను జారీ చేసింది.

కైనెకో నుంచి ఇండో నేషనల్ ఔట్

51 శాతం వాటా విక్రయం

న్యూఢిల్లీ: కన్జూమర్ ఎలక్ట్రికల్ ప్రొడక్టులు, డ్రై సెల్ తయారీ దిగ్గజం ఇండో నేషనల్ తాజాగా కైనెకో లిమిటెడ్‌లో పూర్తి వాటాను విక్రయించినట్లు తెలియజేసింది. రైల్వేలు, డిఫెన్స్ రంగాలలో వినియోగించే కాంపోజిట్స్ తయారీ సంస్థ కైనెకోలో 51 శాతం వాటాను రూ. 220 కోట్లకు విక్రయించినట్లు నిప్పో బ్రాండ్ కంపెనీ వెల్లడించింది. నిధులను న్యూఏజ్ సంస్థలు, ఏరోస్పేస్, రక్షణ రంగం, ఎఫ్ఎంసీజీ పరిశ్రమలలో వెచ్చించే ప్రణాళికల్లో ఉన్నట్లు కంపెనీ పేర్కొంది. కైనెకోలో మెజారిటీ వాటాను ఇన్వెస్టర్ల కన్సార్షియంకు విక్రయించే ప్రతిపాదనపై డైరెక్టర్ల బోర్డు ఆమోదముద్ర వేసినట్లు తెలియజేసింది.

బీఎస్ఈలో ఇండో నేషనల్ షేరు 2.3 శాతం బలపడి రూ. 595 వద్ద ముగిసింది.



లక్ష్మీ డెంటల్ లిస్టింగ్ బాట

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు



న్యూఢిల్లీ: డెంటల్ ప్రొడక్టుల కంపెనీ లక్ష్మీ డెంటల్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి సన్నాహాలు మొదలుపెట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా రూ. 150 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 1.28 కోట్ల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. ప్రీఐపీవో ప్లేస్‌మెంట్‌కింద రూ. 30 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఈక్విటీ జారీ నిధులను అనుబంధ సంస్థ బిజ్‌డెంట్ డివైసెస్‌లో పెట్టుబడితోపాటు.. కొత్త మెషీనరీ కొనుగోలు, రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. కంపెనీ బ్రాండెడ్ డెంటల్ ప్రొడక్టులను తయారు చేస్తోంది.

స్పైస్‌జెట్ ఫ్లోర్ ధర రూ. 64.79

రూ. 3,000 కోట్ల సమీకరణకు క్విబ్



న్యూఢిల్లీ: చౌక ధరల విమానయాన కంపెనీ స్పైస్‌జెట్ అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల(క్విబ్) నుంచి నిధుల సమీకరణకు తెరతీసింది. ఇందుకు తాజాగా షేర్ల జారీ(ఫ్లోర్) ధరను ప్రకటించింది. ఒక్కో షేరుకి రూ. 64.79 చొప్పున సెక్యూరిటీలను విక్రయించనుంది. తద్వారా రూ. 3,000 కోట్లు సమకూర్చుకునే ప్రణాళికల్లో ఉంది. క్విబ్ ద్వారా రూ. 3,000 కోట్లవరకూ సమీకరించేందుకు గత వారం వాటాదారుల నుంచి స్పైస్‌జెట్ అనుమతి పొందిన సంగతి తెలిసిందే. కాగా.. వాటాదారుల అనుమతిమేరకు ఫ్లోర్ ధరపై 5 శాతానికి మించకుండా డిస్కౌంట్ ఇవ్వనున్నట్లు తాజాగా వెల్లడించింది. కంపెనీ ఆర్థిక సవాళ్లు, న్యాయ వివాదాలు, విమాన సర్వీసులు నిలిచిపోవడం తదితర సమస్యలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో నిధుల సమీకరణకు ప్రాధాన్యత ఏర్పడింది.

బీఎస్ఈలో స్పైస్‌జెట్ షేరు 5.25 శాతం పతనమై రూ. 73.72 వద్ద ముగిసింది.

రిలయన్స్ ఇన్‌ఫ్రా నిధుల సమీకరణ

ఈ నెల 19న బోర్డ్ సమావేశం

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిధుల సమీకరణ బాట పట్టింది. ఇందుకు ఈ నెల 19న బోర్డు సమావేశంకానున్నట్లు కంపెనీ వెల్లడించింది. ప్రిఫరెన్షియల్ పద్ధతిలో షేర్ల జారీ ద్వారా నిధుల సమీకరణ చేపట్టేందుకు ప్రతిపాదించినట్లు తెలియజేసింది. కంపెనీ ఇంతక్రితం జులై 2021లో ప్రిఫరెన్స్ షేర్ల జారీ ద్వారా రూ. 550 కోట్లు సమకూర్చుకుంది. ప్రమోటర్లు రూ. 400 కోట్లు అందించగా.. వార్డే క్యాపిటల్ పార్ట్‌నర్స్ రూ. 150 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేసింది. కాగా.. దేశ లేదా విదేశీ మార్కెట్ల నుంచి ఈక్విటీ సంబంధ సెక్యూరిటీల జారీ ద్వారా దీర్ఘకాలిక నిధులను సమీకరించే యోచనలో ఉన్నట్లు కంపెనీ పేర్కొంది. అయితే ఎంతమేర నిధులు సమకూర్చుకోవాలని చూస్తున్నదీ వెల్లడించలేదు.

సేల్స్‌మెన్‌గా స్విగ్గీ పార్ట్‌నర్స్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ ప్రాజెక్ట్ నెక్ట్స్‌కు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అర్హత కలిగిన డెలివరీ పార్ట్‌నర్స్‌కు శిక్షణ ఇచ్చి స్విగ్గీ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్‌గా తీర్చిదిద్దుతారు. 150కిపైగా వృద్ధి చెందుతున్న మార్కెట్లలో రెస్టారెంట్ల విస్తరణను మెరుగుపరచడం వీరి బాధ్యత. డెలివరీ భాగస్వాములకు అర్థవంతమైన కెరీర్‌లో పురోగతిని అందించడం ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. స్విగ్గీకి దేశవ్యాప్తంగా 4 లక్షల పైచిలుకు డెలివరీ భాగస్వాములు ఉన్నారు.

ధవళ్‌కు గోద్రెజ్ కన్జూమర్ ఎండీ సుధీర్ దన్ను

ప్రొఫెషనల్‌గా ఉత్తమ ప్రమాణాలు పాటిస్తారని కితాబు



న్యూఢిల్లీ: సెబీలో సతీమణి మాధవి పురి కీలక హోదాలో ఉండగా, కంపెనీలకు కన్సల్టెన్సీ సేవలందిస్తూ ప్రయోజనాలు పొందుతున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ధవళ్ బుచ్‌కు కార్పొరేట్లు మద్దతుగా నిలుస్తున్నారు. వృత్తిపరంగా ఆయన అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తారని ఎఫ్ఎంసీజీ రంగ దిగ్గజం గోద్రెజ్ కన్జూమర్ ప్రొడక్ట్స్ ఎండీ సుధీర్ సీతాపతి తెలిపారు. హిందుస్తాన్ యూనిలీవర్‌లో ఆయనకు జూనియర్‌గా చేసిన అనుభవంతో ఈ విషయం చెబుతున్నానని నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫాం లింక్డ్ఇన్‌లో ఆయన పోస్ట్ చేశారు. ప్రైవేట్ రంగ వ్యక్తులు ప్రభుత్వంలో చేరినప్పుడు ఇలాంటి సైడ్ ఎఫెక్ట్‌లు కనిపిస్తుండవచ్చని సీతాపతి చెప్పారు. అమెరికా వంటి దేశాల్లో ప్రైవేట్, ప్రభుత్వ రంగాల ఉద్యోగులు అటూ, ఇటూ మారుతుండటం సాధారణమే అన్నారు. కానీ సెబీలో ఇలాంటి నియామకం జరగడం ఇటీవలి కాలంలో ఇదే ప్రథమం కాబట్టి ఇటువంటి పరిణామాలు తలెత్తి ఉండొచ్చని సీతాపతి తెలిపారు. వాస్తవానికి ప్రైవేట్ రంగంలో నిపుణులకు కొదవలేదని, టాలెంట్‌ను ప్రభుత్వం వినియోగించుకోవచ్చని చెప్పారు. అయితే, ప్రతిదానికి ప్రైవేట్ రంగాన్ని వ్యతిరేకించే పాతతరపు సామ్యవాద ధోరణులను విడనాడాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్, ఆమె భర్త ధవళ్ బుచ్‌పై రాజకీయంగా వివాదాలు చెలరేగిన నేపథ్యంలో సీతాపతి వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది

నువోకోలో ఎస్‌బీఐ ఫండ్ వాటా పెంపు

9.37 శాతానికి వాటా



న్యూఢిల్లీ: బిల్డింగ్ మెటీరియల్స్ కంపెనీ నువోకో విస్టాస్ కార్పొరేషన్‌లో ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ వాటా పెంచుకుంది. ఎన్ఎస్ఈ బ్లాక్ డీల్ వివరాల ప్రకారం షేరుకి రూ. 352 సగటు ధరలో 45 లక్షల నువోకో విస్టాస్ షేర్లను కొనుగోలు చేసింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా 1.26 శాతం వాటాను సొంతం చేసుకుంది. ఇందుకు రూ. 158.4 కోట్లు ఇన్వెస్ట్ చేసింది. దీంతో నిర్మా గ్రూప్ కంపెనీ నువోకోలో ఎస్‌బీఐ ఎంఎఫ్ వాటా 8.11 శాతం నుంచి 9.37 శాతానికి బలపడింది. నువోకోలో ఈ వాటాను కొటక్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వయిజర్స్‌కు చెందిన కొటక్ స్పెషల్ సిట్యుయేషన్స్ ఫండ్ విక్రయించింది. ఈ లావాదేవీ తదుపరి కొటక్ స్పెషల్ వాటా నువోకో విస్టాస్‌లో 3.54 శాతం నుంచి 2.28 శాతానికి క్షీణించింది.

బీఎస్ఈలో నువోకో విస్టాస్ షేరు 3.8 శాతం జంప్‌చేసి రూ. 364 వద్ద ముగిసింది.

జేఎస్‌డబ్ల్యూ ఎంజీ లగ్జరీ రైడ్



గురుగ్రామ్: జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా లగ్జరీ రైడ్‌కు రెడీ అయింది. వచ్చే రెండేళ్లలో నాలుగు ప్రీమియం మోడళ్లను అందుబాటులోకి తేనున్నట్టు కంపెనీ వెల్లడించింది. వీటిలో స్ట్రాంగ్ హైబ్రిడ్, ప్లగ్-ఇన్ హైబ్రిడ్, ఎలక్ట్రిక్ వెహికిల్స్ ఉంటాయి. తొలి లగ్జరీ కారును 2025 మార్చిలోగా కంపెనీ ప్రవేశపెడుతోంది. అలాగే ప్రీమియం కస్టమర్లకు నవతరం కార్లను అందించేందుకు ఎంజీ సెలెక్ట్ పేరుతో ఔట్‌లెట్లను తెరవనున్నట్టు జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా సోమవారం ప్రకటించింది. ప్రీమియం విభాగంలో ఉన్న అవకాశాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. 2025 మార్చికల్లా 12 ప్రధాన నగరాల్లో ఈ కేంద్రాలు కొలువుదీరనున్నాయి. ప్రతి ఆరు నెలలకు ఒక కొత్త మోడల్‌ను పరిచయం చేయాలన్నది లక్ష్యమని జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ గౌరవ సీఈవో రాజీవ్ చాబా ఇటీవల చెప్పారు. చైనాకు చెందిన ఎస్ఏఐసీ మోటార్, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ జాయింట్ వెంచరే జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా. ప్రస్తుతం భారత్‌లో ఎంజీ మోటార్ హెక్టర్, ఆస్టర్, గ్లోస్టర్, జడ్ఎస్ ఈవీ, కామెట్ ఈవీ, విండ్సర్ ఈవీలను విక్రయిస్తోంది. కాగా, 2023లో దేశవ్యాప్తంగా 20 శాతం వృద్ధితో 45,000 లగ్జరీ కార్లు అమ్ముడయ్యాయి. మొత్తం ప్యాసింజర్ కార్ల పరిశ్రమలో వీటి వాటా కేవలం ఒక శాతమే.

టర్మ్ డిపాజిట్లకే ఆదరణ



సేవింగ్స్ డిపాజిట్లకు తగ్గిన డిమాండ్

- బ్యాంకులకు పెరిగిన వ్యయాలు
- ఫలితంగా మార్జిన్లకు చిల్లు

న్యూఢిల్లీ: బ్యాంకు ఖాతాల్లో సేవింగ్స్ డిపాజిట్లకు బదులు, అధిక రాబడినిచ్చే టర్మ్ డిపాజిట్లకే కస్టమర్లు మొగ్గు చూపిస్తున్నారు. ఫలితంగా బ్యాంకులకు నిధులపై వ్యయాలు పెరిగిపోయి, వాటి నికర వడ్డీ మార్జిన్లకు చిల్లు పెడుతున్న పరిస్థితి నెలకొంది. ఆర్‌బీఐ తాజా డేటా ప్రకారం.. ఐదు ప్రముఖ బ్యాంక్‌ల్లో సేవింగ్స్ డిపాజిట్లపై వడ్డీ రేటు 2.7-3 శాతం మధ్య ఉండగా, ఏడాది కాల టర్మ్ డిపాజిట్లపై అవే బ్యాంకులు 7.25 శాతం వరకు వడ్డీని ఆఫర్ చేస్తున్నాయి. 2023-2024 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకింగ్ రంగం, అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోల్చి చూస్తే టర్మ్ డిపాజిట్ల రూపంలో 18.64 శాతం అధికంగా రూ.116 లక్షల కోట్లను సమీకరించాయి. అదే కాలంలో బ్యాంకుల సేవింగ్స్ డిపాజిట్లు కేవలం 6 శాతం పెరిగి రూ.63 లక్షల కోట్లుగా ఉన్నాయి. 2022-23లో టర్మ్ డిపాజిట్లలో వృద్ధి 13.5 శాతంగా ఉంటే, సేవింగ్స్ డిపాజిట్లలో పరుగుదల 4.9 శాతంగానే ఉండడం గమనార్హం. 2021-22లో టర్మ్ డిపాజిట్లలో వృద్ధి 9.6 శాతంగానే ఉంది. అదే ఏడాది సేవింగ్స్ డిపాజిట్లు ఇంతకంటే అధికంగా 12.4 శాతం మేర పెరిగాయి. మొత్తం మీద 2024తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ డిపాజిట్లు క్రితం ఆర్థిక సంవత్సరంతో పోల్చి చూస్తే 13.5 శాతం వృద్ధి చెందాయి. అంతకు ముందు వరుస ఆర్థిక సంవత్సరాల్లో ఈ వృద్ధి వరుసగా 9.6 శాతం, 8.9 శాతం చొప్పున ఉంది.

అధిక రాబడుల కోసమే..

పొదుపు నుంచి టర్మ్ డిపాజిట్లకు పెట్టుబడుల మరలింపు స్పష్టంగా కనిపిస్తున్నట్టు బ్యాంకర్లు చెబుతున్నారు. రేట్లు గరిష్ట స్థాయిలో ఉండడంతో టర్మ్ డిపాజిట్లలోకి పొదుపు నిధులు మళ్లించుకోవడం ద్వారా రాబడులను పెంచుకునేందుకు కస్టమర్లు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. దేశంలో అతి పెద్ద బ్యాంక్ (డిపాజిట్లలో 22.6 శాతం వాటా) ఎస్‌బీఐ డిపాజిట్ బేస్ గడిచిన ఆర్థిక సంవత్సరంలో 11.13 శాతం వృద్ధితో రూ.49.16 లక్షల కోట్లకు చేరుకుంది. "2023-24లో వడ్డీ రేట్లు పెరిగే క్రమంలో టర్మ్ డిపాజిట్లు 16.38 శాతం మేర వృద్ధి చెంది రూ.27.82 లక్షల కోట్లకు చేరాయి. కాసా డిపాజిట్లు (కరెంట్, సేవింగ్స్ ఖాతా డిపాజిట్లు) 4.25 శాతం పెరిగి రూ.19.42 లక్షల కోట్లకు చేరాయి"అని ఎస్‌బీఐ తన వార్షిక నివేదికలో వెల్లడించింది. బ్యాంక్ సేవింగ్స్ ఖాతాల నుంచి డిపాజిట్లు కేవలం టర్మ్ డిపాజిట్లలోకే కాకుండా, ఇంకా మెరుగైన రాబడులు వచ్చే ఈక్విటీలు, ప్రత్యామ్నాయ పెట్టుబడుల సాధనాల్లోకి వెళుతున్నట్టు బ్యాంకర్లు చెబుతున్నారు. గత రెండు సంవత్సరాలుగా బ్యాంకు రుణాల వృద్ధి కంటే డిపాజిట్ల వృద్ధి తగ్గడానికి ఇదే కారణమని పేర్కొంటున్నారు. రుణాల వృద్ధి కంటే డిపాజిట్ల వృద్ధి క్షీణించడం పట్ల ఆర్‌బీఐ సైతం ఆందోళన వ్యక్తం చేయడం తెలిసిందే. డిపాజిట్లు ఆకర్షించేందుకు బ్యాంకులు వినూత్నమైన మార్గాలను అన్వేషించాలని సైతం ఆర్‌బీఐ సూచించింది. "బ్యాంక్‌లు డిపాజిటర్లను ఆకర్షించేందుకు మెరుగైన సంబంధాల దిశగా కృషి చేస్తున్నాయి. అందుకు అనుగుణంగా వ్యాపార విధానాలు సైతం మారాల్సిందే. కేవలం డిపాజిట్ల స్వీకరణకే పరిమితం కాకుండా, సంపద నిర్వహణ సేవలు, క్లయింట్లతో పూర్తి సంబంధాల దిశగా వ్యవహరించాల్సిందే"అని ఫెడరల్ బ్యాంక్ ఎండీ శ్యామ్ శ్రీనివాసన్ పేర్కొనడం గమనార్హం.

బ్యాంకుల రుణ వృద్ధి వెనకడుగు

క్యూ1లో 13.7 శాతానికి పరిమితం



క్రెడిట్- డిపాజిట్(సీడీ) రేషియో నిర్వహణపై దృష్టి, వ్యక్తిగత, వ్యవసాయ రుణాలు నెమ్మదించడం వంటి అంశాలు జులై నెలలో బ్యాంకుల రుణ వృద్ధిపై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. దీంతో 2023 జులైలో 19.5 శాతంగా నమోదైన క్రెడిట్ గ్రోత్ 2024 జులైలో 13.7 శాతానికి పరిమితమైంది. కేర్‌ఎడ్జ్ నివేదిక ప్రకారం గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో జోరు చూపిన రుణ మంజూరీ ఈ ఏడాది(2024-25) తొలి 4 నెలల్లో మందగించింది. ఇందుకు అన్‌సెక్యూర్డ్ రిటైల్ రుణాలు, కార్పొరేట్ క్రెడిట్‌కు తగ్గిన డిమాండ్ కారణమైంది. దీంతో జులైలో బ్యాంకుల రుణ వృద్ధి 6 శాతం క్షీణించింది. వ్యక్తిగత, వ్యవసాయ, చిన్నతరహా బిజినెస్ విభాగాల నుంచి రుణ వృద్ధి మందగించడం ప్రభావం చూపింది.

విభాగాలవారీగా..

ఇండస్ట్రీ మినహా అన్ని ప్రధాన రంగాలలోనూ రుణ వృద్ధి జులై నెలలో నీరసించింది. వ్యక్తిగత రుణాలు 31.2 శాతం నుంచి 14.4 శాతానికి దిగివచ్చాయి. ప్రధానంగా వాహన, అన్‌సెక్యూర్డ్ రుణాలు వెనకడుగు వేయడం ప్రభావం చూపింది. ఫైనాన్షియల్ దిగ్గజ ద్వయం హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ విలీనం దీనికి కారణంకాగా.. కేర్‌ఎడ్జ్ నివేదిక ప్రకారం గోల్డ్ లోన్స్ పెరగడం పాక్షికంగా దెబ్బతీసింది. ఇక సీజనల్ ఒత్తిళ్ల నేపథ్యంలో వ్యవసాయ రంగానికి రుణ విడుదల సైతం 5.8 శాతం నుంచి 4.1 శాతానికి మందగించింది. ఈ ఏడాది తొలి నాళ్లలో ఉత్తరాదిన వ్యవసాయ విభాగంలో ప్రతికూల పరిస్థితులు నెలకొన్నట్లు బ్యాంకర్లు పేర్కొన్నారు. భవిష్యత్‌లోనూ కొనసాగనున్నట్లు అభిప్రాయపడ్డారు. సర్వీసుల విభాగం క్రెడిట్ గ్రోత్ 23.4 శాతం నుంచి 14 శాతానికి పడిపోయింది. ఎన్‌బీఎఫ్‌సీలు, వాణిజ్య రంగాల నుంచి రుణాలకు డిమాండ్ నీరసించగా.. రియల్టీ కొంతమేర ఆదుకున్నట్లు బ్యాంకర్లు తెలియజేశారు. అయితే ఇండస్ట్రీ విభాగం రుణ వృద్ధి 5.2 శాతం నుంచి 10.1 శాతానికి ఎగసింది.

చెన్నైలో జోరుగా సాధన

ప్రాక్టీస్‌లో చెమటోడుస్తున్న ఇరు జట్ల ప్లేయర్లు ● రేపటి నుంచి భారత్, బంగ్లాదేశ్ తొలి టెస్టు



కోహ్లి

గంభీర్

చెన్నై: ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో భాగంగా జరుగుతున్న భారత్, బంగ్లాదేశ్ సిరీస్ కోసం ఇరు జట్ల ప్లేయర్లు కసరత్తులు ముమ్మరం చేశారు. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా చెన్నై చెపాక్ స్టేడియం వేదికగా గురువారం నుంచి తొలి టెస్టు ప్రారంభం కానుండగా.. మంగళవారం టీమిండియా ప్లేయర్లు ప్రాక్టీస్‌లో మునిగిపోయారు. ఇటీవల శ్రీలంకతో పరిమిత ఓవర్ల సిరీస్‌లో భారత స్టార్ ఆటగాళ్లు సైతం స్పిన్నర్లను ఎదుర్కోవడంలో తడబడ్డ నేపథ్యంలో... ఆ దిశగా మరింత సాధన చేస్తున్నారు. కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లితో పాటు వికెట్ కీపర్ రిషబ్ పంత్, శుబ్‌మన్‌గిల్, యశస్వి జైస్వాల్ నెట్స్‌లో చెమటోడ్చగా... హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో పాటు బీసీసీఐ సెలెక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్ ప్రాక్టీస్ సెషన్‌ను పర్యవేక్షించాడు. పలువురు ఆటగాళ్లతో వ్యక్తిగతంగా మాట్లాడిన గౌతమ్ గంభీర్ తగు సూచనలు చేయగా... సహాయక కోచ్‌లు ర్యాన్ టెన్ డస్కటే, అభిషేక్ నాయర్ ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నారు. ముఖ్యంగా పంత్ బ్యాటింగ్‌పై గంభీర్ ప్రత్యేక దృష్టి పెట్టాడు. 2022 డిసెంబర్‌లో మిర్పూర్‌లో బంగ్లాదేశ్‌పై మ్యాచ్ తర్వాత పంత్ టెస్టు మ్యాచ్ ఆడనుండటం ఇదే తొలిసారి. చెన్నై పిచ్ తొలుత బ్యాటింగ్‌కు ఆ తర్వాత స్పిన్‌కు అనుకూలించే అవకాశాలున్నాయి. అందుకే నెట్స్‌లో దాదాపు అందరు ఆటగాళ్లు స్పిన్‌ను ఎదుర్కోవడంపై దృష్టి పెట్టడం కనిపించింది. తొలి టెస్టులో టీమిండియా ఇద్దరు పేసర్లు, ముగ్గురు స్పిన్నర్ల కూర్పుతో బరిలోకి దిగే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. చెన్నైలో గత రెండు వారాలుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్లేయర్లు ఎర్రమట్టి పిచ్‌తో పాటు నల్లమట్టి పిచ్‌పై ప్రాక్టీస్ సాగిస్తున్నారు.



పంత్

అశ్విన్ బర్త్‌డే వేడుకలు...



టెస్టు క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్లలో రెండో స్థానంలో ఉన్న రవిచంద్రన్ అశ్విన్ కొత్త సీజన్‌లో సరికొత్త రికార్డుల వేటకు దిగుతున్నాడు. తన సొంత మైదానం చెపాక్ స్టేడియంలో బంగ్లాతో తొలి టెస్టుకు సిద్ధమైన అశ్విన్ భారత్‌లో జరిగే ఐదు వరుస టెస్టుల్లో కలిపి పెద్ద సంఖ్యలో వికెట్లు సాధించే అవకాశం ఉంది. భారత్ తరఫున అనిల్ కుంబ్లే (619 వికెట్లు) టాపర్‌గా ఉండగా, అశ్విన్ ఖాతాలో ప్రస్తుతం 516 వికెట్లు ఉన్నాయి. కుంబ్లేను అందుకునే క్రమంలో అతను ఎంత దూరం వెళతాడనేది ఆసక్తికరం. మంగళవారం భారత జట్టు సహచరులతో కలిసి అతను తన 38వ పుట్టిన రోజును జరుపుకున్నాడు. సొంత గడ్డపై చెన్నైలో ఇప్పటి వరకు 4 టెస్టులు ఆడిన అశ్విన్ 30 వికెట్లు పడగొట్టడం విశేషం.

'భారత్‌తో ఆడటమే సవాల్'

బంగ్లాదేశ్ కోచ్ హతురసింఘా



చెన్నై: భారత్ లాంటి పెద్ద జట్టుతో టెస్టు సిరీస్ ఆడటమే సవాల్ వంటిదని బంగ్లాదేశ్ హెడ్ కోచ్ చందిక హతురసింఘా అన్నాడు. ఇటీవల పాకిస్తాన్‌పై 2–0తో సిరీస్ గెలిచి మంచి జోరు మీద ఉన్న బంగ్లాదేశ్ జట్టు గురువారం నుంచి టీమిండియాతో తొలి టెస్టు మ్యాచ్ ఆడనుంది. 'భారత్‌లో భారత్‌ను ఎదుర్కోవడం అంటే కఠినమైన సవాల్. ప్రపంచంలోనే అత్యుత్తమ జట్టుతో ఆడబోతున్నాం. అలాంటప్పుడే మన అసలు సత్తా బయట పడుతుంది. పాకిస్తాన్‌పై టెస్టు సిరీస్ క్లీన్‌స్వీప్ చేయడం మా ప్లేయర్ల ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. పరిస్థితులకు తగ్గట్లు ఆడితే మంచి ఫలితాలు వస్తాయని అది నిరూపించింది. ప్రస్తుత బంగ్లాదేశ్ జట్టు సమతూకంగా ఉంది. మంచి పేసర్లు అందుబాటులో ఉన్నారు. ఇక స్పిన్ విషయం కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. బ్యాటింగ్‌లో కూడా చాలా మంది అనుభవజ్ఞులు ఉన్నారు. బంగ్లాదేశ్ క్రికెట్‌లో షకీబ్ అల్ హసన్ పాత్ర కీలకం. అతడి ఆల్‌రౌండ్ నైపుణ్యం, అనుభవం జట్టుకు మరింత స్వేచ్ఛను ఇస్తుంది. గత కొన్నాళ్లుగా మెహదీ హసన్ మిరాజ్ ఎంతో పరిణతి సాధించాడు. అది జట్టుకు అదనపు ప్రయోజనం చేకూర్చుతోంది' అని హతురసింఘా మంగళవారం పేర్కొన్నాడు.

ప్రియాన్షు పరాజయం

చైనా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

చాంగ్జౌ: భారత యువ ఆటగాడు ప్రియాన్షు రజావత్ చైనా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ తొలి రౌండ్‌లో ఓటమి పాలయ్యాడు. ఈ ఏడాది చివరి వరల్డ్ టూర్ సూపర్–1000 టోర్నీ పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో మంగళవారం ప్రియాన్షు 13–21, 16–21 బ్రియాన్ యంగ్ (కెనడా) చేతిలో పరాజయం పాలయ్యాడు. 36 నిమిషాల్లో ముగిసిన పోరులో ప్రియాన్షు వరుస గేమ్‌ల్లో ఓడాడు. గత కొంతకాలంగా అంతర్జాతీయ స్థాయిలో నిలకడ కనబరుస్తున్న ప్రియాన్షు... చైనా ఓపెన్‌లో అదే దూకుడు కొనసాగించలేకపోయాడు. ఇక పురుషుల సింగిల్స్‌లో భారత్ నుంచి బరిలో ఉన్న మరో షట్లర్ కిరణ్ జార్జి బుధవారం తొలి రౌండ్‌లో కెంటా నిషిమొటో (జపాన్)తో తలపడనున్నాడు. భారత అగ్రశ్రేణి షట్లర్లంతా ఈ టోర్నీకి దూరంగా ఉండగా... మహిళల సింగిల్స్‌లో సామియా ఇమాద్ ఫారూఖి, మాళవిక బన్సోద్, ఆకర్షి కశ్యప్, మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ, రుతుపర్ణ–శ్వేతాపర్ణ జోడీలు... మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కి రెడ్డి–సుమీత్ రెడ్డి, సతీశ్ కుమార్–ఆద్యా జోడీలు పోటీలో ఉన్నాయి.

పురుషులతో సమానంగా ప్రైజ్‌మనీ



● టి20 ప్రపంచకప్ విజేతకు భారీ నగదు బహుమతి
● వరల్డ్ చాంపియన్‌కు 19.60 కోట్లు

దుబాయ్: వచ్చే నెలలో జరగనున్న మహిళల టి20 ప్రపంచకప్ విజేతకు భారీ ప్రైజ్‌మనీ దక్కనుంది. పురుషుల వరల్డ్‌కప్ విజేతతో సమానంగా... మహిళల ప్రపంచకప్ చాంపియన్‌కు నగదు బహుమతి ఇవ్వాలని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) నిర్ణయించింది. యూఏఈ వేదికగా జరగనున్న మహిళల టి20 ప్రపంచకప్ నుంచే దీనికి శ్రీకారం చుట్టనున్నట్లు ఐసీసీ మంగళవారం వెల్లడించింది. దీంతో మహిళల టి20 వరల్డ్ కప్ విజేతకు రూ. 19.60 కోట్ల ప్రైజ్‌మనీ దక్కనుంది. గత ప్రపంచకప్ నగదు బహుమతితో పోల్చుకుంటే... ఇది 134 శాతం ఎక్కువ కావడం విశేషం. 2023లో నిర్వహించిన మహిళల టి20 ప్రపంచకప్ మొత్తం ప్రైజ్‌మనీ రూ. 20.52 కోట్లు (2.45 మిలియన్ అమెరికన్ డాలర్లు) కాగా.. ఈ సారి ఆ మొత్తాన్ని రూ. 66.67 కోట్ల(7,958,080 అమెరికన్ డాలర్లు)కు పెంచారు. దీంతో రానున్న మెగాటోర్నీలో రన్నరప్‌గా నిలిచిన జట్టుకు రూ.9 కోట్ల ప్రైజ్‌మనీ దక్కనుంది. సెమీఫైనల్స్‌లో ఓడిన రెండు జట్లకు కూడా భారీగా నగదు బహుమతి అందుకోనున్నాయి. 'వచ్చే నెల జరగనున్న టి20 ప్రపంచకప్ నుంచి మహిళలకూ పురుషులతో సమానంగా నగదు బహుమతి ఇవ్వాలని ఐసీసీ నిర్ణయించింది. ఇది క్రీడా చరిత్రలోనే సరికొత్త నిర్ణయం'అని ఐసీసీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాదే జరిగిన పురుషుల టి20 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన టీమిండియాకు రూ.20 కోట్ల నగదు బహుమతి లభించింది. అక్టోబర్ 3 నుంచి 20 వరకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వేదికగా టి20 ప్రపంచకప్ జరగనుంది. షెడ్యూల్ ప్రకారం ఈ మెగాటోర్నీకి బంగ్లాదేశ్ ఆతిథ్యమివ్వాల్సి ఉండగా... అక్కడ రాజకీయ అనిశ్చితి నెలకొనడంతో వేదిక మార్చాల్సి వచ్చింది.

పాక్‌లో ఐసీసీ బృందం పర్యటన



కరాచీ: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఉన్నతస్థాయి బృందం పాకిస్తాన్‌లో పర్యటించేందుకు మంగళవారం కరాచీ చేరుకుంది. వచ్చే ఏడాది ఇక్కడ ప్రతిష్టాత్మక ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ జరగనుంది. ఈ నేపథ్యంలో ఐదుగురు సభ్యులు గల ఐసీసీ బృందం ఆతిథ్య వేదికల్లో చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లు, కల్పించే సదుపాయాలను స్వయంగా పర్యవేక్షించనుంది. ఐసీసీ ఈవెంట్ల భద్రతాధికారి, జనరల్ మేనేజర్, ప్రొడక్షన్ మేనేజర్, ఐసీసీ పిచ్ కన్సల్టెంట్ ఈ బృందంలో ఉన్నారు. ఈ ఏడాది పిచ్ కన్సల్టెంట్ అండీ అట్కిన్సన్ పాక్‌లో పర్యటించడం ఇది మూడోసారి. ఈ బృందం ముందుగా కరాచీలో ఉన్న స్టేడియం, ఆటగాళ్లు బస చేసే హోటల్స్‌ను పరిశీలిస్తుంది. అనంతరం ఇస్లామాబాద్, లాహోర్‌లకు పయనమవుతుంది. భారత్ ఆడే మ్యాచ్‌లన్నీ లాహోర్‌లో ఉండటంతో బృందం ప్రత్యేక దృష్టిపెట్టనుంది. ఈ బృందం నివేదిక ఆధారంగా లోటుపాట్లపై చర్చించిన తర్వాత వేదికల మార్పులు చేర్పులు, టోర్నమెంట్ తుది షెడ్యూలు ఖరారు చేస్తారు.

ఎఫ్ఐహెచ్ అవార్డుల రేసులో శ్రీజేశ్, హర్మన్‌ప్రీత్



హర్మన్‌ప్రీత్

లుసానే: అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) స్టార్స్ అవార్డుల రేసులో భారత దిగ్గజం, మాజీ గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేశ్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ నామినేట్ అయ్యారు. ఎఫ్ఐహెచ్ మంగళవారం విడుదల చేసిన తుది జాబితాలో భారత పురుషుల జట్టు నుంచి వీరిద్దరికి మాత్రమే చోటు దక్కగా, మహిళల జట్టులో ఏ ఒక్కరు రేసులో నిలువలేకపోయారు. ఇటీవల పారిస్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో భారత జట్టు కాంస్య పతక విజయంలో కెప్టెన్ హర్మన్‌తో పాటు గోల్‌కీపర్ శ్రీజేశ్‌లు కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ప్లేయర్ ఆఫ్ ద ఇయర్ కేటగిరీలో హర్మన్‌ప్రీత్‌తో పాటు బ్రింక్‌మన్, జోప్ డి మోల్ (నెదర్లాండ్స్), ముల్లర్ (జర్మనీ), వాలెస్ (ఇంగ్లండ్) నామినేట్ కాగా, బెస్ట్ గోల్‌కీపర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు కోసం పీఆర్ శ్రీజేశ్, పిర్మిన్ బ్లాక్ (నెదర్లాండ్స్), కాల్‌జడో (స్పెయిన్), డేన్‌బర్గ్ (జర్మనీ), శాంటియగో (అర్జెంటీనా) నామినేట్ అయ్యారు. కాంస్యం గెలిచిన తర్వాత శ్రీజేశ్ తన అంతర్జాతీయ కెరీర్‌కు ఘనంగా వీడ్కోలు తెలిపాడు. ఎఫ్ఐహెచ్ నియమించిన నిపుణుల ప్యానెల్ వీరిని తుది జాబితాకు ఎంపిక చేసింది. ఈ ప్యానెల్‌లో పలువురు ప్లేయర్లు, కోచ్‌లు, వివిధ దేశాలకు చెందిన సమాఖ్యల్లోని సీనియర్ అధికారులు సభ్యులుగా ఉన్నారు. ఈ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా జరిగిన ఎఫ్ఐహెచ్ హాకీ ప్రొ లీగ్, నేషన్స్ కప్ హాకీ, ఒలింపిక్ క్వాలిఫయర్స్, ఒలింపిక్స్‌లలో కనబరిచిన ప్రదర్శన ఆధారంగా నిపుణుల ప్యానెల్... ఆటగాళ్లను అవార్డుల కోసం నామినేట్ చేసింది. వచ్చే నెల 11 వరకు జరిగే ఓటింగ్‌లో పోల్ అయిన ఓట్ల శాతంతో విజేతల్ని ప్రకటిస్తారు.

జంషెడ్‌పూర్ ఎఫ్‌సీ శుభారంభం



మార్గావ్: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో జంషెడ్‌పూర్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన పోరులో జంషెడ్‌పూర్ ఎఫ్‌సీ 2–1 తేడాతో గోవాపై విజయం సాధించింది. జంషెడ్‌పూర్ తరఫున జేవియర్ సివేరియా (74వ నిమిషంలో), జార్డాన్ ముర్రే (90+3వ నిమిషంలో) చెరో గోల్ చేశారు. గోవా తరఫున ఆర్మాన్డో సాడికు (45+3వ నిమిషంలో) ఏకైక గోల్ సాధించాడు. కోచ్ మార్ పర్యవేక్షణలో తొలి అర్ధభాగంలో అదరగొట్టిన గోవా జట్టు... గోల్ కొట్టి ఆధిక్యం సాధించినా దాన్ని చివరి వరకు కొనసాగించలేకపోయింది. 74వ నిమిషంలో ఖాతా తెరిచిన జంషెడ్‌పూర్ స్కోరు సమం చేయగా... మరికాసేపట్లో ఆట ముగుస్తుందనుకుంటున్న సమయంలో సబ్‌స్టిట్యూట్ ప్లేయర్ జోర్డాన్ ముర్రే చక్కటి గోల్‌తో జంషెడ్‌పూర్ పాయింట్ల పట్టికలో ఖాతా తెరిచింది. తదుపరి మ్యాచ్‌లో శనివారం ముంబై సిటీతో జంషెడ్‌పూర్ ఎఫ్‌సీ తలపడనుండగా... అదే రోజు మొహమ్మదాన్ స్పోర్టింగ్ క్లబ్ జట్టుతో గోవా ఎఫ్‌సీ అమీతుమీ తేల్చుకోనుంది.

నగాల్ కావాలనే ఆడలేదు!

డేవిస్ కప్‌పై 'ఐటా' విమర్శ



న్యూఢిల్లీ: భారత సింగిల్స్ స్టార్ సుమిత్ నగాల్ ఉద్దేశపూర్వకంగానే వరుసగా డేవిస్ కప్ పోటీలకు దూరమవుతున్నాడని అఖిల భారత టెన్నిస్ సంఘం (ఐటా) ఆరోపించింది. గాయాలు, ఇతరత్రా కారణాలతో ఈ ఏడాది నగాల్... పాకిస్తాన్, స్వీడెన్‌లతో జరిగిన డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్–1 టై లకు గైర్హాజరయ్యాడు. ఇటీవల స్టాక్‌హోమ్‌లో జరిగిన పోరులో భారత్ 0–4తో స్వీడెన్‌తో చిత్తుగా ఓడింది. సుమిత్, యూకీ బాంబ్రీలాంటి స్టార్ ఆటగాళ్లు బరిలోకి దిగితే కచ్చితంగా ఫలితాలు మరోలా ఉండేవని 'ఐటా' కార్యదర్శి అనిల్ ధూపర్ వివరించారు. స్టాక్‌హోమ్‌కు వెళ్లిన భారత జట్టులో ఒక్క రామ్‌కుమార్ రామనాథన్ మాత్రమే అనుభవజ్ఞుడని, డబుల్స్ స్పెషలిస్టు శ్రీరామ్ బాలాజీని సింగిల్స్‌లో ఆడించామని చెప్పారు. ఆర్యన్ షా, సిద్ధార్థ్ విశ్వకర్మ అరంగేట్రం చేసిన ఆటగాళ్లని... అందువల్లే భారత్ చిత్తుగా ఓడిందని ఆయన అన్నారు. వెన్ను గాయాన్ని కారణంగా చూపించిన నగాల్ అదే సమయంలో చైనాలో ఏటీపీ టోర్నీ ఆడుతున్నాడని దుయ్యబట్టారు. డేవిస్ కప్ అనేది కేవలం ఒక టెన్నిస్ టోర్నమెంట్ కాదని... దేశానికి ప్రాతినిధ్యం వహించడమని చెప్పుకొచ్చారు. ముకుంద్ శశికుమార్‌పై సస్పెన్షన్‌ను ఎత్తివేస్తామని, వచ్చి డేవిస్ కప్ ఆడాలని విజ్ఞప్తి చేసినా...అతనూ పట్టించుకోలేదని ధూపర్ విమర్శించారు.

మయన్మార్ వరదల్లో... 236 మంది మృతి

నైపిడావ్: మయన్మార్‌లోని యాగి తుఫాను విలయం కొన సాగుతూనే ఉంది. దేశాన్ని వరదలు ముంచెత్తుతున్నాయి. వాటి ధాటికి ఇప్పటిదాకా ఏకంగా 236 మంది మృతి చెందారని ప్రభుత్వ సంస్థ గ్లోబల్ న్యూ లైట్ ఆఫ్ మయన్మార్ మంగళవారం వెల్లడించింది. ఈ సంఖ్య పెరగవచ్చని ఐరాస మానవతా వ్యవహారాల సమన్వయ కార్యాలయం (ఓసీహెచ్ ఏ) పేర్కొంది. "77 మంది గల్లంతయ్యారు. కనీసం 6 లక్షల మందికి పైగా వరదల బారిన పడ్డారు" అని ఒక ప్రకటనలో తెలిపింది. దక్షిణ చైనా, వియత్నాం, లావోస్, మయన్మార్‌లో గత వారం భారీ వర్షాలు కురిశాయి. ఉత్తర వియత్నాంలో ఇప్పటికే వందలాది మంది మరణించినట్లు నిర్ధారించారు. మయన్మార్‌లో రాజధాని నైపిడావ్, సెంట్రల్ మాండలే, కయా, కయిన్, షాన్ స్టేట్స్ సహా కనీసం తొమ్మిది ప్రాంతాలు, రాష్ట్రాలను వరదలు ప్రభావితం చేశాయి. 2023లో మోచా తుఫాను వేళ అంతర్జాతీయ సాయాన్ని తిరస్కరించిన సైనిక పాలకులు ఇప్పుడు మాత్రం సాయానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

సైనిక ప్రభుత్వంతో సమస్య

ఆహారం, తాగునీరు, మందులు, బట్టలు, ఆశ్రయం మయన్మార్‌కు అత్యవసరమని ఓసీహెచ్ఏ పేర్కొంది. దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు, అస్థిరమైన టెలికమ్యూనికేషన్, ఇంటర్నెట్ సహాయక చర్యలకు ఆటంకంగా మారాయని తెలిపింది. పొరుగు దేశాల సాయం బాధితులకు అందాలంటే సైన్యం పౌర సమాజంతో కలిసి పని చేయడం ముఖ్యమని అంతర్జాతీయ మానవ హక్కుల నిపుణుల స్వతంత్ర సమూహం ఏఏస్ఏసీ-ఎం తెలిపింది. కానీ మెజారిటీ ప్రజలకు సాయమందేలా చూడాలనే ఉద్దేశం సైనిక ప్రభుత్వానికి లేదని ఒక ప్రకటనలో ఆక్షేపించింది. సైన్యం దేశంలో మానవతా సంక్షోభాన్ని సృష్టించిందని, ప్రజలను గాలికొదిలి సొంత సైనిక, రాజకీయ ఎజెండాతో ముందుకు వెళ్తోందని ఆరోపించింది. నిధుల సమస్యతో కూడా సహాయక చర్యలు నత్తనడకన సాగుతున్నాయని ఓసీహెచ్ఏ పేర్కొంది.



మయన్మార్ రాజధాని నైపిడావ్‌లో రోడ్లను వరద నీరు ముంచెత్తడంతో మంగళవారం పడవల ద్వారా స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.



దేశ ఆర్థిక రాజధాని ముంబైలో మంగళవారం భక్తుల కోలాహలం మధ్య సాగుతున్న గణేశుని శోభా యాత్ర



పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలతో మట్టిచెరియలు విరిగిపడి కాలింపాంగ్ జిల్లాలోని సెటిఝోరా వద్ద 10వ నంబర్ జాతీయ రహదారి కొట్టుకుపోయింది. దీంతో, మంగళవారం నుంచి ఆ రహదారిపై రాకపోకలను అధికారులు నిలిపివేశారు.

అస్థిరత ఏర్పడినప్పడల్లా... హిందువులే టార్గెట్

బంగ్లా హింసపై కెనడా ఎంపీ ఆందోళన

అంటారియో: బంగ్లాదేశ్‌లో హిందువుల మీద జరుగుతున్న హింసపై భారత సంతతికి చెందిన కెనడా ఎంపీ చంద్ర ఆర్య తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులు, బౌద్ధులు, క్రైస్తవులతో సహా మతపరమైన మైనారిటీలు ఎదుర్కొంటున్న ఇబ్బందికర పరిస్థితులను ఆయన ఎత్తిచూపారు. కెనడా పార్లమెంటులో ఈ మేరకు ప్రకటన చేశారు. బంగ్లాలో అస్థిరత ఏర్పడినప్పుడల్లా ఈ సమూహాలు, ముఖ్యంగా హిందువులు లక్ష్యంగా అవుతున్నారని, ఎక్కువగా హింసకు గురవుతున్నారని వాపోయారు. 1971లో బంగ్లాకు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ జనాభాలో మతపరమైన మైనారిటీల సంఖ్య భారీగా తగ్గిందని వెల్లడించారు. కెనేడియన్ హిందువులు బంగ్లాదేశ్‌లోని తమ బంధువులు, ఆస్తుల భద్రత గురించి ఆందోళన చెందుతున్నారని ఆర్య తెలిపారు. దీనిపై అవగాహన కల్పించేందుకు సెప్టెంబర్ 23న కెనడా పార్లమెంట్ ముందు ర్యాలీ నిర్వహించనున్నట్టు ప్రకటించారు. బంగ్లాదేశ్‌తో సంబంధాలున్న కెనేడియన్ బౌద్ధులు, క్రిస్టియన్ల కుటుంబాలు కూడా ఇందులో పాల్గొంటాయని తెలిపారు.

హిందువులపై దాడులు

బంగ్లాదేశ్‌లో ఇటీవలి తిరుగుబాటు తర్వాత దేశవ్యాప్తంగా హింస చెలరేగడం తెలిసిందే. దేశవ్యాప్తంగా 27 జిల్లాల్లో హిందువులు దాడులను ఎదుర్కొంటున్నారు. హిందూ దేవాలయాలను భారీగా టార్గెట్ చేశారు. ప్రార్థనా మందిరాలతో సహా మతపరమైన మైనారిటీలను ప్రత్యేక లక్ష్యంగా చేసుకున్నట్టు బంగ్లాదేశ్‌లోని జమాతే ఇస్లామీ అంగీకరించింది. దీనికితోడు రాజీనామా చేసి దేశం వీడిన మాజీ ప్రధాని షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్ నాయకులను హతమార్చడం, వారి ఇళ్లకు నిప్పు పెట్టడం వంటివి పెద్ద పెట్టున జరిగాయి. మైనారిటీలు, ఇతరులపై జరుగుతున్న హింసపై విచారణకు ఐరాస మానవ హక్కుల నిజ నిర్ధారణ బృందం తాజాగా ఢాకా చేరుకుంది.

ఎవరీ ఆర్య?

ఎంపీ చంద్ర ఆర్య కర్ణాటకకు చెందినవారు. రెండేళ్ల క్రితం కెనడా పార్లమెంటులో తన మాతృభాష కన్నడలో మాట్లాడారు. ఆ వీడియో వైరల్ కావడంతో అందరి దృష్టినీ ఆకర్షించారు. అంటారియోలోని నేపియాన్ ఎలక్టోరల్ జిల్లాకు కెనడా హౌస్ ఆఫ్ కామన్స్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కర్నాటకలోని తుమకూరు జిల్లాకు చెందిన ఆర్య కెనడా రాజకీయాల్లో పనిచేస్తూనే తన భారత మూలాలతో సంబంధాలను కొనసాగిస్తున్నారు.

ప్రభుత్వ సలహాదారు నుంచి ప్రభుత్వాన్నే నడిపించేదాకా..



జననం: 1981 జూన్ 8
తల్లిదండ్రులు: విజయ్ సింగ్, త్రిప్తా వాహి(వీళ్లిద్దరూ ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్లు)
భర్త: ప్రవీణ్ సింగ్ (పరిశోధకుడు, విద్యావేత్త)
విద్యార్హతలు: ఢిల్లీలోని స్ప్రింగ్‌డేల్స్ స్కూల్‌లో చదువుకున్నారు. 2001లో ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలో హిస్టరీలో బ్యాచిలర్ డిగ్రీ పూర్తిచేసి టాపర్‌గా నిలిచారు. చెవెనింగ్ స్కాలర్‌షిప్ సాయంతో ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో హిస్టరీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. 2005లో రోడ్స్ స్కాలర్‌షిప్‌తో 'ఎడ్యుకేషన్'లో మాస్టర్స్ చేశారు.

ఢిల్లీ ఆప్ సర్కార్‌లో కీలక మంత్రులంతా జైల్లో ఊచలు లెక్కబెడుతుంటే డజనుకుపైగా మంత్రిత్వ శాఖలను ఒంటిచేత్తో నడిపి సమర్థవంతమైన నాయకురాలిగా నిరూపించుకున్న అతిశికి సరైన మన్నన దక్కింది.

మధ్యప్రదేశ్‌లోని కుగ్రామంలో ఏడు సంవత్సరాలపాటు ఉండి అక్కడి రైతులకు సేంద్రీయ వ్యవసాయంపై పాఠాలు బోధించిన అతిశి తర్వాతి కాలంలో ఆమ్ ఆద్మీ పార్టీలో చేరి అంచెలంచెలుగా ఎదిగారు. సోషలిస్ట్ విప్లవయోధులు మార్క్స్, లెనిన్ పేర్లను కలిపి అతిశి తల్లిదండ్రులు ఆమెకు 'మార్లెనా' పేరును జోడించారు. అయితే రాజకీయరంగ ప్రవేశానికి ముందే 2018లో మార్లెనా పదాన్ని తన పేరు నుంచి అతిశి తొలగించుకున్నారు. రాజకీయ నామధేయం పోయినా ఈమెకు రాజకీయాలు బాగా అబ్బడం విశేషం. ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలల్లో సంస్కరణల కోసం పాటుపడి మంచి పేరు తెచ్చుకున్నారు. పలు శాఖలను నిర్వర్తించిన పాలనా అనుభవం సీఎంగా ఆమెకు అక్కరకు రానుంది.

రాజకీయ ప్రవేశం

2013లో ఆప్ పార్టీలో చేరారు. 2013లో ఆప్ ఎన్నికల మేనిఫెస్టో రూపకల్పనకు సంబంధించిన ముసాయిదా కమిటీలో కీలక సభ్యురాలిగా ఉన్నారు. పట్టణ, మధ్యతరగతి వర్గాల్లో ఆప్ ఇమేజ్ పెరిగేలా ముసాయిదా కమిటీకి అతిశి కీలక సూచనలు ఇచ్చినట్లు చెబుతారు. 2015లో మధ్యప్రదేశ్‌లోని ఖండ్వా జిల్లాలో జల సత్యాగ్రహం దీక్ష చేపట్టి పార్టీలో ముఖ్యురాలిగా మారారు. అప్పటి నుంచి మూడేళ్లపాటు మనీశ్ సిసోడియాకు ముఖ్య సలహాదారుగా సేవలందించారు. 2019లో ఈస్ట్ ఢిల్లీ స్థానం నుంచి లోక్‌సభకు పోటీచేశారు. అయితే అక్కడి బీజేపీ అభ్యర్థి గౌతమ్ గంభీర్ చేతిలో ఓడిపోయారు. 2020లో ఢిల్లీలోని కాల్‌కాజీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీచేసి గెలిచారు.

పలుశాఖలకు మంత్రిగా: మనీశ్ సిసోడియా అరెస్ట్ తర్వాత 2023 ఫిబ్రవరిలో విద్యా, ప్రజాపనులు, సంస్కృతి, పర్యాటక శాఖల మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఢిల్లీలో ఎక్సయిజ్ పాలసీ కేసులో మనీశ్ సిసోడియా, సంజయ్ సింగ్ అరెస్ట్ కావడంతో పార్టీలో కీలక నేతగా ఎదిగారు. అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్ తర్వాత అన్నీ తానై ఆర్థికశాఖసహా 14 మంత్రిత్వ శాఖల బాధ్యతలు తన భుజస్కంధాలపై మోశారు. 2024లో ఆప్ శాసనసభాపక్ష నేతగా ఎన్నికయ్యారు.

అతిశి ఒకప్పుడు రిషివ్యాలీ టీచర్

కురబలకోట(అన్నమయ్య జిల్లా): అన్నమయ్య జిల్లా మదనపల్లెకు సమీపంలోని కురబలకోట మండలం రిషివ్యాలీ స్కూల్‌లో అతిశి గతంలో టీచర్‌గా పనిచేశారు. 2003 జూలై నుంచి 2004 మార్చి వరకు హిస్టరీ టీచర్‌గా చేశారు. 6, 7 తరగతులకు ఇంగ్లీషు టీచర్‌గా పనిచేశారు. తమ పూర్వ టీచర్ ఢిల్లీ సీఎం కానుండటంతో రిషివ్యాలీ స్కూ ల్ నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రముఖ తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి రిషివ్యాలీ స్కూల్‌ను స్థాపించారు.

– సాక్షి, నేషనల్‌డెస్క్

ఆ నేతల్ని అదుపులో పెట్టండి: ఖర్గే

న్యూఢిల్లీ: తమ అగ్ర నేత రాహుల్ గాంధీపై ఎన్డీఏ పక్షాల నేతలు తీవ్ర అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడాన్ని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే మంగళవారం ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లారు. ఇటువంటి విమర్శలు చేయకుండా ఆ నేతల్ని హద్దుల్లో ఉంచాలని ప్రధానికి రాసిన ఒక లేఖలో సూచించారు. ఇటువంటి ప్రకటనలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా, దేశ రాజకీయాల స్థాయి దిగజారకుండా నివారించడంతోపాటు అవాంఛనీయమైన పరిణామాలను అడ్డుకోవచ్చన్నారు.

డ్రెస్‌కోడ్ మినహాయింపు పిల్‌ను తోసిపుచ్చిన సుప్రీం

న్యూఢిల్లీ: మండు వేసవిలో అసౌకర్యంగా మారుతున్న డ్రెస్ కోడ్ నల్లకోటు, గౌను నుంచి న్యాయవాదులకు మినహాయింపు ఇవ్వాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్)ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. వదులుగా ఉండే సంప్రదాయ కుర్తా-పైజామా ధరించి రాలేం కాబట్టి, వేరే ఏదైనా డ్రెస్ కోడ్ అవసరముందని పేర్కొంది. 'అంతిమంగా ఇది హుందాతనానికి సంబంధించిన విషయం. ఏదేమైనా సరే సరైన దుస్తులనే ధరించాలి. కుర్తా-పైజామా, నిక్కర్లు, టీ షర్టులతో వచ్చి కోర్టులో వాదించలేరు కదా'అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం పేర్కొంది.

మద్యం కేసులో అరోరా, అమన్‌దీప్‌లకు బెయిల్

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలపై అరెస్టయిన వ్యాపారవేత్తలు అమిత్ అరోరా, అమన్‌దీప్ ధాల్‌లకు ఢిల్లీ హైకోర్టు బెయిలిచ్చింది. ఈ మేరకు జస్టిస్ నీనా బన్సల్ కృష్ణ మంగళవారం తీర్పు వెలువరించారు. గురుగ్రామ్‌కు చెందిన బడ్డీ రిటైల్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ అరోరా, బ్రిండ్‌కో సేల్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ అమన్‌దీప్‌లు మద్యం లైసెన్సుల విక్రయాలతో వచ్చిన సొమ్మును సౌత్ గ్రూప్ ద్వారా ఆప్ ఖాతాలోకి మళ్లించినట్లు సీబీఐ ఆరోపిస్తోంది. అరోరాను 2022 డిసెంబర్‌లో, అమన్‌దీప్‌ను 2023 మార్చిలో అధికారులు అరెస్ట్ చేశారు.

21న అమెరికాకు మోదీ

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 21 నుంచి 23వ తేదీదాకా అమెరికాలో పర్యటించనున్నారు. క్వాడ్ వార్షిక సమావేశంలో పాల్గొనడంతో పాటు ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో 'భవిష్యత్తు సదస్సు'ను ఉద్దేశించి మోదీ ప్రసంగిస్తారు. న్యూయార్క్‌లో ఈనెల 22న భారతీయుల సమావేశంలో మాట్లాడతారని విదేశాంగ శాఖ మంగళవారం తెలిపింది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తన స్వస్థలం డెలావేర్‌లోని విల్మింగ్టన్‌లో 21న క్వాడ్ సదస్సుకు ఆతిథ్యమిస్తున్నారు. క్వాడ్ కూటమిలో అమెరికా, భారత్, ఆస్ట్రేలియా, జపాన్ ఉన్నాయి.

నార్కోటిక్ చీఫ్‌గా అనురాగ్ గార్గ్

న్యూఢిల్లీ: నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) డైరెక్టర్ జనరల్‌గా అనురాగ్ గార్గ్ నియమితులయ్యారు. 1993 బ్యాచ్.. హిమాచల్‌ప్రదేశ్ కేడర్ ఐపీఎస్ ఆఫీసర్ అయిన అనురాగ్ ప్రస్తుత సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) అదనపు డీజీగా పనిచేస్తున్నారు. 'అనురాగ్ గార్గ్‌ను మాదకద్రవ్యాల నియంత్రణ సంస్థ డైరెక్టర్ జనరల్‌గా డిప్యూటేషన్‌పై నియమించడానికి కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపిందని హోంశాఖ మంగళవారం తెలిపింది.

'ఎమర్జెన్సీ' వాయిదాతో బంగ్లా అమ్ముకున్నా: కంగన

న్యూఢిల్లీ: ఎమర్జెన్సీ సినిమా విడుదల వాయిదా పడటంతో గత్యంతరం లేక ముంబైలోని తన బంగ్లాను అమ్ముకోవాల్సి వచ్చిందని సినీనటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తెలిపారు. దేశంలో ఇందిరా గాంధీ విధించిన అత్యయిక పరిస్థితిపై తీసిన ఎమర్జెన్సీ సినిమాకు కంగన దర్శకత్వం వహించారు. ఇందిర పాత్రను పోషించారు. రచన ఆమెదే, సహ నిర్మాత కూడా. ఈనెల 6 విడుదల కావాల్సిన ఈ సినిమాకు సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ లభించక వాయిదా పడింది. ముంబైలోని ఖరీదైన బాంద్రాలో కంగన 2017లో రూ.20.7 కోట్లకు ఒక బంగ్లాను కొన్నారు. దాన్ని ఆమె రూ.32 కోట్లకు అమ్మినట్లు సమాచారం.

ఆతిశి డమ్మీ సీఎంగా ఉంటారు!

రాజ్యసభ ఎంపీ స్వాతీ మలివాల్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: ఢిల్లీ సీఎంగా ఆప్ నేత అతిశిని ఎంపిక చేయడంపై రాజ్యసభ ఎంపీ స్వాతీ మలివాల్ స్పందించారు. ముఖ్యమంత్రిగా ఆమె డమ్మీగా మిగిలిపోతారనే విషయం అందరికీ తెలిసిందే అంటూ 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు. అతిశి కుటుంబం ఉగ్రవాది అఫ్జల్ గురును ఉరి శిక్ష నుంచి కాపాడేందుకు ప్రయత్నించిందని ఆరోపించారు. 'అఫ్జల్ గురు అమాయకుడు. అతడు రాజకీయ కుట్రకు బలయ్యాడు. అతడిని ఉరి తీయకండి, క్షమాభిక్ష పెట్టండంటూ ఈమె తల్లిదండ్రులు రాష్ట్రపతికి పలుమార్లు వినతులు పంపారు'అని మలివాల్ ఆరోపించారు. 'దేశ భద్రతపై ఆందోళన కలిగించే పరిణామమిది. ఇది ఎంతో విచారకరమైన రోజు. ఢిల్లీని ఆ దేవుడే కాపాడాలి'అని ఆమె పేర్కొన్నారు. అతిశి తల్లిదండ్రులు విజయ్ సింగ్, త్రిప్తా వాహి సంతకాలతో రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి పంపిన క్షమాభిక్ష పిటిషన్ కాపీని కూడా మలివాల్ షేర్ చేశారు. వీటిపై ఆప్ ఎమ్మెల్యే దిలీప్ పాండే స్పందిస్తూ..'ఆప్ టిక్కెట్‌పై రాజ్యసభకు వెళ్లిన స్వాతి మలివాల్..ఇప్పుడు బీజేపీ గొంతు వినిపిస్తున్నారు. ఏమాత్రం సిగ్గున్నా వెంటనే ఆమెకు రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయాలి'అని డిమాండ్ చేశారు. రాజ్యసభలోనే కొనసాగాలనుకుంటే బీజేపీ టిక్కెట్‌పై ఆమె మళ్లీ ఎన్నికవ్వొచ్చని పాండే పేర్కొన్నారు. పార్లమెంట్‌పై 2001లో జరిగిన దాడి కేసులో దోషి అయిన అఫ్జల్ గురును 2013లో ఉరితీయడం తెలిసిందే. తన తల్లిదండ్రులు అఫ్జల్ గురుకు అనుకూలంగా రాష్ట్రపతికి పంపిన క్షమాభిక్ష పిటిషన్‌పై 2019లో ఓ ఇంటర్వ్యూలో అతిశి..'ఆ అంశంతో నాకెలాంటి సంబంధమూ లేదు. అది నా తల్లిదండ్రులు వారి ఆశయాలకు అనుగుణంగా స్పందించారు. అది వారిష్టం. ఈ విషయంలో వారికి నేను ఎలాంటి మద్దతివ్వలేదు కూడా'అని స్పష్టం చేయడం గమనార్హం.



కోర్టులో విచారణకు వస్తున్న బాధితురాలు గిసెలీ

వాళ్లలా నేనూ రేపిస్ట్‌నే

కోర్టులో తొలిసారిగా నేరాన్ని ఒప్పుకుంటూ నిందితుడి వాంగ్మూలం

అవిగ్నోన్(ఫ్రాన్స్): అత్యంత జుగుప్సాకరమైన, అమానవీయ ఘటనకు వేదికగా నిలిచిన ఫ్రాన్స్‌లోని అత్యాచారాల పర్వంలో ప్రధాన నిందితుడు, బాధితురాలి మాజీ భర్త ఎట్టకేలకు తన తప్పును ఒప్పుకున్నాడు. తనను క్షమించాలని మాజీ భార్య, తన ముగ్గురు పిల్లలను వేడుకున్నాడు. అవిగ్నోన్ పట్టణంలోని కోర్టులో సెప్టెంబర్ రెండో తేదీన కేసులో వాదోపవాదనలు మొదలెట్టాక తొలిసారిగా నిందితుడు మంగళవారం తన తప్పును ఒప్పుకుంటూ వాంగ్మూలం ఇచ్చారు. మిగతా రేపిస్టుల్లాగే తాను కూడా భార్యను రేప్‌చేశానని ఏడుస్తూ చెప్పాడు. వాంగ్మూలం ఇచ్చిన సమయంలో ప్రధాన నిందితుడితోపాటు దాదాపు 50 మంది ఇతర రేపిస్ట్ నిందితులూ కోర్టు హాలులోనే ఉన్నారు. గతంలో ప్రభుత్వరంగ సంస్థలో పనిచేసిన 71 ఏళ్ల డొమినిక్ పెలికోట్ తన భార్య గిసెలీకి భోజనంలో మత్తు మందు కలిపి అపస్మారక స్థితిలోకి వెళ్లాక ముక్కూముఖం తెలియని, దారిన పోయే వాళ్లను పిలిచి మరీ రేప్ చేయించాడు. ఇలా 72 మంది గిసెలీని 92 సార్లు రేప్‌చేశారు. ఈ అత్యాచారపర్వం పదేళ్లపాటు అంటే 2011 నుంచి 2020దాకా కొనసాగింది. అయితే 2020లో ఒక సూపర్‌మార్కెట్లో అమ్మాయిలను స్కర్టుల కింది నుంచి వీడియోలు తీస్తూ పెలికోట్ పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో ఇంటికొచ్చి అతని వస్తువులకు పోలీసులు తనిఖీచేశారు. దీంతో ఫోన్, కంప్యూటర్‌లో వెలుగుచూసిన అంశాలు చూసి పోలీసులే విస్తుపోయారు. భార్యను అపరిచితులు రేప్ చేస్తున్న డజన్ల కొద్దీ వీడియోలు, ఫొటోలు అందులో ఉన్నాయి. మూత్రపిండాల్లో రాళ్లు, మూత్రాశయంలో ఇన్ఫెక్షన్ సమస్యలతో తీవ్రంగా బాధపడుతున్న పెలికోట్ మంగళవారం కోర్టులో మాట్లాడాడు. '' ఎవరూ తప్పుడు నడవడికతో పుట్టరు. పరిస్థితులు అలా మారుస్తాయి'' అని అన్నారు. నేరం రుజువైతే పెలికోట్‌కు కనీసం 20 ఏళ్ల జైలుశిక్ష పడుతుంది. పెలికోట్ భార్యను రేప్ చేసిన వారిలో 26 ఏళ్ల యువకుల నుంచి 74 ఏళ్ల వృద్ధుల వరకు ఉన్నారు. మత్తులోకి జారకముందే ఆమె తన సమ్మతి తెలిపిందని, భర్త తమతో ఇలా చేయిస్తున్నట్లు తమకు నిజంగా తెలియదని వారిలో చాలా మంది చెప్పడం గమనార్హం.

ఆ రెండు స్కూళ్లలో వాళ్లని కాల్చి చంపేస్తా!

- అమెరికాలో 11 ఏళ్ల చిన్నారి బెదిరింపులు
- సంకెళ్లు వేసి జైలుకు పంపిన పోలీసులు

ఫ్లోరిడా: రెండు స్కూళ్లలో కాల్పులు జరిపి, చంపాల్సిన 'కిల్ లిస్ట్'ను తయారు చేసుకున్నాడు. అందుకు రకరకాల రైఫిళ్లు, పిస్టళ్లతోపాటు, కత్తులను సైతం సిద్ధం చేసుకున్నాడు. కిల్ లిస్ట్‌తోపాటు ఆయుధ సామగ్రి ఫొటోలను ఆన్‌లైన్‌లో తన క్లాస్‌మేట్‌లకు గొప్పగా చూపించుకున్నాడు. అమెరికాలో ఫ్లోరిడాకు చెందిన 11 ఏళ్ల బాలుడి ఘన కార్యమిది. .! అసలే స్కూళ్లలో కాల్పుల ఘటనలతో జనం గగ్గోలు పెడుతున్న సమయం. ఈ విషయం పోలీసుల దాకా వెళ్లింది. దీంతో, వారు 'కార్లో కింగ్‌స్టన్' డొరెల్లి' కాళ్లు, చేతులకు సంకెళ్లు వేసి జైలుకు తీసుకెళ్లారు. అతడు పోగేసిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. 'క్రీక్ సైడ్ మిడిల్ స్కూల్‌లో చదువుకుంటున్న కార్లో అనే బాలుడు క్రీక్ సైడ్, సిల్వర్ శాండ్ మిడిల్ స్కూళ్లలో వాళ్లను కాల్చి చంపేందుకు పథకం వేశాడు. పేర్లు, లక్ష్యాలతో జాబితాను సైతం సిద్ధం చేసుకున్నాడు. వీటిని ఆన్‌లైన్‌లో పెట్టాడు. ఇదేమని అడిగితే ఒట్టి జోక్ మాత్రమే అంటున్నాడు' అని ఒలూసియా కౌంటీ షరీఫ్ మైక్ చిట్వూడ్ తెలిపారు. అధికారులు బాలుడికి సంకెళ్లు వేసి జైలుకు తీసుకెళ్తున్న వీడియోను ఆయన 'థ్రెడ్'లో షేర్ చేశారు. అతడిపై శిక్షార్హమైన నేరం కింద కేసు నమోదు చేశామన్నారు. 'ఉత్తుత్తిగా లేదా నిజంగానే బెదిరింపులకు గురిచేసే పిల్లల ఫొటోలతో వివరాలను బహిర్గతం చేస్తాం. మీ పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోండి'అని తల్లిదండ్రులను హెచ్చరించారు.

మసీదులో గణేశ్ మంటపం

44 ఏళ్లుగా మతసామరస్యానికి ప్రతీక.. గోథ్‌ఖిండి గ్రామం

పుణె: మతసామరస్యానికి సిసలైన ఉదాహరణ ఇది. మహారాష్ట్రలోని సాంగ్లి జిల్లా గోథ్‌ఖిండి గ్రామంలోని మసీదులోనే ఏటా గణేశుని విగ్రహాన్ని ఏర్పాటు చేస్తారు. స్థానిక న్యూ గణేశ్ మండల్ సభ్యులు నవరాత్రి ఉత్సవాలను మసీదులోనే నిర్వహిస్తుంటారు. రెండు మతాల సామరస్యానికి ప్రతీకగా ఈ గ్రామంలో 44 ఏళ్లుగా ఈ అరుదైన ఆనవాయితీ కొనసాగుతుండటం విశేషం. ఏటా హిందువులతో కలిసి భక్తి, శ్రద్ధలతో గణేశ్ ఉత్సవాలను జరుపుకుంటామని మండల్ అధ్యక్షుడు ఇలాహి పఠాన్ పేర్కొన్నారు. 'గ్రామంలో ఈ సంప్రదాయం 1961లో మొదలైంది. భారీ వర్షాలు కురుస్తుండటంతో అప్పట్లో ముస్లింలు మసీదు లోపటే గణేశుని విగ్రహం ఏర్పాటు చేసుకోవాలంటూ తోటి హిందువులను ఆహ్వానించారు'అని మండల్ మాజీ అధ్యక్షుడు అశోక్ పాటిల్ చెప్పారు. ఆ తర్వాత కొన్నేళ్లపాటు గణేశ్ ఉత్సవాలను గ్రామస్తులు జరుపుకోలేదు. 1980లో న్యూ గణేశ్ మండల్ ఏర్పాటైనప్పటి నుంచి మసీదులో గణేశ్ మంటపాన్ని ఏర్పాటు చేసే ఆనవాయితీ తిరిగి కొనసాగింది'అని పాటిల్ వివరించారు.

నాగాలాండ్ ఊచకోత.. సైనికులపై నేర విచారణ నిలిపివేత

2021లో మిలిటెంట్లుగా పొరబడి 13 మంది కూలీలను కాల్చిచంపిన ఆర్మీ

న్యూఢిల్లీ: నాగాలాండ్‌లో 13 మంది సాధారణ పౌరులను నిర్దాక్షిణ్యంగా కాల్చిచంపిన సైనికులపై క్రిమినల్ నేర విచారణ ప్రక్రియకు సుప్రీంకోర్టు మంగళవారం ముగింపు పలికింది. వారి ప్రాసిక్యూషన్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతి లేదని.. అటువంటపుడు విచారణను కొనసాగించలేమని నాగాలాండ్ ప్రభుత్వం 30 మందిపై నమోదు చేసిన కేసును ముగించింది. 2021లో మోన్ జిల్లాలో మిలిటెంట్లుగా పొరపడి ఇళ్లకు తిరిగి వస్తున్న 13 మంది కూలీలను సైన్యం కాల్చిచంపింది. దీనిపై దేశవ్యాప్తంగా తీవ్ర గగ్గోలు రేగింది. సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం (ఏఎఫ్ఎస్‌పీఏ) దుర్వినియోగం అవుతోందని, దీన్ని మొత్తానికే రద్దు చేయాలనే డిమాండ్లు బలంగా వినిపించాయి. ప్రత్యేక అధికారాల చట్టం కింద.. సైనికల బలగాలు ఎలాంటి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డా రక్షణ లభిస్తోంది. ఈ చట్టం అమలులో ఉన్న ప్రాంతాల్లో సైనికులు ఏం చేసినా.. కేంద్ర ప్రభుత్వం అనుమతి ఉంటే తప్ప వారిపై విచారణ జరపడానికి లేదు. సైనికుల భార్యలు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీబీ వరాలేలు.. ఏఎఫ్ఎస్‌పీఏ సెక్షన్ 6 కింద సైనికులను విచారించడానికి కేంద్ర ప్రభుత్వం గతేడాది ఫిబ్రవరి 28న అనుమతి నిరాకరించిందని, ఈ పరిస్థితుల్లో కేసును కొనసాగించలేమని స్పష్టం చేసింది. ఈ కేసులో నమోదైన ఎఫ్ఐఆర్‌లను మూసివేస్తున్నట్లు తెలిపింది.

వర్తకం కోసం వచ్చి పెత్తనం సాగించిన వలసవాదులు

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ

పోర్చుగీసు నావికుడైన వాస్కోడిగామా అట్లాంటిక్ సముద్రం ద్వారా ప్రయాణించి ఆఫ్రికా దక్షిణాన ఉన్న గుడ్‌హోప్ అగ్రాన్ని చేరుకున్నాడు. ఆ తర్వాత హిందూ మహాసముద్రం ద్వారా 1498లో భారతదేశ పశ్చిమ తీరాన ఉన్న కాలికట్‌ను చేరుకున్నాడు. ఈ సంఘటన భారతదేశ చరిత్రలో కీలక మలుపునకు నాంది పలికింది. వాస్కోడిగామా చూపిన మార్గంలో అనేక మంది యురోపియన్లు భారత్ బాటపట్టారు. మొదట వీరంతా వర్తకం కోసం భారత్‌లోకి ప్రవేశించారు. ఆ తర్వాత మనదేశంపై పూర్తి గుత్తాధిపత్యం సాధించారు.

ఆధునిక భారతదేశ చరిత్ర


వాస్కోడిగామా చూపిన మార్గంలో అనేక మంది పోర్చుగీసు వర్తకులు భారతదేశానికి వచ్చారు. 1503లో ఫ్రాన్సిస్-డి-అల్మీడా భారతదేశంలోని పోర్చుగీస్ స్థావరాలకు మొదటి గవర్నర్‌గా నియామకమయ్యాడు. ఇతడు నీలి నీటి విధానం (Blue Water Policy)ను విస్తరింపజేశాడు. అల్ఫెన్సో-డి-అల్బ్‌కర్క్ 1509 నుంచి 1515 వరకు భారత్‌లో రెండో పోర్చుగీసు గవర్నరుగా పని చేశాడు. ఇతడు పోర్చుగీస్ సామ్రాజ్యానికి పునాదులు వేశాడు. గోవాను, పర్షియా సింధుశాఖలోని హార్మోజ్‌ను 1510లో ఆక్రమించాడు.

ఆంగ్లేయుల రాక..

భారతదేశంలో మొదటిసారి అడుగుపెట్టిన ఆంగ్లేయుడు ఫాదర్ థామస్ స్టీవెన్స్. ఇతడు 1579లో గోవా చేరాడు. 1600లో ఎలిజబెత్ రాణి (లండన్) అనుమతితో భారతదేశంలో వాణిజ్యం చేయడానికి 'ఈస్టిండియా కంపెనీ'ని స్థాపించాడు. 1611లో కెప్టెన్ జేమ్స్ హాకిన్స్ భారతదేశం వచ్చి మొదటి జేమ్స్ ఉత్తరంతో మొగలు పాదుషా జహంగీర్‌ను కలుసుకున్నాడు. జహంగీర్ అనుమతితో ఇతడు 1612లో సూరత్‌లో మొదటి కర్మాగారం స్థాపించాడు. తర్వాత అహ్మదాబాద్, ఆగ్రా, హుబ్లీ, కాశింబజార్, ఢాకాలో కర్మాగారాలు ఏర్పాటు చేశాడు. ఆంగ్లేయులు భారతదేశంలో ప్రధానంగా దుస్తులు, నల్లమందు వ్యాపారం చేసేవారు. పోర్చుగీసు వారితో బ్రిటిషర్లకు ఆధిపత్య పోరు మొదలైంది. 1614లో ఈస్టిండియా కంపెనీవారు పోర్చుగీసువారిని 'సూర్' సమీపంలో ఓడించారు. 1618లో మొదటి జేమ్స్ రాయబారిగా సర్ థామస్ (1615-19) జహంగీర్ ఆస్థానానికి వచ్చి రెండు 'ఫర్మానా'లు పొందాడు. వీటిలో మొదటిది భారతదేశంలో వాణిజ్యం చేసుకోవడానికి అనుమతించడం. రెండోది స్వదేశీ వాణిజ్యంపై సుంకాలు తగ్గించడం.

దక్షిణ భారతదేశంలో మొదటి కర్మాగారాన్ని మచిలీపట్నంలో స్థాపించారు. 1641లో సెయింట్-జార్జికోట(మద్రాసు)ను నిర్మించారు. 1654లో ఇంగ్లిష్ కంపెనీ వాణిజ్య ఆధిపత్యాన్ని పోర్చుగీస్ గుర్తించింది. 1661లో పోర్చుగీస్ వారు బ్రిటిష్ రాజైన రెండో చార్లెస్‌కు బొంబాయిని కట్నంగా ఇచ్చారు. 1698లో ఈస్టిండియా కంపెనీ సత్నూటి, కాలికట, గోవిందపూర్‌లో జమీందారీ హక్కులు పొందింది.

ఆ తర్వాత ఈ మూడు ప్రాంతాలలో కలిపి 'కలకత్తా' నగరాన్ని ఏర్పాటు చేశారు. 1690లో



జాబ్ చార్నాక్ కలకత్తాకు శంకుస్థాపన చేశాడు. 1696లో ఇక్కడ జార్జి విలియం కోట నిర్మాణం మొదలైంది. 1746 నుంచి 1763 వరకు బ్రిటిషర్లు, ఫ్రెంచివారి మధ్య ఆధిపత్యం కోసం మూడు కర్ణాటక యుద్ధాలు జరిగాయి. ఇందులో మూడో కర్ణాటక యుద్ధం (1758-63) ముఖ్యమైంది. 1760లో వాండివాష్ యుద్ధంలో ఇంగ్లిషువారు, ఫ్రెంచివారిని ఓడించి పూర్తి ఆధిపత్యం సాధించారు. 1756లో బెంగాల్ నవాబైన సిరాజుద్దౌలా కలకత్తా పోర్టును ఆక్రమించి చీకటి గది ఉదంతానికి కారకుడయ్యాడు. 1757లో ప్లాసీ యుద్ధంలో సిరాజుద్దౌలాను ఓడించి ఇంగ్లిషువారు కలకత్తాను తిరిగి ఆక్రమించుకున్నారు. 1759లో ఇంగ్లిష్ కంపెనీవారు డచ్‌వారిని బెదరా యుద్ధంలో ఓడించారు. 1764 బక్సార్ యుద్ధం విజయంతో ఉత్తర భారతంలో బ్రిటిషర్ల ఆధిపత్యానికి తిరుగులేకుండా పోయింది. ఈ విజయం కారణంగా 1767లో బెంగాల్‌లో ద్వంద్వ ప్రభుత్వం ఏర్పాటైంది.

1664లో ఫ్రెంచ్ ఈస్టిండియా కంపెనీని 14వ లూయీ మంత్రి కోల్బర్ట్ స్థాపించాడు. 1667లో ఫ్రాంకోయిస్ కరన్ 'సూరత్' ఫ్యాక్టరీని స్థాపించాడు. ఫ్రాన్సిస్కో మార్టిన్ 1673లో ముస్లిం గవర్నర్ నుంచి అనుమతి పొంది పాండిచ్చేరికి పునాదులు వేశాడు. ఇతడు 1764లో గవర్నర్‌గా నియమితుడయ్యాడు. ఫ్రెంచ్‌వారు 1674లో షాయిస్థాఖాన్ నుంచి అనుమతి పొంది బాలాసోర్, కాశిం బజార్, చంద్రనాగూర్ వద్ద ఫ్యాక్టరీలు నిర్మించుకున్నారు. 1674లో డూప్లే పాండిచ్చేరి గవర్నర్‌గా నియమితుడయ్యాడు. ఇతడు రెండు ఆస్ట్రియా వారసత్వ యుద్ధాలు చేశాడు.

డచ్ కంపెనీ

డచ్చివారు యూరప్‌లోని హాలెండ్ (నెదర్లాండ్స్) దేశానికి చెందినవారు. వీరు 1602లో డచ్ ఈస్టిండియా కంపెనీ స్థాపించారు. వీరు తూర్పు ఇండియా సుగంధ దీవులపై దృష్టి కేంద్రీకరించారు. 1604లో గోల్కొండ నవాబు అనుమతితో మచిలీపట్నంలో మొదటి డచ్చి వర్తక స్థావరం ఏర్పాటు చేశారు. 1610లో పులికాట్ వద్ద స్థావరాన్ని నిర్మించుకున్నారు.

గవర్నర్ జనరల్స్

వారన్ హేస్టింగ్స్ (1772-85)

వారన్ హేస్టింగ్స్ 1772లో బెంగాల్ గవర్నర్‌గా నియమితులయ్యాడు. ఇతడు 1773 నుంచి 1785 వరకు గవర్నర్ జనరల్‌గా పనిచేశాడు. 1773లో ద్వంద్వ ప్రభుత్వాన్ని రద్దు చేశాడు. 1773లో రెగ్యులేటింగ్ చట్టం చేశారు. దీంతో కంపెనీకి తూర్పుదేశ వర్తకంపై గుత్తాధిపత్యం లభించింది. వారన్ హేస్టింగ్స్ రాజధానిని ముర్షిదాబాద్ నుంచి కలకత్తాకు మార్చాడు. సివిల్ న్యాయస్థానానికి కలెక్టరును, క్రిమినల్ న్యాయస్థానానికి భారతీయుడిని న్యాయాధిపతిగా నియమించాడు. న్యాయ సంస్కరణలలో భాగంగా ముఖ్యంగా జిల్లాల్లో 'దివానీ', 'ఫౌజ్‌దారీ' అదాలత్‌లను ప్రవేశపెట్టాడు. ప్రెసిడెన్సీ (కలకత్తా)లలో సాదర్, దివానీ సాదర్, నిజామత్ అదాలత్‌లను ఏర్పాటు చేసి హిందూ, ముస్లిం చట్టాలు అమలు చేశాడు. 1784లో బ్రిటిషర్లు పిట్స్ ఇండియా చట్టం చేశారు.

కారన్ వాలిస్ (1786-93)

ఇతడు సివిల్ సర్వీసులను ప్రవేశపెట్టాడు. ప్రభుత్వ యంత్రాంగంలో సంస్కరణలు ప్రవేశపెట్టాడు. వివిధ స్థాయిల్లో కోర్టులను ఏర్పాటు చేశాడు. న్యాయశాఖ నుంచి పరిపాలన శాఖను వేరుపరిచాడు. 1793లో శాశ్వత శిస్తు విధానం ప్రవేశపెట్టాడు. న్యాయ విచారణ పద్ధతిని రాయించాడు. న్యాయ పద్ధతిపై కారన్ వాలీస్ కోడ్‌ను పొందుపరిచాడు. మూడో మైసూర్ యుద్ధంలో టిప్పుసుల్తాన్‌ను ఓడించి రాజ్యంలో సగభాగాన్ని తీసుకున్నాడు.

సర్ జాన్‌షోర్ (1793-98)

శాశ్వత శిస్తు విధానంలో ఇతడి పాత్ర ప్రధానమైంది. జాన్‌షోర్ కాలంలో బ్రిటిష్ పార్లమెంట్ 1793లో చార్టర్ చట్టం చేసింది.

లార్డ్ వెల్లస్లీ (1798-1805)

ఇతడు ఉద్యోగుల శిక్షణ కోసం 1800లో పోర్ట్ విలియం కళాశాల స్థాపించాడు. సంస్థానాధీశులను సామంతులుగా చేసుకున్నాడు. నాలుగో మైసూర్ యుద్ధంలో టిప్పుసుల్తాన్‌ను ఓడించాడు. 1798లో సైన్య సహకార పద్ధతిని ప్రవేశపెట్టాడు. దీనికి మొదటగా హైదరాబాద్ నిజాం అంగీకరించి ఒప్పందం చేసుకున్నాడు. వెల్లస్లీ రెండో మరాఠా యుద్ధం చేశాడు. ఇతడి కాలంలో మద్రాస్ ప్రెసిడెన్సీ ఏర్పడింది.

- 1805 నుంచి 1807 వరకు జార్జ్‌బార్లో గవర్నర్ జనరల్‌గా పని చేశాడు. ఇతడి కాలంలో వెల్లూరు తిరుగుబాటు జరిగింది.

మొదటి లార్డ్ మింటో (1807-1813)

ఇతడి కాలంలో 1813లో చార్టర్ చట్టం చేశారు. రంజిత్ సింగ్‌తో అమృత్‌సర్ ఒప్పందం చేసుకున్నాడు.

లార్డ్ హేస్టింగ్స్ (1813-1823)

ఇతడు నేపాల్ యుద్ధం, మూడో మరాఠా యుద్ధం చేశాడు. పీష్వా పదవి రద్దు చేశాడు. బొంబాయి ప్రెసిడెన్సీ ఏర్పాటు చేశాడు. పిండారులు అనే దారి దోపిడీదారులను అదుపులోకి తెచ్చాడు. బొంబాయి, మద్రాసులో రైత్వారీ పద్ధతి అమలుపరిచాడు. దీనికి సర్ థామస్ మన్రో, ఎల్ఫిన్‌స్టోన్ సహకరించారు. 1817లో కలకత్తాలో ఆంగ్ల మాధ్యమంలో బోధించే హిందూ కళాశాలను స్థాపించాడు. 1813 చట్టంతో ఇంగ్లిష్ ఈస్టిండియా కంపెనీకి చైనాతో పూర్తి స్వేచ్ఛా వాణిజ్యం చేసుకునే వెసులుబాటు కలిగింది. హేస్టింగ్స్ 1799లో పత్రికలపై ఆంక్షలు రద్దు చేశాడు.

లార్డ్ అమ్హెర్స్ట్ (1823-1828)

ఇతడి కాలంలో మొదటి బర్మా యుద్ధం జరిగింది. భరత్‌పూర్‌ను ఆక్రమించాడు.

విలియం బెంటింక్ (1828-1835)

ఇతడు గవర్నర్ జనరళ్లలో గుర్తింపు పొందినవాడు. విలియం బెంటింక్ 'థగ్గులు' అనే దారి దోపిడీ దొంగలను అణచివేశాడు. మైసూర్ రాజును పదవి నుంచి తొలగించాడు. కాచర్, జైంషియా, కూర్గ్‌ను ఆక్రమించాడు. 1828లో బెంగాల్ రాష్ట్రానికే కాకుండా భారతదేశమంతటికీ గవర్నర్ జనరల్‌గా నియమితుడయ్యాడు. 1829లో సతీసహగమనాన్ని నిషేధించాడు. పురిటిలో ఆడ పిల్లలను చంపడం లాంటి దురాచారాలను అదుపు చేశాడు. భారతీయులు ఉన్నత ఉద్యోగాలకు అర్హులని ప్రకటించాడు. బెంటింక్ కలకత్తాలో వైద్య కళాశాలను స్థాపించాడు. 1835లో మెకాలే అధ్యక్షతన న్యాయ సంఘాన్ని నియమించాడు. దీనికి సంబంధించి ఇంగ్లిష్ భాషలో విద్యా బోధన ప్రవేశపెట్టాడు. 1833లో చార్టర్ చట్టంతో స్వేచ్ఛా వాణిజ్యాన్ని ఎత్తేశారు.

- 1835 నుంచి 1836 వరకు సర్ చార్లెస్ మెట్‌కాఫ్ గవర్నర్ జనరల్‌గా పని చేశాడు.
- 1836-42 మధ్య లార్డ్ ఆక్లాండ్ గవర్నర్ జనరల్‌గా ఉన్నాడు. ఇతడు అఫ్గానిస్తాన్‌లో బ్రిటిషర్ల పరాజయం ఫలితంగా పదవి కోల్పోయాడు.

లార్డ్ ఎలెన్‌బరో (1842-44)

ఇతడు సింధ్‌ను బ్రిటిష్ ఇండియాలో విలీనం చేశాడు. ఇతడి కాలంలో మొదటి అఫ్గాన్ యుద్ధం ముగిసింది. ఇతడు గ్వాలియర్ యుద్ధం చేశాడు.

మొదటి లార్డ్ హార్డింజ్ (1844-48)

ఇతడి కాలంలో మొదటి సిక్కు యుద్ధం జరిగింది. ఆంగ్ల మాధ్యమంలో చదివిన భారతీయులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాడు.

లార్డ్ డల్హౌసి (1848-56)

ఇతడు రెండో సిక్కు యుద్ధం తర్వాత పంజాబ్‌ను ఆక్రమించాడు. రెండో బర్మా యుద్ధం తర్వాత బర్మా దిగువ ప్రాంతాన్ని ఆక్రమించాడు. రాజ్య సంక్రమణ సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టి సతారా, సంబల్‌పూర్, ఝాన్సీ, నాగ్‌పూర్‌ను ఆక్రమించాడు. అయోధ్యను ఆక్రమించాడు. ఇతడి హయాంలో వితంతు పునర్వివాహ చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఇతడి కాలంలో సంతాలులు తిరుగుబాటు చేశారు. ప్రతి రాష్ట్రంలో పబ్లిక్ వర్క్స్ శాఖను ప్రవేశపెట్టారు. 1854లో చార్లెస్ ఉడ్స్ అధ్యక్షుడిగా విద్యకు సంబంధించిన అంశాలపై కమిటీ ఏర్పాటు చేశాడు. ఈ కమిటీ సూచనలతో విద్యాలయం నుంచి విశ్వవిద్యాలయాల వరకు కీలక సంస్కరణలు ప్రవేశపెట్టాడు. 1853లో రైళ్లు, తంతితపాలా, రోడ్డు రవాణా సౌకర్యాలు ప్రవేశపెట్టాడు. బొంబాయి నుంచి థానే వరకు మొదటి రైల్వే లైన్ వేశారు. కలకత్తా నుంచి పెషావర్ వరకు మొదటి తంతి నిర్మించాడు. 1854లో మొదటిసారిగా తపాలా బిళ్లలను ప్రవేశపెట్టాడు. పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేశాడు.

1853లో చార్టర్ చట్టంతో పోటీ పరీక్షలను ప్రవేశపెట్టారు. ఈ చట్టం వ్యాపార సంస్థలకు.. వ్యాపారంలో తప్ప మిగతా విషయాలతో సంబంధం లేకుండా చేసింది. 1854లో బొంబాయిలో మొదటి నూలు మిల్లు, కలకత్తాలో జనపనార మిల్లును స్థాపించారు.

లార్డ్ కానింగ్ (1856-62)

1857 సిపాయిల తిరుగుబాటు తర్వాత బ్రిటిష్ పార్లమెంట్ 1858లో ఒక చట్టం చేసింది. దీని ప్రకారం బ్రిటిష్ ఇండియాలో 'వైస్రాయ్' పదవిని ఏర్పాటు చేశారు. లార్డ్ కానింగ్ 1858 చట్టం ప్రకారం తొలి రాజప్రతినిధిగా నియమితులయ్యాడు. 1861లో ఇండియా కౌన్సిళ్ల చట్టం ప్రవేశపెట్టారు. 1859లో రాజ్య సంక్రమణ సిద్ధాంతాన్ని రద్దు చేశారు. 1858లో భారత శిక్షాస్మృతి, 1861లో హైకోర్టు చట్టాన్ని ప్రవేశపెట్టారు. 1865లో లారెన్స్ మూడు హైకోర్టులను స్థాపించాడు. 1857లో కానింగ్ కలకత్తా, బొంబాయి, మద్రాసులో విశ్వవిద్యాలయాలు స్థాపించాడు. ఇతడి కాలంలో 1859లో శ్వేత సైనికుల విప్లవం, 1860లో నీలి మందు రైతుల తిరుగుబాటు, 1863లో పాబ్నా రైతుల తిరుగుబాటు చెలరేగాయి.

మొక్కల్లో స్త్రీ సంయోగ బీజం



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
బయాలజీ - కంటెంట్ (ఎస్ఏ)

మొక్కల్లో ప్రత్యుత్పత్తి

మాదిరి ప్రశ్నలు

1. కవచ రహిత అండాలకు ఏ రెండు సరైన ఉదాహరణలు?
   ఎ) లొరాంథస్ బి) ఆస్టరేసి
   సి) ఒపన్షియా డి) బెలనోఫోరా
   1) ఎ, బి 2) బి, సి
   3) బి, డి 4) ఎ, డి
2. మొక్కల కాండాల పై ఉబ్బెత్తు భాగాల నుంచి ఏర్పడనివి?
   1) ఆకులు 2) వేర్లు
   3) శాఖలు 4) పుష్పాలు
3. 'కోరకీభవనం' అనే శాఖీయ ప్రత్యుత్పత్తి విధానం వీటిలో దేనిలో కనిపిస్తుంది?
   1) మందార 2) వైరస్
   3) గులాబీ 4) ఈస్ట్
4. కిందివాటిలో ఏ విత్తనాలు నీటిని శోషించి ఉబ్బుతాయి?
   1) వరి 2) బఠాణీ
   3) గోధుమ 4) జొన్న
5. కిందివాటిలో సరికాని జతను గుర్తించండి?
   1) మల్లె, జాజి - వికసించే సమయం రాత్రి
   2) చామంతి, గన్నేరు - రంగుల పుష్పాలు
   3) తామర, సూర్యకాంతం - వికసించే సమయం రాత్రి
   4) మల్లె, విరజాజి- తెలుపు, సువాసన
6. 'ఇకేబానా' అనే మాట కిందివాటిలో దేనికి సంబంధించింది?
   1) పత్రాల అందమైన అమరిక
   2) వేరుదుంపల అమరిక
   3) ఫలాల అందమైన అమరిక
   4) పువ్వుల అందమైన అమరిక
7. జిలేబీలను తయారుచేసేటప్పుడు రుచి కోసం జిలేబీ పిండిలో దేన్ని కలుపుతారు?
   1) రైజోపస్ 2) రైజోబియం
   3) ఈస్ట్ 4) లాక్టోబాసిల్లస్
8. కిందివాటిలో ఏ ఫల పరిశీలనలో అది నిజ ఫలం కాదని తెలుస్తుంది?
   1) ఆపిల్ 2) జీడిమామిడి
   3) టమోట 4) 1, 2
9. పత్రాల ద్వారా శాఖీయోత్పత్తి జరిపే మొక్కకు ఉదాహరణ?
   1) కరివేపాకు 2) బంగాళాదుంప
   3) రణపాల 4) మామిడి
10. ద్విక్షేయుత పరాగకోశంలో ఉండే పుప్పొడి గదుల సంఖ్య
    1) రెండు 2) ఆరు
    3) నాలుగు 4) ఒకటి మాత్రమే
11. పరాగకోశంలో ద్వికేంద్రిక స్థితి కలిగిన కణాలు?
    1) టపేటం 2) బాహ్య చర్మం
    3) ఎండోథీషియం 4) పైవన్నీ
12. ఒక వివృత బీజ మొక్కల్లోని క్రోమోజోముల సంఖ్య 32 ఉంటే ఆ మొక్కలోని సూక్ష్మ సిద్ధ బీజ మాతృ కణాలు, పరాగ కోశం, సిద్ధ బీజాల్లో క్రోమోజోముల సంఖ్యలు వరుసగా
    1) 16, 16, 32 2) 32, 32, 32
    3) 32, 16, 16 4) 32, 32, 16
13. టెరిస్‌లో సంయోగ బీజ రకం?
    1) సమ సంయోగ బీజం
    2) విషమ సంయోగం
    3) అసమ సంయోగ బీజం
    4) ఇవేవీ కావు
14. కిందివారిలో ఏ శాస్త్రవేత్త పునరుత్పత్తిపై పరిశోధన చేశారు?
    1) ప్లేటో 2) థియోఫ్రాస్టస్
    3) జగదీష్ చంద్రబోస్
    4) సోక్రటీస్
15. సూక్ష్మ సిద్ధ బీజ చతుష్కంలోని కణాల స్థితి
    1) ఏకస్థితిక 2) ద్వయస్థితిక
    3) త్రయస్థితిక 4) బహుస్థితిక
16. ఒక విద్యార్థి తన పరిసరాల్లోని ఒక ద్విలింగ పుష్పాన్ని పరిశీలించినప్పుడు ఆ పుష్ప పరాగ రేణువులు అదే పుష్ప ఒక నిర్మాణాన్ని చేరడాన్ని గమనించాడు. అయితే అవి చేరిన నిర్మాణం, ఆ రకానికి పేరు?
    1) కీలం, పరాగ విసర్గం
    2) కీలాగ్రం, పరపరాగ సంపర్కం
    3) అండాశయం, పరాగ సంపర్కం
    4) కీలాగ్రం, ఆత్మపరాగ సంపర్కం
17. కేశ గుచ్ఛం కలిగిన విత్తనాలు ఉన్న కుటుంబం
    1) ఫాబేసి 2) సిసాల్పినేసి
    3) ఆస్టరేసి 4) లిల్లియేసి
18. సూక్ష్మ సిద్ధ బీజాల్లో ఎక్సైన్ అనేది
    1) వ్యాధి జనకం 2) వ్యాధి కారకం
    3) వ్యాధి నిరోధకం 4) ఇవేవీ కావు
19. విద్యార్థి ఒక పుష్ప పరిశీలనలో రక్షక, ఆకర్షక పత్రావళి మాత్రమే ఉండటాన్ని గమనించాడు. అటువంటి పుష్పం
    1) ద్విలింగ పుష్పం 2) అసంపూర్ణ పుష్పం
    3) సంపూర్ణ పుష్పం 4) ఏకలింగ పుష్పం
20. పురుష సంయోగ బీజ ద్వితీయ అభివృద్ధి కిందివాటిలో దేనిపై జరుగుతుంది?
    1) అండం 2) కీలం
    3) కీలాగ్రం 4) పరాగనాళం
21. స్పోరోపొలెనిన్‌కు సంబంధించిన పదార్థం?
    1. Mg 2. N
    3. P_2 4. NH_3
22. పుష్పాల వివిధ రంగుల విధికి సరిపోయే అంశం?
    ఎ) పుష్పాలను ఎండిపోకుండా చూడటం
    బి) పుష్పాల తాజాదనాన్ని పెంచడం
    సి) ఫలాల రంగుకు తోడ్పడటం
    డి) పరాగ సంపర్కం కోసం కీటకాలను ఆకర్షించడం
    1) ఎ, బి 2) బి, సి
    3) డి మాత్రమే 4) బి మాత్రమే
23. టపెటమ్ అనేది కిందివాటిలో దేనిలో భాగం?
    1) అండకోశం 2) అండం
    3) పరాగకోశం 4) ఫలం
24. ఫలదీకరణం పూర్తి అయిన తర్వాత ఫలం, విత్తనాలు ఏర్పరచే పుష్ప నిర్మాణాలు వరుసగా
    1) రక్షక పత్రాలు, ఆకర్షక పత్రాలు
    2) కేసరాలు, అండ కోశం
    3) అండం, అండాశయం
    4) అండాశయం, అండాలు
25. చింతకాయ విత్తనం పగుల కొడితే రెండు భాగాలుగా ఏర్పడేవి?
    1) అండాలు 2) స్త్రీ బీజ కణాలు
    3) బీజ దళాలు 4) సహ కణాలు
26. శాఖీయ ప్రత్యుత్పత్తికి సంబంధించి సరైన జత
    1) వేర్ల ద్వారా - గులాబీ
    2) శాఖల ద్వారా - మందార
    3) ఆకుల ద్వారా - కరివేపాకు
    4) కాండం ద్వారా - వేప
27. తగినంత నీరు, గాలితోపాటు కింద ఇచ్చిన ఏ కారకం సహకరిస్తే విత్తనం మొలకెత్తుతుంది?
    1) కాంతి 2) ఖనిజ లవణాలు
    3) ఉష్ణోగ్రత 4) పైవన్నీ
28. విద్యార్థి శాఖీయోత్పత్తి అనే పాఠాన్ని చదువుతూ ఉదాహరణలు తెలుసుకుంటున్నాడు. వేర్ల ద్వారా శాఖీయోత్పత్తికి కచ్చితమైన ఉదాహరణ నేర్చుకొని ఉంటే వీటిలో ఏది చదివి ఉంటాడు?
    1) రణపాల మొక్క వేర్ల ద్వారా శాఖీయోత్పత్తికి ఉదాహరణ
    2) గులాబీ వేరు ద్వారా శాఖీయోత్పత్తి జరుపుతుంది.
    3) ఉల్లి వేర్లు శాఖీయోత్పత్తి జరుపుతాయి
    4) కరివేపాకు వేర్ల ద్వారా శాఖీయోత్పత్తి జరుపుతుంది
29. కిందివాటిలో ఏ రెండు కుటుంబాల్లో పరాగ రేణువు నుంచి ఒకటి కంటే ఎక్కువ పరాగ నాళాలు వృద్ధి చెందుతాయి?
    ఎ) లెగుమినేసి బి) కుకుర్బిటేసి
    సి) మాల్వేసి డి) యుఫర్బియేసి
    1) ఎ, బి 2) బి, సి
    3) సి, డి 4) ఎ, డి
30. కిందివాటిలో అండకోశానికి సంబంధించనది?
    1) ప్రతిపాదక కణం
    2) ద్వితీయ కేంద్రకం
    3) పరాగ కోశం 4) సహాయ కణం

సమాధానాలు

1) 4; 2) 2; 3) 4; 4) 2; 5) 3;
6) 4; 7) 3; 8) 4; 9) 3; 10) 3;
11) 1; 12) 4; 13) 3; 14) 2; 15) 1;
16) 4; 17) 3; 18) 1; 19) 2; 20) 3;
21) 2; 22) 3; 23) 3; 24) 4; 25) 3;
26) 2; 27) 3; 28) 4; 29) 2; 30) 3.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. అలైంగిక ప్రత్యుత్పత్తి ద్వారా మందారం నుంచి పొందే పిలక మొక్కల సంఖ్య (డీఎస్సీ-2012)
   1) ప్రతి శాఖ నుంచి ఒక్కో పిలక మొక్క
   2) పిలక మొక్కలు ఏర్పడవు
   3) అనేకం
   4) నాలుగు
2. పుష్పించే మొక్కల్లో ద్వయస్థితిక క్రోమోజోముల సంఖ్య 16 అయితే దాని అంకురచ్ఛదంలోని క్రోమోజోముల సంఖ్య (డీఎస్సీ-2012)
   1) 10 2) 24
   3) 18 4) 16
3. పుష్పంలోని స్త్రీ సంయోగ బీజంలో కణాలు, కేంద్రకాలు, ఫలదీకరణాల సంఖ్య వరుసగా (డీఎస్సీ-2012)
   1) 3, 4, 2 2) 2, 3, 2
   3) 1, 2, 2 4) 7, 8, 2
4. అతి సరళ పద్ధతిలో మొక్కలను ప్రవర్ధనం చేయాలనుకున్న రైతుకి అవసరం లేనివి (డీఎస్సీ-2012)
   1) ఆకులు 2) వేర్లు
   3) పండ్లు 4) కాండాలు
5. మొక్క సంయుక్త బీజంలో 30 జతల క్రోమోజోములు ఉంటే ఆ మొక్క శరీర కణాలు ఒక్కోదానిలో క్రోమోజోముల మొత్తం? (డీఎస్సీ-2008)
   1) 15 2) 45 3) 60 4) 30
6. పరాగనాళం స్త్రీ బీజ కణం దగ్గరకు కదిలేందుకు సహాయపడే కణాలు (డీఎస్సీ-2008)
   1) అంకురచ్ఛద కణాలు
   2) సినర్జిడ్లు 3) ప్రతిపాద కణాలు
   4) పురుష బీజ కణాలు
7. పుష్ప ఫలదీకరణ సమయంలో పూర్తిగా ఏర్పడిన పిండ కోశంలోని ఏడు కణాల అమరిక (డీఎస్సీ-2008)
   1) స్త్రీ బీజకణం, రెండు సినర్జిడ్లు, మూడు ప్రతిపాదక కణాలు, కేంద్రకం
   2) రెండు స్త్రీ బీజకణాలు, రెండు సినర్జిడ్లు, రెండు ప్రతిపాదక కణాలు, కేంద్రకం
   3) ఒక ప్రతిపాదక కణం, రెండు స్త్రీ బీజ కణాలు, మూడు సినర్జిడ్లు, కేంద్రకం
   4) సినర్జిడ్, ప్రతిపాద కణాలు, మూడు స్త్రీ బీజ కణాలు, కేంద్రకం
8. అంకురచ్ఛదం గల విత్తనాలకు ఉదాహరణ (డీఎస్సీ-2006)
   1) బఠాణీ, చిక్కుడు 2) వరి, చిక్కుడు
   3) చిక్కుడు, ఆముదం 4) వరి, ఆముదం
9. ఫలదీకరణం తర్వాత విత్తనంగా మారే పుష్ప భాగం (డీఎస్సీ-2002)
   1) అండాశయం 2) అండం
   3) ప్రథమమూలం 4) బీజ దళం
10. మొక్కల్లో స్త్రీ సంయోగ బీజం (డీఎస్సీ-2004)
    1) స్థూల సిద్ధబీజ మాతృకణం
    2) అండం 3) పిండ కోశం
    4) సిద్ధ బీజ మాతృకణం

సమాధానాలు

1) 2; 2) 2; 3) 4; 4) 3; 5) 4;
6) 2; 7) 1; 8) 4; 9) 2; 10) 3.

విద్య, ఉద్యోగాలు

వైఎస్సార్ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలో 11 పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైఎస్సార్ జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం.. అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 11.
- **పోస్టుల వివరాలు:** స్టోర్ కీపర్ కమ్ అకౌంటెంట్-01, ఎడ్యుకేటర్(పార్ట్‌టైమ్)-01, పీటీ ఇన్‌స్ట్రక్టర్ కమ్ యోగా టీచర్(పార్ట్‌టైమ్)-02, హెల్పర్(అవుట్‌సోర్సింగ్)-02, హౌస్ కీపర్(అవుట్ సోర్సింగ్)-01, కుక్(అవుట్ సోర్సింగ్)-02, హెల్పర్ కమ్ నైట్ వాచ్‌మెన్ (అవుట్ సోర్సింగ్)-02.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏడో తరగతి, పదో తరగతి, డిప్లొమా, ఇంటర్,డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 45 ఏళ్లు మించకూడదు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, డి-బ్లాక్, న్యూ కలెక్టర్ కాంప్లెక్స్, కడప, వైఎస్సార్ జిల్లా చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 20.09.2024.
- **వెబ్‌సైట్:** https://kadapa.ap.gov.in

గేట్-2025

దేశంలోని ఐఐటీలు, ఇతర సంస్థల్లో ఎంటెక్‌లో ప్రవేశాలకు నిర్వహించే గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్(గేట్)-2025 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఐఐటీ రూర్కీ పరీక్షను నిర్వహిస్తుంది.

- **అర్హత:** ఇంజనీరింగ్, టెక్నాలజీ, ఆర్కిటెక్చర్, సైన్స్, హ్యూమానిటీస్‌లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. **వయసు:** గరిష్ట వయో పరిమితి లేదు.
- **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష. పరీక్ష సమయం మూడు గంటలు.
- **ఆంధ్రప్రదేశ్‌లో పరీక్ష కేంద్రాలు:** చీరాల, చిత్తూరు, గుంటూరు, కడప, నెల్లూరు, ఒంగోలు, తిరుపతి, అనంతపురం, కర్నూల్, ఏలూరు, కాకినాడ, సూరంపాలెం, రాజమహేంద్రవరం, తాడేపల్లిగూడెం, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం.
- **తెలంగాణలో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, మెదక్, నల్గొండ, ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, కోదాడ, కొత్తగూడెం, నిజామాబాద్, సూర్యాపేట, వరంగల్.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**26.09.2024
- **ఆలస్య రుసుముతో దరఖాస్తులకు చివరితేది:** 07.10.2024
- **ఫలితాల వెల్లడి తేది:** 19.03.2024.
- **పరీక్ష తేదీలు:** వచ్చే ఏడాది ఫిబ్రవరి 1, 2, 15, 16 తేదీల్లో జరగనున్నాయి.
- **వెబ్‌సైట్:** https://gate2025.iitr.ac.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ఆకాశం నీలిరంగులో ఉండటానికి కారణం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఫిజికల్ సైన్స్

విద్యుదయస్కాంత వర్ణపటం

వర్ణపటం: తరంగదైర్ఘ్యం లేదా పౌనఃపున్యాల సముదాయాన్ని వర్ణపటం అంటారు.

విద్యుదయస్కాంత వర్ణపటం: పరారుణ, దృగ్గోచర, అతినీలలోహిత, ఇతర వికిరణాలన్నింటి సముదాయాన్ని విద్యుదయస్కాంత వర్ణపటం అంటారు.


విద్యుదయస్కాంత వికిరణాల లక్షణాలు:

- ఈ వికిరణాలు ఒకదానితో మరొకటి లంబ దిశలో కంపిస్తున్న విద్యుత్ క్షేత్రం $(\bar{E})$ అయస్కాంత క్షేత్రం $(\bar{B})$ లను కలిగి ఉంటాయి.
- ఈ విద్యుత్, అయస్కాంత క్షేత్రాలు కాంతి ప్రసరించే దిశకు లంబంగా కంపిస్తుంటాయి. కాబట్టి ఈ తరంగాలకు తిర్యక్ తరంగాల లక్షణాలు ఉంటాయి.
- ఇవి కాంతి వేగంతో ప్రయాణిస్తాయి. శూన్యంలో కాంతి వేగం $(C) = 3\times10^8$ మీ./సె.
- విద్యుదయస్కాంత తరంగాల ఉనికిని గుర్తించి, నిరూపించిన శాస్త్రవేత్త హెర్ట్జ్.
- ఈయన రేడియో, టెలివిజన్, టెలిఫోన్, టెలిగ్రాఫ్‌ల అభివృద్ధికి పునాది వేశారు.
- హెర్ట్జ్ కనుగొన్న కాంతి విద్యుత్ ఫలితాన్ని ఐన్‌స్టీన్ నిరూపించారు.

ఐన్‌స్టీన్ ప్రతిపాదనలు:

- $E = mc^2$ సూత్ర ప్రతిపాదన.
- సాపేక్షతా సిద్ధాంతం
- కాంతి విద్యుత్ ఫలితం నిరూపణ. ఈ ప్రయోగానికి 1921లో నోబెల్ బహుమతి లభించింది.


విద్యుదయస్కాంత వర్ణపటంలోని వివిధ వికిరణాలు వాటి తరంగదైర్ఘ్యాల అవధులు



1. దృగ్గోచర వర్ణపటం
2. పరారుణ(IR) వర్ణపటం
3. మైక్రో తరంగాలు
4. రేడియో తరంగాలు
5. అతినీలలోహిత (UV) వర్ణపటం
6. ఎక్స్(X) కిరణాలు
7. గామా(γ) కిరణాలు

దృగ్గోచర వర్ణపటం

ఒక తెల్లని పతన కిరణం పట్టకంపై పతనం చెందిన తర్వాత, వక్రీభవనం చెంది 7 రంగులుగా విడిపోయి ఏర్పడిన వర్ణపటాన్ని దృగ్గోచర వర్ణపటం అంటారు.



తరంగదైర్ఘ్య అవధి:

0.4μm - 0.7μm (or) (μm= 10^{-6}m)
4000^{-} - 7000^{-} ($^{-}$ = 10^{-10}m)

- పరమాణువుల్లోని ఉత్తేజ వేలన్సీ ఎలక్ట్రాన్లు, తిరిగి వాటి స్థానాలకు పడిపోవడం వల్ల దృగ్గోచర వర్ణపటం ఉద్గారమవుతుంది.
- ఒక వస్తువు నుంచి ఉద్గారమయ్యే కాంతి వర్ణం , అది తయారైన పదార్థంలోని పరమాణువుల లక్షణాలను బట్టి ఉంటుంది.

  ఉదా: టపాకాయల నుంచి వచ్చే కాంతి రంగులు.

ఊదారంగు(Violet):

- ఇది మానవుని కంటికి ప్రమాదకరం.
- దీనికి అధిక వక్రీభవనం, అధికశక్తి ఉంటుంది.
- ఊదారంగు తరంగదైర్ఘ్యం అత్యల్పం.

ఇండిగో(Indigo):

- దీన్ని కూడా మానవుడి కన్ను చూడలేదు.

VIBGYORలో మిగిలిన రంగులు BG-YOR. వీటికి మధ్యలో ఉండే రంగు పసుపు. కాబట్టి VIBGYORలో మాధ్యమిక రంగుగా పసుపును తీసుకుంటారు.

నీలం (Blue): కాంతి పరిక్షేపణం వల్ల ఆకాశం నీలంరంగులో కనిపిస్తుంది.

- ఇది కిరణజన్య సంయోగక్రియకు దోహదపడుతుంది.

ఆకుపచ్చ (Green): మానసిక ఒత్తిడిని దూరం చేసి, మానవుడి కంటికి మానసిక ఆనందాన్ని కలిగిస్తుంది.

- రోగికి ఆత్మస్థైర్యం కలిగేలా ఆసుపత్రిలో ఈ రంగు పరదాలు, దుస్తులు వాడతారు.
- ఆకుపచ్చ రంగు తరంగదైర్ఘ్యం 5560^{-} .

ఆరెంజ్(Orange): ట్రాఫిక్ సిగ్నల్‌లో ఈ రంగును సంసిద్ధతను తెలపడానికి ఉపయోగిస్తారు.

ఎరుపు(Red): ట్రాఫిక్ సిగ్నల్‌లో వాహనాలను నిలపడానికి.

- ప్రమాద సంకేతాలను తెలుపడానికి.
- ఫొటోగ్రాఫిక్ ఫిల్మ్ డెవలపింగ్ రూంలో వెలుతురు కోసం వాడతారు.
- ఈ రంగుకు అత్యల్పశక్తి, అత్యధిక తరంగదైర్ఘ్యం ఉంటుంది.
- కిరణజన్య సంయోగక్రియకు అధికంగా ఉపయోగపడుతుంది.

పరారుణ వర్ణపటం

- దీన్ని హెర్షల్ అనే శాస్త్రవేత్త కనుగొన్నారు.
- పదార్థాల్లోని అణువుల భ్రమణ లేదా కంపన చలనాల స్థితుల్లో మార్పు జరగడం వల్ల పరారుణ కిరణాలు ఉద్గారమవుతాయి.
- ఈ కిరణాలు ఉష్ణజనకాలైన ఎలక్ట్రిక్ హీటర్, వేడిగా ఉన్న సోల్డరింగ్ ఐరన్, వేడిగా ఉన్న ఇస్త్రీపెట్టె నుంచి ఉత్పత్తి అవుతాయి.
- ఇవి మానవుడి కంటికి కనిపించవు.
- సాధారణ సోడా గాజు పరారుణ వికిరణాలను శోషణం చేస్తుంది.
- రాక్‌సాల్ట్‌తో తయారైన పట్టకాలు, ఈ వికిరణాలను శోషణం చేసుకోవు. కాబట్టి వీటి సహాయంతో పరారుణ కిరణాలను పరిశీలించవచ్చు.

పరారుణ వికిరణాల ఉనికిని పరిశీలించే ఉష్ణశోధకాలు:

1) ఉష్ణమాపకాలు 2) థర్మోపైల్‌లు
3) బోలోమీటర్లు

తరంగదైర్ఘ్య అవధి – 0.7μm - 100μm

ప్రయోజనాలు:

- శారీరక చికిత్స(మర్దన)లకు, పక్షవాతం తగ్గించడానికి.
- చీకటిలో ఫొటోలు తీయడానికి.
- గోడలపై ఉండే చిత్రాలు, చిత్రలేఖనం తొలగించడానికి.
- రహస్య సంకేతాలు ప్రసారం చేయడానికి.
- టి.వి. రిమోట్ కంట్రోల్‌లో ఉపయోగిస్తారు.

మైక్రో తరంగాలు

- వీటిని కనుగొన్న శాస్త్రవేత్త హెర్ట్జ్. (ఈయన పేరుమీదనే పౌనఃపున్యం ప్రమాణం హెర్ట్జ్ అని పేర్కొంటారు)
- ఇవి సాధారణంగా 10^9 Hz-10^{11} Hz ల మధ్య కంపిస్తున్న విద్యుదయస్కాంత డోలకాల నుంచి ఉత్పత్తి అవుతాయి.

తరంగదైర్ఘ్య అవధి: 10 μm - 10m

మైక్రోతరంగాల అనువర్తనాలు:

i. రాడార్‌లో RADAR - (RAdio Detection and Ranging)

రాడార్‌ను కనుగొన్న శాస్త్రవేత్త వాట్సన్

ii. టెలిమెట్రి

Tele = దూరం, metry = కొలత

దూరపు వస్తువుల మధ్యదూరాలు కొలవడానికి.

iii. మైక్రోవేవ్ ఓవెన్‌లో.
(మైక్రోవేవ్ ఓవెన్ ఆవిష్కర్త స్పెన్సర్).


iv. ఉపగ్రహాల ద్వారా సమాచార ప్రసారంలో ఉపయోగిస్తారు.

రేడియో తరంగాలు

- తక్కువ పౌనఃపున్యాలు ఉండే విద్యుదయస్కాంత డోలకాల నుంచి ఉద్గారమవుతాయి.
- ఇవి సరైన విద్యుత్ వలయంలో ఎలక్ట్రాన్లకు త్వరణం కలిగించడం వల్ల ఉత్పత్తి అవుతాయి.
- తరంగదైర్ఘ్య అవధి 1 m -100 km

రేడియో తరంగాల అనువర్తనాలు:

- సమాచారాన్ని సుదూర ప్రాంతాలకు చేరవేయడానికి.
- రేడియో ఖగోళశాస్త్రంలో.
- దృశ్యామాన దూరదర్శినితో కనుగొనలేని విషయాలు కనుగొనేందుకు.



అతినీలలోహిత వర్ణపటం

- దీన్ని కనుగొన్న శాస్త్రవేత్త రిట్టర్.
- పరమాణువులోని అధికశక్తి ఉండే ఎలక్ట్రాన్ల సంక్రమణం వల్ల ఈ కిరణాలు ఉత్పత్తి అవుతాయి.
- సూర్యుడిలో స్థానాంతర చలనం ఉండటం వల్ల, అతినీలలోహిత కిరణాలను సూర్యుని నుంచి కూడా గ్రహిస్తాం.
- తరంగదైర్ఘ్య అవధి 1 nm - 0.4μ.

అతినీలలోహిత వర్ణపటం అనువర్తనాలు:

- ఆహార పదార్థాలు నిల్వ చేయడానికి.
- కుళ్లిన, మంచి కోడిగుడ్లను వేరు చేయుడానికి.
- సహజ, కృత్రిమ దంతాలు వేరు చేయడానికి.
- అసలు, నకిలీ డాక్యుమెంట్లు పరిశీలించడానికి.
- వేలిముద్రలు విశ్లేషించడానికి.
- కాన్సర్ వ్రణాలను గుర్తించడానికి.
- టి.వి., రేడియో ప్రసార కార్యక్రమాల్లో.

అనర్థాలు:

i. ఓజోన్ (O_3) పొర పాడవుతుంది. సెప్టెంబర్ 16ను ఓజోన్‌డేగా నిర్వహిస్తారు.

ii. చర్మవ్యాధులు, కాన్సర్ లాంటి వ్యాధులు వస్తాయి.

- వాతావరణంలో ఉండే ఓజోన్, సూర్యుడి నుంచి విడుదలయ్యే అతినీలలోహిత వికిరణాల నుంచి మనల్ని రక్షిస్తుంది.
- వాయు- ద్రావణ పిచికారీ, శీతలీకరణ యంత్రాలు, ఇతర కలుషితాల నుంచి విడుదలయ్యే ఫ్లోరోకార్బన్‌తో, ఓజోన్ రసాయన చర్య జరపడం వల్ల ఆ పొర క్షీణిస్తుంది.

ఎక్స్ (X) - కిరణాలు

- వీటిని 1895లో రాంట్‌జన్ అనే శాస్త్రవేత్త కూలిడ్జ్‌నాళంలో కనుగొన్నారు. ఈయనకు 1901లో నోబెల్ బహుమతి లభించింది.
- పరమాణువు లోపలి ఎలక్ట్రాన్ల పరివర్తన వల్ల, విభిన్న తరంగదైర్ఘ్యాలున్న X-కిరణాలు ఉత్పత్తి అవుతాయి.
- పతన ఎలక్ట్రాన్లను లక్ష్య పరమాణువులతో, రుణ త్వరణానికి గురిచేయడం వల్ల కూడా అవిచ్ఛిన్న తరంగదైర్ఘ్యాలున్న X- కిరణాలను ఉత్పత్తి చేయవచ్చు.

తరంగదైర్ఘ్య అవధి:

0.001nm (0.01^{-}) - 10nm (100^{-})

X-కిరణాలు రెండు రకాలు అవి...

1. దృఢ X- కిరణాలు
2. మృదు X- కిరణాలు

1. దృఢ X-కిరణాలు:

- తరంగదైర్ఘ్య అవధి 0.01^{-} - 10^{-}
- స్ఫటికాల్లోని పరమాణువుల మధ్య 0.1^{-}-10^{-} అవధిలో ఖాళీ ఉంటుంది. కాబట్టి వీటిని ఉపయోగించి పదార్థ నిర్మాణం తెలుసుకోవచ్చు.
- పరిశ్రమల్లో వస్తువులను శోధించటానికి ఉపయోగిస్తారు.
- పైపులు, డ్యాంలలో రంధ్రాలను గుర్తించటానికి ఉపయోగిస్తారు.
- ప్రయాణికుల లగేజీని తనిఖీ చేయడానికి ఉపయోగిస్తారు.

గామా (γ) - కిరణాలు

- వీటిని కనుగొన్న శాస్త్రవేత్త విల్లార్డ్.
- ఒక ఉత్తేజ కేంద్రకం, తన భూస్థాయిని చేరుకునేటప్పుడు ఉత్పత్తి అవుతాయి.
- రేడియో ధార్మిక పదార్థాలు U^{235} లాంటివి ఉద్గారం చేస్తాయి.
- తరంగదైర్ఘ్య అవధి:
  0.0001nm (0.001^{-}) - 0.1nm (1^{-})
- వీటిని మానవ శరీరం ద్వారా పంపించొద్దు. వీటికి అత్యధిక శక్తి ఉండటం వల్ల ఎముకల ద్వారా కూడా ప్రయాణిస్తాయి.

మృదు X- కిరణాలు: వీటి తరంగదైర్ఘ్య అవధి: 10^{-} 100^{-}
మృదు X – కిరణాలు మానవ శరీర భాగాల ద్వారా చొచ్చుకొని పోతాయి. కానీ ఎముకల ద్వారా చొచ్చుకుపోలేవు. కాబట్టి వీటిని వైద్యరంగంలో ఉపయోగిస్తారు.

రేడియోగ్రఫీ: X- కిరణాలను ఉపయోగించి రోగనిర్ధారణ చేయడాన్ని రేడియోగ్రఫీ అంటారు.

రేడియోథెరపీ: X- కిరణాలను ఉపయోగించి రోగ నివారణ చికిత్స చేయడాన్ని రేడియోథెరపీ అంటారు.

రేడియాలజిస్ట్: X- కిరణాలను ఉపయోగించి చికిత్స చేసే వైద్యుణ్ని రేడియోలజిస్ట్ అంటారు.

X- కిరణాలను సి.టి. స్కానింగ్ (కంప్యూటరైజ్డ్ టోమోగ్రఫీ)లో కూడా ఉపయోగిస్తారు.

జీర్ణ సంబంధ సమస్యలను తెలుసుకునేందుకు రోగికి ఎక్స్-రే తీయడానికి ముందు $BaSO_4$ (బేరియం సల్ఫేట్) ద్రావణాన్ని తాగిస్తారు. ఈ ద్రావణం X- కిరణాలను శోషించుకునే శరీరభాగాలను పరిశీలించడానికి దోహదపడుతుంది. కాబట్టి $BaSO_4$ను బేరియం మీల్స్ అని పిలుస్తారు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. సాధారణంగా కనిపించే కాంతి తరంగాల తరంగదైర్ఘ్యం పొడవు?
   ఎ) 1-100nm బి) 350-650nm
   సి) 100-300nm
   డి) 650-1000nm
2. ఏ కిరణాలను ఫొటోలు తీయడానికి లేదా చీకటిలోని వస్తువులను గుర్తించడానికి ఉపయోగిస్తారు?
   ఎ) ఇన్‌ఫ్రారెడ్ కిరణాలు
   బి) మైక్రో కిరణాలు
   సి) అతినీలలోహిత కిరణాలు
   డి) గామా కిరణాలు
3. అతినీలలోహిత కాంతి ప్రసరణ భూ జీవజాలానికి హాని కలిగించకుండా అతినీలలోహిత కాంతి ప్రసారాన్ని హరించేవి లేదా వడపోసేవి?
   ఎ) పచ్చని మొక్కలు బి) మేఘాలు
   సి) ఓజోన్
   డి) బొగ్గుపులుసు వాయువు, నత్రజని
4. అత్యధిక శక్తితో ద్రవ్యంలోకి చొచ్చుకొని పోయే కిరణాలు?
   ఎ) పరారుణ కిరణాలు
   బి) సూక్ష్మ తరంగాలు
   సి) దృగ్గోచర కాంతి డి) ఎక్స్- వికిరణం
5. టి.వి. రిమోట్ కంట్రోల్‌లో వాడే కిరణాలు?
   ఎ) దృశ్యాకాంతి బి) పరారుణ కిరణాలు
   సి) ఎక్స్-కిరణాలు డి) గామా కిరణాలు
6. విచలనం తక్కువగా ఉండే రంగు?
   ఎ) నీలలోహిత రంగు బి) ఎరుపు రంగు
   సి) పసుపు రంగు డి) నీలిరంగు
7. ఆకాశం నీలిరంగులో ఉండటానికి కారణం?
   ఎ) వక్రీభవనం బి) పరావర్తనం
   సి) వివర్తనం డి) పరిక్షేపణం

సమాధానాలు

1) బి; 2) ఎ; 3) సి; 4) డి;
5) బి; 6) బి; 7) డి;

A European visitor to the..



BANK EXAMS

GENERAL ENGLISH

Model Questions

Directions (Q. 1 - 5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Though many companies (1)/ believe that it is quality not price that sells their products, (2)/ they also know the facts (3)/ that advertising sells. (4)/ No error (5)
2. Eat has the selectional restriction (1)/ that it must be following by a kind of food, (2)/ so 'I eat sky' (3)/ is not possible. (4)/ No error (5)
3. There was (1)/ no way he could (2)/ keep going (3)/ below all that pressure. (4)/ No error (5)
4. It was not until morning (1)/ that the sheer scale (2)/ of the damage (3)/ could be seen. (4)/ No error (5)
5. Trade sanctions (1)/ were imposed (2)/ against any country (3)/ that refuses to sign the agreement. (4)/ No error (5)

Directions (Q. 6-10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. You'll have to study <u>any books</u> on Freud before writing a paper on psychoanalysis.
   1) Much books 2) few books
   3) some books 4) more books
   5) No correction required
7. A European visitor to the Far East must accommodate <u>self from</u> the habits of life that may seem very strange to him.
   1) Himself to 2) his self to
   3) himself for 4) his self from
   5) No correction required
8. He joined postgraduate course in the same college in which he had studied <u>for the three previous years.</u>
   1) from previous three years
   2) during the previous three years
   3) three years previous
   4) during the three previous years
   5) No correction required
9. She always <u>manage</u> to hurt her mother's feelings.
   1) do manage
   2) does manage
   3) did manages
   4) do managed
   5) No correction required
10. It is the people <u>who matters</u> in a democracy.
    1) whom matters
    2) whose matters
    3) whose matter
    4) who matter
    5) No correction required

Directions (Q. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. We were surprised to know that our friend was of royal ______.
    1) dissent 2) decent
    3) descent 4) dissuade
    5) dispute
12. ______ of the highly educated people is a huge ______ on the country's resources.
    1) Fight, draw
    2) Position, aspect
    3) Plight, drain
    4) Struggle, issue
    5) Rank, exhaust
13. No ______ reasons have been given for the sudden flight of refugees ______ this area.
    1) proper, for
    2) correct, along
    3) suitable, among
    4) valid, from
    5) compelling, counter
14. The modern ______ of communication have ______ distance.
    1) ways, deep
    2) methods, destroyed
    3) paths, shortened
    4) means, annihilated
    5) gadgets, developed
15. These remarks about the dominance of casteism in elections are quite ____ to the present ____.
    1) apposite, position
    2) opposite, fact
    3) relevance, media
    4) significance, party
    5) applaudable, generation

Directions (Q. 16 - 20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) These days technology has revolutionized the very concept of a wrist watch. 3
B) Almost a majority of the people wear a watch worn round the wrist, it measures time in minutes, hours etc. 1
C) The day is not far when we shall have a little TV fitted into a wrist watch. 4
D) A wrist watch may be wound or automatic. 2
E) Wrist watches have become an integral part of human beings, due to their utilities. 6
F) One may have a choice of leather or metal of gold or silver while choosing a strap for the wrist watch. 5

16. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) E 5) F
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
18. What is the FIFTH sentence after rearrangement?
    1)A 2) C 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) D 5) E
20. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q. 21-30): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

The international fight against Islamic State moved up a _____ (21) on Saturday as Turkish police arrested a Belgian suspect heading for Syria in connection with ____ (22) week's Paris attacks, hours after the UN Security Council unanimously _______ (23) all its members to combat the extremist group.

A day after the EU imposed ____ (24) new external border controls, authorities in Belgium raised the alert level in the capital to level four - signifying a "serious and imminent threat" as the _________ (25) for the remaining jihadi who killed 130 people in Paris entered its second week. The presumed ringleader of the Paris attacks, Abdelhamid Abaaoud, a 28-year-old Belgian national of Moroccan origin, was ______ (26) to have been in Syria but died in a ferocious seven-hour gunfight ______ (27) police at a rundown apartment in St-Denis, north of Paris, on Wednesday. Another _______ (28) member of the unit, Salah Abdelsalam, a 26-year-old Frenchman living in Brussels, is the subject of an international manhunt. His brother, Brahim, who blew himself up in the attacks, spent time in a Belgian prison with Abaaoud, while a third Molenbeek resident, Bilal Hadfi, was also among the Paris suicide bombers. Belgian Special Forces ______ (29) four people in the capital's Place du Grand Sablonon Saturday afternoon, while the Brussels Metro system is expected to be shut down until Sunday afternoon at the earliest. Shops ______ (30) closed, some shopping malls were shuttered, professional football was cancelled, concerts were called off and music venues, museums, and galleries shut their doors for the weekend.

21. 1) gear 2) ahead 3) above 4) always 5) alone
22. 1) lost 2) last 3) late 4) lastly 5) lasted
23. 1) urge 2) urging 3) urged 4) pledged 5) plead
24. 1) tight 2) treat 3) tread 4) tough 5) track
25. 1) hate 2) hurt 3) heat 4) hurt 5) hunt
26. 1) thought 2) thinking 3) think 4) thinned 5) thanked
27. 1) from 2) with 3) for 4) form 5) firm
28. 1) suspense 2) suspect 3) suspected 4) suspecting 5) suspects
29. 1) convicted 2) allowed 3) acquitted 4) arrested 5) prosecuted
30. 1) are to 2) will be 3) will been 4) have been 5) were

KEY

1) 3;	2) 2;	3) 4;	4) 5;
5) 4;	6) 3;	7) 1;	8) 2;
9) 2;	10) 4;	11) 3;	12) 3;
13) 4;	14) 4;	15) 1;	16) 4;
17) 1;	18) 5;	19) 1;	20) 3;
21) 1;	22) 2;	23) 3;	24) 4;
25) 5;	26) 1;	27) 2;	28) 3;
29) 4;	30) 5.		